
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 16
సంచిక: 111
శుక్రవారం 5-1-2024



'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసి గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'

రెండు రోజుల్లోనే...

13లో



దక్షిణాఫ్రికాతో జరిగిన రెండో టెస్టులో టీమిండియా కేవలం రెండు రోజుల్లోనే ఘనవిజయం సాధించింది. రెండు టెస్టుల సిరీస్‌ను 1-1తో సమంగా ముగించింది. దక్షిణాఫ్రికా నిర్దేశించిన 79 పరుగుల లక్ష్యాన్ని భారత జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 12 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి అందుకుంది. అంతకుముందు బుమ్రా (6/61) ధాటికి దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో 176 పరుగులకే ఆలౌటైంది.

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



నన్ను అరెస్టు చేయడానికి కుట్ర

తనను అరెస్టు చేయడానికి బీజేపీ కుట్ర పన్నిందని.. ఈడీ ఇచ్చిన సమన్లు చట్టవిరుద్ధమని ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ఆరోపించారు.

వివరాలు 6లో ▸



ఉగ్రవాది మట్టూ అరెస్ట్

కశ్మీర్‌లో బలగాల కళ్లుగప్పి తిరుగుతున్న హిజ్బుల్ ముజాహిదీన్ ఉగ్రవాది జావెద్ మట్టూను ఢిల్లీ పోలీసులు పట్టుకున్నారు.

వివరాలు 6లో ▸



ఆ తీర్పును రద్దు చేయండి

ప్రైమరీ ఎన్నికల్లో పాల్గొనకుండా నిషేధం విధిస్తూ కొలరాడో కోర్టు ఇచ్చిన తీర్పుపై ట్రంప్ అమెరికా సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

వివరాలు 6లో ▸



లెబనాన్‌ను వీడండి

హమాస్ నేతను ఇజ్రాయెల్ హతమార్చిన నేపథ్యంలో.. లెబనాన్‌లోని తమ పౌరులను వెనక్కి రావాలని అమెరికా హెచ్చరించింది.

వివరాలు 6లో ▸



నీటి అడుగున మోదీ సాహస క్రీడ

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లక్షద్వీప్ పర్యటన సందర్భంగా సముద్రంలో నీటి అడుగున సాహస క్రీడలో స్వయంగా పాల్గొన్నారు. అక్కడి జలచరాలను, వాటి జీవనాన్ని ప్రత్యక్షంగా వీక్షించారు. అరేబియా సముద్రంలో ఉల్లాసకరమైన అనుభవం సొంతం చేసుకున్నానంటూ మోదీ తాజాగా 'ఎక్స్'లో పోస్టు చేశారు. లక్షద్వీప్‌లో తన పర్యటన సందర్భంగా స్నార్కలింగ్‌ను (నీటి అడుగున సాహసం) ప్రయత్నించానని తెలిపారు.


- వివరాలు 6లో

పెత్తందారుల ఉన్మాదం

చంద్రబాబుకు వంతపాడుతూ రామోజీ రాక్షస రాతలు

జనం మెచ్చేలా సీఎం జగన్ సామాజిక న్యాయ పాలన

- ప్రజల ఆకాంక్షలు, సమీకరణలు, స్థానిక పరిస్థితులను బట్టి సమన్వయకర్తల మార్పుచేర్పులు
- ఈ క్రమంలో సామాజిక న్యాయంలో మరో రెండడుగులు ముందుకేసిన సీఎం జగన్
- గత ఎన్నికల్లో అగ్రవర్ణాలు పోటీ చేసిన 7 అసెంబ్లీ స్థానాల్లో ఇప్పుడు 5బీసీలకు, 2మైనార్టీలకు
- రెడ్డి సామాజిక వర్గానికి చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలకు సీట్లు ఇవ్వలేనని స్పష్టం చేసిన సీఎం జగన్
- 56 నెలలుగా సామాజిక న్యాయమంటే ఇదీ అని చాటి చెబుతూ సంస్కరణలతో అడుగులు



- ఎస్సీల్లో పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా? అంటూ నాడు సీఎం హోదాలో ఆ వర్గాల ప్రజల పుట్టుకనే అవహేళన చేసిన చంద్రబాబుది పెత్తందారు పోకడ. వీటిని 'ఈనాడు'లో ప్రచురించకుండా కప్పిపుచ్చిన రామోజీ మరో పెద్ద పెత్తందారు.

2లో

- మీరు దళితులు..! మీకెందుకురా రాజకీయాలు, పదవులు..? అని ఎస్సీలను తూలనాడుతూ నాటి టీడీపీ ఎమ్మెల్యే చింతమనేని చేసిన వ్యాఖ్యలను చంద్రబాబు ఖండించకపోవడం పెత్తందారీ పోకడే. చంద్రబాబును భుజానికెత్తుకుని మోస్తున్న రామోజీది పెత్తందారీ పైత్యమే.
- ఎస్సీలు శుభ్రంగా ఉండరు.. చదువూ రాదు..! అంటూ ఆ వర్గాలను గేలి చేసిన నాటి మంత్రి దేవగుడి ఆదినారాయణరెడ్డి వ్యాఖ్యలను బాబు ఖండించకపోవడం పెత్తందారీ పైశాచికం.
- గతేడాది మే 24న పూతలపట్టు నియోజకవర్గం పేట అగ్రహారంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎస్సీ వర్గానికి చెందిన ఎమ్మెల్యే ఎంఎస్ బాబు పర్యటిస్తే వీధులు మలినం అయ్యాయని టీడీపీ నేతలు పసుపు నీళ్లు చల్లి శుభ్రం చేశారు. ఆ అమానుషాన్ని నిలదీయకుండా కళ్లు మూసుకున్న రామోజీ పెత్తందారీ మనస్తత్వానికి ఇంతకీ నిదర్శనం కావాలి?

బీసీల బతుకులు మారాయి

వైఎస్సార్‌సీపీ వల్లే బడుగులకు సమున్నత స్థానం

- చంద్రబాబు 14ఏళ్ల పాలనలో బీసీలకు ఒరిగిందేమీ లేదు
- ప్రతిపక్షాలవన్నీ మోసపు మాటలే... వాటిని ఎవరూ నమ్మొద్దు
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు కృష్ణయ్య స్పష్టీకరణ
- విజయవంతమైన 139 బీసీ కులాల ఆత్మీయ సమావేశం

10లో



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఆర్ కృష్ణయ్య

నాడు.. అవమానం
నేడు ఆదరణ

10లో

బీసీలకు హామీలకు మించి మేలు చేస్తున్న సీఎం జగన్

కేసీఆర్‌కు సీఎం జగన్ పరామర్శ



- ప్రమాదం, సర్జరీ గురించి అడిగి తెలుసుకున్న ముఖ్యమంత్రి
- ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిపై ఆరా
- జగన్‌కు ఘన స్వాగతం పలికిన బీఆర్ఎస్ నేతలు

2లో

కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఎం వైఎస్ జగన్

శ్రీకాకుళం భాగ్యరేఖ.. మూలపేట పోర్టు

10లో

- శరవేగంగా మూలపేట పోర్టు నిర్మాణ పనులు..
- రూ.4,361.91 కోట్లతో నిర్మాణం చేపట్టిన ఏపీ మారిటైమ్ బోర్డు
- ఇప్పటికే 8.3 లక్షల టన్నుల రాళ్లతో బ్రేక్ వాటర్ నిర్మాణం
- జనరల్ కార్గో నిర్మాణం కోసం భూమిని పటిష్టం చేస్తున్న అధికారులు
- వచ్చే ఏడాది అక్టోబర్ నాటికి అందుబాటులోకి రానున్న ఓడరేవు

ఉత్సాహంగా ఆడేస్తున్నారు

సాక్షి, నెట్‌వర్క్/ అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా 14,899 గ్రామ/వార్డు సచివాలయాల పరిధిలో 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీలు ఉత్సాహాన్ని రేకెత్తిస్తున్నాయి. ఇప్పటి వరకు 1,59,847 మ్యాచ్‌లను నిర్వహించగా 23.90 లక్షల క్రీడాకారులు తమ ప్రతిభను కనబరిచారు. క్రీడాకారులతో సమానంగాప్రేక్షకులు సైతం 'ఆడుదాం ఆంధ్ర'పై ఆసక్తి కనబరుస్తున్నారు. 26 జిల్లాల్లో మొత్తం 38.10 లక్షల మంది ప్రేక్షకులు క్రీడా పోటీలను తిలకించారు. గురువారం ఒక్కరోజే 8,798 మ్యాచ్‌లు నిర్వహించారు. ఇప్పటి వరకు శ్రీకాకుళంలో మొత్తంగా వంద శాతం షెడ్యూల్ ప్రకారం పోటీలు పూర్తయ్యాయి. అల్లూరి సీతారామ రాజు, అనంతపురం, చిత్తూరు, పల్నాడు, తిరుపతి, ఎన్టీఆర్, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, శ్రీ సత్యసాయి, తూర్పుగోదావరి, ఎస్పీఎస్ఆర్ నెల్లూరు, కర్నూలు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో 95 శాతానికిపైగా మ్యాచ్‌లు ముగిశాయి.

ఇదండీ జగత్



ఇక నువ్వేం మాట్లాడకు! మా పార్టీలో చేరుతున్నావ్ అంతే!

ముంపు నుంచి 'రక్షణ'..

కృష్ణానది వెంబడి రిటైనింగ్ వాల్ నిర్మాణం

రూ.243 కోట్ల వ్యయంతో పనులు దాదాపు పూర్తి

- బెజవాడ ప్రజలకు తీరిన కష్టాలు
- రక్షణ గోడ నిర్మాణంతో కరకట్ట వాసుల ఆనందం
- రిటైనింగ్ వాల్ వెంబడి పార్కులు, వాకింగ్, సైక్లింగ్ ట్రాక్‌లు
- ఇందుకోసం రూ.33.83 కోట్లతో పనులు



విజయవాడలో కృష్ణానది తీరాన పూర్తయిన రిటైనింగ్ వాల్.. చురుగ్గా సాగుతున్న సుందరీకరణ పనులు

కృష్ణాతీరం... ఇక ఆహ్లాదం...

నగరవాసులకు ఆహ్లాదం పంచేందుకు వీలుగా ప్రభుత్వం రిటైనింగ్ వాల్ వెంబడి పార్కులు, వాకింగ్, సైక్లింగ్ ట్రాక్‌లు, గ్రీనరీ ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకోసం రూ.38.39 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించి, పనులు ప్రారంభించారు. ఇప్పటికే రిటైనింగ్ వాల్ వెంబడి బండ్ పనులు పూర్తయ్యాయి.

వర్షం వచ్చిందంటే చాలు వారి గుండెల్లో రైళ్లు పరిగెత్తేవి. ఏ క్షణం కృష్ణా నది పొంగుతుందో... ఎక్కడ తమ ప్రాంతానికి వరద వస్తుందో... తమ ఇళ్లు ముంపు బారిన పడతాయో... మళ్లీ మా బతుకులు ఎక్కడ అతలాకుతలం అవుతాయోనని ఆందోళన చెందేవారు. ఇది ఎన్నో ఏళ్లుగా విజయవాడ నగరవాసులు ఎదుర్కొంటున్న సమస్య. అభివృద్ధి చేశామంటూ గొప్పలు చెప్పుకునే ప్రభుత్వాలు ఎన్నో మారినా ఇక్కడివారి గోడు ఎవరూ పట్టించుకోలేదు. సీఎంగా వైఎస్ జగన్ బాధ్యతలు తీసుకున్న తరువాత ఈ సమస్యపై దృష్టిసారించారు. అవసరమైన నిధులు మంజూరు చేసి రక్షణగోడ నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. వేలాదిమంది ప్రజల చింత తీర్చారు.

సాక్షి ప్రతినిధి, విజయవాడ: విజయవాడ నగర ప్రజలకు వరద ముప్పు నుంచి పూర్తి ఉపశమనం కలగనుంది. ఆర్టీసీ బస్టాండు నుంచి యనమలకుదురు వరకు వేలాది మంది ప్రజలకు వరద కష్టాలు తొలగనున్నాయి. ప్రకాశం బ్యారేజీనుంచి 5లక్షలకు పైగా క్యూసెక్కుల నీరు దిగువకు వదిలితే దిగువ లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యేవి. ఇప్పుడు 12 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసినా ఏ ఇబ్బంది లేకుండా రక్షణ గోడ నిర్మించారు. సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన హామీ మేరకు నగరంలోని లోతట్టు ప్రాంతవాసుల ముంపు కష్టాలనుంచి గట్టెక్కిస్తూ కనకదుర్గమ్మ వారధినుంచి కోటినగర్ వరకు రూ. 122కోట్లతో రక్షణగోడ నిర్మించారు. తాజాగా పద్మావతి ఘాట్ నుంచి కనకదుర్గమ్మ వారధి వరకు రూ. 120.82 కోట్లతో రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయి.

కృష్ణలంకకు రక్షణ కవచం

విజయవాడ తూర్పు నియోజకవర్గంలోని కృష్ణలంక ప్రాంతం కృష్ణానదికి వరదలు వచ్చినపుడల్లా ముంపుబారిన పడేది. ఇక్కడి కాలనీ వాసులందరినీ ఇతర ప్రాంతాలకు తరలించేవారు. వారం, పదిరోజుల పాటు వారంతా ప్రభుత్వం ఏర్పాటు చేసిన శిబిరాల్లోనే తలదాచుకునేవారు. ఈ సమస్యను ప్రత్యక్షంగా చూసిన సీఎం వైఎస్ జగన్ రక్షణ గోడ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కనకదుర్గమ్మ వారధి నుంచి కోటి నగర్ వరకు 1.2 కిలో మీటర్ల పొడవునా రూ.122.90 కోట్లతో పనులు పూర్తయ్యాయి. ప్రకాశం బ్యారేజీ దిగువన దాదాపు 50,000 మంది ప్రజలు నివసిస్తున్నారు. బ్యారేజీ నుంచి మిగులు జలాలు విడుదల చేసిన ప్రతిసారీ చలసాని నగర్, కృష్ణలంక, గీతానగర్, రాణిగారితోట, బాలాజీ నగర్, ద్వారకా నగర్, భ్రమరాంబపురం వంటి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యేవి. రక్షణ గోడ నిర్మాణంతో ఈ ప్రాంత వాసుల కష్టాలు పూర్తిగా తీరాయి.

తుది దశకు పనులు

ప్రస్తుతం పద్మావతి ఘాట్‌నుంచి కనకదుర్గా వారధి మధ్య కృష్ణానది వెంబడి 1.070 కిలో మీటర్ల పొడవున రూ120.82 కోట్ల నిధులతో రిటైనింగ్ వాల్ మూడో దశ పనులు తుది దశకు చేరాయి. దీనివల్ల కృష్ణలంకలోని రణదీప్ నగర్, గౌతమి నగర్, నెహ్రూనగర్, ద్వారక నగర్లో నివసిస్తున్న 30 వేల మందికి వరద కష్టం తీరింది.

ముంపు సమస్య తీరింది

వర్షాకాలం వచ్చిందంటే చాలు గుండెల్లో రైళ్లు పరిగెత్తేవి. ఏ క్షణాన్నైనా వరద వచ్చేస్తుందేమోనని భయాందోళన చెందేవాళ్లం. వరద ఇళ్లలోకి వస్తుండటంతో ఇళ్లు కాళీ చేసి, కార్పొరేషన్ ఏర్పాటు చేసిన శిబిరాల్లోనే ఉండేవాళ్లం. ఇప్పుడు ఆ భయం లేదు. మా కష్టాలు తీరాయి.

– మండాది దుర్గ, తారకరామనగర్

రిటైనింగ్ వాల్ పనులు పూర్తయ్యాయి

కృష్ణా నది కరకట్ట వెంబడి రిటైనింగ్ వాల్ పనులు దాదాపు పూర్తయ్యాయి. ప్రస్తుతం మూడోదశలో పద్మావతి ఘాట్‌నుంచి కనకదుర్గా వారధి వరకు రక్షణ గోడ నిర్మా ణానికి సంబంధించిన పనులు తుది దశకు చేరాయి. దీని ద్వారా విజయవాడ వాసులకు ముంపు కష్టాలు పూర్తిగా తొలగిపోనున్నాయి.

– టి.జె ప్రసాద్, నీటిపారుదలశాఖ ఎస్ఈ, విజయవాడ

మా జీవితాలకు రక్షణ

వరద ముంపు సమస్యకు పరిష్కారం దొరికింది. ఎంతో మంది నాయకులు వచ్చారు కానీ సమస్య పరిష్కరించలేదు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మా వరద కష్టాలను పరిష్కరించి, మా జీవితాలకు రక్షణ కల్పించారు.

– వీర్ల సుభద్రాదేవి, తారకరామనగర్

దశాబ్దాల సమస్య పరిష్కారం

ఇతర జిల్లాల నుంచి వచ్చిన వారు కూలీ పనులు చేసుకుంటూ, కృష్ణానది కరకట్టపై ఆవాసాలు ఏర్పాటు చేసుకున్నారు. వరద వచ్చినప్పుడల్లా ఇళ్లు కాళీ చేయాల్సి వచ్చేది. ఇప్పుడు మాకు ఆ సమస్యలేదు. దశాబ్దాలుగా ఉన్న సమస్య పరిష్కారమైంది.

– బావనపల్లి కుమార్, ఆటోడ్రైవర్, భూపేష్‌గుప్తానగర్

కల నేరవేర్చారు

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విజయవాడ నగర వాసుల ముంపు కష్టాలు చూసి, వారి కష్టాలకు చెక్ పెట్టే విధంగా, కృష్ణానది వెంబడి రిటైనింగ్ వాల్ నిర్మించారు. ఇది కృష్ణలంక ప్రజలకు రక్షణ కవచంగా మారనుంది, దీంతో పాటు నగరవాసులకు ఆహ్లాదం పంచేందుకు వీలుగా రిటైనింగ్ వాల్‌ను అందంగా తీర్చిదిద్దుతున్నారు. దశాబ్దాల కలనేరవేర్చిన ముఖ్యమంత్రికి తూర్పు నియోజక వర్గ ప్రజల తరఫున ధన్యవాదాలు.

– దేవినేని అవినాష్, తూర్పునియోజక వర్గ ఇన్‌ఛార్జి

స్వరూపం

- ఆర్టీసీ బస్టాండ్ నుంచి యనమలకుదురు వరకు రక్షణ గోడ
- ఇప్పటివరకూ 5 లక్షల క్యూసెక్కుల వరద వస్తే లోతట్టు ప్రాంతాలు జలమయం.
- ఇకపై 12 లక్షల క్యూసెక్కుల వరద వచ్చినా ముంపు సమస్యే ఉండదు.
- కనకదుర్గమ్మ వారధి నుంచి కోటినగర్ వరకు రూ.122.90 కోట్లతో 1.2 కిలోమీటర్ల పొడవున రక్షణ గోడ నిర్మాణం
- తాజాగా పద్మావతి ఘాట్ నుంచి కనకదుర్గమ్మ వారధి వరకు 1.070 కిలోమీటర్ల పొడవున రూ.120.82 కోట్లతో రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు దాదాపు పూర్తి.



ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

ఇప్పుడు మా సొంతింట్లో ఉన్నాం



ముగ్గురు మగ పిల్లలు, భర్తతో కలసి 38 సంవత్సరాలుగా పశ్చిమగోదావరి జిల్లా కై కలూరులో అద్దె ఇళ్లల్లో కాపురం చేశాను. నా భర్త షరీఫ్ వంట మేస్త్రీగా పని చేస్తున్నారు. ఆయన కష్టంతో వచ్చే డబ్బుల్లో సగం అద్దె కోసమే వెచ్చించాం. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత సచివాలయంలో ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నాను. కొద్ది రోజుల తర్వాత ఇంటి స్థలం కేటాయించినట్టు మా వలంటీర్ చెప్పారు. అన్నట్లుగానే పట్టా నా చేతికిచ్చి, స్థలాన్ని చూపించారు. ఇల్లు కట్టుకునేందుకు రూ.1.80 లక్షలు మంజూరు చేశారు. ఇంటి నిర్మాణానికి అవసరమైన సామగ్రిని సబ్సిడీతో అందజేశారు. కొంత డబ్బు మేము అదనంగా జత చేసి చక్కటి ఇల్లు కట్టుకున్నాం. వివాహమైన నా కుమారుడి భార్యకు కూడా ఇంటి స్థలం కేటాయించారు. చేయూత పథకం కింద నాకు ఏటా రూ.18,750 వంతున వచ్చింది. ఈ ప్రభుత్వం పుణ్యాన మేం ఆనందంగా జీవిస్తున్నాం.

– సయ్యద్ షంసున్నీసా, వైఎస్సార్ గ్రీన్ విలేజ్, కైకలూరు
(బి.శ్యామలరాజు విలేకరి, కైకలూరు)

ఉన్న ఊళ్లోనే ఉపాధి



మాది మారుమూల గిరిశిఖర గ్రామం. నేను, నా భర్త పోలి జీవనోపాధి కోసం ఎన్నో పనులు చేశాం. ఏ పని చేసినా ముగ్గురు పిల్లలుగల మాకు రెండుపూటలా తిండి కూడా కష్టమయ్యేది. బతుకు తెరువు రోజురోజుకూ కష్టంగా మారింది. ఆ సమయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వైఎస్సార్ చేయూత నాకొక ఆధారంలా కనిపించింది. ఈ పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం నా బ్యాంకు ఖాతాలో రూ.18,750 చొప్పున మూడేళ్లపాటు నగదు జమ చేసింది. ఆ డబ్బుతో మేక పిల్లలను కొనుగోలు చేసి పెంచుతున్నాను. దానినే బతుకు బాటగా మలుచుకున్నాను. ఇప్పుడు నేను కుటుంబానికి ఆసరాగా మారాను. మా సొంతూరైన పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మ లక్ష్మీపురం మండలం పెదరావికోనలోనే బతకలగనన్న నమ్మకం కలిగింది. ఈ పథకం నా జీవితాన్నే మార్చేసింది. పెద్దకొడుకు మత ప్రచారకుడిగా ఉన్నాడు. మిగిలిన ఇద్దరు పిల్లలు ఇంట్లోనే మాకు చేదోడు వాదోడుగా ఉన్నారు. ఇప్పుడు మా కుటుంబం హాయిగా జీవనం సాగిస్తోంది.

– నిమ్మక మూగి, పెదరావికోన, గుమ్మలక్ష్మీపురం మండలం
(గంటా పెంటయ్య, విలేకరి, గుమ్మలక్ష్మీపురం)

కష్ట కాలంలో కొండంత ఆసరా



భర్త చనిపోయి ఇద్దరు పిల్లలతో అతి కష్టంగా జీవనం గడుపుతున్న సమయంలో ఈ ప్రభుత్వం వల్ల మా జీవితాలే మారిపోయాయి. మాది అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలం రాయపుర అగ్రహారం. నాకు వివాహమై 15 సంవత్సరాలు అవుతోంది. నా భర్త రాము వ్యవసాయంతో పాటు మైక్, లైటింగ్ పనులు చేసేవారు. ఎనిమిదేళ్ల క్రితం విద్యుత్ షాక్‌తో మృతి చెందారు. అప్పటికి నాకు ఇద్దరు చిన్న పిల్లలు. అప్పట్లో మాకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందలేదు. జగనన్న సీఎం అయ్యాక వితంతు పింఛన్ మంజూరైంది. నాలుగున్నరేళ్లుగా పింఛన్ సొమ్ము ఎంతో ఉపయోగపడుతోంది. ఈ నెల నుంచి రూ.3 వేలు ఇస్తుండడం మరింత సంతోషం కలిగించింది. ప్రస్తుతం పెద్ద పాప గీతిక సబ్బవరం కేజీబీవీ పాఠశాలలో 9వ తరగతి, రెండో పాప దివ్య అదే పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నారు. వారిద్దరూ వసతి గృహంలో ఉండటంతో ఆర్థిక భారం తప్పింది. ఇప్పటికి నాలుగు విడతలుగా అమ్మ ఒడి సొమ్ము రూ.60 వేలు వచ్చింది. నాకు 35 సెంట్ల వ్యవసాయ భూమి ఉంది. రైతు భరోసా కింద నాలుగు విడతలు రూ.13,500 వంతున వచ్చింది. ఐదో ఏట కూడా మొదటి విడత సొమ్ము వచ్చింది. డ్వాక్రా రుణ మాఫీ.. ఆసరా కూడా వచ్చింది. మరో వైపు పశు పోషణ ద్వారా కూడా కొంత ఆదాయం వస్తోంది. సొంత ఇంట్లోనే ఉంటున్నాం. ఈ ప్రభుత్వం వల్ల ఆనందంగా ఉన్నాం.

– నక్కెళ్ల సన్యాసమ్మ, రాయపుర అగ్రహారం
(సుర్ల నాగేశ్వరావు, విలేకరి, సబ్బవరం)

పెత్తందారుల ఉన్మాదం

పెత్తందారులకు రామోజీ వంతపాట.. జనం మెచ్చేలా జగన్ సామాజిక న్యాయ పాలన

సాధికారత సాధించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు.. అగ్రవర్ణ పేదలకూ అదే రీతిలో మేలు



సాక్షి, అమరావతి: సామాజిక న్యాయమంటే నినాదం కాదు.. అమలు చేయాల్సిన విధానమని దేశానికి చాటిచెబుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాలన పట్ల ఆయా వర్గాల్లో రోజురోజుకూ మద్దతు పెరుగుతోంది. వచ్చే ఎన్నికల్లో 175 స్థానాల్లోనూ విజయమే లక్ష్యంగా ప్రభుత్వ పథకాలను సమర్థంగా చేరువ చేయడం, ప్రజల ఆకాంక్షలు, సామాజిక సమీకరణాలు, స్థానిక పరిస్థితుల మేరకు సమన్వయకర్తల స్థానాల్లో మార్పుచేర్పులు చేపట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఈ క్రమంలో సామాజిక న్యాయం దిశగా మరో రెండడుగులు ముందుకేశారు. 2019 ఎన్నికల్లో అగ్రవర్ణాల అభ్యర్థులు పోటీ చేసిన ఏడు శాసనసభ స్థానాల్లో ఇప్పుడు ఐదు స్థానాలకు బీసీలను, రెండు స్థానాలకు మైనార్టీ వర్గాల నేతలను సమన్వయకర్తలుగా నియమించారు. ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డికి గతంలోనే సీటు ఇవ్వలేనని చెప్పిన సీఎం జగన్ తాజాగా రెడ్డి సామాజిక వర్గానికి చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలకూ సీటు ఇవ్వలేనని స్పష్టం చేశారు. ఎస్సీ ఎమ్మెల్యేల సీట్లను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మార్చారంటూ 'ఈనాడు' రామోజీ కాకమ్మ కథలు అచ్చేశారు. ఎస్సీ ఎమ్మెల్యేల సీట్లు మార్చితే మళ్లీ సీటు ఇచ్చింది ఆ వర్గాలకే కదా రామోజీ? జనం మెచ్చిన జగన్ సామాజిక న్యాయ పాలనపై అసూయతో రగిలిపోతున్న రామోజీ 'ఇది కదా పెత్తందారీ పోకడ' అంటూ పచ్చి అబద్ధాలతో కథనాన్ని అచ్చేశారు.

రాజకీయ, ఆర్థిక, విద్యా సాధికారత..

2019 మే 30న ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే ముఖ్యమంత్రి జగన్ సామాజిక విప్లవానికి శ్రీకారం చుట్టారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు కేబినెట్ నుంచి నామినేటెడ్ వరకూ సింహభాగం పదవులు ఇవ్వడం ద్వారా రాజకీయ సాధికారతకు బాటలు వేశారు. సంక్షేమాభివృద్ధి పథకాల్లో అధిక వాటా ఇవ్వడం ద్వారా ఆర్థిక సాధికారత చేకూర్చారు. నాడు–నేడుతో ప్రభుత్వ పాఠశాలలను ఆధునికీకరించి ఇంగ్లీషు మీడియం బోధన, అమ్మ ఒడి, విద్యా కానుక, విద్యా దీవెన తదితర పథకాల ద్వారా విద్యా సాధికారత సాధించారు. వైఎస్సార్ ఆసరా, చేయూత లాంటి పథకాల ఆర్థిక చేయూతనిచ్చారు. పరిపాలనలో భాగస్వామ్యం కల్పించడం ద్వారా మహిళా సాధికారత దిశగా అడుగులు వేశారు. దేశ చరిత్రలో తొలిసారిగా హోం మంత్రిగా ఎస్సీ మహిళను నియమించిన ఘనత సీఎం జగన్‌కే దక్కింది. ఇలా 56 నెలలుగా విప్లవాత్మక నిర్ణయాలతో సంస్కరణలు అమలు చేస్తుండటంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు సామాజిక సాధికారత సాధించాయి. అగ్రవర్ణ పేదలకూ అదే రీతిలో మేలు జరిగింది. వైఎస్సార్‌సీపీ చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్రకు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు బ్రహ్మరథం పడుతుండటమే అందుకు తార్కాణం. వచ్చే ఎన్నికల్లోనూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు అగ్రవర్ణ పేదలు సీఎం జగన్‌కు అండగా నిలవడం ఖాయమని, ఇది 25 లోక్‌సభ స్థానాల్లోనూ వైఎస్సార్ సీపీ ఘనవిజయానికి దోహదం చేస్తుందని 'టైమ్స్ నౌ' లాంటి ప్రముఖ జాతీయ మీడియా సంస్థలు నిర్వహించిన సర్వేల్లో వెల్లడైంది. గత ఎన్నికలకు మించి టీడీపీకి ఘోర పరాభవం తప్పదని తేలడంతో ఉనికి చాటుకునేందుకు చంద్రబాబుతో కలిసి రామోజీ టన్నుల కొద్దీ అబద్ధాలను తన కరపత్రికలో కుమ్మరిస్తున్నారు.

గెలుపే లక్ష్యంగా..

ప్రజల ఆకాంక్షలు, సామాజిక సమీకరణాలు, స్థానిక పరిస్థితుల ఆధారంగా 175 స్థానాల్లోనూ గెలుపే లక్ష్యంగా సీఎం జగన్ నియోజక వర్గాల సమన్వయకర్తల స్థానాల్లో మార్పుచేర్పులు చేస్తున్నారు. ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం(ఎస్సీ) నియోజకవర్గంలో ప్రజల ఆకాంక్షను గౌరవిస్తూ స్థానికుడైన తాటిపర్తి చంద్రశేఖర్‌ను సమన్వయకర్తగా నియమించారు. ఎమ్మెల్యే, మంత్రి ఆదిమూలపు సురేష్‌ను స్థానిక పరిస్థితుల దృష్ట్యా కొండెపి (ఎస్సీ) సమన్వయకర్తగా నియమించారు. గుంటూరు జిల్లా మంగళగిరి నియోజకవర్గంలో చేనేత (బీసీ) వర్గానికి చెందిన ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. బీసీ ఓటర్లు కూడా అధికంగా ఉన్నారు. మంగళగిరి నుంచి చేనేత వర్గానికి చెందిన అభ్యర్థికి అవకాశమివ్వాలన్న ప్రజల అభీష్టాన్ని గౌరవిస్తూ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి స్థానంలో గంజి చిరంజీవిని సమన్వయకర్తగా సీఎం జగన్ నియమించారు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు నియోజకవర్గంలోనూ ఇదే రీతిలో ప్రజాభిప్రాయానికి పట్టం కడుతూ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి స్థానంలో చేనేత వర్గానికి చెందిన మాచాని వెంకటేశ్‌ను సమన్వయకర్తగా నియమించారు. శ్రీసత్యసాయి జిల్లా కదిరిలో ముస్లిం ఓటర్లు ఎక్కువ. అక్కడ మైనార్టీ వర్గానికి అవకాశం ఇవ్వాలన్నది ప్రజల ఆకాంక్ష. దాన్ని గౌరవిస్తూ ఎమ్మెల్యే సిద్ధారెడ్డి స్థానంలో బీఎస్ మక్బూల్ అహ్మద్‌ను సమన్వయకర్తగా నియమించారు. రెండు విడతల్లో 35 నియోజకవర్గాల్లో ఇదే రీతిలో సమన్వయకర్తల స్థానాల్లో మార్పుచేర్పులు చేయడం రామోజీకి తప్పుగా కన్పిస్తుండటం విచిత్రం.

జిల్లాలు దాటించిన బాబు

గత ఎన్నికల్లో విశాఖ జిల్లాలో ఎస్సీ వర్గానికి చెందిన పాయకరావుపేట ఎమ్మెల్యే వంగలపూడి అనితను అక్కడి నుంచి మార్చి పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వూరు నుంచి చంద్రబాబు బరిలోకి దించారు. కొవ్వూరు ఎమ్మెల్యే, అప్పటి మంత్రి కేఎస్ జవహర్‌ను అక్కడి నుంచి మార్చి కృష్ణా జిల్లా తిరువూరు నియోజకవర్గం నుంచి పోటీకి దింపారు. ఇదే రీతిలో పలువురు ఎస్సీ, బీసీ వర్గానికి చెందిన ఎమ్మెల్యేలను జిల్లాల సరిహద్దులు దాటించి ఇతర నియోజక వర్గాల నుంచి చంద్రబాబు పోటీకి దించితే రామోజీకి నచ్చింది. అందుకే దానిపై ఈనాడులో ఎలాంటి కథనం ప్రచురించలేదు.

సామాజిక న్యాయం ఇలా..

- చంద్రబాబు పాలనలో మంత్రివర్గంలో బీసీలకు ఎనిమిది పదవులు ఇవ్వగా సీఎం వైఎస్ జగన్ బీసీలకు 11 పదవులు కేటాయించారు. చంద్రబాబు ఎస్సీలకు రెండు మంత్రి పదవులు ఇస్తే సీఎం జగన్ ఐదు మంత్రి పదవులు ఇచ్చారు.
- టీడీపీ హయాంలో చంద్రబాబు కమ్మ సామాజిక వర్గానికి చెందిన కోడెల శివప్రసాద్‌ను శాసనసభ స్పీకర్‌గా చేస్తే.. సీఎం జగన్ బీసీ వర్గానికి చెందిన తమ్మినేని సీతారామ్‌కు సభాపతిగా అవకాశం కల్పించారు.
- రాష్ట్ర చరిత్రలో తొలి సారిగా ఎస్సీ వర్గానికి చెందిన కొయ్యే మోషేన్ రాజును శాసనమండలి ఛైర్మన్‌గా సీఎం జగన్ చేశారు.
- 2014–19 మధ్య చంద్రబాబు ఒక్క బీసీని కూడా రాజ్యసభకు పంపలేదు. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటిదాకా పార్టీకి దక్కిన 8 రాజ్యసభ స్థానాల్లో బీసీ వర్గానికి నాలుగు పదవులు (50 శాతం) సీఎం జగన్ ఇచ్చారు.
- టీడీపీ హయాంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు 18 ఎమ్మెల్సీ పదవులు (37%) ఇవ్వగా సీఎం జగన్ ఆయా వర్గాలకు 29 ఎమ్మెల్సీ పదవులు(69 శాతం) ఇచ్చారు.
- సీఎం జగన్ ఐదుగురు డిప్యూటీ సీఎంలను నియమిస్తే అందులో నలుగురు (80 శాతం) ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల వారే కావడం గమనార్హం.
- టీడీపీ హయాంలో 13 జిల్లా పరిషత్ ఛైర్మన్ పదవులలో బీసీలకు 6 (46 శాతం) ఇచ్చారు. సీఎం జగన్ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు కలిపి ఏకంగా 9 జెడ్పీ ఛైర్మన్ పదవులు (69 శాతం) ఇచ్చారు.
- రాష్ట్రంలో 14 మున్సిపల్ కార్పొరేషన్లలో వైఎస్సార్‌సీపీ విజయం సాధించింది. 14 మేయర్ పదవుల్లో బీసీలకు ఏకంగా 9 పదవులు (64 శాతం) ఇచ్చారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను కలిపితే 14 కార్పొరేషన్ మేయర్ పదవులకుగానూ 12 పదవులు (86 శాతం) వారికే ఇచ్చారు.
- 87 మున్సిపాల్టీలలో ఎన్నికలు జరిగితే 84 చోట్ల వైఎస్సార్‌సీపీ విజయం సాధించింది. ఇందులో 44 మున్సిపల్ ఛైర్మన్ పదవులను బీసీలకు (53 శాతం) సీఎం జగన్ ఇచ్చారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు కలిపి 58 మున్సిపల్ ఛైర్మన్ పదవులు (69%) ఇచ్చారు.
- వివిధ ప్రభుత్వ కార్పొరేషన్లలో 137 ఛైర్మన్ పదవులలో 53 పదవులు (39 శాతం) బీసీలకే ఇచ్చారు. ఇక ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను కలిపితే 137 పదవుల్లో 79 పదవులు (58 శాతం) ఆ వర్గాలకే ఇచ్చారు.
- 137 ప్రభుత్వ కార్పొరేషన్ పదవులకు సంబంధించి 484 నామినేటెడ్ డైరెక్టర్ పదవులుంటే అందులో 201 పదవులు బీసీలకు (41 శాతం) ఇచ్చారు. ఇక ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను కలిపితే 484 పదవుల్లో 280 పదవులు(58 శాతం) ఆ వర్గాలకే ఇచ్చారు.
- బీసీ వర్గాలకు ప్రత్యేకంగా 56 కార్పొరేషన్లు, ఎస్సీలకు ప్రత్యేకంగా 3 కార్పొరేషన్లు, ఎస్టీలకు 1 కార్పొరేషన్ ఏర్పాటు చేసి వాటికి ఆయా వర్గాల వారినే ఛైర్మన్లుగా నియమించారు. ఆ కార్పొరేషన్లలో ఆయా వర్గాలకు 684 డైరెక్టర్ పదవులూ ఇచ్చారు.
- ఆలయ బోర్డులు, ఆలయ ఛైర్మన్ పదవుల్లో సగ భాగం బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకే ఇచ్చారు. దాదాపు 7,006 ఆలయ బోర్డు మెంబర్ల పదవుల్లో 3,503 అంటే సగం బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకే ఇచ్చారు.
- సంక్షేమాభివృద్ధి పథకాల ద్వారా డీబీటీ (ప్రత్యక్ష నగదు బదిలీ) రూపంలో పేదల ఖాతాల్లో రూ.2.45 లక్షల కోట్లను ఇప్పటి దాకా సీఎం జగన్ జమ చేయగా ఇందులో 75 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల పేదలకే చేరాయి.
- వీటిని పరిశీలిస్తే సామాజిక ద్రోహానికి చంద్రబాబు ప్రతీకగా నిలిస్తే.. సామాజిక న్యాయానికి సీఎం జగన్ నిదర్శనంగా నిలుస్తున్నారన్నది స్పష్టమవుతోంది.

మరో 68,990 మందికి నేడు సంక్షేమ ఫలాలు

- అర్హులై ఉండి ఏ కారణంతోనైనా లబ్ధి పొందని వారికి మరో ఛాన్స్
- బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో రూ 97.76 కోట్లు జమచేయనున్న సీఎం జగన్
- ఇప్పటికే గత 55 నెలల్లో డీబీటీ రూపంలో అందించిన ఆర్థిక సాయం రూ.2,46,551 కోట్లు

సాక్షి, అమరావతి : జనం చెంతకే సంక్షేమం.. అర్హతే ప్రామాణికంగా అర్హులై ఉండి ఏ కారణం చేతనైనా లబ్ధి అందని వారికి మరో అవకాశమిస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం తన క్యాంపు కార్యాలయం నుంచి 68,990 మంది అర్హులకు రూ.97.76 కోట్లను బటన్ నొక్కి వారి ఖాతాల్లో జమచేయనున్నారు. ఇలా ఏటా రెండు పర్యాయాలు.. జనవరి–జూన్ మధ్య అందించిన సంక్షేమ పథకాలకు సంబంధించి ఏ కారణంతోనైనా మిగిలిపోయిన వారికి జూన్–జూలైలోను.. అలాగే, జూలై నుంచి డిసెంబర్ వరకు మిగిలిపోయిన వారికి డిసెంబర్–జనవరిలో సాయం అందిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో.. గత ఆగస్టు 2023 నుండి డిసెంబర్ 2023 వరకు అమలైన వివిధ సంక్షేమ పథకాలు అందని 68,990 మంది అర్హులకు రూ.97.76 కోట్లను సీఎం జగన్ తన క్యాంపు కార్యాలయం నుంచి శుక్రవారం బటన్ నొక్కి వారి ఖాతాల్లో జమచేయనున్నారు.

దరఖాస్తు చేసుకోవడం ఎలా?

- అర్హత ఉండి ఆయా పథకాల లబ్ధి పొందని వారు వాటిని అందించిన నెలలోపు గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి.
- అవసరమైతే వలంటీర్ సేవలు వాడుకోవచ్చు లేదా 1902కి ఫోన్‌చేస్తే వారు తగు సూచనలు ఇస్తారు.
- సచివాలయాల్లో అవసరమైన పత్రాలతో దరఖాస్తు చేశాక వెరిఫికేషన్ చేస్తారు.
- ఆ తర్వాత ఆరు నెలలకోసారి సంక్షేమ పథకాల లబ్ధి అందిస్తారు.

లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత..

- సోషల్ ఆడిట్ కోసం గ్రామ, వార్డు సచివాలయాల్లో లబ్ధిదారుల జాబితాలను ప్రదర్శిస్తారు.
- లంచాలకు, కుల, మత, వర్గ, పార్టీల వివక్షకు తావులేకుండా రాష్ట్ర ప్రభుత్వం పారదర్శకంగా పథకాలను మలుచేస్తోంది.
- నూటికి నూరు శాతం సంతృప్త స్థాయిలో అర్హులందరికీ పథకాల లబ్ధి చేకూరుస్తోంది.

కేసీఆర్‌కు వైఎస్ జగన్ పరామర్శ



- ప్రమాదం, సర్జరీ గురించి అడిగి తెలుసుకున్న ఏపీ సీఎం
- ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిపై ఆరా
- జగన్‌కు ఘన స్వాగతం పలికిన బీఆర్ఎస్ నేతలు

సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం తెలంగాణ మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావును పరామర్శించారు. తెలంగాణ శాసనసభ ఎన్నికల అనంతరం ఫామ్‌హౌస్‌లో జారి పడిన కేసీఆర్‌కు తుంటి ఎముక విరిగిన విషయం తెలిసిందే. అనంతరం ఆయనకు హిప్ రీప్లేస్‌మెంట్ సర్జరీ జరగ్గా, కొద్ది రోజుల నుంచి జూబ్లీహిల్స్ నందినగర్‌లోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో కేసీఆర్‌ను పరామర్శించేందుకు వైఎస్ జగన్ హైదరాబాద్‌కు వచ్చారు. హైదరాబాద్ బేగంపేట ఎయిర్‌పోర్టులో ఆయనకు మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి స్వాగతం పలికారు. అక్కడి నుంచి జగన్ నేరుగా కేసీఆర్ ఇంటికి వెళ్లారు. అక్కడ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్వయంగా ఎదురెళ్లి జగన్‌కు స్వాగతం పలికారు. మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, మహమూద్ అలీ, ఎంపీ సంతోష్‌కుమార్, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి తదితరులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. కాగా కేసీఆర్‌ను పలుకరించిన జగన్.. పుష్పగుచ్ఛం, శాలువాతో సత్కరించారు. అనంతరం కేసీఆర్‌కు జరిగిన ప్రమాదం, సర్జరీ గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. తర్వాత వారు పలు అంశాలపై మాట్లాడుకున్నారు. ఈ సందర్భంగా జగన్ అల్పాహారం, తేనీరు తీసుకున్నారు. కేసీఆర్‌కు తిరుమల వేంకటేశ్వర స్వామి చిత్రపటాన్ని బహూకరించారు. కేటీఆర్, ఇతర నాయకులు సీఎం జగన్‌కు కారు వద్ద వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, దానం నాగేందర్, మాజీ ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య తదితరులున్నారు. జగన్ వెంట ఏపీకి చెందిన ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్సీ రఘురాం, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తదితరులున్నారు.

నాలుగైదు వారాల్లో కేసీఆర్ రికవరీ

మరో నాలుగైదు వారాల్లో కేసీఆర్ పూర్తిగా రికవరీ అవుతారని, ప్రస్తుతం ఆయన ఆరోగ్యం బాగానే ఉందని ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. జగన్ పరామర్శ అనంతరం తనను కలిసిన మీడియాతో ఆయన మాట్లాడారు. కేసీఆర్ ప్రస్తుతం బెడ్ మీదే రెస్ట్ తీసుకుంటున్నారని, మరో నాలుగైదు వారాల్లో సాధారణ స్థితికి చేరుకుంటారని చెప్పారు. కేసీఆర్ ఆరోగ్యం గురించి తెలుసుకునేందుకే జగన్ వచ్చారని, ఇందులో ఎలాంటి రాజకీయం లేదని స్పష్టం చేశారు.

పాణ్యంలో సాధికార పండుగ

- పాణ్యం నియోజకవర్గంలో ఘనంగా సామాజిక సాధికార యాత్ర
- వేలాదిగా తరలివచ్చిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు
- స్వచ్ఛందంగా పాల్గొన్న డాక్టర్లు, లాయర్లు, వ్యాపారులు, డ్రైవర్లు
- 500 బైక్‌లతో యువత ర్యాలీ
- 'జగనే కావాలి.. మళ్లీ జగనే రావాలి' అంటూ నినాదాలతో హోరెత్తిన సభా ప్రాంగణం



కర్నూలు జిల్లా పాణ్యం సామాజిక సాధికార సభలో సంఘీభావం తెలుపుతున్న నేతలు



పాణ్యం సామాజిక సాధికార సభకు తరలివచ్చిన అశేష జనవాహినిలో ఓ భాగం

సాక్షి ప్రతినిధి కర్నూలు: కర్నూలు జిల్లా పాణ్యం నియోజకవర్గంలో బడుగు, బలహీన వర్గాల ప్రజలు సాధికార పండుగ చేసుకొన్నారు. గురువారం వైఎస్సార్‌సీపీ చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్రలో వేలాదిగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు పాల్గొన్నారు. సీఎం వైఎస్ జగన్ తమకు చేసిన మేలును వేనోళ్ల కీర్తిస్తూ వీధివీధిలో కలియదిరిగారు. డాక్టర్లు, న్యాయవాదులు, ఉపాధ్యాయులు, వ్యాపారులు, ఆటో డ్రైవర్లు ఇలా అన్ని వృత్తుల వారు స్వచ్ఛందంగా తరలివచ్చారు. మధ్యాహ్నం అన్ని వర్గాల ప్రతినిధులతో కేఎస్ఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో సమావేశం అనంతరం యాత్ర ప్రారంభమైంది. చెన్నమ్మ సర్కిల్ వరకు ర్యాలీ ఘనంగా జరిగింది. 500 బైక్‌లతో యువత ర్యాలీలో పాల్గొన్నారు. కళాకారుల నృత్యాలు, సంగీత కార్యక్రమాలతో పండుగ వాతావరణం కన్పించింది. మహిళలు, ప్రజాప్రతినిధులు కూడా నృత్యం చేసి సందడి చేశారు. సాయంత్రం జరిగిన సభలో వేలాదిగా ప్రజలు పాల్గొన్నారు. సభ ఆద్యంతం 'జగనే కావాలి.. మళ్లీ జగనే రావాలి' అంటూ నినాదాలతో హోరెత్తించారు.

బడుగుల గురించి ఆలోచించిన సీఎం ఒక్క జగన్ మాత్రమే: ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

సభలో ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి మాట్లాడుతూ.. పేదల పిల్లలు కూడా సంపన్నుల పిల్లల మాదిరిగా అత్యున్నతస్థాయికి ఎదిగేలా అత్యాధునిక చదువులు చెప్పిస్తున్న దేవుడు సీఎం వైఎస్ జగన్ అని చెప్పారు. ఒకే వేదికపై ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను కూర్చోబెట్టి ఆ వర్గాలకు న్యాయం చేశామని ధైర్యంగా ప్రజలకు చెబుతున్న ఏకైక ముఖ్యమంత్రి దేశంలో జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. 75 ఏళ్లలో ఎవ్వరూ ఆలోచించని విధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభ్యున్నతి గురించి సీఎం జగన్ ఆలోచిస్తున్నారని తెలిపారు. ఈ వర్గాలను సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఉన్నత స్థితికి చేర్చారని చెప్పారు. సీఎం జగన్ చేస్తున్న సంక్షేమాన్ని అడ్డుకోవడానికి రామోజీ, చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌తో పాటు చాలామంది ప్రయత్నిస్తున్నారని, అయినా, వెనుకాడేది లేదని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చంద్రబాబు చేసింది ఏమీ లేదని, బీసీలకు ఒక్క రాజ్యసభ సీటు కూడా ఇవ్వలేదని చెప్పారు. సీఎం జగన్ అన్ని స్థానాలు, పదవుల్లో ఈ వర్గాలకే అగ్రతాంబూలం ఇచ్చారన్నారు. పురందేశ్వరి, ఈనాడు, ఏబీఎన్, టీవీ5కు చంద్రబాబు కావాలని, ప్రజలకు మాత్రం సీఎం జగన్‌మోహన్‌రెడ్డే కావాలని అన్నారు.

స్వార్థం కోసం రాష్ట్రాన్ని తాకట్టుపెట్టిన దుర్మార్గుడు చంద్రబాబు: ఎంపీ గోరంట్ల

రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అన్ని సంక్షేమ పథకాల్లో, అన్ని పదవుల్లో కనీసం 70 శాతం ఇచ్చి సామాజిక న్యాయం చేసింది సీఎం జగన్ మాత్రమేనని హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ అన్నారు. బడుగు, బలహీన వర్గాలు, మైనార్టీలను సీఎం జగన్ నాయకులుగా తీర్చిదిద్దుతున్నారని చెప్పారు. ఎలాంటి స్వార్థం లేకుండా ప్రజా సంక్షేమమే పరమావధిగా సుపరిపాలన అందిస్తున్నారని తెలిపారు. చంద్రబాబు ఆయన స్వార్థం కోసం రాష్ట్రానికి, ప్రజలకు తీరని అన్యాయం చేశారని, ప్రత్యేక హోదాను మోదీకి అమ్మి ప్రత్యేక ప్యాకేజీకి ఒప్పుకున్న దుర్మార్గుడని చెప్పారు. బాబు ప్రజలకు అందించిన స్కీములేవీ లేవని, స్కాములు మాత్రం లెక్కలేనన్ని చేశారని అన్నారు. ఆయన చేసిన తప్పులకు జీవితకాలం జైలులో ఉండాలన్నారు.

సీఎం జగన్ గొప్ప దార్శనికుడు: ఎంపీ గురుమూర్తి

సీఎం వైఎస్ జగన్ గొప్ప దార్శనికుడని తిరుపతి ఎంపీ గురుమూర్తి చెప్పారు. పేదల అభ్యున్నతి కోసం విద్య, వైద్య రంగాలను అత్యాధునికంగా తీర్చిదిద్దుతున్నారని, సంక్షేమ పథకాలతో ప్రజల స్థితిగతులను ఉన్నతంగా మారుస్తున్నారని తెలిపారు. చంద్రబాబు నారాయణ, చైతన్య లాంటి ప్రైవేటు విద్యా సంస్థల అభ్యున్నతి కోసం పని చేస్తే.. వాటికి దీటుగా సీఎం జగన్ ప్రభుత్వ బడులను ఆధునీకరించి మంచి చదువు చెప్పిస్తున్నారని కొనియాడారు.

అభివృద్ధి లేదు అనే వారు పాణ్యానికి వచ్చి చూడాలి: ఎమ్మెల్యే రాంభూపాల్ రెడ్డి

పాణ్యంలో ఈ నాలుగున్నరేళ్లలో 1.60 లక్షల మందికి రూ.170 కోట్లు ఇచ్చిన ఘనత వైఎస్ జగన్‌దేనని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి చెప్పారు. పిన్నాపురంలో ప్రపంచంలోనే అతి పెద్ద గ్రీన్‌కో రెన్యువబుల్ పవర్ ప్లాంటు ఏర్పాటు చేస్తున్నారని, త్వరలోనే దీనిని ప్రారంభిస్తామన్నారు. గుట్టపాడు దగ్గర రూ.600 కోట్లతో ఏర్పాటు చేస్తున్న జయరాజ్ ఇస్పాత్ స్టీల్ ప్లాంటు కూడా పూర్తయిందన్నారు కర్నూలు సిటీలో అభివృద్ధి పనులకు రూ.800 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీ సంజీవ్‌కుమార్, ఎమ్మెల్యేలు హఫీజ్‌ఖాన్, సుధాకర్, మేయర్ బీవై రామయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా పింఛన్ కానుక సంబరాలు

సాక్షి, అమరావతి : రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్ పింఛన్ కానుక సంబరాలు జరుగుతున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అందిస్తున్న రూ.3 వేల పింఛన్ కానుకను రాష్ట్రవ్యాప్తంగా అవ్వాతాతలకు ప్రజా ప్రతినిధులు, అధికారులు, వలంటీర్లు అందిస్తున్నారు. గురువారం నాటికి 20 లక్షల మంది (34 శాతం) లబ్ధిదారులకు పింఛన్ అందజేశారు. 533 సచివాలయాల పరిధిలో పింఛన్ సంబరాలు జరుగుతున్నాయి. వీటిలో 181 సచివాలయాల పరిధిలో పింఛన్ కానుక సంబరాలు గురువారం ప్రారంభమయ్యాయి. తిరుపతి పోస్టల్ కాలనీలో పింఛన్ పంపిణీని టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి ఓ పండుగలా నిర్వహించారు. అర్హులైన అవ్వా తాతలు, వితంతువులకు రూ. 3 వేల పింఛన్‌ను ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి తదితరులు అందించారు. అన్నమయ్య జిల్లా ములకలచెరువులో తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకానాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ పింఛన్‌ను పంపిణీ చేశారు.

గురువారం నాటికి 20 లక్షల మందికి అందజేత


కర్నూలు జిల్లా పైచెర్వు తండాలో రంగమ్మకు వృద్ధాప్య పింఛన్ అందిస్తున్న వలంటీర్ నీలావతి


అనంతపురం కృపానంద నగర్‌లో లక్ష్మమ్మకు వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న వలంటీర్ రేవతి


తూర్పుగోదావరి జిల్లా పందలపాకలో షేక్ అమ్మాజాన్‌కు వితంతు పింఛన్ అందిస్తున్న అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి


విజయనగరం జిల్లా వంగరలో పెంచిన వైఎస్సార్ పింఛన్‌ను లబ్ధిదారుకు అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్


విశాఖ 41వ వార్డులో ఇమ్మంది ప్రసాద్‌కు దివ్యాంగుల పింఛన్ అందజేస్తున్న వలంటీర్ ఎ.మాధవి


ఎన్టీఆర్ జిల్లా విజయవాడ క్రీస్తురాజపురంలో లబ్ధిదారు లక్ష్మికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ సుందరి


నెల్లూరులో షేక్ రహీమున్నీసాకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ సురేఖ

కేజీబీవీ ఉపాధ్యాయుల సమ్మె సరికాదు

సమగ్ర శిక్ష రాష్ట్ర పథక సంచాలకులు బి.శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి: మరో రెండు నెలల్లో విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధమవుతున్న సమయంలో కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాల(కేజీబీవీ)ల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు సమ్మె చేపట్టడం సమంజసం కాదని సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు బి.శ్రీనివాసరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల జరిపిన నియామకాల్లో 93 ప్రిన్సిపాల్స్, 398 సీఈఆర్టీలు, 1,015 పీజీటీలు, 49 పీఈటీలు కలిపి 1,555 మందిని నియమించామని తెలిపారు. 41 మంది తెలుగు, ఇంగ్లిష్ పార్ట్ టైం టీచర్లను వారి అర్హత ఆధారంగా కాంట్రాక్టు టీచర్లుగా తీసుకున్నామని వివరించారు. టైప్–3 కేజీబీవీల ప్రిన్సిపల్స్, సీఆర్టీలు, పీజీటీలు, పీఈటీ పోస్టుల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయ సిబ్బందికి ప్రభుత్వం గౌరవ వేతనాన్ని 23శాతం పెంచిందన్నారు. 2018 నుంచి పార్ట్‌టైమ్‌గా పనిచేస్తున్న సుమారు 400 మంది పీజీటీలు గౌరవ వేతనం రూ.12వేలను సీఆర్టీల ప్రకారం రూ.26,759 అందుకుంటున్నారని తెలిపారు. మరో 60 రోజుల్లో పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షలు జరగనున్న తరుణంలో టీచర్లు తరగతులకు గైర్హాజరవడం సమంజసం కాదని హితవు పలికారు. తక్షణమే విధుల్లో చేరాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

14న 'మధునాపంతుల' ప్రతిభా పురస్కారాల ప్రదానం

డాక్టర్ యనమదల, డాక్టర్ పూర్ణచందు ఎంపిక


డాక్టర్ యనమదల మురళీకృష్ణ


డాక్టర్ జీవీ పూర్ణచందు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: భాషాప్రవీణ మధునాపంతుల సూరయ్యశాస్త్రి శతజయంత్యుత్సవాలను పురస్కరించుకుని వివిధ రంగాలకు చెందిన ప్రముఖులకు ప్రతిభా పురస్కారాలను ప్రకటించారు. కాకినాడ జిల్లా కాజులూరు మండలం పల్లిపాలెంలోని మధునాపంతుల కామరాజు సాంస్కృతిక ప్రాంగణం గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. విజయవాడకు చెందిన ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు, బహుగ్రంథకర్త డాక్టర్ జీవీ పూర్ణచందు, కాకినాడకు చెందిన ప్రజావైద్యుడు, వైద్య గ్రంథాల రచయిత డాక్టర్ యనమదల మురళీకృష్ణలను ప్రతిభా పురస్కారాలకు ఎంపిక చేశారు. అలాగే విశ్రాంతాచార్యులు, విశాఖపట్నం గాయత్రీ విద్యా పరిషత్ డైరెక్టర్ డాక్టర్ పులుగుర్త వ్యాఘ్రేశ్వరశర్మకు అభినందన సత్కారం నిర్వహించనున్నారు. ఈ నెల 14న పల్లిపాలెంలోని మధునాపంతుల సత్యనారాయణమూర్తి ఆంధ్ర కుటీరంలో ఈ పురస్కారాలు అందజేయనున్నారు. అనంతరం ద్విభాష్యం అన్నపూర్ణ రచించిన పూర్ణోదయం అనే రచనను ఆవిష్కరించనున్నారు.

ఎన్నికల పటిష్ట నిర్వహణకు కార్యాచరణ

- ఎన్నికల ఏర్పాట్లు, సన్నద్ధతపై సీఎస్ జవహర్‌రెడ్డి సమీక్ష
- డబ్బు, మద్యం అక్రమ రవాణా నియంత్రణకు చెక్ పోస్టులు
- ఒకేచోట మూడు నాలుగేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న అధికారుల బదిలీ
- ఈ నెల 9, 10 తేదీల్లో కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్ర పర్యటన: ముఖేష్‌కుమార్ మీనా


రాష్ట్ర సచివాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షిస్తున్న సీఎస్ జవహర్‌రెడ్డి

సాక్షి, అమరావతి: రానున్న సాధారణ ఎన్నికల సక్రమ నిర్వహణకు వీలుగా సంబంధిత శాఖలు ఇప్పటి నుంచే తగిన కార్యాచరణను సిద్ధం చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా. కేఎస్ జవహర్‌రెడ్డి ఆదేశించారు. ఎన్నికల సన్నద్ధతపై రాష్ట్ర సచివాలయంలో గురువారం ఆయన వివిధ విభాగాల అధికారులతో సమీక్షించారు. రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు సహా ఎన్నికల విధులతో నేరుగా సంబంధమున్న వివిధ విభాగాల అధికారుల ఖాళీల భర్తీతోపాటు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం, జిల్లా ఎన్నికల అధికారుల కార్యాలయాల్లో అవసరమైన సిబ్బంది కేటాయింపు తదితర అంశాలపై రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈఓ) ముఖేష్‌కుమార్ మీనాతో సీఎస్ జవహర్‌రెడ్డి ఈ సమావేశంలో చర్చించారు. అలాగే, కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎన్నికల విధుల నిర్వహణతో సంబంధం ఉండి ఒకే ప్రాంతంలో మూడు నాలుగేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న అధికారుల తప్పనిసరి బదిలీ, కొత్తవారికి పోస్టింగులు వంటి వాటిపై కూడా వెంటనే చర్యలు తీసుకోనున్నట్లు జవహర్‌రెడ్డి తెలిపారు. పోలింగ్ కేంద్రాల వారీగా ఉండాల్సిన కనీస సౌకర్యాలకు సంబంధించిన అంశాలపైనా సమీక్షించారు.

అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో చెక్‌పోస్టులు..

ఇక రానున్న ఎన్నికల్లో డబ్బు, మద్యం వంటి అక్రమ రవాణా నియంత్రణకు సంబంధిత శాఖల అధికారులు, సిబ్బందితో అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో పటిష్టమైన ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టుల ఏర్పాటుకు తీసుకోవాల్సిన చర్యలపైనా సీఎస్ జవహర్‌రెడ్డి సమీక్షించారు. ముఖ్యంగా ఏపీ, ఒడిశా రాష్ట్ర అధికారులతో త్వరలో ఒక సమావేశం నిర్వహించాలని.. దీనిపై ఒడిశా సీఎస్‌తో తాను మాట్లాడతానన్నారు. అలాగే, ఎన్నికలు అత్యంత పారదర్శకంగా సజావుగా నిర్వహించాల్సిన ప్రక్రియని.. కాబట్టి ప్రతి ఒక్కరూ అత్యంత బాధ్యతాయుతంగా పనిచేయాల్సి ఉంటుందని.. ఆ దిశగా సంబంధిత శాఖలన్నీ ఎన్నికల కసరత్తు మొదలుపెట్టాలని అధికారులను సీఎస్ ఆదేశించారు.

9, 10 తేదీల్లో కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్ర పర్యటన..

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా మాట్లాడుతూ.. ఎన్నికల సన్నాహక ఏర్పాట్లపై సమీక్షకు కేంద్ర ఎన్నికల సంఘం రెండ్రోజుల పర్యటన నిమిత్తం ఈనెల 9న రాష్ట్రానికి రానుందని తెలిపారు. 10న విజయవాడలో సీఎస్, డీజీపీ, సీఈఓ సహా ఎక్సైజ్, వాణిజ్య పన్నులు, ఆర్ అండ్ బీ, అటవీ, విద్యా తదితర శాఖల ఉన్నతాధికారులతో సమీక్షిస్తుందని చెప్పారు. రాష్ట్రంలో 46,165 పోలింగ్ కేంద్రాలున్నాయని.. వాటిలో ఉండాల్సిన కనీస సౌకర్యాలు కోసం తీసుకోవాల్సిన చర్యలపై సీఎస్ దృష్టికి తీసుకొచ్చి వీటిపై జిల్లా ఎన్నికల అధికారులైన కలెక్టర్లకు తగిన ఆదేశాలు జారీచేయాల్సి ఉందని సీఎస్‌కు చెప్పారు. అలాగే, వివిధ పోలింగ్ కేంద్రాల్లో విభిన్న ప్రతిభావంతులకు ఏర్పాటుచేయాల్సిన సౌకర్యాలపైనా ఆదేశాలివ్వాల్సి ఉందన్నారు. రాష్ట్ర ఎన్నికల కార్యాలయం, జిల్లా ఎన్నికల అధికారుల కార్యాలయాల్లో ఎన్నికల విధుల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని డిప్యుటేషన్‌పై నియమించాల్సి ఉందని సీఈఓ చెప్పగా.. వెంటనే తగిన ప్రతిపాదనలు పంపాలని సీఎస్ జవహర్‌రెడ్డి కోరారు. ఇంకా ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఇతర అంశాలపైనా సమావేశంలో చర్చించారు.

ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ రావత్, చీఫ్ కమిషనర్ ఆఫ్ స్టేట్ ట్యాక్స్ గిరిజాశంకర్, అదనపు పీసీసీఎఫ్ విజిలెన్స్ గోపీనాథ్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో డైరెక్టర్ ఎం. రవిప్రకాశ్, రవాణా శాఖ కమిషనర్ మనీష్‌కుమార్ ఎస్ఎల్బీసీ కన్వీనర్ తదితర అధికారులు పాల్గొన్నారు. అదే విధంగా.. ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు బి. రాజశేఖర్, రజత్ భార్గవ, ముఖ్య కార్యదర్శి శ్యామలరావు, కమిషనర్, స్కూల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కె.భాస్కర్, సీడీఎంఏ కోటేశ్వరరావు తదితరులు వర్చువల్‌గా పాల్గొన్నారు.

చెక్‌పోస్టులో నిఘా మరింత ముమ్మరం..

రాష్ట్ర ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ ఎం. రవిప్రకాశ్ మాట్లాడుతూ.. ప్రస్తుతం రాష్ట్రంలో అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో 29 ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులున్నాయని, వాటిని పటిష్టంగా నిర్వహించడం ద్వారా డబ్బు, మద్యం, గంజాయి ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా నివారణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. వీటితో పాటు రాష్ట్రంలో 76 పోలీసు చెక్‌పోస్టులు, 14 అటవీ చెక్ పోస్టులున్నాయని వీటన్నింటి ద్వారా నిఘాను మరింత ముమ్మరం చేయనున్నట్లు ముఖేష్‌కుమార్ చెప్పారు.

ఆనందమని 'పింఛెన్'


రూ.3 వేల పింఛన్ పొందిన ఆనందంతో జై జగన్ అంటూ నినాదాలు చేస్తున్న రాజమ్మ

రాజంపేట టౌన్: పింఛను మొత్తం రూ.3 వేలకు పెరగడంతో అన్నమయ్య జిల్లా రాజంపేటలోని జీఎంసీ వీధికి చెందిన రాజమ్మ అనే లబ్ధిదారు అవధులు లేని ఆనందానికి లోనయ్యింది. 'నెలనెలా ఇస్తున్న పింఛను రూ.3 వేలయ్యింది. ఇది సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇస్తున్న మహాకానుక. వయసులో చిన్నవాడైనా నాలాంటి వాళ్లెందరికో మహోపకారం చేయడం ద్వారా సీఎం జగన్ మాకందరికీ ఇంటికి పెద్ద దిక్కుగా మారారు. జై జగన్.. మేం బతికున్నంత కాలం సీఎంగా జగన్ ఉండాలి' అంటూ అందరికీ వినిపించేలా బిగ్గరగా నినాదాలు చేసింది. పింఛన్ల పంపిణీ సందర్భంగా రాజంపేట మునిసిపల్ కార్యాలయంలో గురువారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా పింఛన్ మొత్తం అందుకున్న రాజమ్మలో ఒక్కసారిగా ఆనందం ఉప్పొంగింది. డబ్బును, సీఎం సందేశ పత్రాలను అందరికీ చూపుతూ నినాదాలు చేయడం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

19న అంబేడ్కర్ స్మృతివనం ప్రారంభోత్సవం

- భారీగా తరలివచ్చే ప్రజలకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయండి
- అధికారులకు మంత్రి మేరుగు నాగార్జున ఆదేశం



సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం విజయవాడలోని స్వరాజ్ మైదానంలో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన 125 అడుగుల విగ్రహంతో కూడిన డా.బీఆర్.అంబేడ్కర్ స్మృతివనానికి ఈ నెల 19న ప్రారంభోత్సవం నిర్వహిస్తున్నట్టు సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చే అవకాశం ఉన్నందున.. తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. దేశంలో మరెక్కడా లేని విధంగా దాదాపు రూ.400 కోట్లతో స్మృతివనాన్ని తీర్చిదిద్దినట్టు చెప్పారు. విగ్రహ నిర్మాణం పూర్తయ్యిందని.. లైటింగ్, పెయింటింగ్ పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. మినీ థియేటర్, మ్యూజియం, స్కై లైటింగ్, ఫౌంటెన్లు, ఉద్యానవనాలతో సుందరీకరణ, భవనాలు, ప్రహరీ గోడల నిర్మాణం, లిఫ్టులు, వెహికల్ పార్కింగ్, ఫుడ్ కోర్టు తదితర ప్రధాన పనులన్నీ దాదాపుగా పూర్తయ్యాయని చెప్పారు. సందర్శకులు అంబేడ్కర్ చరిత్రను పూర్తిగా తెలుసుకోవడంతో పాటు వారికి అనిర్వచనీయమైన అనుభూతిని కలిగించేలా స్మృతివనాన్ని తీర్చిదిద్దుతున్నట్టు మంత్రి తెలిపారు. పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వై.శ్రీలక్ష్మి, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, సాంఘిక సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జి.జయలక్ష్మి, ఎన్టీఆర్ జిల్లా జేసీ సంపత్, విజయవాడ మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్, సాంఘిక సంక్షేమ శాఖ అడిషనల్ డైరెక్టర్ రఘురామ్ పాల్గొన్నారు.

ఇంటర్మీడియెట్ విద్యామండలి సమావేశం

ఎఫిలియేషన్స్, ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్స్ జారీపై చర్చ

సాక్షి, అమరావతి: ఇంటర్మీడియెట్ విద్యామండలి 76వ బోర్డు మీటింగ్ గురువారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. విద్యార్థుల ఆన్‌లైన్ సర్వీసెస్, కళాశాలల గుర్తింపు (కాలేజ్ ఎఫిలియేషన్స్), ప్రైవేట్ అన్ ఎయిడెడ్ జూనియర్ కళాశాలల ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్స్ జారీ, డిజిటలైజేషన్ ఆఫ్ ఎగ్జామినేషన్స్‌పై చర్చించారు. సమావేశంలో విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాశ్, స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ సురేశ్, ఇంటర్మీడియెట్ బోర్డు కార్యదర్శి సౌరభ్ గౌర్ తదితరులు పాల్గొన్నారు.

విలువైన కోర్టు సమయాన్ని వృథా చేస్తారా?

- ఓ కక్షదారుడికి రూ.లక్ష ఖర్చులు విధించిన హైకోర్టు
- కేంద్ర ప్రభుత్వంలో పని చేస్తున్న విషయాన్ని దాచిపెట్టిన కక్షిదారు
- తిరిగి రాష్ట్ర ప్రభుత్వం నుంచి వేతన బకాయిల కోసం పిటిషన్
- వాస్తవాలు తెలియడంతో కక్షిదారుపై మండిపడ్డ న్యాయస్థానం



సాక్షి, అమరావతి : కేంద్ర ప్రభుత్వంలో పని చేస్తున్న విషయాన్ని దాచిపెట్టి, తిరిగి రాష్ట్ర ప్రభుత్వం నుంచి వేతన బకాయిల కోసం పిటిషన్ దాఖలు చేసిన కక్షిదారుపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. అత్యంత విలువైన కోర్టు సమయాన్ని వృథా చేయడమే కాక, కోర్టు ప్రక్రియను దుర్వినియోగం చేసినందుకు ఖర్చుల కింద రూ.లక్ష జరిమానా విధించింది. ఈ మొత్తాన్ని ఆరు వారాల్లో న్యాయ సేవాధికార సంస్థకు చెల్లించాలని ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ గుహనాథన్ నరేందర్, జస్టిస్ న్యాపతి విజయ్‌ల ధర్మాసనం ఇటీవల తీర్పు వెలువరించింది. సాంఘిక సంక్షేమ శాఖలో పనిచేస్తున్న పశ్చిమ గోదావరి జిల్లా దారవరం గ్రామానికి చెందిన ఎం.అబ్రహంను ఉద్యోగం నుంచి తొలగించడంతో ఆయన 1991లో లేబర్ కోర్టును ఆశ్రయించారు. లేబర్ కోర్టు అబ్రహం తొలగింపు ఉత్తర్వులను రద్దు చేస్తూ 1996లో తీర్పునిచ్చింది. ఇదిలా ఉండగానే తనకు 1997 నుంచి 2002 వరకు వేతన బకాయిలు చెల్లించేలా ఆదేశించాలంటూ అబ్రహం లేబర్ కోర్టులో ఎగ్జిక్యూషన్ పిటిషన్ (ఈపీ) దాఖలు చేశారు. ఆ వేతన బకాయిలు చెల్లించాలని లేబర్ కోర్టు అధికారులను ఆదేశించింది. ఈ ఉత్తర్వులపై సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు 2016లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అబ్రహంను ఉద్యోగంలోకి తీసుకోవాలని లేబర్ కోర్టు ఆదేశాలు ఇచ్చిన తరువాత అతనికి కాల్ లెటర్ పంపామని, ఆయన స్పందించలేదని కోర్టుకు నివేదించారు. పైపెచ్చు 1992లోనే అతను తపాలా శాఖలో ఉద్యోగిగా పని చేస్తున్న విషయాన్ని దాచిపెట్టారని వివరించారు. ఓ వైపు కేంద్ర ప్రభుత్వ శాఖలో పని చేస్తూనే, మరో వైపు సాంఘిక సంక్షేమ శాఖ నుంచి వేతన బకాయిలు కోరుతున్నారని, దీని వెనుక అబ్రహంకు దురుద్దేశాలున్నాయని వివరించారు. దీంతో వేతన బకాయిలు చెల్లించాలన్న లేబర్ కోర్టు ఉత్తర్వులను రద్దు చేస్తూ సింగిల్ జడ్జి 2017లో తీర్పునిచ్చారు. ఈ తీర్పును సవాలు చేస్తూ అబ్రహం అదే ఏడాది హైకోర్టు ధర్మాసనం ముందు అప్పీల్ చేశారు. ఈ అప్పీల్‌పై ఇటీవల జస్టిస్ నరేందర్ ధర్మాసనం తుది విచారణ జరిపింది. సాంఘిక సంక్షేమ అధికారుల తరఫున ప్రభుత్వ న్యాయవాది అప్పాధరరెడ్డి వాదనలు వినిపిస్తూ.. అబ్రహం తపాలా శాఖలో పనిచేస్తున్న విషయాన్ని ఆ శాఖ అధికారులు ధ్రువీకరించారన్నారు. కేంద్ర ప్రభుత్వ శాఖలో పని చేస్తున్న వ్యక్తి రాష్ట్ర ప్రభుత్వం నుంచి వేతన బకాయిలు ఎలా కోరతారన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం ప్రభుత్వ న్యాయవాది వాదనలతో ఏకీభవించింది. స్వీయ లాభం పొందే ఉద్దేశంతోనే అబ్రహం ఈ అప్పీల్ దాఖలు చేశారని ధర్మాసనం అభిప్రాయపడింది. ఉద్యోగంలో చేరకుండా వేతన బకాయిలు ఎలా కోరతారని ప్రశ్నించింది. కోర్టు ప్రక్రియ దుర్వినియోగానికి ఇది మచ్చుతునక అని తెలిపింది. న్యాయ ప్రక్రియ ఉన్నది న్యాయం చేయడానికి, కక్షిదారుల హక్కుల పరిరక్షించడానికి మాత్రమేనంది. కోర్టు అత్యంత విలువైన సమయాన్ని అబ్రహం వృథా చేశారని, ఆయన తీరును మన్నించలేమని స్పష్టం చేసింది. అందువల్ల ఈ అప్పీల్‌ను భారీ ఖర్చులు విధించి మరీ కొట్టేయాలని నిర్ణయించామంది.

బ్యాంకును బురిడీ కొట్టించిన వ్యక్తికి ఐదేళ్ల జైలు

తప్పుడు పత్రాలతో రూ.69 లక్షల రుణం

విశాఖ లీగల్: తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో బ్యాంకును మోసగించిన ప్రైవేటు కంపెనీ యజమానికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి గురువారం తీర్పు చెప్పారు. సీబీఐ అధికారుల కథనం ప్రకారం..విశాఖ పట్నం ఇండస్ట్రియల్ ఎస్టేట్ ప్రాంతంలోని యూనియన్ బ్యాంకులో మాస్టర్ స్టీల్ ట్యూబ్స్ కంపెనీ మేనేజింగ్ పార్టనర్ ఎం.సుధాకరరావుకు ఖాతా ఉంది. ఇద్దరు ప్రైవేట్ వ్యక్తులు, బ్యాంకు మేనేజర్ సహాయంతో ఆయన బ్యాంకు నుంచి రూ.39 లక్షలు క్రెడిట్, ఇతర ఖర్చులకు సరైన పత్రాలు సమర్పించకుండానే పలు దఫాలుగా అప్పు పొందారు. బ్యాంకు ఆడిటింగ్‌లో నిందితులు రూ.69,49,229 లబ్ధి పొందినట్లు గుర్తించారు. దీంతో బ్యాంక్ అధికారులు చీఫ్ మేనేజర్, సుధాకరరావుతోపాటు మరో ఇద్దరిపై 2002 మే 15న నేరాభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. కేసు విచారణ జరుగుతున్న సమయంలో బ్యాంకు మేనేజర్ మృతి చెందారు. విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి నిందితుడు సుధాకరరావుకు ఐదేళ్ల జైలు శిక్ష విధించారు. మిగిలిన ఇద్దరిని నిర్దోషులుగా విడుదల చేశారు.

• తెలంగాణ

భూ రికార్డులు సరిచేయడంలో ఏపీ టాప్

- సీఎం జగన్ చర్యలతో రైతులకు మేలు
- భూ న్యాయ నిపుణుడు డాక్టర్ సునీల్‌కుమార్

యాచారం: దేశంలో భూ రికార్డులు సరి చేసే విషయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ముందు వరుసలో ఉందని భూ న్యాయ నిపుణుడు డాక్టర్ సునీల్‌కుమార్ పేర్కొన్నారు. భూ రికార్డుల నమోదు, సరిహద్దుల గుర్తింపు, పట్టాదారు పాసు పుస్తకాలు జారీ చేసే విషయంలో ఏపీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి తీసుకుంటున్న చర్యలు రైతులకు ఎంతో మేలు చేస్తున్నాయన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీ పథకాల దరఖాస్తుల స్వీకరణ, ప్రజాపాలన కార్యక్రమాన్ని పరిశీలించేందుకు గురువారం ఆయన రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డితో సమావేశమయ్యారు. ప్రజా పాలనలో భూ సమస్యలపై ఎలాంటి ఫిర్యాదులు వస్తున్నాయి.. ధరణి పోర్టల్‌లో సమస్యలను ఎలా పరిష్కరిస్తున్నారు.. వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం భూ రికార్డులను నమోదు చేసే విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకుంటోందని చెప్పారు. పట్టాదారు పాసుపుస్తకంపైనే భూమి హద్దులు, మ్యాప్ ముద్రించి అందజేస్తున్నారని తెలిపారు.

ఎస్‌ఐపై దాడి కేసులో టీడీపీ కార్యకర్తల అరెస్ట్

తిరువూరు: ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం ఎస్‌ఐ సతీష్‌పై దాడి ఘటనలో ఆ పార్టీకి చెందిన పది మంది కార్యకర్తలను అరెస్టు చేసినట్లు ఏసీపీ రమేష్ తెలిపారు. సీసీ ఫుటేజ్ ఆధారంగా మొత్తం 34 మంది నిందితులను గుర్తించామని, వీరిలో గంపలగూడెం మండలానికి చెందిన యాశారపు ముత్యాలరావు, మందడపు జానకి రామయ్య, గొర్రెపాటి నరేష్, గువ్వల వెంకటేశ్వరరెడ్డి, తూము శ్యాంసన్, పోలిశెట్టిపాడుకు చెందిన వాసం వినయ్, విస్సన్నపేట మండలానికి చెందిన కారే ప్రవీణ్‌కుమార్, గంజిబోయిన శ్రీనివాసరావు, తిరువూరుకు చెందిన షేక్ హుస్సేన్, మల్లెల శ్రీనివాసరావులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచినట్లు తెలిపారు. మిగిలిన నిందితులనూ త్వరలో అరెస్ట్ చేస్తామని తెలిపారు. కాగా, టీడీపీ కార్యకర్తల దాడిలో తీవ్రంగా గాయపడిన తిరువూరు ఎస్‌ఐ సతీష్‌కు స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం విజయవాడ తరలించారు.

డేటా చౌర్యం చేస్తున్న పచ్చమూకలు


నూజివీడులో ఇళ్లలోకి చొరబడి ప్రజల సున్నిత వ్యక్తిగత సమాచారం సేకరిస్తున్న టీడీపీ దొంగల ముఠా

- ఓటర్ల తనిఖీ పేరుతో బరితెగింపు
- అమాయకుల నుంచి ఫోన్ తీసుకొని వ్యక్తిగత వివరాలన్నీ సేకరణ
- ఆందోళన వ్యక్తం చేస్తున్న ప్రజలు


టీడీపీ మూకలు ఇంటింటికీ ఇస్తున్న కరపత్రం

నూజివీడు: ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడటమే లక్ష్యంగా టీడీపీ మూకలు బరితెగిస్తున్నాయి. బాబు ష్యూరిటీ–భవిష్యత్‌కు గ్యారంటీ పేరుతో ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని దొంగిలిస్తున్నాయి. ఇళ్లలోకి చొరబడి.. అమాయకులైన ప్రజల్ని మాయమాటలతో మభ్యపెట్టి వారి ఫోన్ల నుంచి సున్నిత సమాచారాన్ని సేకరిస్తున్నాయి. టీడీపీ కార్యకర్తలు తమ ఫోన్లు తీసుకొని ఓటీపీలు ఎందుకు సేకరిస్తున్నారో తెలియడం లేదంటూ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏలూరు జిల్లా నూజివీడు మండలంలోని గ్రామాల్లో పలువురు టీడీపీ కార్యకర్తలు ప్రజల ఇళ్లకు వెళ్తున్నారు. వారితో మాటలు కలిపి.. ఏ రాజకీయ పార్టీకి ఓటు వేస్తారో తెలుసుకుంటున్నారు. అనంతరం వారి ఫోన్ నంబర్లు సేకరిస్తున్నారు. ఆ తర్వాత మెసేజ్‌లు పంపించి.. ఓటీపీలు సేకరిస్తున్నారు. మెసేజ్‌లు చూడటం తెలియనివారి వద్ద నుంచి టీడీపీ కార్యకర్తలే ఫోన్‌లు తీసుకొని ఓటీపీలను తమ ట్యాబ్‌లలో నమోదు చేసుకుంటున్నారు. రేగుంట గ్రామంలో ఇదే విధంగా జరగడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై టీడీపీ మూకలను ఎవరైనా ప్రశ్నిస్తే.. టీడీపీ మేనిఫెస్టో పేరుతో ఓ లింక్ పంపించి.. మీ కుటుంబం పలు పథకాలకు అర్హత పొందిందని.. 2024 జూన్ తర్వాత మీ ఖాతాలో డబ్బులు జమ అవుతాయంటూ మభ్యపెడుతున్నారు. నూజివీడుకు చెందిన వాసవికి ఆడబిడ్డ నిధి, ఇతర పథకాల కింద ఏడాదికి రూ.54 వేలు వస్తాయని, ఐదేళ్లకు రూ.2.70 లక్షలు లబ్ధి పొందుతారంటూ చెప్పి.. ఆమె సమాచారమంతా సేకరించారు.

నా కుటుంబ వివరాలు వాళ్లకెందుకు?



టీడీపీ కార్యకర్తలు మా ఇంటికి వచ్చారు. ఎన్ని ఓట్లు ఉన్నాయని అడిగారు. చెప్పగా.. నా ఫోన్‌కు ఏదో మెసేజ్ పంపించారు. నాకు చూడటం రాదని చెప్పగా.. వాళ్లే ఏదో నమోదు చేసుకొని వెళ్లారు. ఏదో ఓటీపీ నా ఫోన్ నుంచి తీసుకున్నారని ఆ తర్వాత తెలిసింది. నా కుటుంబ వివరాలు వాళ్లకెందుకో అర్థం కావడం లేదు.

– కె.విజయకుమార్, రేగుంట

నీ చెంపలను గర్వంతో, ప్రజల యెదుట ఉబ్బించకు. భూమిపై అహంకారంతో నడవకు. నిశ్చయంగా, అల్లాహ్ డాంబికాలు చెప్పుకొని, విర్రవీగే వాడంటే ఇష్టపడడు.

– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 5 జనవరి 2024

కూటమిలో అనైక్యతా రాగం

ఎన్నికల సంవత్సరంలోకి వచ్చేశాం. కొద్ది నెలల్లో లోక్‌సభ ఎన్నికలు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఇప్పటికే రామమందిరం సహా రకరకాల వ్యూహాలతో జనంలోకి దూసుకుపోతోంది. మరి, బలమైన అధికార పక్షాన్ని ఢీ కొట్టాల్సిన ప్రతిపక్షాల మాటేంటి? అవి ఇప్పటికీ అయోమయంలో ఉన్నట్టున్నాయి. ప్రతిపక్ష 'ఇండియా' కూటమిలోని భాగస్వామ్య పార్టీలు పేరుకు ఒకే సమూహంగా ఉన్నా, అనేక అంశాల్లో అవి ఒక్క తాటి మీదకు రాలేకపోతున్న దుఃస్థితి కళ్ళకు కడుతోంది. ఉమ్మడి కార్యాచరణ ప్రణాళిక, ఎవరెక్కడ పోటీ చేయాలి, సీట్ల సర్దుబాటేంటి తదితర అంశాలు దేవుడెరుగు, కనీసం ఈ కూటమికి ఎవరు కన్వీనర్‌గా ఉండాలనే అంశంలోనూ ఏకాభిప్రాయం కొరవడింది. ఈ వార్తలు కూటమి బలహీనతలను బట్టబయలు చేస్తున్నాయి. బిహార్‌లో జేడీయూ నేత నితీశ్ కుమార్‌ను దింపి, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్‌ను సీఎంను చేసేందుకు ఇటీవల జరిగిన విఫల యత్నం 'ఇండియా' కూటమి పక్షాలు సొంత కాళ్ళు నరుక్కొనే మూర్ఖత్వమే!

ప్రాధాన్యం తగ్గుతోందని భావిస్తున్న బిహార్ సీఎం నితీశ్ కుమార్‌ను విపక్ష 'ఇండియా' కూటమి కన్వీనర్‌ను చేసి, బుజ్జగించాలన్నది తాజా ప్రతిపాదన. అయితే, అందుకు తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) సహా కొన్నిపక్షాలు ప్రతికూలం. ఈ అంశంపై కూటమి పక్షాల మధ్య గురువారం జరగాల్సిన వర్చ్యువల్ సమావేశం సైతం ఆఖరి నిమిషంలో రద్దయింది అందుకే. ఇక, కూటమిలోని రెండు ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)ల మధ్య ఢిల్లీ, పంజాబ్‌లలో సీట్ల సర్దుబాటుపై ప్రతిష్టంభన కొనసాగుతోంది. మహారాష్ట్రలో శివసేన (ఉద్ధవ్ ఠాక్రే) వర్గంతో, పశ్చిమ బెంగాల్‌లో టీఎంసీతో కూడా సరిగ్గా ఇదే పంచాయతీ కాంగ్రెస్‌కు నడుస్తోంది. అలాగే, బీజేపీతో రాజకీయ రంగు పులుముకుంటున్న అయోధ్య రామమందిర ప్రారంభోత్సవానికి వెళ్ళాలా, వద్దా అనే అంశంపైనా నిశ్చితాభిప్రాయం మృగ్యం. వెరసి, కూటమి పార్టీల మధ్య పరస్పర విరుద్ధ ప్రయోజనాలు, సమన్వయ లోపాలు ఎన్నికలు సమీపిస్తున్నా జవాబు లేని ప్రశ్నలుగానే మిగిలాయి.

2024 ఎన్నికల్లో మోదీని గద్దె దించాలనే లక్ష్యంతో ఈ పార్టీలన్నీ ఒక దగ్గరకు చేరాయి. కాంగ్రెస్ చొరవతో విస్తృత చర్చల తర్వాత గత జూలై 18న 26 పార్టీల కూటమిగా 'ఇండియా' ఆవిర్భవించింది. 80 మంది ఎంపీలున్న కాంగ్రెస్ ప్రాథమికంగా పెద్దన్న పాత్ర పోషిస్తుంటే, ఆ పార్టీకి వివిధ రాష్ట్రాల్లో ప్రత్యర్థులైన ఆప్, టీఎంసీ, వామపక్షాలు సైతం కూటమిలో ఉన్నాయి. ఈ బీజేపీ వ్యతిరేక కూటమి ఏర్పాటుకు ముందు గత ఫిబ్రవరి, మే నెలల్లో 3 రాష్ట్రాల్లో (త్రిపుర, మేఘాలయ, కర్ణాటక) ఎన్నికలు జరిగాయి. కూటమి ఏర్పడ్డాక నవంబర్‌లో 5 రాష్ట్రాలు (తెలంగాణ, మిజోరమ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్) ప్రజాతీర్పు కోరాయి. రెండుసార్లూ ప్రతిపక్షాలు ఉమ్మడి ప్రత్యర్థి బీజేపీతో పాటు, తమలో తాము ఢీకొన్న పరిస్థితి. కూటమి ఉన్నా కాంగ్రెస్ ఒంటరిగా బరిలోకి దిగింది. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్ గఢ్‌లలో కాంగ్రెస్, తన కూటమి పక్షాలైన ఎస్పీ, జేడీయూలతోనూ పోటీ పడింది. ఫలితంగా మిశ్రమ ఫలితాలే దక్కాయి.

దేశంలో తూర్పు నుంచి పడమటి వరకు రాహుల్ గాంధీ చేయనున్న సరికొత్త 'భారత్ న్యాయ యాత్ర' ఈ జనవరి ప్రథమార్ధం లోనే ఆరంభం కానుంది. ఎన్నికల ముందు ప్రతిపక్షాల బలప్రదర్శనకు ఈ యాత్రను అనువుగా మలుచుకోవాలని కాంగ్రెస్ భావన. కూటమి సభ్యుల మధ్య సీట్ల పంపిణీ ఫార్ములాకు తుది రూపం ఇవ్వాలని ఆ పార్టీ అస్తుబిస్తు అవుతోంది. లోక్‌సభలో ఎన్నికలు జరిగే 543 స్థానాల్లో 290 సీట్లలో స్వయంగా పోటీ చేయాలని కాంగ్రెస్ యోచన. ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రంలో సీట్ల సర్దుబాటు చేసుకోవాలనీ, వీలైనచోటల్లా బీజేపీ సారథ్య ఎన్డీఏ అభ్యర్థికీ – తమ అభ్యర్థికీ మధ్య ముఖాముఖీ పోరు జరిగేలా చూడాలని 'ఇండియా' ప్రయత్నం. అయితే టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ, రాహుల్‌తో ఎంత స్నేహంగా ఉన్నా సీట్ల సర్దుబాటులో నిక్కచ్చిగానే నిలబడతారు. పశ్చిమ బెంగాల్‌లో హస్తం పార్టీ క్రితంసారి గెలిచిన 2 స్థానాలు తప్ప, ఇంకేమీ ఇవ్వబోమన్నది టీఎంసీ ప్రతిపాదన. ఆ 'భిక్ష' అవసరం లేదనీ, మోదీకి అనుకూలంగా మమత పని చేస్తున్నారనీ అయిదు సార్లు ఎంపీగా ఎన్నికైన పశ్చిమ బెంగాల్ కాంగ్రెస్ అధినేత అధిర్ రంజన్ చౌధురి వ్యాఖ్య. స్థానిక అనివార్యతల రీత్యా రానున్న రోజుల్లో 'ఇండియా' కూటమిలో ఇలాంటి అపరిణత వ్యాఖ్యలు, పరస్పర దూషణలు మరిన్ని వినిపిస్తాయి.

ఐక్యత లేకపోవడం, ఈ అంతర్గత కుమ్ములాటలు కూటమిని బలహీనం చేస్తున్నాయి. ఇటీవల ఈశాన్య రాష్ట్రాల్లో కాంగ్రెస్, టీఎంసీల మధ్య పోరు బీజేపీకే లాభించింది. రేపు లోక్‌సభ ఎన్నికల్లోనైనా కూటమి పక్షాల మధ్య సర్దుబాటు, సమన్వయం సవ్యంగా సాగుతుందా అన్నది అనుమానమే. నిజానికి, విజయవంతమైన రాహుల్ 'భారత్ జోడో యాత్ర' మొదలు మోదీపై వీగిపోయిన అవిశ్వాస తీర్మానం, పార్లమెంట్‌లో మూకుమ్మడి సస్పెన్షన్ల దాకా ప్రతిపక్షాలు గత ఏడాది వార్తల్లో నిలిచాయి. కానీ, కేవలం వార్తల్లో ఉంటే సరిపోదు. బీజేపీపై పోరాటం, మోదీని గద్దె దించడమే ఏకైక అజెండా అయితే అదీ జనానికి రుచించదు. కూటమికి లాభించదు. అందుకని, ఇప్పటికైనా ఓటర్లను తమ వైపు తిప్పుకొనేందుకు మార్గాలేమిటో 'ఇండియా' కూటమి పర్యాలోచించాలి. గమ్యానికి తగ్గట్టు గమనం ఉండాలన్నది విస్మరించి, భాగస్వామ్య పక్షాలు అభిప్రాయ భేదాలను కొనసాగిస్తే కష్టం. పిట్ట పోరు పిట్ట పోరు... పిల్లి తీర్చినట్టు అధికార బీజేపీకే కలిసొస్తుంది. ఏ పార్టీకి ఆ పార్టీ తనవైన లెక్కలు వేసుకొనే ఎన్నికల ముంగిట దాన్ని నివారించడం 'ఇండియా' కూటమికి పెను సవాలు. కలవని రైలు పట్టాల లాగే స్నేహంతో ప్రతిపక్షాలకు ఒరిగేదేమిటి?

బంగ్లా సుస్థిరత కొనసాగేనా?

విశ్లేషణ



ఆనంద్ కుమార్

భారత్‌కు సన్నిహిత పొరుగుదేశం, నమ్మదగిన భాగస్వామి అయిన బంగ్లాదేశ్‌లో జనవరి 7న ఎన్నికలు జరగనున్నాయి. 2009 నుంచి దేశ ప్రధానిగా అప్రతిహతంగా కొనసాగుతున్న షేక్ హసీనా ఈసారి కూడా తిరిగి అధికారాన్ని నిలబెట్టుకునే అవకాశాలు ఎక్కువే ఉన్నాయి. అయితే, ఎన్నికలు స్వేచ్ఛగా జరగడం లేదనీ, హసీనా ఇటీవలి సంవత్సరాలలో నియంతగా మారిందనీ ఆమె విమర్శకులు ఆరోపిస్తున్నారు. అదే సమయంలో ఆమె పదవీకాలం బంగ్లాదేశ్‌లో రాజకీయ సుస్థిరతను తెచ్చిపెట్టింది. గత దశాబ్దంలో బంగ్లాదేశ్ తలసరి ఆదాయం మూడు రెట్లు పెరిగింది. గడచిన 20 ఏళ్లలో 2.5 కోట్ల మందికి పైగా ప్రజలు పేదరికం నుండి బయటపడినట్లు ప్రపంచ బ్యాంకు అంచనా వేసింది.

జనవరి 7న బంగ్లాదేశ్‌లో ఎన్నికలు జరగనున్నాయి. పాలక అవామీ లీగ్ అధికారాన్ని తిరిగి నిలబెట్టుకోవాలని చూస్తోంది. ప్రధాన ప్రతిపక్ష పార్టీ అయిన బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ(బీఎన్‌పీ) ఎన్నికలను బహిష్కరించడం వల్ల ఈ పని మరింత సులభమవుతోంది. స్వతంత్ర అభ్యర్థులతో పాటు కొన్ని చిన్న, పెద్దగా పేరులేని రాజకీయ పార్టీలు అధికార పక్షానికి వ్యతిరేకంగా పోటీ చేస్తున్నప్పటికీ, అవి పెద్ద సవాలుగా మారే అవకాశం లేదు. ఈ నేపథ్యంలో అధికార పార్టీకి అఖండ మెజారిటీ వచ్చే అవకాశం ఉంది. అయితే, బీఎన్‌పీ ఈ ఎన్నికలలో పాల్గొనక పోవడం అనేది అవామీ లీగ్ సాధించనున్న విజయంలోని ఆకర్షణను అయితే కచ్చితంగా తగ్గిస్తుంది.

బేగమ్‌ల పోరు

బంగ్లాదేశీయులు దేశ పితామహుడిగా భావించే షేక్ ముజిబుర్ రెహమాన్ కుమార్తె అయిన షేక్ హసీనా అవామీ లీగ్ పార్టీకి నాయకత్వం వహిస్తున్నారు. సైనిక నియంత జియావుర్ రెహమాన్ భార్య ఖలీదా జియా బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీకి సారథ్యం వహిస్తున్నారు. ఈ ఇద్దరు మహిళలను బంగ్లాదేశ్‌లోని పరస్పరం పోరాడుతున్న బేగమ్‌లు ('బ్యాటిలింగ్ బేగమ్స్') అని కూడా పిలుస్తారు.

బంగ్లాదేశ్‌లో 1990లో ప్రజాస్వామ్య పునరుద్ధరణ తర్వాత జరిగిన తొలి మూడు ఎన్నికల్లో ఈ రెండు పార్టీలు వంతులవారీగా అధికారంలో ఉన్నాయి. అయితే 2009 నుంచి దేశానికి హసీనా సారథ్యం వహిస్తున్నారు. గత దశాబ్దపున్నర కాలంలో ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరగలేదని విమర్శకులు ఆరోపించారు. 2014 ఎన్నికలను బహిష్కరించడం బీఎన్‌పీ చేసిన తప్పిదమనీ, అవామీ లీగ్ భారీ మెజారిటీతో అధికారాన్ని నిలుపుకోవడానికి అది వీలు కల్పించిందనీ కొందరు అంటున్నారు. ఈ నిర్ణయం బీఎన్‌పీనీ, దాని అగ్రనేతలనూ పార్లమెంటుకు చాలాకాలం పాటు దూరంగా ఉంచింది. ఖలీదా, తారిఖ్ రెహమాన్ (ఖలీదా కుమారుడు, రాజకీయ వారసుడు) సహా చాలా మంది నాయకులు అవినీతి కేసుల్లో చిక్కుకోవడంతో పార్టీ మరింత అపఖ్యాతి పాలైంది. వారి అక్రమాలకు సంబంధించి విచారణ జరిపి వారికి శిక్ష విధించారు. రెహమాన్ బంగ్లాదేశ్ రాజకీయాలతో సంబంధం లేకుండా లండన్‌లో ఉంటున్నారు. ఖలీదా గృహనిర్బంధంలో ఉన్నారు; పైగా ఆరోగ్యం సరిగా లేకపోవడంతో ఆమె తన పార్టీ రాజకీయ అదృష్టాన్ని పునరుద్ధరించడం కష్టమైపోయింది.

మునుపటి ఎన్నికలకు ముందు బీఎన్‌పీ హింసాత్మక చర్యల్లో పాల్గొంది. ఇది బీఎన్‌పీకి చెందిన మరికొందరు అగ్రనేతలను విచారించే అవకాశాన్ని కూడా అవామీ లీగ్‌కు ఇచ్చింది. ఫలితంగా పార్టీ ఇప్పుడు చాలా బలహీనంగా ఉంది. అవామీ లీగ్‌ను ఏ విధంగానూ ఎదుర్కొనే స్థితిలో లేదు.



ఆపద్ధర్మం స్థానంలో...

బీఎన్‌పీ కూటమి కీలక భాగస్వామి అయిన బంగ్లాదేశ్ జమాత్‌-ఎ-ఇస్లామీని ఎన్నికలలో పోటీ చేయకుండా నిషేధించారు. పార్లమెంటరీ చట్టాలపై తమకు నమ్మకం లేదనీ, ఇస్లామిక్ చట్టం, పాలనకు మాత్రమే కట్టుబడి ఉన్నామనీ ఆ పార్టీ పదేపదే ప్రకటించింది. దీంతో బంగ్లాదేశ్ ఎన్నికల సంఘం జమాత్ పార్టీ రిజిస్ట్రేషన్‌ని రద్దు చేసింది. హసీనా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్వహించిన యుద్ధ నేరాల విచారణ నేపథ్యంలో జమాతే ఇస్లామీ అగ్రనేతలకు ఉరిశిక్షలు పడ్డాయి. దాంతో పార్టీ మరింత నష్టపోయింది.

సార్వత్రిక ఎన్నికలను తటస్థ మధ్యంతర ప్రభుత్వం నిర్వహించాలని బీఎన్‌పీ డిమాండ్ చేస్తోంది. హసీనా ప్రభుత్వం స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలను నిర్వహించదని ఆ పార్టీ భయపడుతోంది. అయితే ప్రతిపక్షాల డిమాండ్‌ను ప్రభుత్వం అంగీకరించడం లేదు. 2018 ఎన్నికలలో పాల్గొనడం ద్వారా తాము తప్పు చేశామని బీఎన్‌పీ ఇప్పుడు నమ్ముతోంది.

2011లో 15వ రాజ్యాంగ సవరణ ద్వారా తాత్కాలిక ప్రభుత్వ ఏర్పాటును అవామీ లీగ్ ప్రభుత్వం తొలగించింది. అంతకు ముందు ఆపద్ధర్మ ప్రభుత్వం నిర్దిష్ట గడువులోగా ఎన్నికలు నిర్వహించి ఎన్నికైన పార్టీకి అధికారాన్ని అప్పగించేది. ఏది ఏమైనప్పటికీ, తాత్కాలిక ప్రభుత్వం కొన్ని సంవత్సరాలు (2007–09) కొనసాగింది, సాధారణ ప్రభుత్వం వలె పనిచేయడమే కాకుండా దాని అధికార పరిధికి మించిన అనేక చర్యలు కూడా తీసుకుంది. అలాగే హసీనా, ఖలీదాలను కూడా విచారించింది. స్పష్టంగా, ఆపద్ధర్మ ప్రభుత్వం తప్పు చేయలేని వ్యవస్థ అయితే కాదు. అందుకే బంగ్లాదేశ్ ఇతర ప్రజాస్వామ్య దేశాలలో మాదిరిగా స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలను నిర్వహించగల సంస్థలతో ముందుకు రావాలి.

నిశ్శబ్ద విజయాలు ఉన్నప్పటికీ...

షేక్ హసీనా ఇటీవలి సంవత్సరాలలో నియంతగా మారిందని ఆమె విమర్శకులు ఆరోపిస్తుండగా, ఆమె పదవీకాలం బంగ్లాదేశ్‌లో రాజకీయ సుస్థిరతను తెచ్చిపెట్టిందన్నది మరో నిజం. ఇది బంగ్లాదేశ్‌కూ, దాని ప్రజలకూ ప్రయోజనకరంగా నిరూపితమైంది. దేశం వేగవంతమైన ఆర్థిక వృద్ధిని చవిచూస్తోంది. దక్షిణాసియాలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలలో బంగ్లాదేశ్ ఒకటి. గత దశాబ్దంలో దాని తలసరి ఆదాయం మూడు రెట్లు పెరిగింది. గత 20 ఏళ్లలో 2.5 కోట్ల మందికి పైగా ప్రజలు పేదరికం నుండి బయటపడినట్లు ప్రపంచ బ్యాంకు అంచనా వేసింది.

అనేక ప్రధాన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను కూడా హసీనా ప్రభుత్వం అమలు చేసింది. దేశ సొంత ఆర్థిక వనరులు, రుణాలు, అభివృద్ధి సహాయాల కలయికతో, కీలకమైన 2.9 బిలియన్ డాలర్ల పద్మ వంతెనను గంగానదిపై నిర్మించారు. ఈ వంతెన ఒక్కటే దేశ జీడీపీని 1.23 శాతం పెంచడానికి సహాయపడుతుందని భావిస్తున్నారు.

ఈ విజయాలు ఉన్నప్పటికీ, కోవిడ్ -19 మహమ్మారి నేపథ్యంలో బంగ్లాదేశ్ ఆర్థిక సమస్యలను ఎదుర్కొంటోంది. నవంబరులో ద్రవ్యోల్బణం 9.5 శాతానికి చేరుకోవడంతో పెరుగుతున్న జీవన వ్యయంతో దేశం పోరాడుతోంది. విదేశీ మారక నిల్వలు ఆగస్టు 2021లో రికార్డు స్థాయిలో 48 బిలియన్ల డాలర్ల నుండి ఇప్పుడు దాదాపు 20 బిలియన్ డాలర్లకు పడిపోయాయి. ఇవి మూడు నెలల దిగుమతులకు కూడా సరిపోవు. అదనంగా, దాని విదేశీ రుణం 2016 నుండి రెట్టింపు అయింది. అయితే, భారతదేశం అవసరమైన వస్తువులను సరఫరా చేయడం ద్వారా బంగ్లాదేశ్‌కు సహాయం చేసింది.

దశాబ్దపున్నర కాలంగా బంగ్లాదేశ్‌లో ఉన్న రాజకీయ సుస్థిరత ఆర్థికాభివృద్ధికి కారణమైందనడంలో సందేహం లేదు. భారతదేశం, బంగ్లాదేశ్ ఇప్పుడు మరింతగా ఎక్కువ స్థాయి విశ్వాసాన్ని కలిగివున్న భాగస్వామ్య పక్షాలు. దీని ఫలితంగా ఇరు దేశాల మధ్య మెరుగైన రైలు కనెక్టివిటీ, ద్వైపాక్షిక వాణిజ్యం ఏర్పడింది.

అయితే, చైనా నేతృత్వంలోని అంతర్జాతీయ వాణిజ్య కూటమి, రీజినల్ కాంప్రహెన్సివ్ ఎకనామిక్ పార్టనర్‌షిప్‌లో బంగ్లాదేశ్ ప్రవేశించే అవకాశం ఉంది. దీంతో పొరుగుదేశంతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పంద చర్చలపై భారత్‌ను జాగ్రత్తగా నడుచుకునేలా చేసింది. భారతదేశం పరిస్థితిని నిశితంగా గమనిస్తోంది. ఎన్నికల తర్వాత కొత్త ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించాక పరిస్థితులు తనకు అనుకూలంగా పని చేస్తాయని ఆశిస్తోంది.

వ్యాసకర్త అసోసియేట్ ఫెలో, మనోహర్ పారీకర్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ డిఫెన్స్ స్టడీస్ అండ్ ఎనాలిసెస్, న్యూఢిల్లీ

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

సానుభూతి



ఇరాన్‌లో తీవ్రవాదులు పేల్చిన జంట బాంబుల దాడిలో పదులకొద్దీ మంది మరణించారు. వందల మంది గాయపడ్డారు. ఇరాన్ ప్రజలకు, ముఖ్యంగా బాధితుల బంధువులకు నా ప్రగాఢ సానుభూతి.

– తుషార్ గాంధీ, రచయిత

నిపుణులు తప్పయితే?



2024 కోసం నేను ఒక కొత్త పదబంధాన్ని పుట్టిస్తున్నాను. కాన్‌స్పిరసీ రియాలిటీ (కుట్ర వాస్తవం). నిపుణులందరూ ఒక అంశాన్ని కుట్ర సిద్ధాంతంగా కొట్టివేసినప్పటికీ, అది వాస్తవంగా తేలడమే కాన్‌స్పిరసీ రియాలిటీ. గత కొన్నేళ్లలో ఇది చాలాసార్లు జరిగింది.

– పీటర్ స్వీడన్, జర్నలిస్ట్

అందినకాడికి...



నా స్నేహితుడు, ఒక అంకుర సంస్థ వ్యవస్థాపకుడు తన విడాకుల 'ఒప్పందం' కోసం చెల్లించిన మొత్తమెంతో తెలిసింది. 8 నెలలు మాత్రమే నిలిచిన ఈ పెళ్లికి అతడు దాచుకున్న మొత్తం సొమ్ము, అత్యవసర నిధి అన్నీ ఖాళీ అయ్యాయి. 33 ఏళ్ల వయసులో తను మళ్లీ సున్నా నుంచి మొదలుపెట్టాలి. మహిళలూ దయచేసి ఇలా చేయద్దు. ఇది తప్పు.

– శ్రుతీ చతుర్వేది, ఆంట్రప్రెన్యూర్

వందనం



మా అమ్మ ఎనిమిదో తరగతి పాస్, మా నాన్న పన్నెండో తరగతి పాస్. మా జిల్లాలో మా అక్క ఒక్కతే ఇస్రో శాస్త్రవేత్త. మా ఊరిలో నేనొక్కడినే ఐఐటీయన్. మా చిన్నప్పటి స్నేహితులు చాలామంది రైతులు. మేము ఈ స్థాయికి వచ్చామంటే, అది మా తల్లిదండ్రుల ఘనతే!

– హిమాంశు త్యాగి, ఐఎఫ్ఎస్ అధికారి

తల్లి ప్రేమ



మనం వండిన వంటల్ని మన పిల్లలు తమ పళ్లేల్లో నింపుకొంటూ ఉంటే చూడడాన్ని మించిన సంతోషం మరొకటి ఉండదు. అది ఒక వయసుకొచ్చాకగానీ నాకు అర్థం కాలేదు.

– రుజుతా దివేకర్, పోషణ నిపుణురాలు

తెలుగు వారి సాంస్కృతిక కేంద్రం

స్వాతంత్ర్యోద్యమకాలం నుండి తెలుగు భాషకు, సంస్కృతికి విశిష్టసేవలందిస్తున్న గ్రంథాలయాలు ఎన్నో. అలాంటివాటిలో ఒకటి విజయవాడలోని శ్రీవెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయం. దీనికి అరుదైన మరో ప్రత్యేకతా ఉంది. అదే... అనుబంధ సంస్థ 'ఆంధ్ర ఆర్ట్ థియేటర్స్'. ఇది అభిమాన సాంస్కృతిక కేంద్రంగా విరాజిల్లుతోంది. ఈ గ్రంథాలయం ఇప్పుడు మరో ఘనతను సాధించింది. 'పూర్ణకుంభ' పురస్కారానికి ఎంపికైంది. శ్రీ రాజరాజనరేంద్రుల వారి పట్టాభిషేక సహస్రాబ్ది ఉత్సవాల సందర్భంగా **రాజమహేంద్రవరంలో** నిర్వహిస్తున్న ద్వితీయ అంతర్జాతీయ తెలుగు మహాసభల్లో **జనవరి 5 సాయంత్రం పూర్ణకుంభ పురస్కార ప్రదానం** జరగనుంది. వెలిదండ్ల హనుమంతరావు 1899లో గుడివాడలో జన్మించారు. 1930లో ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని జైలుకెళ్లారు. జైలు సిబ్బంది క్రూరత్వానికి గురై రక్తం కక్కి స్పృహ కోల్పోయారు. జైలు నుండి విడుదలైన తర్వాత క్షయతో బాధపడుతూ 1931, అక్టోబర్ 20న తుది శ్వాస విడిచారు. త్యాగనిరతినీ, ధైర్యసాహసాలనూ, ప్రజా సేవలో అనురక్తినీ చూపిన హనుమంతరావు సత్యాగ్రహ దళంలోని వాలంటీర్లుగా పనిచేసిన ముగ్గురు యువ స్వాతంత్ర్య సమరయోధులు గెల్లి రాజగోపాలం, కృత్తివెంటి కుటుంబరావు, నండూరి వెంకటేశ్వరరావులుతో మరికొందరు సహచర మహనీయులు కలిసి వారి పేరిట శాశ్వత స్మృతి చిహ్నం ఏర్పాటు చేయాలన్న సంకల్ప ఫలితమే ఈనాటి శ్రీ వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయం!



హనుమంతరాయ గ్రంథాలయం

ముందుగా 1934లో ప్రారంభమైన గ్రంథాలయం 1944 నాటికి తగినన్ని పక్కా భవనాలను అమర్చుకోగలిగింది. అదే సంవత్సరం సొసైటీ యాక్టు క్రింద గ్రంథాలయం రిజిష్టర్ అయింది. నాటకాలు, కళారూపాలను ప్రదర్శిస్తూ ప్రజల కళాభిరుచిని పెంపొందించాలనే తపనతో 'ఆంధ్రా ఆర్ట్ థియేటర్స్'ను ఏర్పాటు చేశారు. గ్రంథాలయ వైజ్ఞానిక శాఖగా ఏర్పాటైన ఈ ఆంధ్రా ఆర్ట్ థియేటర్స్ అనేక ఉత్తమ ప్రదర్శనల ద్వారా ప్రజల మన్ననలను, అనేక పరిషత్తులలో బహుమతులు పొందింది. సాంస్కృతిక ఉత్సవాలు పేరుతో నాటక, నాటికల పోటీలు నిర్వహించింది. 1963లో సినీ నటీనటులు సావిత్రి, సూర్యకాంతం, అక్కినేని నాగేశ్వరరావు వంటి అనేకమంది భూరి విరాళాలు ఇచ్చి గ్రంథాలయంలో అన్ని హంగులూ సమకూర్చారు. తొలి రోజులలో తోలుబొమ్మలాటలతో, చిన్నచిన్న సమావేశాలతో ప్రారంభమైన ఈ సంస్థ సంతోషాన్నిచ్చే 'సురభి' నాటకాలతో పాటు 'రక్తకన్నీరు', 'చింతామణి', 'కన్యాశుల్కం', 'శ్రీకృష్ణ రాయబారం' లాంటి ఎన్నో నాటక ప్రదర్శనల నిలయంగా నిలిచింది.

జాతి, కుల, మత, వర్గ వివక్ష లేకుండా సమాజంలో అన్ని వర్గాల వారికి సమాన స్థాయిలో గ్రంథాలందిస్తూ చదువరుల నుండి ఎలాంటి రుసుము వసూలు చేయక, ఆడిటోరియంలో ఉచిత సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ 90వ వార్షికోత్సవ వత్సరంలో ఉన్న శ్రీ వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయానికి పూర్ణకుంభ పురస్కార భాగ్యం ప్రాప్తించడం హర్షణీయం.

– మహబూబ్ ఆజిమ్, హనుమంతరాయ గ్రంథాలయ పాలక మండలి సభ్యులు

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ-మెయిల్: editpage@sakshi.com

హిట్లర్, గోబెల్స్ విస్తు పోయేలా...

అభిప్రాయం



పి. విజయబాబు

'బీభత్స రస ప్రధానం పిశాచ గణ సమవాకారం...' అని శ్రీశ్రీ అన్నట్టుగా ఆంధ్రప్రదేశ్‌లో ఒక వర్గం మీడియా చేస్తున్న కథలూ, కథనాల ప్రచారం చూస్తే నాటి నాజీ నియంత హిట్లర్ ప్రచారమంత్రి పాల్ జోసెఫ్ గోబెల్స్ కూడా విస్తుపోయేలా ఉందని చెప్పక తప్పదు.

చంద్రబాబు నాయుడు బీసీల తోకలు కత్తిరిస్తాననీ 'ఎవరైనా ఎస్సీలుగా పుట్టాలని కోరుకుంటారా' అనీ అణగారిన వర్గాల మీద తన కసి, ద్వేషాన్ని ప్రదర్శించినట్టుగా హిట్లర్ యూదులను నిర్మూలించాలనే లక్ష్యంతో అలాంటి వివక్షనే ప్రదర్శించాడు. కాగా గోబెల్స్ అనేక వాస్తవాలను వక్రీకరించి ప్రజలను నమ్మించడానికి హిట్లర్ తరఫున విశేషంగా కృషి చేశాడు. వాస్తవాలను తెలిపే రేడియో వంటి ప్రసార సాధనాలను నియంత్రించి పెద్ద అబద్ధాలను పదేపదే ప్రచారం చేయడంలో తనదైన దుర్మార్గాన్ని చాటుకున్నాడు.

ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో ఒక వర్గం మీడియా చేస్తున్న ప్రచారాల్ని పరిశీలిస్తే అచ్చంగా గోబెల్స్ ప్రచారమే గుర్తుకొస్తుంది. చంద్రబాబు నాయుడు ఆలోచనా విధానం కూడా హిట్లర్ విధానానికి సరిపోలి ఉంది. 'మనం తప్పును ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించకూడదు. మన మీద వచ్చిన నిందలను ఏ పరిస్థితుల్లో కూడా ఒప్పుకోకూడదు. ఏదైనా తప్పు జరిగితే తప్పులకు మాత్రమే కాక ప్రతిదానికి కూడా మన ప్రత్యర్థిని నిందించాలి. రాజకీయ సుడిగాలిని ఉధృతం చేయడానికి ప్రతి అవకాశాన్నీ సద్వినియోగం చేసుకోవాలి' అంటాడు హిట్లర్. ఈ విధానాలకు గోబెల్స్ ప్రచారం తోడయ్యింది. 'మీరు ఒక పెద్ద అబద్ధం చెపుతూ దానిని పునరావృతం చేస్తూ ఉంటే ప్రజలు ఎట్టకేలకు ఇది నిజమే అని విశ్వసిస్తారు... మన లక్ష్యాలను సాధించడానికి అబద్ధాలను పదేపదే ప్రచారం చేస్తున్నప్పుడు ప్రజలు వాటిని విశ్వసిస్తారు' అంటాడు గోబెల్స్.

'సమాజంలో గొప్ప వారిగా చలామణీ అయినటువంటి వారు వాస్తవాలను ఘోరంగా వక్రీకరించగలిగే ధైర్య సాహసాలు చేస్తారని ప్రజలు అనుకోరు. అందుకే వారిని భారీ అబద్ధాలతో ప్రేరేపించేలా చేయాలి. నిజం అపఖ్యాతి పాలైనా సరే లక్ష్యాన్ని సాధించడానికి ప్రత్యర్థిని దెబ్బ తీయడానికి అబద్ధమే ఆయుధం' అనేది హిట్లర్, గోబెల్స్‌ల విశ్వాసం. ఆ భావజాలమే వారిద్దరినీ దగ్గరకు చేర్చింది. అచ్చంగా చంద్రబాబునాయుడూ, ఆయన్ని సమర్థిస్తున్న ఎల్లో మీడియా వలె. వీరు అబద్ధాలను ప్రచారం చేయడంలో, ప్రసారం చేయడంలో అనుకున్న లక్ష్యాన్ని సాధించే క్రమంలో పచ్చి క్రూరత్వమే తప్ప ఎక్కడ నైతిక విలువలు కానీ, మానవతా దృక్పథం గాని కనిపించదు. ఈ నేపథ్యంలో జగన్ సంక్షేమ పాలనలో మచ్చుకు కొన్ని అంశాలు:



ప్రస్తుతం ఏపీలో పెన్షన్‌లు తీసుకొంటున్న వాళ్ళు 66 లక్షలు మంది ఉన్నారు. 'అమ్మ ఒడి', 'విద్యా కానుక', 'దీవెన,' 'పోషణ' కింద లబ్ధి పొందుతున్నవారు 45 లక్షల మంది ఉన్నారు. 'రైతు భరోసా' లబ్ధిదారులు సుమారు 52 లక్షలు మంది ఉన్నారు. ఇళ్ల పట్టాలు 31 లక్షల మంది తీసుకున్నారు. పొదుపు సంఘాలకు బాబు ఎగ్గొట్టిన 25 వేల కోట్లలో ఇప్పటికే 19 వేల కోట్లు జగన్ ఇచ్చారు.

డీబీటీ ద్వారా 2. 48 లక్షల కోట్లు, నాన్ డీబీటీ ద్వారా 1.68 లక్షల కోట్ల రూపాయలను జగన్ ప్రభుత్వం పంపిణీ చేసింది. బాబు 34 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తే, 1.40 లక్షల గ్రామ సచివాలయ ఉద్యోగాలు, 52 వేల ఆర్టీసీ ఉద్యోగాలూ, ఇతర శాఖలలో నింపిన ఉద్యోగాలూ కలిపి మొత్తం 2.14 లక్షల ఉద్యోగాలు ఇచ్చారు. కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ కలుపుకుంటే 6.32 లక్షల ఉద్యోగాలు ఇచ్చారు. 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' లో గత మూడేళ్ళుగా ఏపీ నంబర్ వన్‌గా ఉంది. బాబు హయాంలో 60 వేల కోట్ల పెట్టుబడులు వస్తే, ఇప్పుడు 70 వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. విశాఖలో జరిగిన గ్లోబల్ సమ్మిట్‌లో రూ. 13.11 లక్షల కోట్ల విలువైన 386 ఎంఓయూలను ప్రభుత్వం కుదుర్చుకుంది. తద్వారా 6.07 లక్షల మందికి ఉపాధి లభించనుంది. ఇన్ఫోసిస్, విప్రో, అమెజాన్, బీఈఎల్, రాడ్‌స్టాండ్ తదితర దిగ్గజ ఐటీ కంపెనీలు విశాఖలో కార్యకలాపాలను ప్రారంభించాయి. బ్లూస్టార్, డైకిన్, డిక్సన్, టీసీఎల్, మునోత్ తదితర అనేక ఎలక్ట్రానిక్ కంపెనీలు ఏపీలో తమ కార్యకలాపాలను ప్రారంభించడమే కాకుండా విస్తరణ కార్యక్రమాలను చేపట్టాయి. అభివృద్ధి సంక్షేమం రెండు కనులుగా ముందుకు పోతున్నారు జగన్. 17 వేల కోట్లతో 45 వేల స్కూల్స్ బాగు చేస్తున్నారు. 17 వేల కోట్లతో 17 కొత్త మెడికల్ కాలేజీలు, ప్రభుత్వ ఆసుపత్రులు బాగు చేస్తున్నారు. 20 వేల కోట్ల రూపాయలతో 4 పోర్టులు, 10 ఫిషింగ్ హార్బర్లు, 6 ఫిషింగ్ పాండ్స్ ఏర్పాటు చేస్తున్నారు.

అలాగే పరిపాలనా వికేంద్రీకరణలో భాగంగా 13 జిల్లాలను 26 జిల్లాలుగా విభజించారు. 10 వేల విలేజ్ క్లినిక్స్, 10,778 రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీష్ మీడియం, సీబీఎస్ఈ సిలబస్‌ను ప్రవేశపెట్టారు. బైజూస్ మెటీరియల్, టోఫెల్‌కు శిక్షణ, డిజిటల్ క్లాసులు... ఇలా ఎన్నో మార్పులు, చేర్పులతో విద్యారంగాన్ని కొత్త పుంతలు తొక్కిస్తున్నారు.

కానీ ఈ వాస్తవాలన్నింటినీ కప్పిపుచ్చి హిట్లర్, గోబెల్స్ సైతం విస్తుపోయేలా విష ప్రచారానికి పూనుకుంది చంద్రబాబు తైనాతి మీడియా. అయితే ఇది హిట్లర్ కాలం కాదు. ఆంధ్రులు ఈ గోబెల్స్ వారసుల వికృత ప్రచారానికి లోనయ్యే బలహీన మనస్కులు కారు. చైతన్యానికి ప్రతీక ఆంధ్రప్రదేశ్!

వ్యాసకర్త ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షులు

చదువుతోనే అన్నీ!

'చదువుకోకపోతే మనిషి అజ్ఞాని అవుతాడు. చదువు వల్ల ఏది మంచి, ఏది చెడు అనే విచక్షణా జ్ఞానం కలుగుతుంది. ప్రజలందరు చదువుకోవాలి' అంటాడు మహా భాగవతంలో ప్రహ్లాదునికి చదువు విలువ చెపుతూ హిరణ్యకశిపుడు. ఇది సర్వ కాలాలకు, సర్వ జనులకు వర్తించే సూక్తి.

జ్యోతిర్మయం

చదువు వలన జ్ఞానం వస్తుంది. ఆత్మ విశ్వాసం పెరుగుతుంది. సమాజంలో జరిగే అనేక విషయాలపై అవగాహన, పరిశీలన చదువు వలన వృద్ధి పొందుతాయి. చదువు వ్యక్తికి సమాజంలో గౌరవ స్థానాన్ని ఇస్తుంది. చదువు వినయాన్ని ఇస్తుంది. వినయం ఒక అర్హతను, చదువుకు వినయం కూడితే ఆ వ్యక్తికి మంచి ఉపాధి, ధనం సమకూరుతాయి.

చదువు మనిషికి పరదేశంలో బంధువులా సహాయపడుతుంది. గురువులా ఎన్నో బోధిస్తుంది. చదువుకు సమానమైన సంపద ఈ విశ్వంలో మరొకటి లేదు. దీనిని దొంగలు దోచుకోలేరు. భౌతిక సంపదలు ధనం, నగలు, ఆస్తుల్లా సోదరులు పంచుకోలేరు. ఇస్తున్న కొద్దీ తరిగిపోయేది ధనమైతే, ఎప్పటికీ తరగని నిధి చదువు. తనకు తెలిసిన విషయాలను మనిషి ఇతరులకు చెప్పటానికి చేసే ప్రయత్నంలో జ్ఞానాన్ని పెంచుకోవలసిన అవసరం ఉంటుంది. అలా ఇతరులకు ఇచ్చే కొద్దీ జ్ఞానం పెరుగుతుంది. నేర్చిన చదువు నుంచి, చదివిన పుస్తకాల నుంచి పొందిన జ్ఞానాన్ని, విచక్షణను జీవితంలో అమలుపరిచినప్పుడే చదువుకు నిజమైన సార్థకత!

– డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, **తిథి:** బ.నవమి రా.7.55 వరకు, తదుపరి దశమి, **నక్షత్రం:** చిత్త సా.4.49 వరకు, తదుపరి స్వాతి, **వర్జ్యం:** రా.10.47 నుండి 12.27 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.45 నుండి 9.33 వరకు తదుపరి ప.12.28 నుండి 1.16 వరకు, **అమృతఘడియలు:** ఉ.9.47 నుండి 11.32 వరకు; **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 6.36, **సూర్యాస్తమయం:** 5.35.

క్లుప్తంగా...

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనలో దేశానికే ఆదర్శం



'ఆపరేషన్ స్వేచ్ఛ' వార్షిక నివేదికను విడుదల చేస్తున్న సంజయ్

సాక్షి, అమరావతి: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో ఆంధ్రప్రదేశ్ దేశానికే ఆదర్శనంగా నిలుస్తోందని సీఐడీ అదనపు డీజీ సంజయ్ పేర్కొన్నారు. జిల్లాల్లో మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం, కార్మిక శాఖ సమన్వయంతో సీఐడీ చేపట్టిన కార్యాచరణ విజయవంతమవుతోందన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం సీఐడీ చేపట్టిన 'ఆపరేషన్ స్వేచ్ఛ' వార్షిక నివేదిక-2023ను ఆయన మంగళగిరిలోని రాష్ట్ర పోలీస్ ప్రధాన కార్యాలయంలో గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా అదనపు డీజీ సంజయ్ మాట్లాడుతూ 2023లో 1,506 మంది బాల కార్మికులకు విముక్తి కల్పించామని తెలిపారు. వారిలో మన రాష్ట్రానికి చెందిన 897 మందిని పాఠశాలల్లో చేర్పించామన్నారు. ఆపరేషన్ స్వేచ్ఛను విజయవంతం చేసిన సీఐడీ, ఇతర శాఖల అధికారులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో సీఐడీ ఐజీ సీహెచ్.శ్రీకాంత్, ఎస్పీ(ఉమన్ ప్రొటెక్షన్) సరిత తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి అంతర్జాతీయ తెలుగు మహాసభలు



తెలుగు మహాసభలు జరిగే ప్రధాన వేదిక

రాజానగరం: తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటిచెబుతూ చారిత్రక నగరంగా పేరొందిన తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం సమీపంలోని గోదావరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (గైట్) కళాశాల ప్రాంగణంలో మూడు రోజుల పాటు నిర్వహించే అంతర్జాతీయ తెలుగు మహాసభలు శుక్రవారం ప్రారంభం కానున్నాయి. ఉదయం 8.30 నుంచి 12 గంటల వరకు జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమం విశాఖ శ్రీ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి దివ్యాశీస్సులతో ప్రారంభం కానుంది. ఈ మహాసభలకు ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్, చైతన్య విద్యా సంస్థల చైర్మన్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. 'ఆంధ్రమేవ జయతే' అనే నినాదంతో సుమారు 25 సాహితీ ప్రక్రియలపై ప్రముఖులతో సదస్సులు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పలువురు ప్రముఖులు హాజరు కానున్నారు. తెలుగుదనం ఉట్టిపడేలా ప్రధాన వేదిక ఏర్పాటు చేయడంతో పాటు ఆదికవి నన్నయ, రాజరాజ నరేంద్రుడి పేరిట కూడా వేదికలు ఏర్పాటు చేశారు.

నేటి నుంచి సౌత్ జోన్ ఇంటర్ వర్సిటీ యూనిఫెస్ట్



స్కిట్ సాధన చేస్తున్న విద్యార్థులు

ఏయూ క్యాంపస్ (విశాఖపట్నం): ఆంధ్ర విశ్వవిద్యాలయం వేదికగా శుక్రవారం నుంచి 37వ సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ యూత్ ఫెస్టివల్(యూనిఫెస్ట్) 2023-24 ప్రారంభం కానుంది. 9వ తేదీ వరకు జరిగే ఈ వేడుకలకు యువభేరి అని నామకరణం చేశారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ రాష్ట్రాలతో పాటు కేంద్రపాలిత ప్రాంతమైన పాండిచ్చేరి నుంచి 20కిపైగా విశ్వవిద్యాలయాలకు చెందిన 700 మందికిపైగా విద్యార్థులు యూత్ ఫెస్టివల్‌లో భాగమవుతున్నారు. విద్యార్థులకు, వారితో వచ్చే మేనేజర్లు, ఇతర సభ్యులకు వర్సిటీలో వసతి, భోజన సదుపాయాలు కల్పిస్తున్నారు. పోటీల్లో విజేతలను ఎంపికకు 19 మంది న్యాయ నిర్ణేతలను ప్రత్యేకంగా అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ ఎంపిక చేసి పంపనుంది.

బీసీల ద్రోహి చంద్రబాబు

మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ



రేణిగుంట (తిరుపతి జిల్లా): బీసీ కులాల మధ్య చిచ్చుపెట్టి వారిని నిరంతరం దగా చేస్తూ.. పబ్బం గడుపుకుంటున్న చంద్రబాబు బీసీల ద్రోహి అని రాష్ట్ర సమాచార శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ ధ్వజమెత్తారు. రేణిగుంట విమానాశ్రయ ఆవరణలో మీడియాతో మాట్లాడారు. రాజకీయ లబ్ధికోసం కులాల మధ్య చిచ్చుపెట్టడంలో, కుటుంబంలో కలహాలు రేపడంలో చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. ఇన్నాళ్లు బీసీలు, ఎస్సీ, ఎస్టీలు, మైనార్టీలు రాజ్యాధికారానికి దూరంగా ఉన్నారని, వారికే ఎక్కువ సీట్లిచ్చి చట్టసభల్లో కూర్చోబెట్టిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో రూ.2.60లక్షల కోట్లు వివిధ పథకాల రూపంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేరుగా పేదల ఖాతాల్లో జమ చేశారని, అందులో ఒక్క పైసా అవినీతి జరిగినట్లు నిరూపించగలవా? అని ప్రశ్నించారు. వైఎస్ షర్మిల కాంగ్రెస్ పార్టీలో చేరిన వ్యవహారానికి, ఏపీకి సంబంధం లేదని చెప్పారు. 2024లో మళ్లీ సీఎం జగన్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు.

పట్టణ పేదలకు ఆరోగ్య భరోసా

వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన సీఎం జగన్

- డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాలలో నాణ్యమైన వైద్యం
- ప్రతి 25 వేల మంది జనాభాకు ఒకటి చొప్పున ఏర్పాటు
- ప్రతి కేంద్రానికి శాశ్వత భవనాలు.. 344 నూతన భవనాల నిర్మాణం
- ఒక్కో భవనానికి రూ.80 లక్షలు ఖర్చు
- అన్నింటిలోనూ ఆధునిక సౌకర్యాలు.. సరిపడా వైద్య సిబ్బంది
- 63 రకాల ల్యాబ్ వైద్య పరీక్షలు, 172 రకాల మందులు
- గర్భిణుల కోసం అల్ట్రాసౌండ్ స్కానింగ్ యంత్రాలు
- టీడీపీ ప్రభుత్వంలో 259 కేంద్రాలే.. అందించిన సేవలు శూన్యం..
- అపరిశుభ్ర వాతావరణం, సిబ్బంది లేమి..
- వాటి వైపు కన్నెత్తి చూడని జనం



తాడేపల్లి, మంగళగిరి కార్పొరేషన్ పరిధిలోని కుంచనపల్లిలో వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి రాష్ట్ర ప్రజలందరి ఆరోగ్యం బాగుండాలన్న లక్ష్యంతో వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తెస్తున్నారు. అందులో భాగంగా గ్రామీణ ప్రాంతాలతోపాటు పట్టణ ప్రాంతాల్లో వైద్య సదుపాయాలను అత్యున్నతంగా తీర్చిదిద్దుతున్నారు. పట్టణ పేదలకు అత్యాధునిక, నాణ్యమైన వైద్యాన్ని అందించడం కోసం పట్టణ ప్రాథమిక వైద్యాన్ని సీఎం జగన్ ప్రభుత్వం బలోపేతం చేసింది. తద్వారా చిన్న చిన్న ఆరోగ్య సమస్యలకు పట్టణ ప్రజలు జీజీహెచ్, జిల్లా, ఏరియా ఆస్పత్రులు, ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించాల్సిన అవసరం లేకుండా చేసింది. ఇందుకోసం నగర, పట్టణ ప్రాంతాల్లో 542 డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాలను వైద్య శాఖ నెలకొల్పింది.

రాష్ట్ర వ్యాప్తంగా పట్టణ, నగర ప్రాంతాల్లో 40 లక్షలకు పైగా జనాభా నివసిస్తున్నారు. వీరికి గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 73 మున్సిపాలిటీల్లో 259 అర్బన్ హెల్త్ సెంటర్లు మాత్రమే ఉండేవి. ఇవి పేరుకే హెల్త్ సెంటర్లు. ప్రజలకు అందించిన వైద్య సేవలు మాత్రం శూన్యం. వీటిలో ఎటువంటి సౌకర్యాలూ ఉండేవి కావు. చిన్న చిన్న వైద్య పరీక్షలు కూడా చేసే అవకాశం ఉండేది కాదు. అపరిశుభ్ర వాతావరణం, వైద్యులు, వైద్య సిబ్బంది కొరత కారణంగా ప్రజలు వీటివైపు కన్నెత్తి చూసే వారే కాదు. సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే వైద్య రంగంలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టారు. గతంలో నగరాలు, పట్టణాల్లో 50 వేల జనాభాకు ఒకటి చొప్పున ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్ల సంఖ్యను పెంచారు. ప్రతి 25 వేల మంది జనాభాకు ఒకటి తప్పనిసరిగా ఉండేలా డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేశారు. తద్వారా విశాఖ నగరంలో గతంలో 24 ఆరోగ్య కేంద్రాలు ఉండగా ఇప్పుడు 63కు పెరిగాయి. అదే విధంగా విజయవాడలో 29 ఉండగా ప్రస్తుతం 41 ఉన్నాయి. ఇలా అన్ని పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు మరింత చేరువగా ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటయ్యాయి.

డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో నాలుగేళ్లలో జరిగిన వైద్య సేవలు

సంవత్సరం	ఓపీలు	ల్యాబ్ టెస్ట్‌లు
2020-21	51,23,446	18,07,619
2021-22	54,67,938	8,73,266
2022-23	61,17,876	22,80,434
2023-24	47,14,261	42,06,132

(2023 ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు)

47.14 లక్షల ఓపీలు నమోదు


గతంలో ఎన్నడూ లేని విధంగా అన్ని సౌకర్యాలతో కూడా వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాలు పట్టణ పేదలకు ప్రయోజనకరంగా ఉన్నాయి. దీంతో ఇక్కడికి వచ్చే రోగుల సంఖ్య గణనీయంగా పెరిగింది. 2023 ఏప్రిల్ నుంచి డిసెంబర్ మధ్య వీటిలో 47,14,261 ఓపీలు నమోదయ్యాయి. డిజిటల్ వైద్య సేవల్లో భాగంగా 30.77 లక్షల హెల్త్ రికార్డులను వీటిలోడిజిటలైజేషన్ చేశారు. 8,99,946 మంది టెలీ మెడిసన్ ద్వారా బోధనాస్పత్రుల్లోని హబ్‌లో ఉండే స్పెషలిస్ట్ వైద్యుల సేవలు పొందారు. 42.06 లక్షల ల్యాబ్ టెస్ట్‌లను ఆరోగ్య కేంద్రాల్లో చేశారు. ల్యాబ్ టెస్ట్‌ల ఫలితాలను ఎస్ఎంఎస్ రూపంలో రోగుల మొబైల్ నంబర్లకు పంపుతున్నారు. గర్భిణులకు అల్ట్రా సౌండ్ స్కానింగ్ సేవలూ అందుబాటులోకి తెచ్చారు ప్రతి ఆరు ఆరోగ్య కేంద్రాలను ఒక క్లస్టర్‌గా చేసి ఒక చోట అల్ట్రా సౌండ్ మిషన్‌ను ఏర్పాటు చేశారు. ఒక్కో మిషన్ కొనుగోలుకు రూ. 2.45 లక్షలు ప్రభుత్వం ఖర్చు చేసింది.

అత్యున్నత ప్రమాణాలతో

నాడు-నేడు కార్యక్రమం కింద పట్టణ ఆరోగ్య కేంద్రాలన్నింటికీ ప్రభుత్వం సొంత భవనాలను సమకూరుస్తోంది. 188 పాత భవనాలకు మరమ్మతులు చేసింది. మరో 344 కొత్త భవనాలు నిర్మిస్తోంది. వీటిలో 248 భవనాల నిర్మాణం పూర్తయింది. 240 భవనాలను వైద్య శాఖ స్వాధీనం చేసుకుంది. మిగిలిన భవనాల పనులు శరవేగంగా సాగుతున్నాయి. కొత్త భవనం నిర్మాణానికి రూ. 80 లక్షలు, పాత వాటి మరమ్మతులకు రూ.10 లక్షల చొప్పున ఖర్చు పెట్టారు. ఈ భవనాలన్నింటినీ నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్(ఎన్‌క్వాష్) ప్రమాణాలతో తీర్చిదిద్దారు. ఇప్పటికే 11 ఆస్పత్రులకు ఎన్‌క్వాష్ గుర్తింపు కూడా లభించింది. ఓ వైపు పక్కా భవనాలను సమకూర్చుకుంటూనే, తాత్కాలిక భవనాల్లో 542 ఆరోగ్య కేంద్రాల కార్యకలాపాలను 2020-21లోనే వైద్య శాఖ ప్రారంభించింది. గతంలో పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ఒక్క నర్సు మాత్రమే అందుబాటులో ఉండగా, ఇప్పుడు ఒక మెడికల్ ఆఫీసర్, ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఒక ల్యాబ్ టెక్నీషియన్, ఇతర సిబ్బందిని నియమించారు. అన్ని కేంద్రాల్లో వందశాతం మానవ వనరులు ఉండేలా చర్యలు తీసుకున్నారు. ఇందుకోసం ప్రభుత్వం 3,760 మంది ఉద్యోగులను అర్బన్ హెల్త్ సెంటర్లలో కొత్తగా నియమించింది. గతంలో ఓపీ మాత్రమే ఉండగా, ఇప్పుడు ప్రతి ఆరోగ్య కేంద్రంలో పది పడకలతో ఇన్‌పేషెంట్ విభాగం ఏర్పాటు చేసింది. 63 రకాల ల్యాబ్ వైద్య పరీక్షలు, 172 రకాల మందులు అందుబాటులో ఉంచింది.

చంద్రబాబు పగటి కలలు
నెరవేరవు


- ఎవరు ఎన్ని కుట్రలు చేసినా ప్రజలంతా జగన్ వెంటే నడుస్తారు
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



సాక్షి, చిత్తూరు: చంద్రబాబు పగటి కలలు నెరవేరవని.. మళ్లీ ఆయన ఎప్పటికీ ముఖ్యమంత్రి కాబోరని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం ఆయన చిత్తూరులో మీడియాతో మాట్లాడారు. తన రాజకీయ జీవితంలో జగన్ వంటి ముఖ్యమంత్రిని చూడలేదన్న చంద్రబాబు మాట నిజమేనన్నారు. కిరణ్‌కుమార్‌రెడ్డి మాదిరిగా కనిపించకుండా పోయిన ముఖ్యమంత్రిని చూసిన తర్వాత వైఎస్ జగన్ వంటి బలమైన ముఖ్యమంత్రిని చూడటంతో చంద్రబాబు అయోమయంలో పడిపోయి ఏదేదో మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. సీఎం జగన్‌ను విమర్శించే వారంతా తమ ప్రత్యర్థులేనన్నారు. ఎవరు.. ఏ పార్టీలో చేరినా తమకు ఎలాంటి అభ్యంతరం లేదని చెప్పారు. తమ నాయకుడు మాత్రం సీఎం వైఎస్ జగనే అని స్పష్టం చేశారు. గతంలో చంద్రబాబు, సోనియాగాంధీ కుట్రపూరితంగా వైఎస్ జగన్‌ను 16 నెలల పాటు జైల్లో పెట్టించిన విషయం ప్రజలకు ఇంకా గుర్తుందన్నారు. కుటుంబాలనే కాదు.. మనుషులనూ విభజిస్తున్నారన్నారని మంత్రి మండిపడ్డారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా ప్రజలతో పాటు తామంతా వైఎస్ జగన్ వెంటే నడుస్తామని చెప్పారు. జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకునేందుకు రాష్ట్ర ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో కుప్పం సహా అన్ని చోట్లా వైఎస్సార్‌సీపీ విజయం ఖాయమన్నారు. ఎంఎస్ బాబును పూతలపట్టు ఎమ్మెల్యేగా గెలిపించిన ఘనత సీఎం జగన్‌దేనని.. ఎంఎస్ బాబు ఆత్మవిమర్శ చేసుకోవాలని సూచించారు.

బీసీ నాయకత్వాన్ని తయారు చేసిన ఫ్యాక్టరీ టీడీపీ

జయహో బీసీ వర్క్‌షాప్‌లో చంద్రబాబు



సాక్షి, అమరావతి: బీసీ నాయకత్వాన్ని తయారు చేసిన ఫ్యాక్టరీ టీడీపీ అని చంద్రబాబు అన్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన జయహో బీసీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. పన్నుల రూపంలో సీఎం జగన్ బలహీన వర్గాల రక్తం తాగుతున్నారని విమర్శించారు. జగన్ పాలనలో రెడ్లు కూడా బాగుపడలేదని.. పెద్దిరెడ్డి, విజయసాయిరెడ్డి, సజ్జల రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి వంటి కొందరు మాత్రమే బాగుపడ్డారన్నారు. బీసీలకు తాను అవకాశం ఇస్తానని, నాయకత్వం పెంచుతానన్నారు. ఈ వేదికపై నా పక్కన బీసీలు కూర్చున్నట్టుగా వైఎస్సార్‌సీపీలో బీసీలు కనబడతారా అని ప్రశ్నించారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 20 శాతం రిజర్వేషన్లు ఎన్టీఆర్ ప్రవేశపెడితే దాన్ని 34 శాతానికి తాను పెంచానన్నారు. లక్షల మందిని నాయకులుగా తయారు చేశామన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక 34 శాతం ఉన్న రిజర్వేషన్లు 24 శాతానికి తగ్గించిందన్నారు. బీసీ సబ్ ప్లాన్ ద్వారా ఐదేళ్లలో రూ.37 వేల కోట్లు ఖర్చు చేశామని, తాను అధికారంలోకి వస్తే ఏడాదికి రూ.15 వేల కోట్లు ఖర్చు చేస్తామని జగన్ అన్నాడన్నాడన్నారు. ఒక్క రూపాయి కూడా బీసీలకు ఖర్చు చేయకుండా సాధికార యాత్ర చేసే హక్కు జగన్‌కు ఎవరిచ్చారని ప్రశ్నించారు. రూ.75 వేల కోట్లు బీసీలకు జగన్ అప్పు ఉన్నాడని, అవి ఖర్చు చేసిన తర్వాతే ఓట్లు అడగాలన్నారు. ప్రభుత్వ వైఫల్యాలపై మాట్లాడితే కేసులు పెడుతున్నారని అన్నారు. అచ్చెన్నాయుడుతో బోణీ చేసి, హోదాను బట్టి కేసులు పెట్టాడని, కొల్లు రవీంద్ర, కూన రవికుమార్, బండారు సత్యనారాయణ, కళా వెంకట్రావుపై అక్రమంగా కేసులు పెట్టారన్నారు. సీఎం జగన్ 38 మంది ఎమ్మెల్యేలను ట్రాన్స్‌ఫర్ చేస్తే.. ఆ 38 మందిలో 25 మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలే ఉన్నారన్నారు. బియ్యపురెడ్డి, పెద్దిరెడ్డిని, ద్వారంపూడిని ఎందుకు మార్చలేదని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో 300 మంది బీసీలను పొట్టనబెట్టుకున్నారన్నారు. టీడీపీకి చెందిన 74 మంది కార్యకర్తలను దారుణంగా చంపేశారన్నారు. ఒక్క పల్నాడులోనే 16 మందిని చంపారన్నారు. సభానంతరం జయహో బీసీ ప్రచార రథాలను పార్టీ కార్యాలయం వద్ద జెండా ఊపి చంద్రబాబు ప్రారంభించారు. ఒక్కో పార్లమెంట్ నియోజకవర్గానికి 2 రథాల చొప్పున కేటాయించారు.

రాని బాకీలు రూ.లక్ష కోట్లు

- తప్పుడు పత్రాలతో బ్యాంకులనే బురిడీ కొట్టిస్తున్న కేటుగాళ్లు
- 2023లోనే 18,500 మోసాలు

సాక్షి, అమరావతి: ఏదైనా బ్యాంకులో రుణం తీసుకోవాలంటే అంత సులువుకాదు. సవాలక్ష ప్రశ్నలు అడుగుతారు. షూరిటీలు ఇమ్మంటారు. అయితే అలాంటి బ్యాంకులనే బురిడీ కొట్టించే కేసులు దేశంలో గణనీయంగా పెరుగుతున్నాయి. . నాలుగేళ్లలో బ్యాంకులను మోసగించిన కేసులు రెట్టింపు అయ్యాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) నివేదిక వెల్లడించింది. అలా ఇచ్చిన రుణాలు ఇక వెనక్కి రావని గుర్తించి వాటిని మాఫీ చేయాల్సిన అనివార్యత బ్యాంకులకు ఎదురవుతోంది. ఎనిమిదేళ్లలో బ్యాంకులు ఏకంగా రూ.లక్ష కోట్ల రుణాలను రాని బాకీలుగా పేర్కొని మాఫీ చేయడం గమనార్హం. బ్యాంకులను బురిడీ కొట్టించి మోసాలకు పాల్పడుతున్న కేసుల వివరాలతో ఆర్‌బీఐ విడుదల చేసిన తాజా నివేదికలోని ప్రధాన అంశాలు ఇవీ...

- 2023లో దేశంలో బ్యాంకులను మోసగించిన అంశంపై 13,500 కేసులు నమోదయ్యాయి. 2019లో 6,800 కేసులు నమోదు కాగా 2023 నాటికి ఆ కేసులు దాదాపు రెట్టింపయ్యాయి.
- తప్పుడు పత్రాలతో రుణాలు ఇచ్చి మోసపోతున్న వాటిలో 2016 నాటికి ప్రైవేటు బ్యాంకుల వాటా కంటే జాతీయ బ్యాంకుల వాటా ఎక్కువగా ఉండేది. 2019 నుంచి ప్రైవేటు బ్యాంకుల వాటా పెరుగుతోంది. 2016-17లో మొత్తం బ్యాంకు మోసాల్లో జాతీయ బ్యాంకుల వాటా 80.4శాతం ఉండగా ప్రైవేటు బ్యాంకుల వాటా 12.4శాతం, మిగిలినది ఇతర బ్యాంకుల వాటాగా ఉండేది. కాగా 2023లో బ్యాంకు మోసాల్లో జాతీయ బ్యాంకుల వాటా 23.5% తగ్గగా ప్రైవేటు బ్యాంకుల వాటా 74.3శాతానికి పెరిగింది.
- ఫేక్ పత్రాలతో ఇచ్చిన రుణాలు ఇక వెనక్కి రావని గుర్తించి వాటిని రాని బాకీలుగా నిర్ధారించి మాఫీ చేస్తున్న మొత్తం బ్యాంకులకు భారంగా పరిణమిస్తోంది. 2015-16 నుంచి ఇప్పటివరకు రూ.లక్ష కోట్ల కంటే ఎక్కువ మొత్తం మాఫీ చేయడం పరిస్థితి తీవ్రతకు నిదర్శనంగా నిలుస్తోంది. ఏడాదికి సగటున రూ.13 వేల కోట్ల వరకు బ్యాంకులు రుణాలు మాఫీ చేస్తున్నట్టు రికార్డుల్లో చూపిస్తున్నాయి. దేశంలో బ్యాంకులు ఏటా ఇస్తున్న రుణాల్లో 0.4 శాతం రుణాలను ఈ విధంగా మాఫీ చేయాల్సి వస్తోంది. 2019-23 మధ్య మాఫీ చేసిన రుణాలు అత్యధికంగా 9 శాతం ఉన్నాయి.

వికేంద్రీకరణను అడ్డుకుంటున్న విజ్ఞత లేని పార్టీలు



సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో మూడు ప్రాంతాలు అభివృద్ధి చెందాలని సీఎం వైఎస్ జగన్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతించకుండా కొన్ని విజ్ఞత లేని రాజకీయ పార్టీలు అడ్డుకుంటున్నాయని పరిపాలనా వికేంద్రీకరణ నాన్ పొలిటికల్ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ హనుమంతు లజిపతిరాయ్ ఆవేదన వ్యక్తంచేశారు. ఆయన గురువారం విశాఖపట్నంలో మీడియాతో మాట్లాడుతూ పరిపాలనా రాజధాని విషయంలో న్యాయపరమైన నిర్ణయం మరింత ఆలస్యం కావడంపై విచారం వ్యక్తంచేశారు. ఏదో ఒకరకమైన సాంకేతిక అంశాలను లేవనెత్తి సుప్రీంకోర్టులో త్వరితగతిన తీర్పు రాకుండా విజ్ఞత లేని రాజకీయ పార్టీలు అడ్డుకోవడాన్ని రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర రాజధాని ఎక్కడ ఉండాలని నిర్ణయించే అధికారం ఆయా ముఖ్యమంత్రులకు లేదని తెలిపే అధికరణ భారత రాజ్యాంగంలో ఎక్కడా లేదని ఆయన స్పష్టంచేశారు. మారుతున్న అభివృద్ధి.. అవసరాల దృష్ట్యా పరిపాలనా వికేంద్రీకరణను ఇప్పటికే ప్రపంచంలో 14కు పైగా దేశాలు పాటిస్తున్నాయని చెప్పారు. మన దేశంలో కూడా అనేక రాష్ట్రాల్లో హైకోర్టు ఒకచోట ఉంటే శాసనసభ వ్యవహారాలు మరోచోట ఉన్న విషయాన్ని గుర్తుచేశారు.

బీజేపీ నేతల్ని కలిసిన నాదెండ్ల

- ఈ భేటీ మర్యాదపూర్వకమన్న ఏపీ బీజేపీ చీఫ్ పురందేశ్వరి
- జనసేన, టీడీపీ పొత్తుకు మోదీ ఆశీస్సులున్నాయన్న జనసేనాని



సాక్షి, అమరావతి: రాష్ట్ర పర్యటనలో ఉన్న బీజేపీ జాతీయ సహ సంఘటన కార్యదర్శి శివప్రకాష్‌ను జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ గురువారం విజయవాడలో కలిశారు. ఈ భేటీపై మనోహర్ మీడియాతో మాట్లాడుతూ.. బీజేపీ నేతలను మర్యాద పూర్వకంగా కలిసేందుకే ఇక్కడికి వచ్చానని చెప్పారు. పొత్తులపై మాట్లాడే వేదిక, సమయం ఇది కాదన్నారు. ఈ భేటీపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ.. జనసేన తమ మిత్రపక్షమని.. నాదెండ్లతో భేటీ కేవలం మర్యాద పూర్వకమని చెప్పారు. పొత్తులపై అంతిమ నిర్ణయం పార్టీ అధిష్టానానిదేనని వ్యాఖ్యానించారు.

బీజేపీ బలోపేతంపైనే ఫోకస్

కాగా.. ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో ఎలాంటి వ్యూహం అమలు చేయాలన్న అంశంపై 45 మంది బీజేపీ కీలక నాయకులతో గురువారం శివప్రకాష్ చర్చించారు. అనంతరం పార్టీ సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలను బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్, మాజీ ఎమ్మెల్సీ మాధవ్, మీడియా కమిటీ చైర్మన్ నాగభూషణంతో కలిసి మీడియాకు వెల్లడించారు. ఎన్నికల దృష్ట్యా 175 అసెంబ్లీ స్థానాలతో పాటు 25 పార్లమెంట్ స్థానాల్లో కిందస్థాయి క్యాడర్ వరకు ఎలా సమాయత్తం చేయాలన్న అంశంపై దానిపై ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీని ఏర్పాటు చేయనున్నట్టు సత్యకుమార్ చెప్పారు. పార్టీ బలోపేతంపై ప్రధానంగా ఫోకస్ చేయాలని జాతీయ సహ సంఘటనా కార్యదర్శి శివప్రకాష్ సూచించారన్నారు. ఎన్నికల మేనిఫెస్టో అంశంపైనే చర్చించామన్నారు. రాజకీయ సంబంధం లేని వ్యక్తులు, ఓటర్లను బీజేపీ వైపు చేరేలా చూడటం వంటి అంశాలపై చర్చించినట్టు వివరించారు. టీడీపీతో పొత్తు అంశంపై సమావేశంలో ఏమన్నా చర్చ జరిగిందా అన్న విలేకరుల ప్రశ్నకు ఆయన స్పందిస్తూ.. 'పొత్తులపై నిర్ణయం మేం ఒక్కరం తీసుకునేది కాదు. మాతో పొత్తు పెట్టుకోవాలి అనుకున్న వాళ్లు కూడా దానిపై ముందు స్పందించాలి. మా లక్ష్యమైతే బీజేపీని ఏపీలో బలోపేతం చేయడమే' అని బదులిచ్చారు.

నా మాటలకు అర్థం త్వరలోనే తెలుస్తుంది

జనసేన-టీడీపీ పొత్తుకు ప్రధాని నరేంద్ర మోదీ ఆశీస్సులు ఉన్నాయని జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ అన్నారు. ప్రధాని మోదీ ఆశీస్సులతోనే రాష్ట్ర అభివృద్ధి కోసం ఇరుపక్షాలు ఒక విశ్వసనీయ పొత్తుతో అడుగులు వేస్తున్నాయన్నారు. ఈ క్రమంలో తాను ఏ నిర్ణయం తీసుకున్నా.. ఏం మాట్లాడినా అందుకు ఒక బలమైన కారణం ఉంటుందని.. అవి ఇప్పటికిప్పుడు కంటికి కనిపించకపోవచ్చునని పేర్కొన్నారు. తాను ఆశించినవి నెరవేరిన రోజున ఇప్పుడు తనను అపార్థం చేసుకుని దూషిస్తున్న కాపు పెద్దలు కచ్చితంగా హర్షిస్తారని చెప్పారు. కాపులను కాపు నాయకులతో తిట్టిస్తూ.. తూలనాడిస్తున్న వ్యక్తిని కాకుండా తనను దూషించడం వల్ల ఎవరికీ ప్రయోజనమో గ్రహించాలని కోరారు. ఈ మేరకు పవన్ కళ్యాణ్ పేరుతో జనసేన పార్టీ కార్యాలయం గురువారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేసింది.

బాబుకే ష్యూరిటీ లేదు

- ఎంపీ మార్గాని భరత్‌రామ్
- ప్రజల గుండెల్లో సీఎం జగన్
- వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీకి చెందిన పలువురు ముస్లింలు



టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన ముస్లింలతో ఎంపీ భరత్‌రామ్, రౌతు సూర్యప్రకాశరావు తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: భవిష్యత్ రాజకీయాల్లో చంద్రబాబుకే ష్యూరిటీ లేదని, అటువంటిది ప్రజలకు ఆయన ఎలా గ్యారంటీ ఇస్తారని వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ ఎద్దేవా చేశారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఆజాద్ చౌక్ సెంటర్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో టీడీపీకి చెందిన పలువురు ముస్లింలు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఎంపీ భరత్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'మీ భవిష్యత్తుకు బాబు గ్యారంటీ, బాబు ష్యూరిటీ' అంటూ ఇంకా ప్రజలను మభ్యపెట్టడానికి చంద్రబాబు, లోకేశ్, పవన్‌కళ్యాణ్ జిమ్మిక్కులు చేస్తున్నారు. వీరిని నమ్మి మోసపోవడానికి ప్రజలు సిద్ధంగా లేరు' అని చెప్పారు. 2014 నుంచి 2018 వరకు ఎన్‌డీఏతో ఉన్న టీడీపీ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి వెలగబెట్టిందేమీ లేదన్నారు. అమరావతిని రాజధాని చేసేస్తామంటూ సామాన్య రైతుల నుంచి తక్కువ ధరకు భూములు లాక్కుని టీడీపీ నేతలు పంచుకున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. సీఎం వైఎస్ జగన్ నాలుగున్నరేళ్లలో సంక్షేమ పాలన అందించారని, అన్ని వర్గాల ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారని చెప్పారు. రాజమహేంద్రవరం నగర అభివృద్ధి సంస్థ చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

రవాణా రంగ సమస్యలను పరిష్కరించండి

- ముఖ్యమంత్రి జగన్‌కు లారీ ఓనర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి



సీఎం జగన్‌కు వినతి పత్రం అందిస్తున్న లారీ యజమానుల సంఘం అధ్యక్షుడు రాజు (ఫైల్)

కాకినాడ: రవాణా రంగం, లారీ పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్ఎస్ రాజు కోరారు. ఈ మేరకు బుధవారం కాకినాడలో సీఎం వైఎస్ జగన్‌కు వినతిపత్రం ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ వివరాలను ఎస్ఎస్ రాజు గురువారం మీడియాకు వెల్లడించారు. రాష్ట్రంలో 40 లక్షల కుటుంబాలు రవాణా రంగంపై ఆధారపడి జీవిస్తున్నాయని చెప్పారు. గ్రీన్ ట్యాక్స్ వల్ల లారీ యజమానులపై పడుతున్న అదనపు భారాన్ని తగ్గించాలని సీఎంను కోరినట్లు తెలిపారు. గూడ్స్, రవాణా వాహనాలకు ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో కౌంటర్ సిగ్నేచర్ పర్మిట్లు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. రోడ్డు ప్రమాదాలకు గురైన సమయంలో సంబంధిత పోలీస్‌స్టేషన్లు.. లారీలను వీలైనంత త్వరగా విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని సీఎంను కోరామన్నారు. శిథిలావస్థకు చేరిన లారీల నుంచి అఫిడవిట్ తీసుకుని, ఆర్సీలు రద్దు చేయాలని, కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం సరిహద్దుల్లో చెక్‌పోస్టులు తొలగించాలని విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు.

బీసీలపై కపటప్రేమ చాలించు చంద్రబాబు

మంత్రి జోగి రమేష్



పెడన: బీసీల ఆత్మగౌరవాన్ని నిలబెట్టింది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, క్యాబినెట్‌లో 17 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పదవులిచ్చారని, 9 రాజ్యసభ స్థానాల్లో నలుగురు బీసీలున్నారని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. కృష్ణాజిల్లా పెడన మార్కెట్ యార్డు ఆవరణలో గురువారం ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపు సోదరులంతా ఏకతాటిపైకొచ్చి జగనన్నకే మద్దతిస్తున్నారని స్పష్టం చేశారు. నిన్నటి దాకా తన సొంత సామాజికవర్గం తప్ప మిగతా సామాజికవర్గాల వారందర్నీ చంద్రబాబు హీనంగా, చులకనగా చూశారని గుర్తు చేశారు. రేపో మాపో ఎన్నికలగానే మళ్లీ చంద్రబాబు వేషాలు మార్చుతున్నారంటూ దుయ్యబట్టారు. ఒకప్పుడు తోకలు కత్తిరిస్తాం..అంతు చూస్తానంటూ..బీసీల్ని బెదిరించిన చంద్రబాబు ఇప్పుడు వారిపై దొంగ ప్రేమ కురిపిస్తున్నారని అన్నారు. ఈరోజు జయహో బీసీ పేరిట పార్టీ కార్యక్రమం పెట్టుకుని అందులో ఆయనతో పాటు అచ్చెన్నాయుడు, బండారు సత్యన్నారాయణ, ఇంకా కొంత మంది బీసీలకేదో చేసినట్టు పెద్దపెద్దగా రంకెలేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

బీసీలకు పెద్దన్నగా జగన్

అణగారిన వర్గాలు, బడుగు, బలహీనవర్గాల్ని గుర్తించి వారిని అన్నివిధాలుగా అభివృద్ధిలోకి తెచ్చి బీసీలకు పెద్దన్నగా నిలిచింది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డేనని అన్నారు. క్యాబినెట్‌లో 25 మంది మంత్రులకుగాను 17 మంది, 9 రాజ్యసభ స్థానాల్లో నాలుగింటిని బలహీనవర్గాలకు ఇచ్చి బీసీల్ని అగ్రస్థానంలో నిలబెట్టారని తెలిపారు. కులం, మతం, ప్రాంతం చూడకుండా డీబీటీ ద్వారా లబ్ధిదారుల ఖాతాల్లో జమచేసిన సొమ్ము అక్షరాలా రూ.2.41 లక్షల కోట్లు అని అన్నారు. వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం లబ్ధిదారుల ఖాతాల్లో జమచేసిన సంక్షేమలబ్ధిని లెక్కగట్టి.. చంద్రబాబు పాలనతో బేరీజు వేసుకోవాలని ప్రజలను జోగి రమేష్ కోరారు.

ఎస్సీల రాజ్యసభ సీటును అమ్ముకున్న నీచుడు చంద్రబాబు

ఎస్సీ సామాజికవర్గానికి రాజ్యసభ స్థానం కేటాయిస్తామని వర్ల రామయ్యకు కబురు పంపి, ఆయన భారీ ర్యాలీగా వచ్చేలోగానే.. దాన్ని కనకమేడల రవీంద్రకుమార్‌కు అమ్ముకున్నావా.. లేదా అని చంద్రబాబును ప్రశ్నించారు. డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు రుణమాఫీ అని చెప్పి చేతులెత్తి ఓడిపోయాడన్నారు. ఆయన ఎగ్గొట్టిన రుణమాఫీని జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక అమలు చేశారని గుర్తు చేశారు. అక్కచెల్లెమ్మలకు మూడు సెంట్ల స్థలం, రైతు రుణమాఫీ, డ్వాక్రా మహిళల రుణాల మాఫీ తదితర చంద్రబాబు నెరవేర్చని హామీలపై ఆయన దత్తపుత్రుడు పవన్ కళ్యాణ్ ఏనాడూ ప్రశ్నించలేదని ధ్వజమెత్తారు.

నాలుగు రోజుల తర్వాత

తల్లి ఒడికి..



ఈ పిల్ల ఏనుగు తల్లి ఒడిలో వెచ్చదనాన్ని ఆస్వాదిస్తూ హాయిగా నిద్రిస్తోంది. ఇందులో ప్రత్యేకత ఏముంది అంటారా? మంద నుంచి తప్పిపోయిన ఈ బుజ్జి ఏనుగు నాలుగు రోజుల తర్వాత తల్లి వద్దకు చేరుకుంది. అటవీ శాఖ అధికారులు ఎంతో శ్రమించి పిల్ల ఏనుగును తల్లి ఏనుగు వద్దకు చేర్చారు. తమిళనాడులోని అన్నామలై టైగర్ రిజర్వ్‌లో ఏనుగులు గుంపులుగా సంచరిస్తుంటాయి. గత నెల 29వ తేదీన అడవిలో ఒంటరిగా ఉన్న పిల్ల ఏనుగును అధికారులు గుర్తించారు. అది మంద నుంచి వేరుపడినట్లు గుర్తించారు. తల్లి వద్దకు క్షేమంగా చేర్చడానికి చర్యలు ప్రారంభించారు. గజమాత కోసం డ్రోన్లతో గాలింపు చేపట్టారు. 3 కిలోమీటర్ల దూరంలో ఏనుగుల గుంపు ఒకటి సంచరిస్తున్నట్లు కనిపెట్టారు. తల్లి అందులోనే ఉండొచ్చని భావించారు. పిల్ల ఏనుగును ఈ నెల 2వ తేదీన ఆ గుంపు వద్దకు చేర్చారు. బిడ్డను గుర్తించిన తల్లి ఏనుగు వెంటనే ఆప్యాయంగా అక్కున చేర్చుకుంది. అమ్మ ఒడిలోకి బిడ్డ ఒదిగిపోయింది. అది చూసి తమ శ్రమ ఫలించినందుకు అటవీ శాఖ సిబ్బంది ఆనందించారు. ఈ దృశ్యాన్ని ఫోన్లలో బంధించారు. ఈ చిత్రాన్ని తమిళనాడు అటవీ శాఖ అధికారి సుప్రియా సాహూ 'ఎక్స్'లో పోస్టు చేయగా, నెటిజన్లు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

ఉల్లాసంగా ఉత్సాహంగా..

కడలి ఒడిలో



న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లక్షద్వీప్ పర్యటన సందర్భంగా సముద్రంలో నీటి అడుగున సాహస క్రీడలో స్వయంగా పాల్గొన్నారు. అక్కడి జలచరాలను, వాటి జీవనాన్ని ప్రత్యక్షంగా వీక్షించారు. అరేబియా సముద్రంలో ఉల్లాసకరమైన అనుభవం సొంతం చేసుకున్నానంటూ మోదీ తాజాగా 'ఎక్స్'లో పోస్టు చేశారు. సముద్రం అడుగున తన సాహసానికి సంబంధించిన ఫొటోలను పంచుకున్నారు. అడ్వెంచర్‌ను ఇష్టపడేవారికి లక్షద్వీప్ సందర్శన అద్భుతమైన అనుభూతిని ఇస్తుందని పేర్కొన్నారు. లక్షద్వీప్‌లో తన పర్యటన సందర్భంగా స్నాకలింగ్‌ను(నీటి అడుగున సాహసం) ప్రయత్నించానని తెలిపారు. అది మర్చిపోలేని అనుభవమని ఉద్ఘాటించారు. లక్షద్వీప్ సముద్ర తీరాల్లో ఉదయం పూట నడక, బీచ్ ఒడ్డున కుర్చీలో విశ్రాంతి తీసుకుంటున్న ఫొటోలను సైతం మోదీ షేర్ చేశారు. ఆయన ఈ నెల 2, 3వ తేదీల్లో లక్షద్వీప్‌లో పర్యటించారు. పలు ప్రాజెక్టులను ప్రారంభించారు. కొన్నింటికి శంకుస్థాపన చేశారు. వివిధ ప్రాజెక్టులను జాతికి అంకితం చేశారు. లక్షద్వీప్ అందచందాలతోపాటు అక్కడి ప్రశాంతత మనల్ని మంత్రముగ్ధులను చేస్తాయని పేర్కొన్నాను. అలాగే అక్కడి ప్రజలు చూపిన ఆత్మీయత, గౌరవం తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని వివరించారు. లక్షద్వీప్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ప్రధాని మోదీ తెలిపారు.

యోగిని చంపేస్తానంటూ బెదిరింపులు

డియోరా: ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్‌ను చంపేస్తానంటూ ఓ వ్యక్తి సోషల్ మీడియాలో బెదిరించడం కలకలం రేపింది. అజిత్ యాదవ్ అనే యువకుడు సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పెట్టిన అనుచిత వ్యాఖ్యలతో కూడిన మెసేజీ బుధవారం రాత్రి నుంచి వైరల్ అవుతోంది. ఈ మేరకు రుద్రపూర్ పోలీస్‌స్టేషన్‌లో సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదైంది. ఆ యువకుడి ఆచూకీ కోసం గాలిస్తున్నామని ఎస్పీ సంకల్ప్ యాదవ్ చెప్పారు. డియోరా జిల్లా ఫతేపూర్‌లో అక్టోబర్ 2వ తేదీన ఆరుగురిని బలి తీసుకున్న భూ వివాదం గురించి అతడు ఆ పోస్టులో ప్రస్తావించాడని ఎస్పీ చెప్పారు. జిల్లా పంచాయతీ మాజీ సభ్యుడు ప్రేమ్ యాదవ్‌ను అతడి ప్రత్యర్థి సత్యప్రకాశ్, అతడి కుటుంబసభ్యులు కలిసి చంపేశారు. ఈ విషయం తెలిసి యాదవ్ మద్దతుదారులు సత్యప్రకాశ్‌తోపాటు అతడి భార్య, ముగ్గురు పిల్లలను హత్య చేశారు. అయితే, ప్రేమ్ యాదవ్ ఇల్లు ప్రభుత్వ స్థలంలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఆ ఇంటిని కూల్చేసిన పక్షంలో సీఎం యోగిని చంపేస్తానంటూ అజిత్ యాదవ్ బెదిరించినట్లు ఎస్పీ పేర్కొన్నారు.

వాంటెడ్ ఉగ్రవాది మట్టూ అరెస్ట్

న్యూఢిల్లీ: కశ్మీర్‌లో బలగాల కళ్లుగప్పి తిరుగుతున్న హిజ్బుల్ ముజాహిదీన్ ఉగ్రవాది జావెద్ అహ్మద్ మట్టూ(32)ను ఎట్టకేలకు ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు పట్టుకున్నారు. నిజాముద్దీన్ ఏరియాలో తస్కరించిన కారులో వెళ్తుండగా అతడిని పట్టుకున్నారు. అతడి నుంచి ఒక పిస్టల్, ఆరు కాట్రిడ్జిలు స్వాధీనం చేసుకున్నారు. జమ్మూకశ్మీర్‌లోని సాపోర్‌కు చెందిన మట్టూకు కనీసం అయిదు గ్రెనేడ్ దాడులు అయిదుగురు పోలీసులను పొట్టనబెట్టుకున్న ఘటనలు సహా మొత్తం 11 ఉగ్ర ఘటనలతో ప్రమేయముంది. హిజ్బుల్ ముజాహిదీన్‌తోపాటు అల్ బదర్ ఉగ్ర సంస్థల్లో సభ్యుడని స్పెషల్ పోలీస్ కమిషనర్ ధలీవాల్ చెప్పారు. వాంటెడ్ ఉగ్రవాదిగా ఉన్న మట్టూ తలపై రూ.10 లక్షల రివార్డు ఉంది. భద్రతా బలగాల ఏ ప్లస్‌ప్లస్ కేటగిరీలో సజీవంగా ఉన్న కశ్మీర్ ఉగ్రవాదుల్లో ఇతడొకడు. 2010నుంచి ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు సాగిస్తున్న జావెద్ మట్టూ గతంలో పలుమార్లు పాకిస్తాన్‌కు వెళ్లి వచ్చాడు. కొన్నేళ్ల క్రితం భద్రతా బలగాలతో జరిగిన ఎదురు కాల్పుల్లో గాయపడిన ఇతడు పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐ సలహా మేరకు నేపాల్ వెళ్లి తలదాచుకున్నాడు. ఆయుధాలు, మందుగుండు సామగ్రి కొనుగోలు చేసేందుకు అతడు నేపాల్ నుంచి ఢిల్లీకి వస్తున్నట్లు నిఘా వర్గాలకు సమాచారం అందడంతో వలపన్ని పట్టుకున్నారు.

లెబనాన్‌ను వీడండి

న్యూఢిల్లీ: హమాస్ అగ్రనేత సలేహ్ అల్ అరౌరీని ఇజ్రాయెల్ డ్రోన్ దాడితో లెబనాన్ గడ్డపై హతమార్చడంతో హమాస్–ఇజ్రాయెల్ యుద్ధమేఘాలు లెబనాన్‌పైనా కమ్ముకుంటాయని అమెరికా, దాని మిత్రదేశాలు ఆందోళన చెందుతున్నాయి. ఇందులోభాగంగా లెబనాన్‌లో ఉంటున్న తమ పౌరులను తక్షణం వెనక్కి రావాలని అడ్వైజరీలు, హెచ్చరికలు జారీచేశాయి. ఈ మేరకు జర్మనీ విదేశాంగ శాఖ సామాజిక మాధ్యమాల్లో ఒక పోస్ట్ పెట్టారు. '' వీలైనంత త్వరగా జర్మనీ పౌరులంతా లెబనాన్‌ను వదిలేయండి. అత్యవసర 'ఎలిఫాండ్ సంక్షోభ సన్నద్ధత జాబితాలో మీ పేర్లను రిజిస్టర్ చేసుకోండి. అరౌరీ హత్య తర్వాత లెబనాన్‌లో సంక్షోభం తలెత్తే ప్రమాదముంది'' అని పోస్ట్‌చేసింది. ఇజ్రాయెల్ శివారు గ్రామాలపై హమాస్ మిలిటెంట్లు దాడి చేసినపుడు గత అక్టోబర్‌లోనూ జర్మనీ ఇలాంటి అడ్వైజరీని విడుదలచేసింది. కెనడా, అమెరికా, స్వీడన్‌లూ ఇదే తరహాలో స్పందించాయి.

శ్రీరాముడిపై ఎన్‌సీపీ నేత వ్యాఖ్యలు

ముంబై: హిందువుల ఆరాధ్య దైవం శ్రీరాముడు మాంసాహారి అంటూ ఎన్సీపీ నేత, మహారాష్ట్ర మాజీ మంత్రి జితేంద్ర అవ్హాద్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. బుధవారం షిర్డీలో జరిగిన కార్యక్రమంలో అవ్హాద్ మాట్లాడుతూ..'శ్రీరాముడు మనవాడు. మన బహుజనుడు. రాముడు వేటాడి, మాంసాన్ని తినేవాడు. మీరు మమ్మల్ని శాకాహారిగా మారాలంటున్నారు. కానీ, శ్రీరాముడినే మేం ఆదర్శంగా భావిస్తాం. మాంసం తింటాం. శ్రీరాముడు శాకాహారిగా కాదు, మాంసాహారి'అని అన్నారు. అయోధ్య రామ మందిరంలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠ జరగనున్న వేళ ఆయన వ్యాఖ్యలు తీవ్ర కలకలానికి కారణమయ్యాయి. శ్రీరాముడిపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన అవ్హాద్‌పై బీజేపీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో అవ్హాద్ తన వ్యాఖ్యల పట్ల క్షమాపణ చెప్పారు.

కరోనా కేసుల ఉధృతి

న్యూఢిల్లీ: భారత్‌లో కరోనా పాజిటివ్ కేసులు విపరీతంగా పెరుగుతున్నాయి. గత 24 గంటల్లో ఏకంగా 760 కొత్త కేసులు నమోదయ్యాయి. క్రియాశీలక కేసుల సంఖ్య 4,423కి ఎగసింది. గత 24 గంటల్లో కేరళ, కర్ణాటకలో చెరో రోగి కోవిడ్‌తో కన్నుమూశారని కేంద్ర ఆరోగ్య శాఖ గురువారం తెలిపింది. గత ఏడాది డిసెంబర్ ఐదోతేదీదాకా రోజూ రెండంకెల స్థాయిలో నమోదైన కొత్త కేసులు ఇప్పుడు ఒక్కసారిగా ఎక్కువయ్యాయి. 2020 తొలినాళ్లలో కోవిడ్ మహమ్మారి భయంకరంగా విజృంభించడంతో ఆరోజుల్లో కోట్లాది పాజిటివ్ కేసులు నమోదైన సంగతి తెలిసిందే.

కొలరాడో కోర్టు తీర్పును రద్దు చేయండి

డెన్వర్: కొలరాడో రాష్ట్రంలో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిత్వం కోసం ప్రైమరీ ఎన్నికల్లో పాల్గొనకుండా నిషేధం విధిస్తూ కొలరాడో కోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అమెరికా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కొలరాడో కోర్టు ఇచ్చిన తీర్పును రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై న్యాయస్థానం త్వరలో విచారణ చేపట్టనుంది. 2020 నవంబర్‌లో జరిగిన అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ ఓటమి అనంతరం ఆయన మద్దతుదారులు 2021 జనవరి 6న యూఎస్ క్యాపిటల్‌పై దాడికి దిగారు. వారిని హింసకు ప్రేరేపించినట్లు ట్రంప్‌పై అభియోగాల నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో కొలరాడోలో ప్రైమరీ ఎన్నికల్లో పోటీకి ఆయన అనర్హుడని కొలరాడో సుప్రీంకోర్టు ఇటీవల తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే.

ఒకే కుటుంబంలోని 14 మంది మృతి

ఖాన్‌యూనిస్: ఇజ్రాయెల్ నిరంతరాయంగా కనికరం లేకుండా జరుపుతున్న దాడుల్లో పాలస్తీనియన్ల కుటుంబాలు సమిధలవుతున్నాయి. గురువారం ఖాన్‌యూనిస్‌కు సమీపంలోని ఓ ఇంటిపై జరిగిన దాడితో అందులోని సలాహ్ కుటుంబానికి చెందిన 14 మంది మృత్యువాతపడ్డారు. వీరిలో అయిదేళ్ల చిన్నారి కూడా ఉన్నాడు. వీరంతా గాజాలోని ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ఇక్కడ తలదాచుకుంటున్నారు.

గెలుపే ధ్యేయంగా కలిసి పనిచేద్దాం

- కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలకు పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే దిశానిర్దేశం
- పీసీసీ అధ్యక్షులు, సీఎల్పీ నేతలు, పార్టీ ప్రధాన కార్యదర్శులతో సమావేశం
- రాహుల్ గాంధీ యాత్ర రూట్‌మ్యాప్ స్వల్ప మార్పులతో ఖరారు

సాక్షి, న్యూఢిల్లీ: రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ఢిల్లీ నుంచి గల్లీ స్థాయి వరకు పార్టీ నాయకులు, కార్యకర్తలంతా ఒక జట్టుగా కలిసి పనిచేయాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే దిశానిర్దేశం చేశారు. రాబోయే మూడు నెలలు అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఇలాంటి సమయంలో ప్రతి ఒక్కరూ అలుపెరుగకుండా క్షేత్రస్థాయిలో పని చేయాలని సూచించారు. అధికార బీజేపీ అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లో ఎండగట్టాలని చెప్పారు. గురువారం ఢిల్లీలో ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో అన్ని రాష్ట్రాల పీసీసీ అధ్యక్షులు, సీఎల్పీ నేతలు, పార్టీ ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జిలతో ఖర్గే సమావేశమయ్యారు. పార్టీ సీనియర్ నేత రాహుల్ గాంధీ సైతం హాజరయ్యారు. లోక్‌సభ ఎన్నికల సన్నద్ధత, పార్టీ వ్యూహం, మేనిఫెస్టో, సీట్ల సర్దుబాటు, భారత్ జోడో న్యాయ్ యాత్ర తదితర కీలక అంశాలపై ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చించారు. పార్టీ శ్రేణులకు ఖర్గే పలు సూచనలు చేశారు. రాబోయే ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు.

భావోద్వేగాలను రెచ్చగొట్టడానికి బీజేపీ యత్నాలు

కేంద్రంలో అధికార బీజేపీ గత పదేళ్లలో చేసిందేమీ లేదని, వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ప్రజల్లో భావోద్వేగాలను రెచ్చగొట్టడానికి ప్రయత్నిస్తోందని మల్లికార్జున ఖర్గే మండిపడ్డారు. కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు భారత్ జోడో యాత్ర చేపట్టిన రాహుల్ గాంధీని ప్రశంసించారు. దేశంలో అమలుకు నోచుకోని సాంఘిక న్యాయం, పెరుగుతున్న ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, రైతుల సమస్యలు, ప్రజల ఆర్థిక పరిస్థితి, కుల గణన తదితర కీలక అంశాలను భారత్ జోడో న్యాయ్ యాత్ర ద్వారా లేవనెత్తనున్నట్లు తెలిపారు. అంతేకాకుండా ఈ యాత్ర సామాజిక న్యాయ సమస్యలను జాతీయ స్థాయిలో చర్చకు తీసుకువస్తుందని ఖర్గే విశ్వాసం వ్యక్తం చేశారు.



సమావేశంలో ఖర్గే, రాహుల్ మంతనాలు

బీజేపీకి తగిన సమాధానం చెప్పాలి

బీజేపీ అబద్ధాలు, మోసాలు, అక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు ఖర్గే సూచించారు. విభేదాలను పక్కనపెట్టి పని చేయాలని, అంతర్గత సమస్యలపై రచ్చకెక్కకూడదని హితవు పలికారు. బీజేపీ 10 ఏళ్లలో ఘనంగా చెప్పుకునే ఒక్క పనీ చేయలేదని విమర్శించారు. యూపీఏ ప్రభుత్వ పథకాల పేర్లను, రూపాలను మార్చడంపైనే బీజేపీ దృష్టి పెట్టిందని ఆక్షేపించారు. 'ఇండియా' కూటమి తరఫున దేశవ్యాప్తంగా 8 నుంచి 10 భారీ బహిరంగ సభలు ఉమ్మడిగా నిర్వహించాలని సూచించారు.

భారత్ జోడో న్యాయ్ యాత్ర

తూర్పు నుంచి పశ్చిమ భారతదేశం వరకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తలపెట్టిన యాత్ర పేరు మారింది. 'భారత్ జోడో న్యాయ్ యాత్ర' అని గురువారం నామకరణం చేశారు. తొలుత భారత్ న్యాయ్ యాత్ర అని పేరుపెట్టారు. ఇప్పుడు అదనంగా జోడో అనే పదాన్ని జోడించారు. రాహుల్ దక్షిణాదిన కన్యాకుమారి నుంచి ఉత్తరాదిన కశ్మీర్ వరకు ఇప్పటికే భారత్ జోడో యాత్ర పూర్తిచేసిన సంగతి తెలిసిందే. ఇక 'భారత్ జోడో న్యాయ్ యాత్ర' ఈ నెల 14వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. ఇందుకోసం సన్నాహాలు మొదలయ్యాయి. మణిపూర్ నుంచి రాహుల్ యాత్రకు శ్రీకారం చుడతారు. మహారాష్ట్ర రాజధాని ముంబైలో ముగిస్తారు. ఎక్కువగా బస్సు యాత్ర, వీలును బట్టి పాదయాత్ర ఉంటుంది. యాత్రలో పాల్గొనాల్సిందిగా విపక్ష 'ఇండియా' కూటమి భాగస్వామ్య పక్షాలను కూడా ఆహ్వానిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ చెప్పారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆధ్వర్యంలో గురువారం ఢిల్లీలో కీలక సమావేశం నిర్వహించారు. 'భారత్ జోడో న్యాయ్ యాత్ర' రూట్‌మ్యాప్‌ను స్వల్పమార్పులతో ఖరారు చేశారు. మణిపూర్‌లో ప్రారంభమయ్యే యాత్ర 66 రోజులపాటు కొనసాగుతుంది. 6,713 కిలోమీటర్ల మేర బస్సుయాత్ర, పాదయాత్ర నిర్వహిస్తారు. 15 రాష్ట్రాలు, 110 జిల్లాలు, 100 లోక్‌సభ నియోజకవర్గాలు, 337 అసెంబ్లీ నియోజకవర్గాల గుండా యాత్ర జరుగుతుంది. ఇందులో అత్యధికంగా ఉత్తరప్రదేశ్‌లో 11 రోజులపాటు 1,074 కిలోమీటర్లు యాత్ర సాగనుంది. భారత్ జోడో యాత్ర ఒక బ్రాండ్‌గా స్థిరపడిందని, న్యాయ్ యాత్రలో సైతం జోడోను చేరిస్తే బాగుంటుందని పార్టీ నేతలంతా సూచించడంతో పేరు మార్చారు. ఇందులో న్యాయ్ అనే పదాన్ని రాజ్యాంగ ప్రవేశిక నుంచి స్వీకరించినట్లు జైరామ్ తెలిపారు.

ప్రాసెసింగ్ ఫీజు మాత్రమే తీసుకోండి

- ఇతరత్రా చార్జీలు వేయకండి
- రక్తం విషయంలో ఆస్పత్రులు, బ్లడ్‌బ్యాంక్‌లకు డీసీజీఐ ఆదేశాలు

న్యూఢిల్లీ: రోగుల ఆపత్కాలాన్ని దుర్వినియోగం చేస్తూ ఆస్పత్రులు, బ్లడ్‌బ్యాంక్‌లు రక్త యూనిట్లకు భారీగా ఫీజులు వసూలుచేస్తున్నాయన్న ఆరోపణలపై ఔషధ నియంత్రణ సంస్థ స్పందించింది. ప్రాసెసింగ్ ఫీజు మినహా మరే ఇతరత్రా రుసుములు రక్త యూనిట్లపై వసూలుచేయొద్దని డ్రగ్స్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా(డీసీజీఐ) అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు లేఖలు రాసింది. బ్లడ్ యూనిట్లకు రోగులు భారీగా ఖర్చుచేస్తున్న ఉదంతాలు డ్రగ్స్ కన్సల్టేటివ్ కమిటీ ఇటీవల జరిగిన సమావేశంలో చర్చకొచ్చాయి. ' రక్తం అమ్మకానికి కాదు. దానిని కేవలం సరఫరా చేయాలి. అమ్ముకోకూడదు. సంబంధిత రక్త కేంద్రం(ఆస్పత్రి/బ్లడ్ బ్యాంక్) కేవలం ప్రాసెసింగ్ ఫీజును మాత్రమే వసూలుచేయాలి. అంతకుమించి ఇంకేం చార్జీలు వేయకూడదు' అని సమావేశ అజెండా ద్వారా తీర్మానించారు'' అని డీసీజీఐ తన లేఖలో పేర్కొంది. రక్తం, రక్త విభాగాలకు రూ. 250 నుంచి రూ.1,550 మాత్రమే వసూలుచేయాలని సూచించింది. సవరించిన ఈ మార్గదర్శకాలను మీ పరిధిలోని అన్ని బ్లడ్ సెంటర్లు పాటించేలా చూడాల్సిన బాధ్యత రాష్ట్రాలు, యూటీల డ్రగ్ కంట్రోలర్లదేనని సీసీజీఐ స్పష్టంచేసింది. రోగికి రక్తం అవసరమైనపుడు రోగి బంధువులు/సంబంధిత వ్యక్తులు వేరే గ్రూప్ బ్లడ్‌ను దానం చేయని సందర్భాల్లో ఒక్కో యూనిట్ బ్లడ్‌కు ప్రైవేట్ ఆస్పత్రులు రూ.3,000 నుంచి రూ.8,000 వసూలుచేస్తున్నట్లు అధికారిక వర్గాలే చెబుతున్నాయి. రోగికి కావాల్సిన గ్రూప్ రక్తం అందుబాటులో లేకపోవడం, అరుదైన బ్లడ్ గ్రూప్‌లాంటి సందర్భాల్లో అయితే విపరీతంగా చార్జీలు వసూలుచేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తడం తెల్సిందే.




మహిళా జడ్జిపై దాడి చేస్తున్న నిందితుడు. గాయపడిన జడ్జి

కోర్టు హాల్‌లో మహిళా జడ్జిపై దాడి

నెవడా: ఓ కేసు విచారణకు సందర్భంగా నిందితుడు అనూహ్యంగా మహిళా జడ్జిపైకి దాడికి పాల్పడ్డాడు. అనంతరం కోర్టు సిబ్బంది, ఇతరులు కలిసి పిడిగుద్దులతో అతడికి దేహశుద్ధి చేశారు. లాస్ వెగాస్‌లోని రీజినల్ జస్టిస్ సెంటర్‌లో బుధవారం ఉదయం ఈ అనూహ్య ఘటన చోటుచేసుకుంది. ఏడాది క్రితం బేస్‌బాల్ బ్యాట్‌తో ఓ వ్యక్తిపై దాడి చేశాడన్న ఆరోపణ ఎదుర్కొంటున్న డియోబ్రా డెలోన్ రెడెన్(30)అనే వ్యక్తిని పోలీసులు క్లార్క్ కౌంటీ డిస్ట్రిక్ట్ జడ్జి మేరీ కే హోల్తస్ ఎదుట ప్రవేశపెట్టారు. కేసు వాదనలు పూర్తి కాగా, జడ్జి తీర్పు ప్రకటించారు. తీర్పువిన్న రెడెన్ తీవ్ర ఆగ్రహంతో దుర్భాష లాడుతూ ఒక్కసారిగా దుమికి, జడ్జి టేబుల్‌పైకి చేరుకున్నాడు. జడ్జి హోల్తస్ వెనక్కి నెట్టేశాడు. దీంతో, ఆమె కుర్చీలో నుంచి వెనక్కి పడిపోయి, గోడకు గుద్దుకున్నారు. అడ్డుకోబోయిన కోర్టు మార్షల్‌కు గాయాలయ్యాయి. కోర్టు సిబ్బంది, ఇతరులు కలిసి అతడిని అదుపులోకి తీసుకున్నారు. కోర్టు హాలు కొద్దిసేపు రణరంగాన్ని తలపించింది. కోర్టు హాలుకు వచ్చిన సమయంలో అతడి చేతులకు బేడీలు లేవు. ఘటన జడ్జి ఆదేశాల మేరకు రెడెన్ చేతులకు బేడీలు వేసి, క్లార్క్ కౌంటీ డిటెన్షన్ సెంటర్‌కు తరలించారు.

టెట్రిస్ గేమ్‌ను జయించిన బాలుడు



వాషింగ్టన్: ప్రపంచవ్యాప్తంగా వీడియో గేమ్ ప్రియులకు చిరపరిచితమైన టెట్రిస్ గేమ్‌ను 13 ఏళ్ల అమెరికన్ టీనేజర్ ఎట్టకేలకు మొత్తం పూర్తిచేశాడు. ఈ గేమ్ విడుదలైన దాదాపు 40 ఏళ్ల తర్వాత తొలిసారిగా.. చివరి 157వ లెవల్ దాకా ఆడి చరిత్ర సృష్టించాడు. ఓక్లహోమాకు చెందిన ఈ బుల్లోడి పేరు విల్లీస్ గిబ్సన్. తాను సాధించిన రికార్డు చూసి తెగ సంబరపడిపోతున్నాడు. 'మొదటిసారి ఆట మొదలెట్టినపుడు దీన్ని పూర్తి/క్రాష్ చేయగలనని అస్సలు అనుకోలేదు. గెలుపుతో నా చేతి వేళ్ల స్పర్శనూ నేను నమ్మలేకపోతున్నా' అంటూ గేమ్ చిట్టచివరి 38 నిమిషాల వీడియోను మంగళవారం యూట్యూబ్‌లో గిబ్సన్ పోస్ట్‌చేశాడు. టెట్రిస్ గేమ్ ఇప్పటిదాకా కనీసం 70 విధానాల్లో 200కుపైగా అధికారిక వేరియంట్లలో విడుదలైంది. కిందకు పడిపోతున్న భిన్న ఆకృతుల 'బ్లాక్'లను వరసగా కిందివైపు పేర్చడమే ఈ ఆట.

అరెస్టుకు కుట్ర!

- ఈడీ ఇచ్చిన సమన్లు చట్టవిరుద్ధం..
- తప్పుడు కేసులతో నా గౌరవ ప్రతిష్టలను దెబ్బతీయలేరు
- బీజేపీపై కేజ్రీవాల్ ధ్వజం



న్యూఢిల్లీ: బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం తనను అరెస్టు చేయడానికి కుట్రలు పన్నిందని ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో తాను ప్రచారం చేయకుండా అడ్డంకులు సృష్టించాలన్నదే బీజేపీ ఎత్తుగడ అని మండిపడ్డారు. కేజ్రీవాల్ గురువారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. తన ప్రతిష్టను దెబ్బతీయడానికి బీజేపీ సాగిస్తున్న కుతంత్రాలు ఫలించబోవని తేల్చిచెప్పారు. తన అతిపెద్ద ఆస్తి నిజాయతీ అని చెప్పారు. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో కేజ్రీవాల్ బుధవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) ఎదుట విచారణకు గైర్హాజరైన సంగతి తెలిసిందే. ఆయన ఈడీ ఎదుట హాజరు కాకపోవడం ఇది మూడోసారి. విచారణ పేరుతో పిలిచి, ఈడీతో అరెస్టు చేయించడానికే లోక్‌సభ ఎన్నికల ముందు సమన్లు ఇచ్చారని ధ్వజమెత్తారు. ఈ కేసులో ఈడీ ఇచ్చిన సమన్లు చట్టవిరుద్ధమని తన లాయర్లు చెప్పారని కేజ్రీవాల్ అన్నారు. తనను ఎలాగైనా అరెస్టు చేయాలన్నదే బీజేపీ అసలు పన్నాగమని దుయ్యబట్టారు. సమన్లు చట్టవిరుద్ధమని పేర్కొంటూ ఈడీకి లేఖ రాశానని, అక్కడి నుంచి ప్రతిస్పందన రాలేదని వెల్లడించారు. సమన్లు చట్టవిరుద్ధమని తెలుసు కాబట్టే ఈడీ అధికారులు తన లేఖపై స్పందించలేదని స్పష్టం చేశారు. చట్టవిరుద్ధంగా ఇచ్చిన సమన్లను తానెందుకు పాటించాలని ప్రశ్నించారు. ఒకవేళ చట్టబద్ధంగా ఇస్తే పాటిస్తానని వ్యాఖ్యానించారు. తప్పుడు కేసులతో తన గౌరవ ప్రతిష్టను ఎవరూ దెబ్బతీయలేరని కేజ్రీవాల్ స్పష్టం చేశారు. నిజానికి ఢిల్లీలో మద్యం కుంభకోణమే జరగలేదన్నారు. ఈ కేసులో అరెస్టయిన ఆమ్ ఆద్మీ పార్టీ నేతలకు వ్యతిరేకంగా ఎలాంటి సాక్ష్యాధారాలు లేవన్నారు. బీజేపీలో చేరనందుకే మనీష్ సిసోడియా, సంజయ్ సింగ్, విజయ్ నాయర్‌ను అరెస్టు చేశారని ఆరోపించారు.

అసలు రంగు బయటపడింది: బీజేపీ

కేజ్రీవాల్ అసలు రంగు బయటపడిందని బీజేపీ ప్రతినిధి సుధాంశు త్రివేది చెప్పారు. ఢిల్లీ ప్రభుత్వ ఆధ్వర్యంలోని మొహల్లా క్లినిక్‌ల సిఫార్సుతో ప్రైవేట్ ల్యాబ్‌ల్లో నకిలీ డయాగ్నోస్టిక్ టెస్టులు జరిగాయని, నకిలీ రోగులకు చికిత్స అందించారని చెప్పారు. ఈఉదంతంపై లెఫ్టినెంట్ గవర్నర్ సక్సేనా సీబీఐ విచారణకు ఆదేశించారని తెలిపారు.

ఢిల్లీ ఎయిమ్స్‌లో అగ్ని ప్రమాదం

న్యూఢిల్లీ: ఢిల్లీలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్)లో గురువారం ఉదయం అగ్ని ప్రమాదం సంభవించింది. రెండో అంతస్తులోని రిప్రొడక్టివ్ బయాలజీ డిపార్టుమెంట్‌లో 6 గంటల సమయంలో మంటలు మొదలయ్యాయి. వెంటనే అగ్ని మాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. ఎటువంటి నష్టం జరగలేదని అధికారులు అన్నారు. ఫ్రిడ్జిలో షార్ట్ సర్క్యూట్ వల్లే ప్రమాదం జరిగింది.

10 వేల మందికి క్షమాభిక్ష

మయన్మార్ సైనిక జుంటా ప్రకటన

బ్యాంకాక్: మయన్మార్‌లోని సైనిక ప్రభుత్వం దేశ 76వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని 10 వేల మందికి క్షమాభిక్ష ప్రకటించింది. జైళ్ల నుంచి విడుదలయ్యే వారిలో సైనిక ప్రభుత్వాన్ని వ్యతిరేకించే రాజకీయ ఖైదీలున్నదీ లేనిదీ వెల్లడి కాలేదు. 9,652 మంది ఖైదీలను క్షమాభిక్ష ద్వారా విడుదల చేస్తామంటూ దేశ మిలటరీ కౌన్సిల్ సీనియర్ జనరల్ మిన్ ఔంగ్ హ్లెయింగ్ తెలిపినట్లు ప్రభుత్వ టీవీ వెల్లడించింది. అయితే, పదవీచ్యుత నేత అంగ్ సాన్ సుకీ(78) పేరు ఈ జాబితాలో ఉన్న సూచనల్లేవని పరిశీలకులు అంటున్నారు. ఆమ్నెస్టీ పొందిన వారిలో 114 మంది విదేశీయులు సైతం ఉన్నారు. ఖైదీల విడుదల గురువారం మొదలై కొన్ని రోజులపాటు సాగుతుందని చెబుతున్నారు. రెండేళ్ల క్రితం అధికారాన్ని హస్తగతం చేసుకున్న ఆర్మీ 25 వేల మందికి పైగా నిర్బంధించినట్లు చెబుతున్నారు.

బ్రాండెడ్ షూస్.. సగం ధరకే అమ్మేయాలని..

- బెంగళూరులో రూ.1.1 కోట్ల షూలను ఎత్తుకెళ్లి.. పట్టుబడిన ట్రక్కు డ్రైవర్లు

బెంగళూరు: ఖరీదైన షూస్‌ను కొట్టేశారు. వాటిని అయిన కాడికి అమ్మేసి ధనవంతులై పోవాలని ప్లాన్ వేశారు. అయితే కథ అడ్డం తిరిగి జైలు ఊచలు లెక్కబెడుతున్నారు. నగరానికి చెందిన దిగంత్ ట్రాన్స్‌పోర్ట్ నిర్వాహకులు తమకు కావాల్సిన ట్రక్కులు, డ్రైవర్లను పీన్యాలోని ఈసీ షిప్పర్ ట్రాన్స్‌పోర్ట్ సర్వీసెస్ నుంచి అద్దెకు తీసుకుంటూ ఉంటారు. అదేవిధంగా, డిసెంబర్ 21న ఒక ట్రక్కుతోపాటు డ్రైవర్‌ను కూడా పనికి పెట్టుకున్నారు. చెప్పినవిధంగానే సలెహ్ అహ్మద్ లస్కర్ అనే డ్రైవర్ ట్రక్కుతో షెట్టిహళ్లిలోని 'నైక్'షోరూంకు వెళ్లి, రూ.1.1 కోట్ల 1,558 షూలను లోడు చేసుకుని అనుగొండనహళ్లిలోని మింత్రా గోదాము వైపు బయలుదేరాడు. కానీ, అక్కడికి వెళ్లలేదు. అనుమానం వచ్చిన ట్రాన్స్‌పోర్ట్ నిర్వాహకులు పోలీసులతో కలిసి జీపీఎస్ ఆధారంగా తరబనహళ్లి–చిక్కబనవర మధ్య ఉన్న ఖాళీ ట్రక్కును గుర్తించారు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా అదే రోజు అర్ధరాత్రి సమయానికి షూస్‌తోపాటు వాహనాన్ని గుర్తించారు. ఎత్తుకెళ్లిన షూస్ అందులో ఉన్నాయి. లస్కర్‌తోపాటు, సహకరించిన సుభాన్ పాషా, మన్సూర్ అలీ, సాహిదుల్ రహ్మాన్‌లను అరెస్ట్ చేశారు. వీరంతా నగరంలో పనిచేయడానికి వచ్చిన అస్సాంకు చెందిన ట్రక్కు డ్రైవర్లని పోలీసులు తెలిపారు. షూలను కొట్టేశాక వాటిని రోడ్డు పక్కన సగం ధరకే అమ్మేసి, తొందరగా డబ్బు సంపాదించాలనుకున్నామని వెల్లడించారు.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
శుక్రవారం, 5 జనవరి 2024

ఉచిత వైద్యశిబిరం

తుమకూరు: సిద్దగంగా వైద్య విద్యాసంస్థ వైద్యనిపుణుడు డాక్టర్.ఎస్. పరమేశ్ ఆధ్వర్యంలో నగరంలోని 7వ వార్డులో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. నాలుగు నుంచి 7వ వార్డు ప్రజలు హాజరై వైద్యసేవలు పొందారు. ప్రజలకు పలు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైనవారికి ఉచితంగా ఔషధాలను అందజేశారు. మాజీ ఉప మేయర్ టీఆర్ నాగరాజు పాల్గొన్నారు.



న్యూస్‌రీల్

విమానాల మీదకు లేజర్ లైట్లు



మైసూరు: మైసూరు నగరానికి దగ్గరలోనున్న మండకళ్లి విమానాశ్రయంలో విమానాలు దిగే, ఎగిరే సమయంలో కొందరు దుండగులు కావాలనే లేజర్ లైట్లను వేస్తున్న ఘటనలు వెలుగులోకి వచ్చాయి. దీనివల్ల తాము ఆందోళనకు గురైనట్లు విమాన ప్రయాణికులు తెలిపారు. ఎంతో ప్రకాశవంతమైన ఆకుపచ్చ లేజర్ లైట్లను సరిగ్గా పైలట్ల కళ్ల మీదకు వేస్తున్నారని ప్రయాణికులు తెలిపారు. దాంతో పైలట్లు గందరగోళానికి గురయ్యే ప్రమాదం ఉందని అన్నారు. ఎయిర్‌పోర్టుకు చాలా దూరం నుంచి ఈ లేజర్ లైట్లు వస్తున్నాయని తెలిపారు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేసి దుండగుల ఆట కట్టించాల్సి ఉందన్నారు.

పోలీస్ స్టేషన్ ముందు ఎమ్మెల్యే ధర్నా

శివాజీనగర: హుబ్లీలో కరసేవకులను అరెస్టు చేశారంటూ గురువారం ఉదయం బెంగళూరులోని సదాశివనగర పోలీస్ స్టేషన్ ఎదురుగా కార్కళ బీజేపీ ఎమ్మెల్యే సునీల్ కుమార్ ధర్నా చేశారు. హుబ్లీలో కరసేవకుడైన శ్రీకాంత్ పూజారి అరెస్ట్ చేశారు, నేను కూడా కరసేవకున్ని, నన్ను అరెస్టు చేయడి అని ప్లకార్డ్ పట్టుకొని ఒంటరిగా బైఠాయించారు. అప్పట్లో అయోధ్య అభియానలో తాను కూడా పాల్గొన్నట్లు చెప్పారు. చివరకు పోలీసులు ఆయనను అరెస్టు చేసి తరువాత విడుదల చేశారు.

తుపాకీతో కాల్చుకుని విద్యార్థి ఆత్మహత్య



విశు ఉత్తప్ప



విశు మృతదేహం

దొడ్డబళ్లాపురం: డబుల్ బ్యారెల్ తుపాకీతో కాల్చుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన నగరంలో మాదనాయకనహళ్లి పరిధిలో చోటుచేసుకుంది. చిక్కబాణావరలో నివసిస్తున్న కొడుకుకు చెందిన విశు ఉత్తప్ప (19) మృతుడు. విశు తండ్రి రవి తమ్మయ్య నైస్ కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తుండగా ఆయన వద్ద డబుల్ బ్యారెల్ గన్ ఉంది. కొడుకు విశు ఆర్ఆర్ కాలేజీలో బీకాం ఫస్ట్ ఇయర్ చదువుతున్నాడు. మంగళవారం సాయంత్రం కుటుంబ సభ్యులు బయటకు వెళ్లిన సమయంలో ఇంట్లో గన్‌తో ఎదలో కాల్చుకున్నాడు. రాత్రి 9 గంటలకు కుటుంబ సభ్యులు ఇంటికి రాగా సంఘటన వెలుగు చూసింది. చదువులో సమస్యలు, ప్రేమ వ్యవహారమే కారణం కావచ్చని భావిస్తున్నారు. మాదనాయకనహళ్లి పోలీసులు కేసు నమోదు చేశారు.

అన్నదాత బలవన్మరణం

మండ్య: అప్పుల బాధను తట్టుకోలేక అన్నదాత ఒకరు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండ్య తాలూకాలోని గిడిగెనహళ్లి గ్రామంలో జరిగింది. రైతు సోమశేఖరయ్య (58) సేద్యం కోసం సహకార బ్యాంకులు, వడ్డీ వ్యాపారుల వద్ద రూ. 18 లక్షల వరకూ అప్పులు చేశాడు. పంటలు పండక, అప్పులు తీరే మార్గం లేక జనవరి నెల 2వ తేదీన సాయంత్రం పొలంలోనే పురుగుల మందును తాగాడు. కొందరు చూసి వెంటనే ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ విష ప్రభావం అధికమై గురువారం చనిపోయాడు. కెరెగోడు పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

కార్మికశాఖ ఆఫీసులో లంచాల గోల



ధర్నా చేస్తున్న కార్మికులు

తుమకూరు: జిల్లాలోని గుబ్బి తాలూకా కార్మిక శాఖ కార్యాలయంలో అవినీతి తాండవిస్తోందని, ఇక్కడ పింఛన్, కార్మికులకు గుర్తింపు కార్డులు, వాటిని రెన్యువల్ చేయడానికి లంచం డబ్బులు ఇస్తే తప్ప పని జరగడం లేదని కూలీ కార్మికులు వాపోయారు. జిల్లా వ్యవసాయ కూలీ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆ ఆఫీసు ముందు ధర్నా చేశారు. కార్మిక నేత సీజే లోకేష్ మాట్లాడుతూ గుబ్బి కార్మిక శాఖలో విపరీతంగా లంచాల బెడద ఉందని, ఉన్నతాధికారులు దృష్టి సారించాలని డిమాండ్ చేస్తూ వినతిపత్రం సమర్పించారు.

బహుపరాక్.. డిజిటల్ అరెస్టు

- సైబర్ నేరగాళ్ల కొత్త పంథా
- సిలికాన్ సిటీ వాసులపై పంజా
- నేరాలకు పాల్పడ్డారని బెదిరించి భారీగా వసూళ్లు

బనశంకరి: మీరు కొరియర్లో డ్రగ్స్ తెప్పిస్తున్నారు, లేదా నిషిద్ధ వస్తువులు మీకు కొరియర్ వచ్చాయి. లేదా నేరపూరిత కార్యక్రమాలు చేస్తున్నారు, మీపై కేసు పెడుతున్నాం అని ఫోన్ చేస్తారు, విచారణ పేరుతో ఎక్కడికీ వెళ్లకుండా కట్టడి చేస్తారు. దీనినే సాంకేతిక పరిభాషలో డిజిటల్ అరెస్ట్ అని పిలుస్తారు. ఇది సైబర్ నేరగాళ్ల పన్నాగం.

వీరే బాధితులు

పోలీసులు, సీబీఐ, కస్టమ్స్, ఈడీ, ఆర్‌బీఐ అధికారులమంటూ బెదిరించి డబ్బు వసూలు చేస్తారు. ఐటీ బీటీ సిటీలో 300 కు పైగా డిజిటల్ అరెస్ట్ కేసులు నమోదయ్యాయి. ప్రభుత్వ అధికారులు, ఐటీ ఇంజనీర్లు, పారిశ్రామికవేత్తలు, విశ్రాంత అధికారులు, శాస్త్రవేత్తలు సైతం ఇటువంటి వంచనకు గురి అవుతున్నారు. ఫోన్ కాల్ చేసి కంప్యూటర్ లేదా ఫోన్‌లో లైవ్‌లో పెట్టి పోలీస్ కేస్, జైలు అని బ్లాక్‌మెయిల్‌కు పాల్పడి భారీగా నగదు దోచేస్తారు. సైబర్ నేరాల లోకంలో ఇది పెద్ద మాఫియాగా మారి ప్రజలను హడలెత్తిస్తోంది.

కొరియర్, పార్శిల్ పేరుతో ఫోన్

- ప్రారంభంలో కొరియర్ కంపెనీ ఉద్యోగుల ముసుగులో ఫోన్ చేసి ఏదో ఊరు నుంచి మాట్లాడుతున్నామని చెబుతారు.
- మీ ఆధార్ నంబరు పేరుతో విదేశాలకు పార్శిల్ బుక్ అయింది. పాత పాస్‌పోర్ట్ , బ్యాంకు క్రెడిట్‌కార్డు, డ్రగ్స్ ఆ పార్శిల్‌లో దొరికాయి. దీనిపై ఎన్‌సీబీ అధికారులు, సైబర్‌క్రైం పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారని చెబుతారు.
- అంతేగాక అతడికి స్కైప్ యాప్ లింక్ పంపించి యాప్ ను డౌన్‌లోడ్ చేసుకుని పోలీసులతో మాట్లాడాలని సలహా ఇస్తారు. అంతలో మరో పోలీస్ అధికారి ముసుగులో స్కైప్ యాప్‌లో వీడియోకాల్ చేసి నకిలీ ఐడీ కార్డు చూపించి మాట్లాడతారు.
- మీ పేరుతో డ్రగ్స్ దందా జరుగుతోంది, అంతేగాక మీ ఆధార్ కార్డుతో బ్యాంక్ అకౌంట్ తెరిచి కోట్లాది రూపాయలు అక్రమ కార్యకలాపాలు జరిగాయి. దీనిపై కూడా కేసులైనట్లు కంగారు పుట్టిస్తారు.



అరెస్టు, విచారణ అని భయాందోళనకు గురిచేసే సైబర్ నేరగాళ్లు



భయపడి వారు చెప్పినట్లు చేస్తే సుడిగుండంలో చిక్కినట్లే



చెప్పినట్లు చేస్తే చాలంటూ..

ఈ కేసు నుంచి మీరు తప్పించుకోవడానికి మేమే సర్టిఫికెట్ ఇస్తాం, మేము చెప్పినట్లు వినాలి, ముంబై సైబర్‌క్రైం డీసీపీ వర్చువల్ విచారణ చేస్తారు. అప్పటి వరకు ఎవరికీ ఏమీ చెప్పరాదు, లేదంటే అరెస్టవుతారు అని బెదిరిస్తారు. ఇలా వీడియో కాన్ఫరెన్స్, వీడియో కాల్స్ ద్వారా తీవ్రంగా సతాయించి, ఎంత ఎక్కువ సొమ్ము వీలైతే అంత ఆన్‌లైన్‌లో బదిలీ చేయించుకుంటారు. పిల్లల అక్రమ రవాణాకు పాల్పడుతున్నారని, మీ మొబైల్‌నంబర్‌తో ఉగ్రవాదుల సంభాషణలు జరిగాయని కూడా సైబర్ కేటుగాళ్లు భయాందోళనకు గురిచేస్తారు.

స్కైప్ యాప్‌లో దందా

దర్యాప్తులో దొరకకుండా సైబర్ వంచకులు సిమ్‌కార్డును వాడరు. దీనికి బదులు స్కైప్ యాప్‌లో మాట్లాడతారు. బ్యాంక్ అకౌంట్‌లోకి నగదు జమైన తక్షణం డ్రా చేసుకుని క్రిప్టో కరెన్సీ ద్వారా మళ్లిస్తారు. దీనిని స్వాధీనం చేసుకోవడం పోలీసులకు సవాల్‌గా మారుతుంది.

గత నెలలో 2 ఘటనలు

- బెంగళూరు మైకో లేఔట్ ఎల్అండ్‌టీ సౌత్ సిటీలో దేబశీశ్ దాస్ అనే వ్యక్తిని గత నెల 10 తేదీన మధ్యాహ్నం 12 గంటలకు డిజిటల్ అరెస్ట్ చేసి 4 గంటల పాటు కూర్చోబెట్టి రూ.1.52 కోట్లు దోచేశారు.
- గత నెల 15న ఐఐఎస్‌సీ శాస్త్రవేత్తకు ఫోన్ చేసిన సైబర్ కేటుగాళ్లు 16వ తేదీ అర్ధరాత్రి 12 వరకు కంప్యూటర్ ముందు ఉండాలని ఉత్తుత్తి ఆన్‌లైన్ విచారణ జరిపారు. చివరికి రూ.83 లక్షల్ని లాగేశారు.
- అపరిచిత కాల్స్‌కు స్పందించరాదని, ఇటువంటి ఫోన్లు వచ్చినప్పుడు తక్షణమే స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయాలని పోలీసు అధికారులు తెలిపారు.

మహాదేశ్వరుని హుండీల్లో రూ.2.90 కోట్లు

మైసూరు: చరిత్ర ప్రసిద్ధ చామరాజనగర జిల్లాలోని హనూరు తాలూకాలో ఉన్న శ్రీ మలెమహాదేశ్వర బెట్ట దేవస్థానంపై కనక వర్షం కురిసింది. స్వామికి 33 రోజుల్లో భక్తుల నుంచి సుమారు 2.90 కోట్ల రూపాయల నగదు హుండీల్లో జమైంది. శాంత మల్లికార్జున స్వామీజీ ఆధ్వర్యంలో దేవాలయంలో ఉన్న హుండీలను గురువారం లెక్కింపు జరిగింది. డిసెంబరు ఆఖరు నుంచి వరుసగా సెలవులు రావడంతో మహదేశ్వరున్ని పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. హుండీలో 2.90 కోట్ల నగదు, 102 గ్రాముల బంగారం, 3.3 కేజీల వెండి కానుకలు వచ్చాయి.

హుబ్లీ సీఐని బదిలీ చేయం: హోంమంత్రి

శివాజీనగర: కరసేవకుల అరెస్టు విషయంలో హుబ్లీ నగర ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ రఫీక్‌ను సస్పెండ్ చేయబోమని, ఆయన బలవంతపు సెలవుపై వెళ్లలేదని హోం మంత్రి జీ.పరమేశ్వర్ చెప్పారు. గురువారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ హుబ్లీ ఇన్‌స్పెక్టర్‌ను సస్పెండ్ చేయాలన్న బీజేపీ డిమాండ్‌పై స్పందించారు. సీఐని ఎందుకు సస్పెండ్ చేయాలి...? ఆయన చేసిన తప్పేమిటి అని అన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడటమే తమ బాధ్యత. చట్ట ప్రకారం హుబ్లీ పోలీసులు చర్యలు తీసుకొన్నారు. బీజేపీవారు దీనిని రాజకీయం చేసి ధర్నాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. కాగా, కరసేవకుడు శ్రీకాంత్ పూజారిని పాత కేసులో సీఐ రఫీక్ అరెస్టు చేయడంపై బీజేపీ రాష్ట్రమంతటా ఆందోళనలు చేస్తుండడం తెలిసిందే. త్వరలో లోక్‌సభ ఎన్నికలు రాబోతుండగా ఈ విషయం సున్నితంగా మారింది.

పలు జిల్లాల్లో ఆకస్మిక వర్షం



గురువారం ఉదయం చిక్కమగళూరులో వర్షంలో వెళ్తున్న బాలలు, జనం

- వరి, వక్క రైతులకు సంకటం



చిక్కమగళూరులో వర్షంలో బడికి పయనం

శివాజీనగర: రాష్ట్రంలో పలుచోట్ల శీతాకాల వర్షాలు ఆరంభమయ్యాయి. మరో నాలుగు రోజులపాటు వానలు పడతాయని వాతావరణ శాఖ తెలిపింది. దక్షిణ ఒళనాడు, కరావళి జిల్లాల్లో పలుచోట్ల భారీ వర్షం కురుస్తుండగా, మరికొన్ని చోట్ల సాధారణ వానలు పడ్డాయి. ఉత్తర కన్నడ, ఉడుపి జిల్లాల్లో గురువారం తెల్లవారజాము నుంచే వర్షం మొదలు కావడంతో జీవనానికి ఆటంకం ఏర్పడింది. దక్షిణ కన్నడ, ఉత్తర కన్నడ, కొడగు, చిక్కమగళూరు జిల్లాల అంతటా భారీ వర్షం కురుస్తోంది. కడూరు, కొప్ప, శృంగేరిలో వర్షాలతో ప్రజా జీవనం అస్తవ్యస్తంగా మారింది. ఆఫీసులకు, పనులకు వెళ్లేవారు ఇబ్బంది పడ్డారు. వ్యాపారాలు జరగలేదు.

అన్నదాతలకు కష్టం

రైతులకు సంకటం ఏర్పడింది. ఆకస్మిక వర్షంతో వరి, వక్కల పంట నాశనమైంది. కోతకు వచ్చిన వరి, వక్కలు వర్షం పాలైనట్లు రైతులు వాపోయారు. హాసన్, శివమొగ్గతో పాటుగా పలుచోట్ల చిరుజల్లులు కురుస్తున్నాయి. అనుకోని వర్షంతో చిక్కమగళూరులో కాఫీ రైతులు కూడా సమస్యల్లో పడ్డారు. అరేబియా సముద్రంలో వాయుగుండం పుట్టడం వల్ల రాష్ట్రంలో పలు జిల్లాల్లో 4-5 రోజుల శీతాకాలపు గాలులు వీస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.

నంజనగూడు బంద్

- శ్రీకంఠేశ్వర భక్తుల ర్యాలీ

మైసూరు: దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన మైసూరు జిల్లాలోని నంజనగూడులోని శ్రీకంఠేశ్వర స్వామి దేవాలయంలో ఉత్సవమూర్తిపైన కొందరు ఎంగిలి నీరు చల్లి అపచారం చేశారు. ఆ దుండగులను వెంటనే అరెస్టు చేసి శిక్షించాలని గురువారం స్థానిక ప్రజలు, భక్తులు నంజనగూడు బంద్ నిర్వహించారు. షాపులు, బడులు మూతపడ్డాయి. ప్రభుత్వ ఆఫీసులు పని చేయగా, ప్రైవేటు సంస్థలను మూసివేశారు. పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. దుండగులని అరెస్టు చేయాలని నినాదాలు చేశారు. ఇటీవల ఆలయంలో అంధకాసుర వధ కార్యక్రమం నిర్వహిస్తుండగా, మైసూరుకు చెందిన మహిషాసుర భక్తులమని చెప్పుకునేవారు వచ్చి అడ్డుకుని హల్‌చల్ చేశారు. ఆ సమయంలో దుండగులు స్వామి మీదకు నీళ్లను విసిరారు.



నంజనగూడులో ర్యాలీ నిర్వహిస్తున్న పట్టణవాసులు, భక్తులు



పట్టణంలో బంద్ దృశ్యం

ఎమ్మెల్సీ బీకేపై ఎస్పీకి ఫిర్యాదు

మండ్య: దేశంలో, ఇటు రాష్ట్రంలో రాజకీయం కోసం మళ్లీ గోద్రా, పుల్వామా వంటి దాడులు జరగవచ్చని హేళన చేసిన కాంగ్రెస్ నేత బీకే హరిప్రసాద్ పైన బీజేపీ గురువారం మండ్య ఎస్పీ పిఎన్ యతీష్‌కు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్సీ వంటి ఉన్నత స్థానంలో ఉన్న బీకె ఇలాంటి వ్యాఖ్యలు చేయడం తగదని అన్నారు. అయోధ్య రామమందిరం కోసం 500 సంవత్సరాలుగా పోరాటం జరుగుతోందని, 32 యుద్ధాలు జరిగి, ప్రాణాలు త్యాగం చేశారని, బీకే వారిని అపహాస్యం చేసేలా మాట్లాడడం బాధాకరమన్నారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు.

రెగ్యులర్ వాగ్దానం ఏమైంది?



ధర్నా నిర్వహిస్తున్న అతిథి అధ్యాపకులు

- సర్కారుకు అతిథి అధ్యాపకుల ప్రశ్న
- ఫ్రీడంపార్క్‌లో ఆందోళన

శివాజీనగర: రాష్ట్ర డిగ్రీ కాలేజీ అతిథి అధ్యాపకులు ఉద్యోగాల పర్మనెంట్ కోసం పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. తుమకూరుతో పాటు అనేక జిల్లాల నుంచి పాదయాత్రల ద్వారా గురువారం నగరంలోని ఫ్రీడం పార్కు మైదానానికి చేరుకొన్న అతిథి అధ్యాపకులు భారీ ధర్నా నిర్వహించారు. అధికారంలోకి వస్తే అతిథి ఉపాధ్యాయులను, అతిథి అధ్యాపకులను రెగ్యులర్ చేస్తామని కాంగ్రెస్ పార్టీ గత మేనిఫెస్టోలో భరోసానిచ్చింది. ఇచ్చిన మాట ప్రకారం నడుచుకోవాలని కోరుతున్నామన్నారు. అందుకే గత 39 రోజుల నుంచి బోధనను బహిష్కరించి సమ్మె నిర్వహిస్తుంటే ప్రభుత్వం అసలు స్పందించలేదని, అందుకే నిరసనను తీవ్రం చేశామని తెలిపారు. 430 ప్రభుత్వ ప్రథమ శ్రేణి కాలేజీల్లో ఏళ్ల తరబడిగా సేవలందిస్తుంటే ఉద్యోగ భద్రత లేక బతుకు అస్తవ్యస్తంగా మారిందని వాపోయారు.

ఆమ్ ఆద్మీ పార్టీ మద్దతు

వారి పోరాటానికి ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు మద్దతుగా ధర్నాలో పాల్గొన్నారు. పార్టీ నేత పృథ్వీరెడ్డి మాట్లాడుతూ అతి కష్టంగా విధులు నిర్వర్తిస్తున్న అతిథి అధ్యాపకుల న్యాయసమ్మతమైన డిమాండ్‌ను తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

చక్కెరనాడులో రాజకీయ వేడి



మండ్య నగర ప్రవేశద్వారం



ఎంపీ సుమలత

- ఈసారి బీజేపీ- జేడీఎస్ కూటమి అభ్యర్థి?
- స్వతంత్ర ఎంపీ సుమలతకు గట్టి పరీక్ష!

యశవంతపుర: చక్కెరనాడు మండ్య అంటేనే ఎప్పుడూ ఏదో ఒక రాజకీయ సంచలనం సంభవిస్తూ ఉంటుంది. స్థానిక స్వతంత్ర ఎంపీ సుమలత వచ్చే లోక్‌సభ ఎన్నికలలో కఠిన పరీక్ష ఎదుర్కొనేలా సమీకరణాలు మారుతున్నాయి. బీజేపీ- జేడీఎస్ మధ్య ఏర్పడిన పొత్తు వల్ల ఆ సీటును జేడీఎస్ తీసుకోవచ్చని ప్రచారం సాగుతోంది. దీని వల్ల కాంగ్రెస్‌తో, అలాగే బీజేపీ-జేడీఎస్ కూటమితో సుమలత ఒంటరిగా పోరాడాల్సి వస్తుంది. గత లోక్‌సభ ఎన్నికల్లో ఆమె స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి అభిమానుల బలం, సానుభూతితో ఘన విజయం సాధించడం తెలిసిందే. అప్పట్లో జేడీఎస్ అభ్యర్థి నిఖిల్ కుమారస్వామి ఆమె చేతిలో మట్టికరిచారు.

కూటమి పోటీలో ఎవరుంటారు?

పొత్తులో భాగంగా మండ్యను జేడీఎస్‌కు కేటాయిస్తే, అక్కడ నిఖిల్ లేదా ఆయన తండ్రి కుమారస్వామి పోటీ చేయవచ్చని ప్రచారం నడుస్తోంది. మండ్యలో సుమలత- కుమారస్వామి కుటుంబాల మధ్య రాజకీయంగా పోటీ సాగుతోంది. జిల్లాలో అక్రమ గనుల తవ్వకాలతో కేఆర్ఎస్ డ్యాంకు ప్రమాదం ఉందని, డ్యాంకు గండ్లు పడతాయని సుమలత అనేకసార్లు ఆరోపించారు. జేడీఎస్ నేత హెచ్‌డీ రేవణ్ణ ఇందుకు పరుషంగా బదులు ఇవ్వడం అప్పట్లో వివాదాస్పదమైంది. తుమకూరులో గత లోక్‌సభ ఎన్నికల్లో దళపతి దేవెగౌడ పరాజయం పొందారు, ఫలితంగా మండ్యలో పోటీచేసి ఎలాగైనా గెలవాలని కూడా యోచిస్తున్నారు. ఎంతమంది పోటీ చేసినా తాను మండ్య నుంచే బరిలో ఉంటానని సుమలత ధీమాగా ఉన్నారు.

శిశువు అమ్మకం, ఐదుగురు అరెస్టు

యశవంతపుర: పుట్టిన ఒక రోజులోనే శిశువును అమ్మిన ఘటన హాసన్ జిల్లా సకలేశపుర తాలూకాలో రట్టయింది. శిశువు తల్లితో పాటు ఐదుమందిని అరెస్ట్ చేశారు. వివరాలు.. 2023 నవంబర్ 15న హెత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ఓ మహిళ మగ బిడ్డకు జన్మనిచ్చింది. తనకు ఇద్దరు పిల్లలు ఉన్నందున, మూడో బిడ్డ అవసరం లేదంటూ మరుసటి రోజే చిక్కమగళూరుకు చెందిన ఉషా అనే మహిళకు పసికందును అమ్మేసింది. శిశు రక్షణా అధికారి కాంతరాజ్‌కు ఇటీవల ఈ సంగతి తెలిసింది. తల్లి, మధ్యవర్తిగా ఉన్న ఆశా కార్యకర్త సుమిత్ర, శిశువును కొన్న ఉషా, మరో ఇద్దరు బ్రోకర్లు శ్రీకాంత్, సుబ్రమణ్యంను పోలీసులు అరెస్ట్ చేశారు. శిశువును స్వాధీనం చేసుకుని ఆశ్రయ కేంద్రంలో ఉంచారు. శిశువును కొనడం వెనుక ఏదైనా కుట్ర ఉందా అనేది తేలాల్సి ఉంది. పేదల నుంచి పిల్లలను కొనుగోలు చేసి వారిని చూపి యాచిస్తూ బెగ్గింగ్ మాఫియాలు నగదు సంపాదనకు పాల్పడున్నాయి.

నగరంలో మహిళ హత్య

బనశంకరి: బెంగళూరు నగరంలో పట్టపగలే మహిళ దారుణహత్యకు గురైంది. ఈ ఘటన ఎలక్ట్రానిక్ సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. బెట్టదాసపురలో నీలం (30) అనే మహిళ భర్తతో కలిసి నివసిస్తోంది. భర్త ఉదయమే విధులకు వెళ్లగా ఇంట్లోకి చొరబడిన దుండగులు మహిళ గొంతు పిసికి హత్యచేసి ఉడాయించారు. సమాచారం అందిన వెంటనే ఎలక్ట్రానిక్ సిటీ పోలీసులు చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేశారు. హంతకుల కోసం గాలిస్తున్నారు. పరిచయస్తులే ఈ దారుణానికి పాల్పడి ఉండవచ్చునని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

చట్టసవరణపై అభిప్రాయాలు సేకరిస్తాం


మాట్లాడుతున్న మంత్రి శివానంద పాటిల్

రాయచూరు రూరల్: ఏపీఎంసీ చట్టం–2023 సవరణపై రైతులు, వ్యాపారులు, కూలీ కార్మికుల నుంచి అభిప్రాయ సేకరణ చేస్తామని రాష్ట్ర జవళి, చక్కెర, వ్యవసాయ ఉత్పత్తుల విక్రయ శాఖ మంత్రి శివానంద పాటిల్ వెల్లడించారు. బుధవారం నగరంలోని ఏపీఎంసీ భవన్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఏపీఎంసీ చట్టాన్ని, మహారాష్ట్రలో రద్దు చేసిందని, ఉత్తర ప్రదేశ్, కర్ణాటకల్లో సవరణపై అభిప్రాయాలు సేకరించి తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. సమావేశంలో రూరల్ ఎమ్మెల్యే బసనగౌడ, ఏపీఎంసీ అధ్యక్షుడు మల్లికార్జునగౌడ, ఎమ్మెల్సీ అరుణ, కేశవ ప్రసాద్, తిప్పేస్వామి, జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్, ఏడీసీ దురుగేష్, కార్యదర్శులున్నారు.

టెన్త్‌లో సత్ఫలితాలు సాధించండి


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

రాయచూరు రూరల్: మార్చి నెలలో జరిగే టెన్త్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని తారానాథ్ శిక్షణ సంస్థ కార్యదర్శి శరత్ కుమార్ కలస పిలుపు ఇచ్చారు. గురువారం నగరంలోని హందర్ద్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. విజన్ 625ను లక్ష్యంగా పెట్టుకొని విద్యార్థుల మనోబలాన్ని పెంచాలన్నారు. ఉపాధ్యాయులు జిల్లాలో వంద శాతం ఉత్తీర్ణత సాధనకు కృషి చేయాలన్నారు. సమావేశంలో అధికారులు చంద్రశేఖర్, శివరాజ్, హనుమంతరాయలున్నారు.

అక్రమంగా గోదాముల విక్రయం


మాట్లాడుతున్న విరుపాక్షి

రాయచూరు రూరల్: ఏపీఎంసీలోని నాలుగు గోదాములను అక్రమంగా విక్రయించారని జేడీఎస్ జిల్లాధ్యక్షుడు విరుపాక్షి ఆరోపించారు. గురువారం పాత్రికేయుల భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో రైతులు పండించిన పంటలను నిల్వ చేయడానికి ఉపయోగించాల్సిన గోదాములను రూ.5 కోట్లు విలువ చేసే వాటిని కేవలం రూ.34,50,600కు విక్రయించారన్నారు. నగరంలో వెయ్యి మెట్రిక్ టన్నుల గోదాములు శ్రీశైలేశ్వర కాటన్ ట్రేడర్స్, రేణుక కాటన్ ట్రేడర్స్, లక్ష్మీ వెంకటేశ్వర ట్రేడర్స్, శ్రీకాంత్ కాటన్ ట్రేడర్స్‌లకు విక్రయించారన్నారు. లీజ్ కం సేల్ మీద గోదాములను వినియోగించుకోకుండా హోటల్ ఇతర పదార్థాల విక్రయిస్తున్నారన్నారు. ఏపీఎంసీ చట్ట నియమాలను ఉల్లంఘించిన వారిపై చర్యలు చేపట్టాలని కోరారు.

నరేగ కార్మికులకు వైద్య సేవలు

రాయచూరు రూరల్: జిల్లాలో నరేగ కార్మికులకు ఉత్తమ వైద్య సేవలందించాలని జిల్లా ఆరోగ్య అధికారి సురేంద్రబాబు పేర్కొన్నారు. గురువారం నగరంలోని భారతీయ వైద్య భవనంలో ఉపాధి హామీ పథకంలో విధులు నిర్వహించే కార్మికులకు, దేవదాసి మహిళలకు ఆరోగ్య అభియాన్ పథకంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. 148 మందికి ఆరోగ్య సేవలు అందించారు.

అక్రమాలపై విచారణకు సూచన


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బసనగౌడ

రాయచూరు రూరల్: తాలూకాలోని వివిధ గ్రామాల్లో భూ పంపిణీలో జరిగిన అక్రమాలపై విచారణ జరపాలని గ్రామీణ ఎమ్మెల్యే బసనగౌడ సూచించారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన తాలూకా స్థాయి కోర్ కమిటీ, భూ అక్రమ, సక్రమ సభ్యుల సమావేశంలో మాట్లాడారు. పలు సంవత్సరాల నుంచి పేద రైతులు రెండు, మూడెకరాల భూములను సాగు చేసుకుంటున్న వారికి సాగు చేసుకొనేలా పట్టాలు ఇవ్వాలని తహసీల్దార్ సురేష్‌వర్మను ఆదేశించారు. అక్రమ, సక్రమ పేర్లతో ఉన్న భూములను సర్వే చేసి వారి పేరు మీద పట్టాలివ్వాలన్నారు. దరఖాస్తు చేసుకున్న 3500 మంది పేద రైతులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఈసం దర్భంగా సభ్యులు ఆంజనేయ, అబ్రహం, పార్వతమ్మలున్నారు.

● శీతాకాలం చినుకుల వాన

బనశంకరి: రాష్ట్రంలో అనూహ్యంగా గురువారం వర్షాలు కురిశాయి. అరేబియా సముద్రంలో ఏర్పడిన అల్ప పీడన ప్రభావంతో కోస్తా జిల్లాలు, పరిసర ప్రాంతాల్లో వర్షాలు కురిశాయి. దీంతో వాతావరణం మరింత చల్లబడి ఆహ్లాదంగా మారింది. మైసూరులో జల్లుల వాన కురిసింది. బెంగళూరులో మబ్బులు కమ్మి అక్కడక్కడా చిరుజల్లులు కురిశాయి.


బెంగళూరులో మేఘావృతమై చిరుజల్లులు


గురువారం రేవు నగరం మంగళూరులో వర్షంలో వెళ్తున్న దృశ్యాలు




మైసూరులో వర్షంలో పిల్లలను ఇంటికి తీసుకెళ్తున్న మహిళ

ఏటీఎంలో రూ.20 లక్షల దోపిడీ

● చిక్కతిరుపతిలో ఘటన

మాలూరు: ఏటీఎంలో దోపిడీ దొంగలు చొరబడి అందులోని రూ.20 లక్షల నగదును దోచుకెళ్లిన ఘటన కోలారు జిల్లా చిక్కతిరుపతి గ్రామంలోని కెనరా బ్యాంకు ఏటీఎంలో చోటు చేసుకుంది. కెనరా బ్యాంకు ప్రాంగణంలోని ఏటీఎంలో బ్యాంకు అధికారులు రూ.20 లక్షల నగదును ఉంచారు. ఇందులో వినియోగదారులు సుమారు రూ.1.5 లక్షల వరకు డబ్బులను డ్రా చేసుకున్నారు. అదే రోజు రాత్రి ఏటీఎంలోకి చొరబడిన దుండగులు నగదు యంత్రాన్ని పగులగొట్టి డబ్బును దోచుకెళ్లారు. ఉదయం విషయం తెలిసిన వెంటనే బ్యాంకు సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. పోలీసు జాగిలం, వేలిముద్రల నిపుణులతో పోలీసులు పరిశీలించారు. మాలూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వరుసగా ఏటీఎంల లూటీలు

ఇటీవల చింతామణిలో, తరువాత చిక్కమగళూరులో, తరువాత చిక్కతిరుపతిలో ఏటీఎంలను లూటీ చేయడం వెనుక ఒకే ముఠా ఉండవచ్చని అనుమానాలున్నాయి. పోలీసులు చురుగ్గా పని చేసి బందిపోటు దొంగల ముఠాలను అరికట్టాలని ప్రజలు డిమాండ్ చేశారు.


చోరీకి గురైన ఏటీఎం ఇదే

హంతకులపై కఠిన చర్యలకు వినతి

బళ్లారిఅర్బన్: నగరంలో డిసెంబర్ 31వ తేదీ రాత్రి సంచలనం రేకెత్తించిన సైదుల్లాను హత్య కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ పలువురు గురువారం ఆందోళన చేపట్టారు. హత్యకు గురైన వ్యక్తి కుటుంబ సభ్యులతో కలిసి కర్ణాటక నదాఫ్ పింజార్ సంఘం ఆధ్వర్యంలో జిల్లాధికారి కార్యాలయం వరకు పెద్ద ఎత్తున ర్యాలీ చేపట్టారు. అనంతరం అదనపు అధికారికి వినతి పత్రాన్ని అందజేశారు. సంఘం అధ్యక్షుడు షాషాబ్, కోశాధికారి మౌలాలీ మాట్లాడుతూ బాపూజీ నగర్‌లోని ఆర్‌కే కాలనీకి చెందిన సయ్యద్ అలీని హత్య చేసిన వారిని బంధించి కఠినంగా శిక్షించాలని ఒత్తిడి చేశారు. ఈసందర్భంగా సంఘం ప్రముఖులు అల్లాబకాష్, షాషావలి, మౌలాలీ, నబీసాబ్, మస్తాన్‌వలి, మృతుని తల్లి, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


ఏడీసీకి వినతిపత్రం అందజేస్తున్న కుటుంబ సభ్యులు

ఐఐటీ ఆర్కిటెక్ట్.. అయ్యాడు వడాపావ్ వ్యాపారి

బనశంకరి: బెంగళూరులో ఒక ఆర్కిటెక్ట్ పని వదిలిపెట్టి వడా–పావ్ వ్యాపారిగా మారాడు. నేను సూపర్ హీరోని కాదు, కానీ నేను వడా పావ్‌ని నమ్ముకున్నాను అని అర్థం వచ్చే బోర్డు పట్టుకుని ఉన్న ఆర్కిటెక్ట్ ఫోటోని విశ్వాస్ అనే టెక్కీ గురువారం ఎక్స్‌లో పోస్ట్ చేయగా వైరల్‌గా మారింది. స్కూటర్‌నే తాత్కాలిక షాప్‌గా మార్చుకుని బెంగళూరు హెచ్ఎస్ఆర్ లేఔట్‌లో ఒక కూడలిలో వడా–పావ్‌లను అమ్ముతున్నాడని ఆ పోస్టులో తెలిపాడు. అతడు ఐఐటీలో ఆర్కిటెక్చర్ పూర్తి చేశాడని, ఒక కార్పొరేట్ సంస్థలో ఉద్యోగం చేశాడని, కానీ అక్కడ బోర్ కొట్టి ఉద్యోగం వదిలేసి కొత్తగా ఈ వ్యాపారం చేపట్టాడని ఆ పోస్టులో రాశారు. వడ పావ్‌కి వైభవం కల్పించడమే అతని ప్రయత్నమని తెలిపాడు. అతడు ఏ ఐఐటీలో చదివాడు, ఏం ఉద్యోగం చేశాడనే వివరాలు లేవు. దీనిపై నెటిజన్లు తలోరకంగా స్పందన వ్యక్తం చేశారు. కొందరైతే ఈ కథ నమ్మశక్యంగా లేదని అన్నారు. మరికొందరు ఇదొక కొత్త స్టార్టప్ అని వ్యాఖ్యానించారు.

ఆకట్టుకున్న తత్వపదాల ఆలాపన


గానాలాపన చేస్తున్న దృశ్యం

చింతామణి: తాలూకాలో కైవారలో జానపద గీతాలపన శ్రోతలను మంత్రముగ్దులను చేసింది. జానపద అకాడమి విజేత కైవార రామణ్ణ బృందం గురువారం ఆలపించిన తత్వాలకు భక్తులు పరవశించిపోయారు. విద్వాన్ చంద్రప్ప, కీబోర్డు విద్వాన్ కేశవార నాగేంద్రలు సహకరించారు. కైవార చైతన్య వృద్ధాశ్రమ, కన్నడ సంస్కృతి శాఖ, మౌర్య శ్రీరామ ట్రస్టు, నందాదీప దివ్యాంగుల పునర్వసతి సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. తిరుపతి గాయకుడు రఘునాథ్‌ను సత్కరించారు. తళవగార ఆనంద పాల్గొన్నారు.

పాత కేసును తిరగదోడిన ప్రభుత్వం

యశవంతపుర: కరసేవకుడి కేసును తిరగదోడిన సర్కార్ మరో ముందడుగు వేసింది. 2017లో చిక్కమగళూరు దత్తపీఠం గోరి ధ్వంసం కేసును రాష్ట్ర ప్రభుత్వం రీ ఓపెన్ చేసింది. 14 మంది కోర్టు ద్వారా నోటీసులు పంపింది. ఈ నెల 8న కోర్టులో హాజరు కావాలని ఆ నోటీసుల్లో పేర్కొన్నారు. ఈకేసుపై బీజేపీ పోరాటం చేసే అవకాశం కనబడుతోంది.

బీజేపీలో నూతన నియామకాలు

శివాజీనగర: రాష్ట్ర బీజేపీలో నూతన సంచాలకుడు, సహ సంచాలకుడు, అధికార ప్రతినిధులను నియమించారు. సోషల్ మీడియా, ఐటీ విభాగాల్లో వారిని నియమించారు. ప్రశాంత్ మాకనూరు, నరేంద్ర మూర్తిని, నితిన్‌రాజ్ నాయక్, శ్యామలా రఘునందన్‌లు ఈ పోస్టుల్లో చేరతారు. పెద్దసంఖ్యలో నేతలను అధికార ప్రతినిధులుగా నియమిస్తూ పార్టీ రాష్ట్రాధ్యక్షుడు బీ.వై.విజయేంద్ర ఆదేశాలిచ్చారు.

శ్రీకాంత్ పూజారిపై 16 కేసులు

హుబ్లీ: రాష్ట్రంలో సంచలనం రేకెత్తించిన 1992 డిసెంబర్ 5న హుబ్లీలో జరిగిన ఘర్షణ కేసులో అరెస్టయిన శ్రీకాంత్ పూజారిపై దాదాపు 16 కేసులు దాఖలైనట్లు పోలీసు వర్గాలు వెల్లడిస్తున్నాయి. స్థానిక ఎమ్మెల్యే ప్రసాద్ అబ్బయ్య విడుదల చేసిన ప్రకటనలో పాతహుబ్లీ చెన్నపేట నివాసి శ్రీకాంత్ అలియాస్ కాంత్యపై పాత హుబ్లీ స్టేషన్ పరిధిలో 8 అక్రమ మద్య విక్రయాల కేసులు, మూడు దొమ్మి కేసులతో పాటు ఒక జూదం కేసు దాఖలైంది. కసబా పేట స్టేషన్ మూడు ముందు జాగ్రత్త కేసులు దాఖలయ్యాయి. ఇక హుబ్లీ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో 1992లో జరిగిన దొమ్మి కేసులో కూడా ఇతను నిందితుడని కేసు దాఖలు చేశారు. అక్రమ మద్యం విక్రయాలకు సంబంధించి 1998, 1999, 2003లో రెండేసి కేసుల చొప్పున, 2002, 2006లో ఒక్కో కేసు నమోదయ్యాయి. దొమ్మి కేసుకు సంబంధించి 1992, 2001లో, అలాగే 2014లో పలు కేసులు దాఖలయ్యాయని, 2002లో మట్కా జూదం కేసు కూడా పాత హుబ్లీలో నమోదైందని, ఈ కేసులపై పోలీసు కమిషనర్ రేణుక సుకుమార వివరణ ఇచ్చారు. శ్రీకాంత్ పూజారిపై వివిధ స్టేషన్లలో పలు కేసులు దాఖలు కావడం నిజమేనని, అయితే కొన్ని పరిష్కారం కూడా అయ్యాయని, ఈ విషయాన్ని పరిశీలిస్తున్నామన్నారు.

మైసూరు జిల్లా అభివృద్ధిపై నిర్లక్ష్యం

మైసూరు : మైసూరు జిల్లా అభివృద్ధిపై సీఎం సిద్దరామయ్య నిర్లక్ష్యం చేస్తున్నారని జేడీఎస్ ఎమ్మెల్యే జీ.టి.దేవెగౌడ విమర్శించారు. గురువారం ఆయన మైసూరులో విలేకరుల భవనంలో కొత్త సంవత్సరం క్యాలెండర్ డైరీని ప్రారంభించి మాట్లాడారు. సిద్దరామయ్య జిల్లాకు చెందిన వ్యక్తి అయినా అభివృద్ధిపై దృష్టి పెట్టడం లేదన్నారు. యడియూరప్ప సీఎంగా ఉన్న సమయంలో జిల్లా పర్యాటకంగా అభివృద్ధి చెందిందన్నారు.

క్వారీ నీటి గుంతలో పడి వ్యక్తి మృతి

సాక్షి,బళ్లారి: క్వారీలో ఉన్న నీటిలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన చిత్రదుర్గ జిల్లాలో చోటు చేసుకుంది. వివరాలు.. బుధవారం రాత్రి చిత్రదుర్గ జిల్లా చెళ్లకెరె తాలూకా నాయకనహట్టి సమీపంలోని నేరలగుంటె కణివె మారెమ్మ దేవాలయం దగ్గరలోని క్వారీలో ఉన్న నీటి గుంతలో హొళల్కెరె తాలూకా దానయ్యనహట్టి గ్రామానికి చెందిన గోపాలప్ప(45) అనే వ్యక్తి ప్రమాదశాత్తు పడి మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. నాయకనహట్టి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కొత్త చట్టం వద్దంటూ డ్రైవర్ల ర్యాలీ

బళ్లారి అర్బన్: వాహన డ్రైవర్లపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొత్త చట్టాన్ని అమలు చేయడాన్ని నిరసిస్తూ గురువారం నగరంలో కర్ణాటక డ్రైవర్ల యూనియన్ తరఫున ఆందోళన చేపట్టారు. నగరంలో డ్రైవర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జీ.నారాయణ స్వామి నేతృత్వంలో భారీ ర్యాలీ నిర్వహించి జిల్లాధికారి కార్యాలయానికి చేరుకుని నిరసన తెలిపారు. అనంతరం డ్రైవర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.డీ.మస్తాన్ మాట్లాడుతూ పేదలు మాత్రమే డ్రైవర్ వృత్తిని నమ్ముకుని జీవిస్తున్నారన్నారు. ప్రమాదం చేసిన డ్రైవర్‌పై చర్యలు తీసుకొని, రూ.10 లక్షలు జరిమానా, ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తామంటూ కేంద్రం కొత్త చట్టాన్ని అమలు చేయడం సరికాదన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా డ్రైవర్లపై అమలు చేసిన చట్టాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర, దేశ వ్యాప్తంగా నిరసన వ్యక్తం అవుతోందన్నారు. 10 రోజుల్లో ఈ చట్టాన్ని వెనక్కి తీసుకోకపోతే డ్రైవర్ వృత్తిని వదిలి వేరే పనులు చేసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా డ్రైవర్ల అసోసియేషన్ తరఫున జిల్లాధికారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కర్ణాటక డ్రైవర్ల ఐక్య సంఘం జిల్లాధ్యక్షుడు సయ్యద్ అజాం, పదాధికారులు హుసేన్ పీరా, సుధాకర్, కేఎం.కవిత, నాగవేణి, శాంతమ్మ, ఆంథోని రాజ్, ఎం.డీ.రియాజ్, దాదా పాల్గొన్నారు.


ఆందోళనలో పాల్గొన్న సంఘం నేతలు, డ్రైవర్లు

మంత్రి లక్ష్మీకి ఆహ్వానం

యశవంతపుర: కాంగ్రెస్ నాయకులకు అయోధ్య రామమందిరం ప్రారంభోత్సవానికి ఆహ్వానాలు అందడం లేదు. కానీ బెళగావి జిల్లా మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్‌ను హిందూసంఘాల నాయకులు గురువారం ఇంటికెళ్లి ఆమెను ఆహ్వానించారు. అయోధ్యలో జరిగే వేడుకకు తప్పకుండా హాజరుకావాలని కోరారు.

ఠాణా ముందు సీటీ ధర్నా

యశవంతపుర: నేను కరసేవకున్ని, నన్ను అరెస్ట్ చేయాలని చిక్కమగళూరు బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే సీటీ రవి గురువారం అక్కడి పట్టణ పోలీసుస్టేషన్ ఎదుట ఆందోళన చేశారు. హిందూ కార్యకర్త శ్రీకాంత్ పూజారి అరెస్టును ఖండిస్తూ సీటీ మౌనంగా స్టేషన్ ఎదుట బైఠాయించారు. అదనపు ఎస్పీ కృష్ణమూర్తి వచ్చి రవిని స్టేషన్‌లోకి తీసుకెళ్లారు. బీజేపీ కార్యకర్తలు స్టేషన్ వద్దకు చేరుకోవడంతో కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది. తమను కూడా అరెస్టు చేయాలని, ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

చెరువులో చేపల మృత్యువాత


మృతి చెందిన చేపలను చూపుతున్న గ్రామస్తులు

మండ్య : మండ్య తాలూకా రాగిముద్దనహళ్లిలో ఉన్న చెరువులో చేపలు పెద్ద సంఖ్యలో మృత్యువాత పడుతున్నాయి. మూడు రోజులుగా మృతి చెంది వాటి కళేబరాలు నీటిపై తేలియాడుతున్నాయి. వందల సంఖ్యలో చేపలు మృతి చెందుతుండటంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. కాగా చెరువులోకి ఇతర ప్రాంతాలనుంచి మురుగునీటిని విడుదల చేస్తుండటంతో చేపలు మృతి చెందుతున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి చెరువులోకి మురుగునీరు రాకుండా చూడాలని డిమాండ్ చేస్తున్నారు.

డివైడర్‌పైకి ఎక్కిన మినీలారీ



మండ్య : మినీలారీ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈఘటన మండ్య తాలూకా కాళేనహళ్లి గ్రామ సమీపంలోని జాతీయ రహదారిలో గురువారం జరిగింది. బెంగళూరు నగరం నుంచి మైసూరు వైపు వెళ్తున్న ఈ వాహనం మితిమీరిన వేగంతో వచ్చి డివైడర్‌పైకి ఎక్కి అడ్డదిడ్డంగా ఆగిపోయింది. ఆ సమయంలో అటువైపు, ఇటు వైపు వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ట్రాఫిక్ పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు.


కోలారు వార్తలు...

సమస్యల పరిష్కారానికే జనతా దర్శన్


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నంజేగౌడ

మాలూరు: ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే జనతా దర్శన్ ధ్యేయమని ఎమ్మెల్యే కేవై నంజేగౌడ తెలిపారు. గురువారం మాస్తి వెంకటేశ అయ్యంగార్ రంగమందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి జనతా దర్శన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజలు జనతా దర్శన్‌లో ఇచ్చిన అర్జీలను ఆయా శాఖలకు చెందిన అధికారులు పరిశీలించి వెంటనే పరిష్కరిస్తారన్నారు. పట్టణంలో గత అక్టోబర్ 16న నిర్వహించిన జనతా దర్శన్‌లో 55 దరఖాస్తులు అందగా, వాటిలో అన్నింటినీ ఇప్పటికే అధికారులు పరిష్కరించారన్నారు. జనతాదర్శన్‌ను అధికారుల సమక్షంలోనే నిర్వహిస్తుండడం వల్ల వాటిని అక్కడికక్కడే పరిష్కరించడానికి వీలవుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ పద్మ బసవంతప్ప, తహసీల్దార్ కె రమేష్, తాలూకా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వెంకటశివారెడ్డి

శ్రీనివాసపురం: నగరంలో పీడబ్ల్యూడీ శాఖ ఎస్ఎఫ్‌సీ నిధులతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను గురువారం ఎమ్మెల్యే జీకే వెంకటశివారెడ్డి పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పురసభ వ్యాప్తిలో శాశ్వత అభివృద్ధి పనులను చేపడతామన్నారు. కొత్తగా పురసభ వ్యాప్తికి చేరుతున్న హెచ్ నల్లపల్లి, ఉనికిలి, కొళ్లూరు, భైరపల్లి కొత్త కాలనీల అభివృద్ధికి ప్రాధాన్యత నిస్తామన్నారు. ఇప్పటికే పురసభ వ్యాప్తిలో కొత్త కాలనీల అభివృద్ధి కోసం ప్రభుత్వం నుంచి రూ.15 కోట్లను విడుదల చేస్తామన్నారు. మొత్తం రూ.2 కోట్ల వ్యయంతో పురసభ పరిధిలో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. పనులను సత్వరం పూర్తి చేయాలని సూచించామన్నారు. ఈసందర్భంగా పీడబ్ల్యూడీ శాఖ ఈఈ ఎస్ నారాయణస్వామి, ఇంజినీర్ ఎల్ఎం నాగరాజ్, ముఖ్యాధికారి వైఎన్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ ఫైళ్ల సత్వర క్లియరెన్స్‌కు సూచన

కోలారు: మజరా గ్రామాలను రెవిన్యూ గ్రామాలుగా పరివర్తించి శాఖలోని పెండింగ్ ఫైళ్లను త్వరగా క్లియర్ చేయాలని రాష్ట్ర సర్వే శాఖ కమిషనర్ మంజునాథ్ సూచించారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో సర్వే శాఖ ప్రగతి పరిశీలన కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నుంచి సన్మానం స్వీకరించి మాట్లాడారు. సర్వే శాఖ ప్రజలకు మరింత దగ్గర కావాలన్నారు. ఆకారబంధు, డిజిటలీకరణ తదితర విషయాలపై చర్చించి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అటవీ భూమిని సర్వే చేయాలని, సర్వే సమయంలో గందరగోళాల పరిష్కారానికి సలహాలు అందించారు. జిల్లాలో ప్రభుత్వ సర్వేయర్ల కొరత ఉండడం వల్ల సర్వే పనులు ఆలస్యం అవుతున్నాయని అధికారులు తెలిపారు. కొత్త నియామకాలు జరిగే వరకు లైసెన్సు కలిగిన సర్వేయర్ల నియామకానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. చెరువులు అధికంగా ఉన్న జిల్లాలో చెరువుల్లో ఆక్రమణల తొలగింపునకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జీ.సురేష్‌బాబు, డిప్యూటీ డైరెక్టర్ భాగ్యమ్మ, ఉద్యోగుల సంఘం కార్యదర్శి ఎన్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.


కమిషనర్ మంజునాథ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

మహిళా హక్కుల నేత సావిత్రిబాయి

కోలారు: సమాజంలో మహిళలందరికీ సమాన హక్కులు, అక్షరాస్యత కోసం శ్రమించిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని జెడ్పీ సీఈఓ పద్మ బసవంతప్ప తెలిపారు. గురువారం నగరంలోని పాత్రికేయుల భవనంలో యోగినారాయణ ఛారిటబుల్ ట్రస్టు, అరుణోదయ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన సావిత్రిబాయి పూలే జయంతిలో ఆమె మాట్లాడారు. పురుషులతో సమానంగా మహిళలకు కూడా విద్యాభ్యాసం అందాలని సావిత్రిబాయి పూలే శ్రమించారన్నారు. సమాజంలో బాల్యవివాహం వంటి అనిష్ట పద్ధతిని నిర్మూలించడం కోసం అహర్నిశలు శ్రమించారన్నారు. అయినా నేటికీ సమాజంలో బాల్య వివాహాలు జరుగుతుండడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో వివిధ రంగాల్లో సాధకులను సన్మానించారు. కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షుడు కెవి సురేష్ కుమార్, ఉపన్యాసకుడు జెజి నాగరాజ్, జిల్లా పాత్రికేయుల సంఘం అధ్యక్షుడు బివి గోపినాథ్ పాల్గొన్నారు.


సాధకులను సన్మానిస్తున్న దృశ్యం

బ్యాంకర్లు సహృదయంతో మెలగాలి

కోలారు: జిల్లాలోని సహకార బ్యాంకులు రైతులపై సహృదయంతో వ్యవహరించాలని జిల్లాధికారి అక్రంపాషా తెలిపారు. గురువారం కలెక్టరేట్ సభాంగణంలో కోలారు, చిక్కబళ్లాపుర జిల్లాల సహకార బ్యాంకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని రైతులు పంట రుణాల తిరిగి చెల్లింపులో ఇతర జిల్లాల కంటే ముందంజలో ఉన్నారన్నారు. వాతావరణం, మట్టి సారవంతం అనుగుణంగా ఉద్యానవన, వాణిజ్య పంటలను అధికంగా పండిస్తున్నారన్నారు. వాన కొరత వల్ల జిల్లాలోని ఆరు తాలూకాలను కరువు పీడిత ప్రాంతాలుగా ప్రకటించారన్నారు. ఈ సమయంలో కూరగాయలు, వాణిజ్య పంటలకు కూడా సరైన రుణ పరిమితి విధిస్తారన్నారు. సమావేశంలో డీసీసీ బ్యాంకు సీఈఓ శంకర్, చిక్కబళ్లాపుర జిల్లా అభివృద్ధి మేనేజర్ సాయి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంఘం పదాధికారుల ధర్నా

శ్రీనివాసపురం: వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్ కమిటీ(ఏపీఎంసీ)లో లైసెన్సును పొందిన అనప వ్యాపారుల వ్యాపారాన్ని ఎంజీ మార్కెట్‌కు తరలించాలని లేదా మరో సరైన స్థలానికి మార్చాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘం పదాధికారులు గురువారం పట్టణంలోని ఇంద్రా భవన్ సర్కిల్ వద్ద అనపకాయలను పోసి ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ రైతులు కరువు, పంట నష్టంతో తీవ్ర ఇబ్బంది పడుతున్న రైతులకు నకిలీ విత్తనాలు, మందులను విక్రయించి రైతులను నిండా ముంచుతున్నారన్నారు. అనప వ్యాపారానికి సరైన మార్కెట్ వ్యవస్థ ఉన్నా ఏపీఎంసీ కార్యదర్శి, పాలక మండలి బాధ్యతారాహిత్యం వల్ల అనప వ్యాపారులు ఎంజీ మార్కెట్‌లోనే వ్యాపారాలు చేసుకుంటున్నారని ఆరోపించారు. రైతులకు సరైన ధరలు ఇవ్వకుండా తూకాల్లో కూడా మోసాలు చేస్తున్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ధర్నాలో రైతు సంఘం రాష్ట్ర సంచాలకుడు బంగవాది నాగరాజగౌడ, తాలూకా అధ్యక్షుడు తేర్నహళ్లి అంజినప్ప తదితరులు పాల్గొన్నారు.


ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

క్లుప్తంగా

నామఫలకాలు కన్నడలోనే ఉండాలి



దుకాణదారులకు సూచనలు ఇస్తున్న నగరసభ కమిషనర్ గీత

గౌరిబిదనూరు: ప్రభుత్వ ఆదేశాల మేరకు దుకాణాలు, ఇతర సంస్థల నామఫలకాలు కన్నడ భాషలో ఉండాలని నగరసభ కమిషనర్ గీత దుకాణాదారులకు సూచించారు. గురువారం ఆమె పట్టణంలో పర్యటించారు. కన్నడ భాషలో నామఫలకాలు లేని దుకాణదారులతో మాట్లాడారు. తప్పనిసరిగా కన్నడలోనే బోర్డులు ఏర్పాటు చేయాలని, లేని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటివరకు 90శాతం బోర్డులు కన్నడలోనే ఉన్నాయన్నారు. హెల్త్ ఇన్స్పెక్టర్ నవీన్, సతీశ్, లోకేశ్ పాల్గొన్నారు.

కళాశాల ఉద్యోగి ఆత్మహత్యాయత్నం

మైసూరు : ప్రిన్సిపాల్ వేధింపులతో కళాశాల ఉద్యోగి ఆత్మహత్యకు యత్నించాడు. ఈఘటన మైసూరులో జరిగింది. నగరంలోని టీకే లేఔట్‌కు చెందన జే.శివకుమార్ ఇదే నగరంలోని యువరాజు డిగ్రీ కళాశాలలో ఎఫ్‌డీఏగా పనిచేస్తున్నాడు. ప్రిన్సిపాల్ దేవరాజుగౌడ చిన్న పాటి విషయాలకు తనను వేధిస్తున్నాడని ఆరోపిస్తూ లేఖ రాసి కారులో కూర్చొని కళాశాల ఆవరణ వద్దనే నిద్రమాత్రలు మింగాడు. గమనించిన సిబ్బంది సరస్వతీపురం ఆస్పత్రికి తరలించారు. మైసూరు వర్సిటీ ఉద్యోగుల సంఘం సభ్యులు వచ్చిచాన్సలర్ ఎస్.కే. లోకనాథ్‌ను కలిసి యువరాజు కళాశాల ప్రిన్సిపాల్ హెచ్.సి.దేవరాజుగౌడపై ఫిర్యాదు చేశారు. ప్రిన్సిపాల్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

'కాంగ్రెస్‌కు పోయే కాలం దాపురించింది'



ధర్నాలో పాల్గొన్న మాజీ మంత్రి కేఎస్ ఈశ్వరప్ప తదితరులు

శివమొగ్గ: కాంగ్రెస్ సర్కార్‌కు మూడిందని, అందువల్లనే అక్రమ అరెస్ట్‌లకు పాల్పడుతోందని బీజేపీ మాజీ మంత్రి. కే.ఎస్. ఈశ్వరప్ప మండిపడ్డారు. కర సేవకుడి అరెస్ట్‌ను నిరసిస్తూ గురువారం శివమొగ్గలో బీజేపీ నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. హిందూధర్మంపై కాంగ్రెస్ నేతలు ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేస్తున్నారని, బీ.కే. హరిప్రసాద్ వ్యాఖ్యలు దేశద్రోహంతో సమానమన్నారు. తక్షణం ఆయన్ను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఆయన కుమారుడు యతీంద్ర సిద్దరామయ్య మతం మారి పాకిస్తాన్‌కు వెళ్లిపోవచ్చని సూచన చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో ముస్లింలను ఓటు బ్యాంకుగా వినియోగించుకునేందుకే హిందూధర్మానికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు.

కుంచె మురిపించే



పెడిలిటస్ ఆర్ట్‌గ్యాలరీలో వేంకటేశ్వరస్వామి పెయింటింగ్ గీస్తున్న కళాకారుడు కోటెగద్దెరవి

బనశంకరి: తనదైనశైలిలో విభిన్న చిత్రాలు గీయడంలో ప్రత్యేకత చాటుతున్న మలెనాడుకు చెందిన వర్ధమాన కళాకారుడు కోటెగద్దెరవి మరోసారి తన ప్రతిభను చాటాడు. బనశంకరి రెండోస్టేజ్ పెడిలిటస్ ఆర్ట్‌గ్యాలరీలో కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి పెయింటింగ్‌ను కోటెగద్దెరవి అద్భుతంగా గీశారు. తన మనసులోని భావాలను కుంచె ద్వారా వ్యక్తం చేస్తూ నవ్యచిత్రాలకు జీవం పోస్తూ ప్రశంసలు అందుకుంటున్నారు.

12న యువనిధికి శ్రీకారం

బనశంకరి: ప్రభుత్వం అమలు చేస్తున్న ఐదు గ్యారెంటీల్లో చివరిదైన యువనిధి పథకానికి ఈనెల 12న శివమొగ్గలో శ్రీకారం చుట్టనున్నట్లు మంత్రి శరణప్రకాష్‌పాటిల్ తెలిపారు. గురువారం ఆయన విధానసౌధలో తన చాంబర్‌లో అధికారులతో సమావేశమై పథకం అమలుపై చర్చించారు. ఇప్పటికే వేదిక ఖరారు చేశారని, అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీఎం సిద్దరామయ్య, డిప్యూటీ సీఎం డీకే.శివకుమార్, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే పాల్గొంటారని తెలిపారు.

హిమవద్ పర్వతం..పరవశించే సౌందర్యం



బండీపుర అటవీ ప్రాంతంలో ప్రకృతి అందాలు



మంచుతో కప్పబడిన హిమవద్ వేణుగోపాలస్వామి కొండ

- పర్యాటకులకు స్వర్గధామం హిమవద్ వేణుగోపాలస్వామి కొండ

బనశంకరి: చేతికందే ఎత్తులో మేఘాలు..చల్లటి గాలులు...ఆహ్లాదూపరిచే పచ్చదనం, జలపాతాల సవ్వడి, వినసొంపైన పక్షులు కిలకిలరావాలు, బెదురు చూపులతో పరిగెత్తే జింకలు. మందగమనంతో సాగే మత్తగజాలు ఇలాంటి నయమనోహరమైన అద్భుత ప్రకృతి సౌందర్యాన్ని కళ్లారా వీక్షించాలంటే బండీపుర జాతీయ ఉద్యానవనంలో ఉన్న చారిత్రాత్మక హిమవద్ వేణుగోపాలస్వామి కొండకు వెళ్లాల్సిందే. మైసూరు నగరానికి 70 కిలోమీటర్ల దూరంలో ఊటీ రహదారిలో పడమటి కనుమమల వరుసలో హిమవద్ వేణుగోపాలస్వామి కొండ ఉంది. ఎంతోమంది ఋషులు హిమవత్‌వేణుగోపాలస్వామి కొండపై తపస్సు చేసినట్లు స్థానికులు చెబుతారు. ఈ ఆలయాన్ని చోళుల వంశానికి చెందిన బళ్లాలరాజు తన సేనాధిపతి పెరుమాళ్ నేతృత్వంలో 1315లో నిర్మించినట్లు శాసనాలు చెబుతున్నాయి. ద్వాపరయుగంలో గోవర్ధనగిరి వద్ద నిలబడి గోవుల మందను తన వద్ద కు రప్పించేందుకు వేణుగానం వినిపిస్తున్న రూపంలో శ్రీకృష్ణుడు ఇక్కడ భక్తులకు దర్శనమిస్తున్నారు. సముద్రమట్టానికి 1440 మీటర్లు ఎత్తులో ఈ ప్రదేశం ఉండటం వల్ల వేసవిలో కూడా వాతావరణం చల్లగా ఉంటుంది. వర్షాకాలంలో మాత్రం చలివిపరీతంగా ఉంటుంది హిమవద్ వేణుగోపాలస్వామి కొండకు కేఎస్ఆర్‌టీసీ బస్సు సర్వీసులు తక్కువగా ఉండటంతో పర్యాటకులు తప్పనిపరిస్థితుల్లో ట్యాక్సీలపై ఆధారపడాలి. ఉదయం 6 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే కొండపైకి పర్యాటకులను అనుమతి ఇస్తారు. రాత్రి 7 గంటలనుంచి వన్యజీవులు సంచారం ప్రారంభం కానుండటంతో అటవీశాఖ సిబ్బంది 5 గంటలనుంచి భక్తులను, పర్యాటకులను అక్కడ నుంచి ఖాళీ చేయిస్తారు. ఊటీ, కొడైకెనాల్‌కు ఏమాత్రం తీసిపోని వాతావరణంతో కూడిన హిమవద్ వేణుగోపాలస్వామి కొండకు దశాబ్దం క్రితం వరకు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలు మాత్రమే వచ్చి పూజలు చేసుకుని వెళ్లేవారు. ఇటీవల టీవీ మాధ్యమాల్లో హిమవద్ వేణుగోపాలస్వామి కొండ విశేషాలు, ప్రకృతిసౌందర్యం గురించి ప్రచారం చేయడంతో రోజురోజుకు పర్యాటకుల రద్దీ పెరుగుతుంది. సాంస్కృతిక రాజధాని మైసూరు నగరానికి వచ్చే పర్యాటకులు ఈ కొండకు తరలివస్తున్నారు. దట్టమైన మంచు కురుస్తుండటంతో ఫొటోలు తీసుకోవడం సాధ్యంకాదు.



కొండపైకి ట్రెక్కింగ్ చేస్తున్న దృశ్యం



వేణుగోపాలస్వామి ఆలయ ముఖ ద్వారం వద్ద భక్తుల క్యూ



అటవీ ప్రాంతంలో ఏనుగుల సంచారం

నగ్న వీడియోలతో బ్లాక్‌మెయిల్?

- భార్య ఫిర్యాదుతో భర్త అరెస్ట్

యశవంతపుర: తనతో ఏకాంతంగా ఉన్న సమయంలో వీడియోను రికార్డ్ చేసి బ్లాక్ మెయిల్ చేస్తున్నాడని ఓ మహిళ తన భర్తపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు అతన్ని జైలుకు పంపారు. ఈ ఘటన బెళగావిలో జరిగింది. సదరు దంపతులు 2022 నవంబర్ 17న ప్రేమ వివాహం చేసుకున్నారు. కొంతకాలం వారి కాపురం సవ్యంగా సాగింది. ఆ తర్వాత అతనిలో మరో కోణం వెలుగు చూసింది. ఏకాంతంగా ఉన్న సమయంలో వీడియోలు తీశాడు. తనతో విడాకులు తీసుకోవాలని ఒత్తిడి చేశాడు. అనంతరం కోర్టులో కేసు వేశాడు. ఇదంతా రెండో వివాహం చేసుకునేందుకు ఇలా వేధింపులకు పాల్పడుతున్నట్లు భార్య పసిగట్టి బెళగావి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు భర్తను స్టేషన్‌కు పిలిపించి విచారణ చేపట్టగా అతని సెల్‌ఫోన్‌లో దంపతుల ప్రైవేటు దృశ్యాలు బయట పడ్డాయి. అనంతరం తప్పును అంగీకరించిన అతను ఆత్మహత్యకు యత్నించగా ఆస్పత్రికి తరలించి చికిత్స అనంతరం హిండలగా జైలుకు తరలించారు.

వృద్ధ దంపతులను తాళ్లతో బంధించి దోపిడీ

దొడ్డబళ్లాపురం: వృద్ధ దంపతులను తాళ్లతో బంధించి దుండగులు దోపిడీకి పాల్పడ్డారు. ఈ ఘటన రామనగర తాలూకా నిజియప్పనదొడ్డి గ్రామంలో చోటుచేసుకుంది. జయమ్మ, చిక్కభైరేగౌడ దంపతులు గ్రామ శివారులో తోటలో ఇల్లు నిర్మించుకుని జీవిస్తున్నారు. మంగళవారం రాత్రి ఇంట్లోకి జొరబడ్డ ఇద్దరు దుండగులు దంపతులను కత్తులతో బెదిరించి కాళ్లు, చేతులు కట్టేసి బీరువాలో ఉన్న 58గ్రాముల బంగారం, రూ.1.15 లక్షల నగదు దోచుకున్నారు. బయటి తలుపులకు గడియ పెట్టి పరారయ్యారు. బాధితులు కట్లు విడిపించుకుని గ్రామంలో నివసిస్తున్న కుమారుడికి ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. అనంతరం ఘటనపై రామనగర గ్రామీణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బిగ్‌బాస్ పోటీదారుడు ప్రతాప్‌కు స్వల్ప అస్వస్థత

యశవంతపుర: కన్నడ బిగ్‌బాగ్ పోటీదారుడు ప్రతాప్ అస్వస్థతకు గురయ్యాడు. ఆయన్ను బెంగళూరు ఆర్‌ఆర్‌నగరలోని ఎస్ఎస్ ఆస్పత్రికి తరలించి చికిత్సలు అందిస్తున్నారు. ఖాళీ కడుపుతో విటమిన్ మాత్రలు వేసుకోవటంతో ఈ పరిస్థితి తలెత్తినట్లు చెబుతున్నారు. ఇదిలా ఉండగా ఆయన ఆత్మహత్యకు యత్నించినట్లు వదంతులు వ్యాపించాయి. పోలీసులు కూడా ఆస్పత్రికి వెళ్లి వివరాలు సేకరించారు. అయితే అలాంటిది ఏదీ లేదని ప్రతాప్ పీఆర్‌ఓ విలేకర్లకు తెలిపారు. ఆరోగ్యం కుదుట పడిందన్నారు. రేపు బిగ్‌బాగ్ ఇంటికి వెళ్లే అవకాశం ఉన్నట్లు వివరించారు.

యతీంద్ర వ్యాఖ్యలు అప్రస్తుతం

దొడ్డబళ్లాపురం: ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఆ పదవిలో ఐదేళ్ల కొనసాగాలంటే పోరాడాల్సిన అవసరం ఉందని సిద్దూ కుమారుడు యతీంద్ర చేసిన వ్యాఖ్యలు అప్రస్తుతమని, ఆ విధంగా ఆయన ఎందుకు మాట్లాడారో ఆయననే అడగాలని రాష్ట్ర రోడ్డు రవాణాశాఖ మంత్రి రామలింగారెడ్డి అన్నారు. చెన్నపట్టణంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ కరసేవకుల అరెస్టును బీజేపీ రాజకీయంగా వాడుకుంటోందన్నారు. అరెస్టయిన శ్రీకాంత్ పూజారిపై 16 కేసులు ఉన్నాయన్నారు. బీజేపీ హయాంలో 20వేల మందిపై ఉన్న రౌడీషీట్‌లు తీసివేశారన్నారు. తరువాత వారికి బీజేపీ కండువా కప్పి పార్టీలో చేర్చుకున్నారన్నారు. త్వరలో జరగనున్న పార్లమెంటు ఎన్నికల్లో 20 స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులే గెలుస్తారన్నారు. బీజేపీ–జేడీఎస్ పొత్తు కాంగ్రెస్ విజయాన్ని అడ్డుకోలేదన్నారు.

ఆయుర్వేదంతో వ్యాధులకు చెక్

మైసూరు: అనేక వ్యాదులను నయం చేసే శక్తి ఆయుర్వేదానికి ఉందని ఎమ్మెల్యే జీటీ దేవెగౌడ అన్నారు. ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో మైసూరులోని చాముండేశ్వరి నియోజకవర్గం లింబాంబుది పాళ్య గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన ఆయుష్ సేవా గ్రామ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పురాతన కాలం నుంచి ఆయుర్వేద వైద్యం ఎంతో ప్రాశస్త్యం కలిగి ఉందన్నారు. పంచేంద్రియాలను నియంత్రించే శక్తి ఆయుర్వేదానికి ఉందన్నారు.

స్త్రీ విద్యకు కృషి చేసిన సావిత్రిబాయి పూలే

గౌరిబిదనూరు: మహిళా విద్యకు నాంది పలికిన వారిలో సావిత్రి బాయి పూలే మొదటివారని ఎమ్మెల్యే పుట్టస్వామిగౌడ అన్నారు. కదళి మహిళా వేదిక, సావిత్రి బాయి పూలే ఉపాధ్యాయినుల సంఘం ఆధ్వర్యంలో స్టెల్లా కాన్వెంటు సభాభవనంలో శనివారం జరిగిన సావిత్రి బాయి పూలే జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. శతాబ్దాల క్రితమే స్త్రీ విద్య కోసం, మహిళల్లో అక్షరాస్యతను పెంపొందించేందుకు సావిత్రిబాయి పూలే కృషి చేశారన్నారు. మహిళలు సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం సావిత్రిబాయి పూలే అవార్డు గ్రహీతలు సువర్ణమ్మ, ఏజీ చంద్రకళను, వివిధ రంగాలలో సేవలందించిన వారిని సన్మానించారు. కసాప అధ్యక్షుడు నంజుండప్ప, వేణుగోపాలరెడ్డి, భారతి, నళిని, విశ్రాంత ప్రిన్సిపాల్ నాగరత్నమ్మ, లక్ష్మి,, పద్మ, శబరీన్‌తాజ్ పాల్గొన్నారు.

లిఫ్ట్‌లో చిక్కుకుపోయిన ఎంపీ

శివాజీనగర: ఎంపీ ఉమేశ్ జాధవ్ అరగంటపాటు లిఫ్ట్‌లో ఇరుక్కుపోయి తీవ్ర ఆందోళనకు గురయ్యాడు. ఈఘటన బెంగళూరులోని బీజేపీ కార్యాలయంలో జరిగింది. గురువారం కార్యాలయానికి విచ్చేసిన ఎంపీ ఉమేశ్, మరో ముగ్గురు లిఫ్ట్ ఎక్కారు. ఆ సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో లిఫ్ట్ మధ్యలోనే ఆగిపోయింది. టెక్నీషియన్ స్థలానికి చేరుకొని అరగంటపాటు శ్రమించి జాధవ్, ఇతరులు ముగ్గురిని కిందకు తెచ్చారు.

యువత దేశసేవకు నడుం బిగించాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వీఎస్.ఉగ్రప్ప తదితరులు

బనశంకరి: ఎన్ఎస్ఎస్ ద్వారా యువత దేశసేవకు నడుం బిగించాలని కాంగ్రెస్ నేత వీఎస్.ఉగ్రప్ప అన్నారు. బనశంకరి మూడోస్టేజ్ ఐటీఐ లేఔట్ శ్రీకృష్ణ డిగ్రీకాలేజీలో గురువారం ఎన్ఎస్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యా సంస్థ అధ్యక్షుడు డాక్టర్ ఎం.రుక్మాంగదనాయుడుతో కలిసి వీఎస్.ఉగ్రప్ప మాట్లాడారు. పచ్చదనం పెంచేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. దేశంలో రామాయణ, మహాభారత గ్రంథాలు సమాజంలో ప్రజలను ఉత్తమమార్గంలో నడిపించాయన్నారు. స్వామివివేకానంద ఆదర్శాలు, ఆశయాలను అలవరచుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో వాణిజ్యపన్నుల శాఖ అసిస్టెంట్ కమిషనర్ మహమ్మద్‌రఫీ పాషా, లండన్ మాజీ మేయర్ డాక్టర్ నీరజ్‌పాటిల్, కుమారి ప్రాచీగౌడ, విద్యాసంస్థ డైరెక్టర్ ఎస్‌పీ.మనోహర్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ఉషాకుమారి తదితరులు పాల్గొన్నారు.

గుజరాత్‌కు బయల్దేరిన బమూల్ సిబ్బంది



గుజరాత్‌కు బయల్దేరిన వారితో అంజినప్ప

బొమ్మనహళ్లి: పాల ఉత్పత్తుల్లో దేశంలోనే మొదటి స్థానంలో ఉన్న గుజరాత్‌లో పాల ఉత్పత్తి, పశుపోషణ, దాణా వినియోగం తదితర అంశాలపై అధ్యయనం చేసేందుకు బమూల్ సిబ్బంది, డైరెక్టర్లు గురువారం గుజరాత్ బయల్దేరి వెళ్లారు. వీరికి అనేకల్ తాలూకా బమూల్ డైరెక్టర్ బీజీ అంజినప్ప వీడ్కోలు పలికారు. ఆయన మాట్లాడుతూ పాల ఉత్పత్తులను పెంచి మూడో స్థానంలో ఉన్న బమూల్‌ను మరింత ఉన్నత స్థానానికి తీసుకొచ్చేందుకు సంస్థ కసరత్తు చేస్తోందని, అందులో భాగంగా 9 రోజుల పర్యటనకు బమూల్ సంస్థ సిబ్బంది వెళ్లారన్నారు. డాక్టర్ సురేష్ పాల్గొన్నారు.

సిరిధాన్యాల సాగుకు సహకారం

బనశంకరి: సిరిధాన్యాల ఉత్పత్తిలో దేశంలో నాల్గో స్థానంలో ఉన్న రాష్ట్రాన్ని నంబర్ వన్ స్థానంలో నిలపడమే ప్రభుత్వ సంకల్పమని వ్యవసాయశాఖ మంత్రి చెలువరాయస్వామి అన్నారు. ప్యాలెస్ మైదానంలో శనివారం నుంచి జరిగే సిరిధాన్యాల మేళాకు చేపట్టే ఏర్పాట్లను గురువారం ఆయన పరిశీలించారు. సిరిధాన్యాల సాగుకు ప్రభుత్వం సహకారం అందిస్తుందన్నారు. ఆరోగ్య పరిరక్షణలో సిరిధాన్యాలు మంచి పాత్ర పోషిస్తున్నందున వాటికి అంతర్జాతీయంగా డిమాండ్ పెరిగిందన్నారు. ఈనేపథ్యంలో సిరిధాన్యాల సాగుకు ఎకరాకు రూ.10 వేలు, రెండెకరాలకు రూ.20 వేలు ప్రోత్సాహదనం అందిస్తున్నట్లు తెలిపారు. చిత్రదుర్గ, హావేరి, బళ్లారి, కొప్పళ, బెంగళూరు గ్రామాంతర జిల్లాల్లో సిరిధాన్యాల సాగు పెరుగుతోందన్నారు.

కళ్లను కాపాడుకోవాలి



విజయపుర(బెంగళూరు గ్రామీణ) : కళ్లను జాగ్రత్తగా కాపాడుకోవాలని, ఇందు కోసం తరచూ కంటి పరీక్షలు చేయించుకుంటూ ఉండాలని వైద్యులు సూచించారు. విజయపుర పట్టణంలోని పురసభ రోజ్‌గార్ కార్యాలయం ఆవరణలో గురువారం పురసభ ఆధ్వర్యంలో కంటి పరీక్షల శిబిరం నిర్వహించారు. వైద్యులు హాజరై కంటి దోషాలు ఉన్నవారికి పరీక్షలు చేశారు.

బోర్డులు కన్నడలో లేకపోతే అనుమతులు రద్దు



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ తుషార్ గిరినాథ్

బనశంకరి: బృహత్ బెంగళూరు మహానగర పాలికె పరిధిలోని వాణిజ్య దుకాణాల బోర్డులు 60 శాతం కన్నడభాషలో ఉండాలని, లేని పక్షంలో అనుమతులు రద్దు చేస్తామని బీబీఎంపీ కమిషనర్ తుషార్‌గిరినాథ్ హెచ్చరించారు. గురువారం ఆయన బీబీఎంపీ కేంద్ర కార్యాలయంలో పాలికె 8 వలయాల కమిషనర్లు, ఇతర అధికారులతో సమావేశం నిర్వహించారు. నామఫలకాల్లో కన్నడ భాషను వినియోగించకపోతే వారికి తెలియజేసి తక్షణం కన్నడబోర్డులు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలోని ఆర్టీరియల్, సబ్ ఆర్టీరియల్ రోడ్లలో వచ్చే వాణిజ్య దుకాణాలు, వాటి ముందు అన్ని వలయాల్లో ఈనెల 15 లోగా సర్వేచేసి కన్నడభాషలో బోర్డులు ఏర్పాటుచేయాలని సూచించాలన్నారు. కన్నడభాషను వినియోగించని దుకాణాల దారులపై కఠినచర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వలయ కమిషనర్లు ఇబ్రహీం మైగూర్, ప్రీతి గెహ్లాట్ పాల్గొన్నారు.

హోసూరు వార్తలు..

అక్రమ మద్యం సీజ్

హోసూరు: బెంగళూరు నుంచి తిరుపత్తూరుకు అక్రమంగా తరలిస్తున్న మద్యం బాటిళ్లను మద్య నిషేధ శాఖ పోలీసులు స్వాధీనపరుచుకొన్నారు. జూజువాడి చెక్‌పోస్ట్ వద్ద ఒక కారును తనిఖీ చేయగా 2,500 టెట్రా ప్యాక్‌ల కర్ణాటక మద్యం పట్టుబడింది. కారుతో పాటు మద్యాన్ని సీజ్ చేసి, తిరుపత్తూరు జిల్లాకు చెందిన డ్రైవర్ కార్తికేయన్ (32)ను అరెస్టు చేశారు.

విగ్రహాల స్వాధీనం

- దొంగలు పరారు



స్వాధీనపరుచుకొన్న విగ్రహాలు, గోపురకళశాలు

హోసూరు: పంచలోహ విగ్రహాల దొంగలు తృటిలో తప్పించుకున్నారు. వివరాల మేరకు హోసూరు– బెంగళూరు జాతీయ రహదారి అత్తిపల్లి (అత్తిబెలె) చెక్‌పోస్ట్ వద్ద బుధవారం రాత్రి అక్కడి పోలీసులు వాహన తనిఖీలను నిర్వహించారు. మినీ లారీ ఆపకుండా వేగంగా వెళ్లిపోయింది. అనుమానం వచ్చి పోలీసులు లారీని వెంబడించారు. డ్రైవర్‌తో పాటు ఇద్దరు దుండగులు లారీని రోడ్డు పక్కన నిలిపి పరారయ్యారు. వెంటనే పోలీసులు లారీని అదుపులోకి తీసుకొని పరిశీలించగా స్వామి విగ్రహాలు, గోపురకళశాలు, పెద్ద పెద్ద దీపాలు, వెండి వస్తువులు బయటపడ్డాయి. వీటి విలువ సుమారు రూ. 20 లక్షలు ఉండవచ్చని అంచనా వేశారు. హోసూరు సీతారామ్‌దిన్నలోని ఓ దుకాణంలో నుంచి వీటిని దొంగిలించుకెళుతున్నట్లు తెలిసింది. పరారైన దొంగల కోసం తీవ్రంగా గాలిస్తున్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

కెలమంగలం: కెలమంగలం సమితిలోని పలు గ్రామపంచాయతీల్లో గురువారం తళి ఎమ్మెల్యే టి. రామచంద్రన్ అభివృద్ధి పనులకు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. జెక్కేరి, బోడిచిపల్లి, ఆనేగొళ్లు, బొమ్మతత్తనూరు గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు రూ. 1.26 కోట్ల నిధులను మంజూరు చేయించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కౌన్సిలర్ ప్రభాజయరామన్ కార్యదర్శి తమిళ్‌సెల్వన్, పంచాయతీ అధ్యక్షులు బీడీవో, ఇంజనీర్లు పాల్గొన్నారు.

గంజాయి విక్రేతలు అరెస్ట్

కెలమంగలం: అంచెట్టి పోలీసులు బుధవారం రాత్రి సమీపంలోని రాశీపురం ప్రాంతంలో గస్తీ నిర్వహించారు. ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పద స్థితిలో తిరుగుతూ కనిపించారు. వారిని విచారించగా రాశీపురానికి చెందిన గోవిందరాజ్ (24), ఏరికొడి గ్రామానికి చెందిన పాండురంగన్ (60) అని తేలింది. ఇద్దరూ గంజాయి అమ్ముతున్నట్లు తెలిసింది. ఇరువురిని అరెస్ట్ చేసి వారి వద్ద ఉన్న గంజాను స్వాధీనపరుచుకొన్నారు.

సంతానం కలగలేదని ఆత్మహత్య

హోసూరు: పెళ్లై ఐదేళ్లు గడిచినా సంతానం కలుగలేదని వివాహిత యువతి ఆత్మహత్య చేసుకుంది. వివరాల మేరకు బాగలూరు సమీపంలోని చూడుగొండపల్లి గ్రామానికి చెందిన శివరాజ్ భార్య వనజ (24), వీరికి గత ఐదేళ్ల క్రితం పెళ్లి జరిగింది. ఇంతవరకు పిల్లలు పుట్టకపోవడంతో విరక్తి చెందిన వనజ బుధవారం రాత్రి అదే ప్రాంతంలోని రైతు పొలంలోని నీటి మడుగులోకి దూకి ప్రాణాలు తీసుకుంది. బాగలూరు పోలీసులు శవాన్ని హోసూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రోడ్ల పనులకు భూమిపూజ

హోసూరు: హోసూరు యూనియన్‌లో రోడ్ల అభివృద్ధి పథకం ద్వారా తారురోడ్డు, సీసీరోడ్ల నిర్మాణ పనులను హోసూరు ఎమ్మెల్యే వై. ప్రకాష్ ప్రారంభించారు. హోసూరు – డెంకణీకోట ప్రధాన రోడ్డు డి.బారందూరు వరకు రూ. 1.2 కోట్ల ఖర్చుతో, ఎస్.ముదుగానపల్లి నుంచి వద్రపాళ్యం వరకు రూ. 56 లక్షల ఖర్చుతో తారురోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. యూనియన్ కమిటీ సభ్యులు సుకుమార్, కౌన్సిలర్ సంపత్, పంచాతీ అధ్యక్షుడు రమేష్, తిమ్మారెడ్డి, ప్రవీణ్, శివకుమార్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతుడు రామకృష్ణ (ఫైల్)

పావగడ: పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని దొమ్మతమరి గ్రామం సాప్పులమ్మ గుడి వద్ద చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో మడకశిర మండలం ఆర్ అనంతపురం గ్రామానికి చెందిన బోయ రామకృష్ణ(30) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..మృతుడు టీవీఎస్ మోపెడ్‌లో బుధవారం రాత్రి తన స్వగ్రామానికి వెళ్తుండగా సాప్పులమ్మ గుడి వద్ద వెనుక నుంచి వేగంగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో రామకృష్ణ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ సీఐ నాగేశ్ గురువారం తెలిపారు. మృతుడికి నక్షత్ర అనే కుమార్తె ఉంది. రామకృష్ణ మృతితో భార్య విజయలక్ష్మి, తల్లిదండ్రులు తీవ్రంగా రోదించారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



చింతామణి: విద్యార్థి దశనుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని, అప్పుడే నేరాలు తగ్గుతాయని చింతామణి పట్టణ సీఐ రంగస్వామయ్య విద్యార్థులకు సూచించారు. గురువారం స్టేషన్ అవరణలో విద్యార్థులకు చట్టంపై అవగాహన కల్పించారు. బైకులు నడిపే సమయంలో పాటించాల్సిన రోడ్డు నిబంధనలు వివరించారు. బాలికలకు ఎలాంటి సమస్య వచ్చినా 112 నంబర్‌కు ఫోన్ చేస్తే ఐదు నిమిషాల్లో పోలీసులు అక్కడ ఉంటారన్నారు.

ఇంటింటికీ అయోధ్య అక్షింతలు



సామసంద్రపాళ్యలో అక్షింతలను పంపిణీ చేసేందుకు ఊరేగింపుగా వెళ్తున్న దృశ్యం

బొమ్మనహళ్లి: అయోధ్యలో నిర్మించిన నూతన రామాయలం ప్రారంభోత్సవం, సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఇంటింటికీ అక్షింతలను హిందూ ధార్మిక సంస్థలు పంపుతున్నాయి. ఈక్రమంలో సామసంద్రపాళ్యలో ఉన్న గురుమూర్తి స్వామి సన్నిధికి అక్షింతలు చేరాయి. బీజేపీ నాయకుడు శ్రీనివాస్ రెడ్డి, మురళీధర్ రెడ్డి ఆధ్వర్యంలో అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేశారు. గ్రామస్తులు మురళీధర్ రెడ్డి, రాజప్ప రెడ్డి, శుభకర్ రెడ్డి, బాబురెడ్డి, మురళి, నవీన్, వెంకటేష్, సంతోష్, సతీష్, శరత్, లిఖిత్, ఆర్ఎస్ఎస్ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

విజయపుర (బెంగళూరు గ్రామీణ): విజయపుర పట్టణం 8 వార్డులో అయోధ్య నుంచి తెచ్చిన అక్షింతలను ఇంటింటికీ పంపిణీచేశారు. ఈ నెల 22వ తేదీన జరిగే అయోధ్య రామాలయ ప్రారంభోత్సవం సమాచారంతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీకాకుళం భాగ్యరేఖ.. మూలపేట పోర్టు



శరవేగంగా జరుగుతున్న మూలపేట పోర్టు నిర్మాణ పనులు

- పోర్టు రాకతో మారనున్న శ్రీకాకుళం జిల్లా రూపురేఖలు
- రూ. 4,361.91 కోట్లతో పోర్టు నిర్మాణం చేపట్టిన ఏపీ మారిటైమ్ బోర్డు
- ఇప్పటికే 8.3 లక్షల టన్నుల రాళ్లతో బ్రేక్ వాటర్ నిర్మాణం
- జనరల్ కార్గో నిర్మాణం కోసం భూమిని పటిష్టం చేస్తున్న అధికారులు
- మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ రాష్ట్రాలకు అనువుగా మూలపేట పోర్టు
- వచ్చే ఏడాది అక్టోబర్ నాటికి అందుబాటులోకి రానున్న ఓడరేవు

సాక్షి, అమరావతి: వెనుకబడ్డ ఉత్తరాంధ్ర తలరాతను మార్చే మరో పోర్టు వేగంగా రూపుదిద్దుకుంటోంది. వలస జిల్లా పేరు నుంచి ఉపాధి కల్పించే జిల్లాగా శ్రీకాకుళం పేరును మార్చే మూలపేట పోర్టు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ జిల్లాకు రెండు వేల కోట్ల రూపాయలకు మించి పెట్టుబడులు రాలేదు. కానీ ఇప్పుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఏకంగా మూలపేట పోర్టు, మంచినీళ్లపేట, బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బర్ల నిర్మాణానికి రూ. 5,000 కోట్లు పైనే వ్యయం చేస్తున్నారు. దీంతో స్థానిక ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా నిర్మిస్తున్న నాలుగు పోర్టుల్లో ఒకటైన మూలపేట మన రాష్ట్రంతో పాటు ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, దక్షిణ ఒడిశా ప్రాంతాల నుంచి ఎగుమతులు దిగుమతులకు అనువుగా ఉంటుందని.. ఇలాంటి కీలకమైన ప్రదేశంలో మూలపేట ఉందని ఏపీ మారిటైమ్ బోర్డు అధికారులు పేర్కొంటున్నారు. ఈ పోర్టు ద్వారా ఐదు రాష్ట్రాల్లోని పరిశ్రమలు తమకు అవసరమైన ముడి సరుకులు దిగుమతి చేసుకునేందుకు అవకాశం ఉంది. అలాగే ఇక్కడ నుంచి మినరల్ శాండ్, ముడి ఇనుము, జీడిపప్పు, సోయా మీల్, గ్రానైట్, ఫెర్రో ఉత్పత్తులు, జూట్, ఐరన్ అండ్ స్టీల్ ఉత్పత్తుల ఎగుమతికి అవకాశాలు మెండుగా ఉన్నాయి. మూలపేట పోర్టు పనులను ఏప్రిల్ 19న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. అప్పటి నుంచి పనులు అత్యంత వేగంగా జరుగుతున్నాయి. ఈ ప్రాజెక్టు పూర్తయితే సుమారు 25,000 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభించడంతో పాటు చుట్టుపక్కల ప్రాంతం పారిశ్రామికంగా వేగంగా అభివృద్ధి చెందుతుందని అధికారులు పేర్కొంటున్నారు.


శరవేగంగా సాగుతున్న నార్త్ బ్రేక్ వాటర్ పాయింట్ పనులు

అన్ని అనుమతుల తర్వాత

అన్ని అనుమతుల తర్వాతే నిర్మాణ పనులు ప్రారంభించడంతో పోర్టు పనులు వేగంగా జరుగుతున్నాయి. పోర్టులో కీలకమైన సౌత్ బ్రేక్ వాటర్ నిర్మాణానికి 19.40 లక్షల టన్నులు, నార్త్ బ్రేక్ వాటర్ నిర్మాణానికి 2.71 లక్షల టన్నుల బండరాళ్లు అవసరమవుతాయని అంచనా వేయగా ఇప్పటికే 8.3 లక్షల టన్నుల బండరాళ్లను తరలించారు. ఇదే సమయంలో జనరల్ బెర్త్ నిర్మాణ పనులు, తీర ప్రాంతం పటిష్టం చేయడం, ఎన్‌హెచ్ 16ను అనుసంధానం చేసే పనులు వేగంగా జరుగుతున్నాయి.

మూలపేట పోర్టు స్వరూపం

- ప్రాజెక్టు వ్యయం: రూ.4,361.91 కోట్లు
- తొలి దశ పోర్టు: 23.5 ఎంటీపీఏ
- తుది దశ పోర్టు: 83.3 ఎంటీపీఏ
- తొలి దశలో బెర్తుల సంఖ్య 4
- నౌక పరిమాణం: 1,20,000 డీడబ్ల్యూటీ
- అవసరమైన భూమి: 1,254.72 ఎకరాలు
- దక్షిణ బ్రేక్ వాటర్: 2,455 మీటర్లు
- ఉత్తర బ్రేక్ వాటర్: 580 మీటర్లు



- తీరం రక్షణ: 1,000 మీటర్లు
- డ్రెడ్జింగ్: 15.85 మిలియన్ క్యూబిక్ మీటర్లు
- అప్రోచ్ చానల్: 3.3 కి.మీ
- నీరు: గొట్టా బ్యారేజీ నుంచి 0.5 ఎంఎల్‌డీ నీటి సరఫరా
- రైల్: 10.6 కి.మీ రైల్వే లైన్ నిర్మాణం
- రహదారి: ఎన్‌హెచ్16ను అనుసంధానం చేస్తూ 13.8 కి.మీ. నాలుగు లేన్ల రహదారి నిర్మాణం
- కార్యకలాపాలు ప్రారంభం: అక్టోబర్, 2025

తొలి దశలో నాలుగు బెర్తులు

పోర్టు నిర్మించడానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 4,361.91 కోట్లకు పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. ల్యాండ్ లార్డ్ మోడల్ విధానంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్న ఈ పోర్టు నిర్మాణ పనుల కాంట్రాక్టును విశ్వసముద్ర కన్సార్టియం చేపట్టింది. రూ. 2,949.70 కోట్ల వ్యయంతో తొలిదశలో నాలుగు బెర్తుల నిర్మాణం, ఇతర మౌలిక వసతుల కల్పనను విశ్వసముద్ర అభివృద్ధి చేయనుంది. మొత్తం పోర్టు వార్షిక సామర్థ్యం 83.3 మిలియన్ టన్నులు కాగా తొలిదశలో నాలుగు బెర్తుల నిర్మాణంతో 23.5 మిలియన్ టన్నుల సామర్థ్యంతో పోర్టును అభివృద్ధి చేయనున్నారు. మొత్తం నాలుగు బెర్తుల్లో రెండు జనరల్ కార్గోకు, ఒకటి బొగ్గు, ఇంకొకటి కంటైనర్‌తోపాటు ఇతర ఎగుమతి దిగుమతులకు వినియోగించనున్నారు. ఈ పోర్టు నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం మూలపేట పోర్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ పేరుతో ప్రత్యేకంగా కంపెనీని ఏర్పాటు చేసింది. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన నిధులను పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి రుణరూపంలో సమీకరిస్తున్నారు.

596 కుటుంబాల తరలింపు

పోర్టు నిర్మాణం కోసం విష్ణుచక్రం, మూలపేట గ్రామాలకు చెందిన 596 కుటుంబాలకు పునరావాస ప్యాకేజీని ప్రభుత్వం ప్రకటించింది. 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరిని ఒక కుటుంబంగా పరిగణించి వారికి కస్త నౌపాడ వద్ద పునరావాస గ్రామం అభివృద్ధి చేస్తోంది. ఇందుకోసం రూ. 149 కోట్లు వ్యయం చేస్తోంది. ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద అక్కడ 13 రకాల మౌలిక వసతులను ప్రభుత్వం కల్పిస్తోంది. ఇప్పటికే స్థలాన్ని చదును చేసి విద్యుత్, తాగునీరు కనెక్షన్లను ఏర్పాటు చేయడం పూర్తయింది. త్వరలోనే లాటరీ విధానంలో ప్లాట్‌ను కేటాయించి ఇంటి నిర్మాణాలను ప్రారంభించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

ముమ్మరంగా జరుగుతున్న సౌత్ బ్రేక్ వాటర్ పాయింట్ పనులు



శ్రీకాకుళం ఇక సిరుల జిల్లా



ఇంతకాలం శ్రీకాకుళం అంటే వలసలు గుర్తుకు వచ్చేవి. కానీ మూలపేట పోర్టు రాకతో స్థానికులు వలస వెళ్లాల్సిన అవసరం ఉండదు. అంతేగాక వేరే ప్రాంతం వారికి కూడా ఇక్కడ ఉపాధి కల్పించే సిరుల జిల్లాగా రూపాంతరం చెందుతుంది. కేవలం పోర్టులే కాకుండా వాటిపక్కనే పోర్టు ఆధారిత పరిశ్రమలను ప్రమోట్ చేస్తున్నాం. కొత్తగా వస్తున్న నాలుగు పోర్టులు, 10 ఫిషింగ్ హార్బర్లతో రాష్ట్రం గుజరాత్, మహారాష్ట్రలతో పోటీ పడుతుంది. రెండు లక్షల టన్నుల బరువు ఉండే భారీ ఓడలను తీసుకువచ్చే విధంగా ఈపోర్టులను అభివృద్ధి చేస్తున్నాం.

– కాయల వెంకటరెడ్డి, చైర్మన్ ఏపీ మారిటైమ్ బోర్డు

6 నెలలు ముందుగానే అందుబాటులోకి పోర్టు



శంకుస్థాపన జరిగిన 8 నెలల్లో రికార్డు స్థాయిలో పనులు పూర్తయ్యాయి. ఇప్పటికే నార్త్ బ్రేక్ వాటర్ పనులు దాదాపుగా పూర్తయ్యాయి. సౌత్ బ్రేక్ వాటర్ పనులు 50 శాతంపైగా పూర్తయ్యాయి. వాస్తవంగా ఈ ప్రాజెక్టును అక్టోబర్ 2025 నాటికి పూర్తి చేయాల్సి ఉండగా సీఎం ఆదేశాలు మేరకు ఆరు నెలలు ముందుగానే అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నాం. ఆ మేరకు ప్రణాళికలను సిద్ధం చేశాం. డ్రెడ్జింగ్ పనుల కోసం ప్రత్యేకంగా రూ. 350 కోట్లతో చైనా నుంచి డ్రెడ్జింగ్ మిషన్ కొనుగోలు చేశాం. త్వరలోనే డ్రెడ్జింగ్ పనులు ప్రారంభించనున్నాం.

–చావల బాబురావు, ఎండీ, మూలపేట పోర్టు

భావితరాలకు మేలు చేకూరుతుంది



భావితరాలకు మేలు చేకూరుతుందని మూలపేట పోర్టుకు మాభూములు, ఇళ్లు, గ్రామాన్ని ఇచ్చాము. జిల్లా అభివృద్ధిలో మేము కూడా భాగస్వామ్యంగా ఉన్నందుకు గర్వంగా ఉంది. స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయి. చెన్నై, హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లకుండా ఇక్కడే పని దొరుకుతుంది.

– గిన్ని భైరాగి, విష్ణుచక్రం గ్రామం

పారిశ్రామికాభివృద్ధి జరుగుతుంది



మూలపేట పోర్టు రావడం వల్ల మరికొన్ని అనుబంధ పరిశ్రమలు ఈ ప్రాంతానికి వస్తాయి. దీంతో పారిశ్రామికాభివృద్ధి జరుగుతుంది. యువకులకు ఉద్యోగ, ఉపాధి కలిగి వలసనివారణ జరుగుతుంది. ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలని మా భూములను ప్రభుత్వానికి ఇచ్చాము.

– కనిరెడ్డి భాస్కర్‌రెడ్డి, నౌపడ

పోర్టుతో భూముల ధరలు పెరిగాయి



మూలపేట పోర్టుతో ఈ ప్రాంత భూముల ధరలు విపరీతంగా పెరిగాయి. సెంటు భూమి రూ. 1.50లక్షల నుంచి రూ. 2లక్షలు వరకు పెరిగింది. పోర్టు పూర్తి అయితే ఈ ప్రాంతం అంతా పారిశ్రామిక వాడగా మారుతుంది. నిరుద్యోగులకు, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయి.

– కర్రి కాంతారావు, రైతు, నౌపడ

బీసీల బతుకులు మారాయి

- ప్రతిపక్షాలవన్నీ మోసపు మాటలే... వాటిని ఎవరూ నమ్మొద్దు
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు కృష్ణయ్య స్పష్టీకరణ
- విజయవంతమైన 139 బీసీ కులాల ఆత్మీయ సమావేశం

సాక్షి, అమరావతి: సమాజంలో అన్ని విధాలుగా వెనుకబడిన తరగతుల వారికి ఈ ప్రభుత్వంలోనే సరైన న్యాయం జరిగిందని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. డబ్బు, నోరు, శక్తి, గుర్తింపు లేనివాళ్లకు ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో అగ్రపీఠం వేసిన ఏకైక వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. జగన్ పాలనలో బడుగుల బతుకులు మారాయని, ఆయన గెలుపుతోనే బీసీలకు న్యాయం జరుగుతుందని ఉద్ఘాటించారు. ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం ఆధ్వర్యంలో విజయవాడలోని ఓ హోటల్‌లో 139 బీసీ కులాల ప్రతినిధులతో గురువారం బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.మారేష్ అధ్యక్షతన నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ తన 45 ఏళ్ల బీసీ ఉద్యమ ప్రస్థానంలో ఎంతో మంది నాయకులను చూశాననీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అగ్రవర్ణ పేదల మేలు కోరే జగన్ వంటి నాయకుడిని చూడలేదనీ పేర్కొన్నారు. ఆయన ఒక రాజకీయ నాయకుడిగా కాకుండా సంఘ సంస్కర్తగా అనేక విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని, సామాజిక న్యాయం అందించడంలో దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారని ప్రశంసించారు. నాలుగున్నరేళ్ల ఆయన పాలనలోనే వాస్తవ రాజ్యాధికార బదిలీ జరిగిందని స్పష్టం చేశారు. ఏ రాష్ట్రంలోనూ జరగనంత సామాజిక న్యాయం ఆంధ్రప్రదేశ్‌లో జరిగిందని చెప్పారు. సామాజిక న్యాయం కోసం, సమ సమాజం నెలకొల్పే దిశగా జగన్ పాలన కొనసాగుతున్నందున బీసీలంతా ఆయనకు మద్దతుగా నిలవాలని కృష్ణయ్య పిలుపునిచ్చారు.

బీసీలు బాగుంటే చంద్రబాబుకు కడుపుమంట

సీఎం జగన్ పాలనలో రాష్ట్రంలోని పేదవర్గాల కడుపునిండుతుంటే చంద్రబాబు వంటి పెత్తందార్ల కడుపు మండుతోందని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా 'ఖబడ్దార్ ప్రతిపక్షాలు.. మీ మోసాలు మాకు తెలిశాయి' అంటూ కృష్ణయ్య హెచ్చరించారు. అమ్మఒడి, విద్యాదీవెన వంటి అనేక పథకాలు పెట్టి బీసీల బిడ్డలను సీఎం జగన్ చదివిస్తున్నారనీ, విదేశీ విద్య వంటి ప్రోత్సాహంతో బీసీల పిల్లలు అమెరికాలో చదువుకుంటున్నారనీ, వారి ఆర్థిక పరిస్థితులు మెరుగుపడి బీసీలు ఇప్పుడు కార్లు, విమానాల్లో తిరుగుతున్నారని చెప్పారు. పొరుగున ఉన్న ఒడిశా, తెలంగాణా, కర్నాటక రాష్ట్రాలకు వెళ్లి బీసీ బతుకులు ఎలా ఉన్నాయో చూస్తే ఏపీలో బీసీల అభివృద్ధి ఎంత గొప్పగా ఉందో తెలుస్తుందని చెప్పారు. ఇటీవల కర్నాటకలోని బళ్లారి, తమిళనాడులోని తెలుగు వారుండే ప్రాంతంలో ఓ సమావేశానికి తాను వెళ్లినపుడు అమ్మ ఒడి, పింఛన్, విద్యా కానుక, ఆరోగ్య శ్రీ వంటి పథకాల కోసం తమను కూడా ఏపీలో కలిపితే బాగున్ను అని అక్కడివారు తనతో అన్నట్టు ఉదహరించారు. రాష్ట్రాన్ని 14 ఏళ్ళు పాలించిన చంద్రబాబు బీసీలకు చేసిందేమీ లేదని మండిపడ్డారు. ప్రతిపక్షాల మోసపు మాటలు ఎవరూ నమ్మొద్దని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అఖిల భారత యాదవ సంఘం నాయకుడు జక్కా శ్రీనివాసరావు, ఏపీ బీసీ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మోర్ల మహీధర్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వేముల బేబీరాణీ, కురుబ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జబ్బల శ్రీనివాస్, పలు సంఘాల రాష్ట్ర నాయకులు బెజవాడ గణేష్, జగదీష్, రాజులపాటి కల్యాణి, సూరవరపు వెంకటాచారి, నాగమల్లేశ్వరరావు తదితర నేతలు మాట్లాడారు. బీసీలకు సీఎం జగన్ చేసిన మేలును ప్రస్తావిస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు.


మాట్లాడుతున్న మారేష్, పక్కన ఆర్.కృష్ణయ్య, బీద మస్తాన్‌రావు తదితరులు

జగన్‌తోనే సామాజిక న్యాయం

సామాజిక న్యాయం అందించడంలో దేశానికే రోల్ మోడల్‌గా నిలిచిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలన కొనసాగితేనే రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అగ్రవర్ణ పేదల జీవితాల్లో సంక్షేమ, అభివృద్ధి వెలుగులు కొనసాగుతాయి. దేశంలో ప్రధానితోపాటు పలు రాష్ట్రాలకు బీసీలే ముఖ్యమంత్రులుగా ఉన్నప్పటికీ ఎవరూ చేయని విధంగా వెనుకబడి వర్గాలను అత్యున్నతంగా నిలబెట్టిన ఘనత మాత్రం సీఎం జగన్‌కే దక్కుతుంది. వైఎస్సార్‌సీపీకి 9 రాజ్యసభ సీట్లుంటే అందులో ఏకంగా ఐదుగురు బీసీలకే అవకాశం ఇచ్చి జగన్ చరిత్ర సృష్టించారు. 30 ఏళ్లపాటు టీడీపీకి సేవ చేసి నా ఆస్తిని పోగొట్టుకున్నాను. అయినా చంద్రబాబు ఎలాంటి ప్రాధాన్యం ఇవ్వలేదు. పైగా టీడీపీలో టిక్కెట్ కావాలంటే నీ దగ్గర రూ.50 కోట్లు ఉన్నాయా? రూ.70 కోట్లు ఉన్నాయా? అని చంద్రబాబు పెట్టుబడి అడిగేవారు. పైసా పెట్టుబడి లేకుండా పిలిచి మరీ అవకాశం ఇచ్చిన గొప్ప నాయకుడు జగన్. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మోసపు మాటలతో మళ్లీ వస్తున్న చంద్రబాబు మాయలో పడకుండా సీఎం జగన్‌కు అండగా నిలిచి రుణం తీర్చుకుందాం.

– బీద మస్తాన్‌రావు, రాజ్యసభ సభ్యుడు

వైఎస్సార్‌సీపీకే సంపూర్ణ మద్దతు

రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాల బలమైన గొంతుక సీఎం జగన్. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకే సంపూర్ణ మద్దతు ఇస్తున్నాం. ఈ మేరకు 139 బీసీ కులాల సమావేశం ఏక వాక్య తీర్మానం చేసింది. ఈ ప్రభుత్వం ద్వారా బీసీలకు జరిగిన సామాజిక న్యాయం, నవరత్నాల వంటి అనేక కార్యక్రమాలు ద్వారా వారికి జరిగిన మేలును రానున్న ఎన్నికల్లో 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రచారం చేస్తాం. ఆరు కిలో మీటర్ దూరం నడిచి వెళ్లి పెన్షన్ తెచ్చుకునే టీడీపీ పాలన కావాలా? ఇంటి వద్దకే అందించే జగన్ పాలన కావాలా? అన్న ప్రజలు తేల్చుకునే తరుణం వచ్చింది. గత ఎన్నికల్లో చంద్రబాబు 600కు పైగా హామీలిచ్చి ఒక్కటీ నెరవేర్చలేదు. చంద్రబాబు, పవన్ ఎంత మంది కట్టకట్టుకుని వచ్చినా జనం అండ జగన్‌కు ఉంది. బడుగుల ఆదరాభిమానాలున్న జగన్ మరో 30 ఏళ్లు ముఖ్యమంత్రిగా కొనసాగుతారు.

– ఎస్.మారేష్, ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

నాడు.. అవమానం నేడు ఆదరణ

నాడు: టీడీపీ హయాంలో హక్కులు పరిరక్షించాలని వేడుకున్న నాయీ బ్రాహ్మణులను తోకలు కత్తిరిస్తానంటూ తాత్కాలిక సచివాలయం సాక్షిగా చంద్రబాబు బెదిరించారు. హామీలను అమలు చేయాలని విన్నవించుకున్న పాపానికి తాట తీస్తానంటూ మత్స్యకారులపై హూంకరించారు. న్యాయమూర్తులుగా బీసీలు పనికి రారంటూ చంద్రబాబు అవహేళన చేశారు.

నేడు: వెనుకబడిన వర్గాలను సమాజానికి వెన్నుముకగా తీర్చిదిద్దడమే లక్ష్యమని 2019 ఫిబ్రవరి 17న ఏలూరు బీసీ గర్జనలో చెప్పిన దానికి మిన్నగా సీఎం జగన్ మంచి చేస్తున్నారు. వివిధ సంక్షేమ పథకాలతో డీబీటీ రూపంలో రూ.2.45 లక్షల కోట్లు అందించగా అందులో బీసీల ఖాతాల్లోనే రూ.1,15,155.02 కోట్లు జమ చేశారు. బీసీ బిడ్డలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దుతున్నారు. కేబినెట్ నుంచి నామినేటెడ్ పదవుల వరకూ సింహభాగం పదవులను బీసీలకే ఇచ్చి రాజ్యాధికారంలో వాటా కల్పించారు.



బీసీలకు హామీలకు మించి మేలు చేస్తున్న సీఎం జగన్

- 25 మంది మంత్రివర్గంలో ఏకంగా 11 మంది బీసీలే
- కీలక శాఖలు.. శాసనసభ స్పీకర్‌గా వారికే అవకాశం
- 8 రాజ్యసభ స్థానాల్లో సగం బీసీలకే ఇచ్చి చిత్తశుద్ధి చాటుకున్న సీఎం
- డీబీటీతో పేదలకు రూ.2.45 లక్షల కోట్లు.. ఇందులో రూ.1.15 లక్షల కోట్లు బీసీలకే
- నాలుగున్నరేళ్లలో బలహీన వర్గాలకు రాజకీయ, విద్యా, ఆర్థిక సాధికారత
- బీసీలే సీఎంలుగా ఉన్న రాష్ట్రాల్లోనూ ఈ స్థాయిలో మేలు జరగలేదంటున్న సామాజికవేత్తలు
- బీసీల కంచుకోట కుప్పం వలస వెళ్లి ఆక్రమించిన చంద్రబాబు.. మంగళగిరిలో చినబాబుదీ అదే దారి

సాక్షి, అమరావతి: సంక్షేమ పథకాల ద్వారా ఆర్థికంగా చేయూతనివ్వడం, రాజ్యాధికారంలో సింహభాగం వాటా, ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దడం ద్వారా బీసీలను ముఖ్యమంత్రి జగన్ సమాజానికి వెన్నుముకలా తీర్చిదిద్దారని సామాజికవేత్తలు ప్రశంసిస్తున్నారు. దేశంలో సామాజిక న్యాయం నినాదంతో వివిధ రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చిన బీసీ ముఖ్యమంత్రులకు సైతం సాధ్యం కాని రీతిలో సీఎం జగన్ రాజ్యాధికారంలో సింహభాగం వాటా బలహీన వర్గాలకు ఇచ్చారని గుర్తు చేస్తున్నారు. వివిధ సంక్షేమ పథకాల ద్వారా డీబీటీ రూపంలో గత 56 నెలల్లో రూ.2.45 లక్షల కోట్లను పేదల ఖాతాల్లో జమ చేయగా ఇందులో బీసీల ఖాతాల్లోనే రూ.1,15,155.02 కోట్లను నేరుగా జమ చేశారని ప్రస్తావిస్తున్నారు. డీబీటీ, నాన్ డీబీటీతో కలిపి పేదలకు రూ.4.12 లక్షల కోట్ల మేర ప్రయోజనం చేకూరగా అందులో బీసీ వర్గాలే రూ.1,65,476.89 కోట్ల మేర లబ్ధి పొందాయి. విద్యా సాధికారతతో ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దారు. ఇవన్నీ బీసీలను సమాజానికి వెన్నుముకలా మార్చేందుకు బాటలు వేశాయని విశ్లేషిస్తున్నారు.

పరిపాలనలో సింహభాగం..

2019 ఎన్నికల్లో 50 శాతం ఓట్లతో 151 శాసనసభ, 22 లోక్‌సభ స్థానాలలో వైఎస్సార్‌సీపీ చారిత్రక విజయాన్ని సాధించింది. 2019 మే 30న వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. 2019 జూన్ 8న ఏర్పాటు చేసిన మంత్రివర్గాన్ని గతేడాది ఏప్రిల్ 11న పునర్ వ్యవస్థీకరించారు. 25 మంది సభ్యులున్న మంత్రివర్గంలో ఏకంగా 11 మంది బీసీలకు స్థానం కల్పించారు. ఆ సామాజిక వర్గానికి చెందిన బూడి ముత్యాలనాయుడును డిప్యూటీ సీఎంగా నియమించారు. విద్య, రెవెన్యూ, పౌరసరఫరాలు, వైద్యారోగ్యం లాంటి కీలక శాఖలను ఆ వర్గాలకే అప్పగించారు. 2014–19 మధ్య చంద్రబాబు తన మంత్రివర్గంలో కేవలం 8 పదవులు మాత్రమే బీసీలకు ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎనిమిది రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తే నలుగురు బీసీలను సీఎం వైఎస్ జగన్ రాజ్యసభకు పంపారు. శాసనసభ స్పీకర్‌గా బీసీ వర్గానికి చెందిన తమ్మినేని సీతారామ్‌కు అవకాశం కల్పించారు. శాసనమండలిలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు 29 పదవులు (69 శాతం) దక్కేలా సీఎం జగన్ చర్యలు తీసుకోగా 2014–19 మధ్య చంద్రబాబు ఆ వర్గాలకు కేవలం 18 పదవులు (37 శాతం) మాత్రమే ఇచ్చారు.

స్థానిక సంస్థల్లో బీసీలకు పెద్దపీట

- స్థానిక సంస్థల్లో బీసీలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించడంపై హైకోర్టును ఆశ్రయించేలా చంద్రబాబు టీడీపీ నేతలను పురిగొల్పారు. దీనిపై హైకోర్టు ఇచ్చిన తీర్పుతో బీసీల రిజర్వేషన్ 24 శాతానికి తగ్గిపోయింది. అయితే రిజర్వేషన్లు తగ్గినా అంతకంటే ఎక్కువ మంది బీసీలకు స్థానిక సంస్థల్లో అవకాశం కల్పిస్తానని హామీ ఇచ్చిన సీఎం జగన్ దాన్ని ఆచరించి చూపారు.
- జిల్లా పరిషత్ ఎన్నికల్లో 13 జడ్పీలను వైఎస్సార్‌సీపీ దక్కించుకోగా అందులో బీసీలకు 6 జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పదవులు (46 శాతం) కేటాయించారు.
- మండల పరిషత్ ఎన్నికల్లో 648 మండలాలకుగాను వైఎస్సార్‌సీపీ 635 మండల పరిషత్ అధ్యక్ష పదవులను దక్కించుకోగా 67 శాతం పదవులను బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల వర్గాలకే ఇచ్చారు. ఇందులో కూడా గరిష్టంగా బీసీలకే పదవులు దక్కాయి.
- 14 కార్పొరేషన్లలో వైఎస్సార్‌సీపీ క్లీన్ స్వీప్ చేయగా తొమ్మిది చోట్ల మేయర్ పదవులు (64 శాతం) బీసీలకు ఇచ్చారు.
- 87 మున్సిపాలిటీల్లో 84 మున్సిపాలిటీలను వైఎస్సార్‌సీపీ చేజిక్కించుకోగా చైర్‌పర్సన్ పదవుల్లో బీసీలకు 44(53 శాతం) ఇచ్చారు.

చట్టం చేసి మరీ నామినేటెడ్ పదవులు

- దేశ చరిత్రలో ఎక్కడా లేని రీతిలో నామినేటెడ్ పదవులు, పనుల్లో 50 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు రిజర్వేషన్ చేస్తూ సీఎం జగన్ ఏకంగా చట్టం తెచ్చారు.
- రాష్ట్రంలో 196 వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ పదవుల్లో 76 అంటే 39 శాతం బీసీలకు ఇచ్చారు.
- వివిధ ప్రభుత్వ కార్పొరేషన్లలో 137 చైర్మన్ పదవుల్లో 53 బీసీలకు ఇచ్చారు. బీసీలకు ప్రత్యేకంగా 56 కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసి ఆ వర్గాల వారికే అవకాశం కల్పించారు.
- 137 కార్పొరేషన్లకు సంబంధించి మొత్తం 484 డైరెక్టర్ పదవుల్లో 201 బీసీలకు (42 శాతం) ఇచ్చారు.

కుప్పం కోట బీసీలదే..!

ఎన్టీఆర్‌కు 1995లో వెన్నుపోటు పొడిచి అధికారాన్ని దక్కించుకోవటానికి ముందే.. 1989లోనే బీసీలకు చంద్రబాబు వెన్నుపోటు పొడిచారు. 1983 ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున చంద్రగిరి నుంచి పోటీ చేసిన చంద్రబాబు టీడీపీ అభ్యర్థి చేతిలో ఘోరంగా ఓడిపోయారు. ఆ తర్వాత టీడీపీ పంచన చేరారు. టీడీపీ ఆవిర్భావం నుంచి అంటే 1983, 1985 ఎన్నికల్లో కుప్పం నియోజకవర్గం నుంచి ఆ పార్టీ తరఫున బీసీ నేతలే పోటీ చేసి గెలుపొందారు. అక్కడ బీసీల జనాభా అధికం. తన సొంతూరు ఉన్న చంద్రగిరి నియోజకవర్గంలో రాజకీయంగా పప్పులు ఉడకవని గ్రహించిన చంద్రబాబు 1989లో కుప్పం నియోజకవర్గానికి వలస వెళ్లి రాజకీయంగా బీసీలకు ద్రోహం చేశారు. అప్పటి నుంచి కుప్పంలోనే పోటీ చేస్తూ వస్తున్నారు. తండ్రి బాటలోనే లోకేశ్ నడుస్తున్నారు. మంగళగిరి నియోజకవర్గంలో బీసీలు అధికం. 2019 ఎన్నికల్లో బీసీ నేతకు వెన్నుపోటు పొడిచి ఆ స్థానంలో పోటీ చేసిన నారా లోకేశ్ ఘోరంగా ఓడిపోయారు.

వైఎస్సార్‌సీపీ వెంటే బీసీలు..

చట్టసభల్లో జనాభా ప్రాతిపదికన బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని ప్రతిపక్షంలో ఉన్నప్పుడే రాజ్యసభలో ప్రైవేటు బిల్లును ప్రవేశపెట్టడం, అనంతరం అధికారంలోకి వచ్చాక బీసీల అభ్యున్నతికి సీఎం జగన్ చిత్తశుద్ధితో కృషి చేస్తుండటంతో ఆ వర్గాలు వైఎస్సార్‌సీపీ వెంటే నడుస్తున్నాయని రాజకీయ పరిశీలకులు స్పష్టం చేస్తున్నారు. పంచాయతీ, జిల్లా పరిషత్, మండల పరిషత్, మున్సిపల్.. తిరుపతి లోక్‌సభ, బద్వేలు, ఆత్మకూరు ఉప ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ చారిత్రక విజయాలు సాధించడం దీనికి రుజువుగా నిలిచింది. బీసీల జనాభా అధికంగా ఉన్న కుప్పం కోట కూలిపోయి చంద్రబాబు రాజకీయ పునాదులు పెకలించడానికి ఇదే కారణమని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. బీసీల అభ్యున్నతి కోసం శాశ్వత కమిషన్, కులగణన చేపట్టాలని కేంద్రాన్ని కోరుతూ శాసనసభలో సీఎం జగన్ ఏకగ్రీవ తీర్మానాన్ని ఆమోదింపజేశారు. కేంద్రం నుంచి స్పందన లేకపోవడంతో రాష్ట్రంలో కులగణన చేపట్టడానికి సిద్ధమవడం బీసీ వర్గాల అభ్యున్నతి పట్ల చిత్తశుద్ధికి నిదర్శనంగా నిలిచిందని స్పష్టం చేస్తున్నారు.

ఫ్యాషన్




శారీ డ్రేప్ గురించి మనకు తెలిసిందే
మరి బ్లౌజ్ డ్రేప్ గురించి..
దుపట్టాను జత చేసినట్టుగా ఒక డిజైన్
కొంగును చుట్టినట్టుగా మరో డిజైన్
చీరను కట్టేసినట్టుగా ఇంకో డిజైన్
అతివలను స్టైలిష్ లుక్‌తో
మెరిపించే బ్లౌజ్ డ్రేప్
సంప్రదాయమైనా.. ఇండోవెస్ట్రన్ అయినా
వేడుకల్లో ప్రత్యేకతను చూపుతుంది.

శారీ డ్రేప్‌కు దీటుగా!




లెహంగా మీదకు దుపట్టాను విడిగా వేసుకోవడం కాకుండా బ్లౌజ్‌కే ఓణీలా డ్రేప్ చేయడం ఓ ప్రత్యేకత



దుపట్టాను బ్లౌజ్‌తో కలిపి చుట్టినట్టుగా డిజైన్ చేయడం స్టైలిష్ లుక్‌తో ఆకట్టుకుంటుంది. అయితే, వేడుకను బట్టి పట్టు లేదా ఇతర మెటీరియల్‌ను ఎంచుకోవాల్సి ఉంటుంది.

చీరతో పాటు బ్లౌజ్ డిజైనింగ్‌లోనే కొంగును అమర్చేలా చేసే డిజైన్ ఎక్కువగా శారీ గౌన్స్‌లో చూస్తుంటాం. ఇది వెస్ట్రన్ స్టైల్ పార్టీలకు బాగా నప్పుతుంది.





బ్లౌజ్ డిజైన్‌లో క్రాస్ కట్ ఎంచుకొని, పవిటతో కలిపి వేసే కట్టు వేడుకలపైనా వెలిగిపోతుంటుంది.

ఒకే కలర్‌తో డిజైన్ చేసే డ్రేప్ బ్లౌజ్, లెహంగా సెట్స్ అన్ని రకాల వేడుకలకూ బాగా నప్పుతుంది.

నేడు జాతీయ పక్షుల దినోత్సవం



పాస్‌పోర్ట్ లేని అతిథులు పక్షులు.
అవి మనల్ని ఫుడ్ అడగవు.
వెచ్చటి బెడ్‌రూమ్‌లూ అడగవు.
తొణికిసలాడే నీటి తావూ
వాలడానికి విస్తారంగా చెట్లు ఉంటే చాలు.
కాని అవి వచ్చినప్పుడు
వాటిని నమిలి మింగుదామనుకుంటే?...
కుదరదు అంటున్నారు స్త్రీలు.
కేవలం డజన్ మందే.
ఒడిశాలోని అరాచండిలో ప్రతి శీతాకాలం వచ్చే
అరుదైన పక్షులను కాపాడి
తిరిగి ఇళ్లకు పంపుతారు.

శీతాకాలం సైనికులు

అంతా కలిపి ఒకటిన్నర చదరపు కిలోమీటర్లు. తేమ మైదానాలు. భువనేశ్వర్ నుంచి గంటన్నర దూరంలో ఉన్న 'బంకి' అనే ఊళ్లో ఉంటాయి. వాటిని 'అరాచండి మైదానాలు' అని పిలుస్తారు. అక్కడకు ప్రతి సంవత్సరం చలికాలంలో చలి దేశాల నుంచి వలస పక్షులు వస్తాయి. బూడిద కొంగలు, వల్లంకి పిట్టలు, పెయింటెడ్ స్టార్క్స్, చక్రవాకాలు (రడీ షెల్‌డక్)... ఇంకా డజను రకాల పక్షులు వస్తాయి. సెప్టెంబర్–అక్టోబర్ నెలల్లో ఇవి వలస వచ్చి ఫిబ్రవరి–మార్చి నాటికి తిరిగి సొంత ప్రాంతాలకు మూట ముల్లె సర్దుకుని వెళ్లిపోతాయి. దేశం కాని దేశం ఎందుకు వస్తాయవి? మనుషుల్ని నమ్మి. ఆ నమ్మకం అందరూ నిలబెట్టుకోరు. కొందరు నిలబెట్టేందుకు నడుం కడతారు.

ఆ పన్నెండు మంది

ఈ మైదానాల పక్కనే ఉండే నిస్తిపూర్ అనే గ్రామంలో నివసించే సూర్యకాంతి మొహంతి అనే గృహిణి ఒకరోజు ఈ తేమ మైదానాల వైపు వచ్చింది. అక్కడ కొంతమంది వేటగాళ్లు ఈ అందమైన పక్షులు, వలస వచ్చిన అతిథులను వేటాడుతూ కనిపించారు. ఆమె మనసు వికలమైపోయింది. తమ ఊరిని ఈ పక్షులు క్షమి



స్తాయా అనిపించింది. వెంటనే ఊళ్లో ఉన్న ఇతర గృహిణులకు ఈ విషయం చెప్పడం మొదలుపెట్టింది.

'అందరం కలిసి పక్షులను కాపాడదాం' అంది. చాలా మంది పట్టించుకోలేదు. 'లగాన్' సినిమాలో ఒక్కొక్కరూ దొరికినట్టు కేవలం 12 మంది గృహిణులు అంగీకరించారు. వీరంతా తమ భర్తలకు విషయాన్ని చెప్పి ఒప్పించారు. భర్తలు అంగీకరించాక 12 మంది కలిసి 'అరాచండి పక్షి సురక్షా సమితి'గా ఏర్పడ్డారు. ఆ తర్వాత ఆ పక్షులకు వారే తల్లిదండ్రులు, కాపలాదారులు, సైనికులుగా మారారు.

పక్షుల కోసమని

'ఈ పక్షులు ఎంతో సున్నితమైనవి. కాలుష్యం బారిన పడితే చచ్చిపోతాయి. అందుకే పక్షులను చూడటానికి వచ్చే వారిని ఇక్కడ చెత్త వేయకుండా అడ్డుపడ్డారు. అలాగే పిక్నిక్‌ల పేరుతో వచ్చి హారన్‌లు కొట్టడం, పాటలు పెట్టి సౌండ్లు చేయడం కూడా నిరోధించాం. ఈ పక్షులు చుట్టుపక్కల పొలాల నుంచే ఆహారాన్ని పొందుతాయి. అందుకే రైతుల దగ్గరకు వెళ్లి క్రిమిసంహారక మందులు ఉపయోగించని సేంద్రియ పంటలే పండించమన్నాం. రైతులు మా వేడుకోలును మన్నించారు. పక్షులు ఉన్నంత కాలం ప్రతి రోజూ మేము ఈ ప్రాంతానికి వచ్చి కాపలా కాస్తాం. ప్లకార్డులు ప్రదర్శిస్తాం. చెత్త లేకుండా చూస్తాం' అంటారు ఈ పన్నెండు మంది గృహిణులు.

మొసళ్లు తోడయ్యాయి

అయితే ఈ స్త్రీలకు మొసళ్లు కూడా తోడయ్యాయి. ఇక్కడి నీటిమడుగుల్లో మొసళ్లు ఉంటాయి. వేటగాళ్లు నీటి లోపలికి చొచ్చుకొచ్చి పక్షులను వేటాడకుండా ఈ మొసళ్ల భయం అడ్డుకుంటోంది. 'మొసళ్లు పక్షులకు కాపలా ఉన్నప్పుడు మనుషులు ఉండటానికేమి?' అంటారు ఈ స్త్రీలు. వీరి కృషి మెల్లగా పత్రికల ద్వారా ప్రభుత్వానికి తెలిసింది. అయినా సరే ప్రభుత్వం చేసే పని కన్నా ప్రజలు చేసే పనే ఎక్కువ ఫలితాన్ని ఇస్తోంది. 'ఈ పక్షులను గమనిస్తే ఎన్నో విషయాలు తెలుస్తాయి. చక్రవాకాలు గొప్ప ప్రేమతో ఉంటాయి. ఒంటరి చక్రవాకాలను చూద్దామన్నా కనిపించవు. జంటగా ఉండాల్సిందే' అంటారు ఈ స్త్రీలు.

వీరి సేవకు ప్రభుత్వ మెచ్చుకోలుకన్నా ప్రకృతి ఆశీస్సులు తప్పక దొరుకుతాయి.

వంటిల్లు



కాలం మారింది...
అరిశె కోసం జనవరి వరకు ఎదురు చూడక్కర్లేదు.
స్వగృహ ఫుడ్స్ ఏడాదంతా అందిస్తున్నాయి.
అయినా సరే...
సంక్రాంతి వస్తోందంటే ఇంట్లో బెల్లం కాగాల్సిందే.
పాకం వాసనకు పక్కింటి వాళ్ల నోరూరించాల్సిందే.
కాలం ఎంత మారినా సరే...
అసలైన అరిశె రుచి అంటే... మన వంటింటి అరిశె రుచే.

సంక్రాంతి మాధుర్యం మన వంటింట్లోనే...

బెల్లపు అరిశెలు

కావలసినవి: బియ్యం – ఒకటింపావు కిలో; బెల్లం – కిలో; నువ్వులు, గసగసాలు– కొద్దిగా; నెయ్యి లేదా నూనె– కాల్చడానికి సరిపడినంత

తయారి: బియ్యాన్ని ముందు రోజు రాత్రి శుభ్రంగా కడిగి, మునిగేటట్లు నీరు పోసి రాత్రంతా నానబెట్టాలి. ఉదయాన్నే నీళ్లను వంపేసి తడిగా ఉన్నప్పుడే దంచాలి. దంచిన పిండిని సన్నని రంధ్రాలున్న జల్లెడతో జల్లించాలి. జల్లించేటప్పుడు పిండి ఆరిపోకుండా జాగ్రత్త తీసుకోవాలి. గాలికి ఆరకుండా ఎప్పటికప్పుడు ఒకపాత్రలో వేసి అదిమి మూత పెట్టాలి. పిండి సిద్ధమయ్యాక బెల్లాన్ని పాకం పట్టాలి. ● పెద్దపాత్రలో ఒక గ్లాసు నీటిని, బెల్లం ముక్కలను వేసి పాకం వచ్చేదాకా మరగనిచ్చి బియ్యప్పిండి కలుపుకుంటే పాకం పిండి సిద్ధం. ● ఇప్పుడు బాణలిలో నూనె లేదా నెయ్యి పోసి కాగనివ్వాలి. పాకంపిండిని పూరీకి, చపాతీకి తీసుకున్నట్లుగా తీసుకుని గోళీ చేసి గసాలు లేదా నువ్వులలో లేదా రెండింటిలోనూ అద్దాలి. ఇలా అద్దినట్లయితే అవి పిండికి చుట్టూ అంటుకుంటాయి. ఆ పిండిని పాలిథిన్ పేపర్ మీద పెట్టి వేళ్లతో వలయాకారంగా అద్ది, కాగిన నూనెలో వేసి రెండువైపులా దోరగా కాలిన తర్వాత తీసి అరిశెల పీట మీద వేసి అదనంగా ఉన్న నూనె కారిపోయేటట్టు వత్తాలి. అరిశెల పీటకు బదులుగా రంధ్రాలున్న చెక్కలుంటాయి. వీటితో బాణలిలో నుంచి తీసేటప్పుడే నూనె వదిలేటట్లు వత్తేయవచ్చు.

గమనిక: అరిశె నొక్కులు పోకుండా వలయాకారంగా అంతా ఒకే మందంలో రావాలంటే చేతితో అద్దడానికి బదులుగా పూరీ ప్రెస్సర్ వాడవచ్చు. ● అరిశె మెత్తగా రావాలంటే పాకం లేతగా ఉన్నప్పుడే బియ్యప్పిండి కలుపుకోవాలి. గట్టిగా ఎక్కువ తీపిగా, ఎక్కువ రోజులు నిల్వ ఉండాలంటే ముదరు పాకం పట్టాలి. ● ఒక ప్లేటులో నీళ్లు పోసి ఉడుకుతున్న బెల్లం మిశ్రమాన్ని స్పూనుతో కొద్దిగా తీసుకుని నీటిలో వేయాలి. దీనిని చేత్తో నొక్కి రౌండ్ చేయాలి. జారిపోకుండా రౌండ్ వచ్చిందంటే పాకం వస్తున్నట్లు. ఆ రౌండ్‌ను పైకెత్తి ప్లేటు మీద వేసినప్పుడు మెత్తగా జారిపోకుండా అలాగే ఉంటే పాకం వచ్చినట్లు. ముదురు పాకం కావాలనుకుంటే ఆ పాకం బాల్ ప్లేటుకు తగిలినప్పుడు ఠంగున శబ్దం వచ్చే దాకా మరగనివ్వాలి. ● ఇవి పదిహేను రోజుల వరకు తాజాగా ఉంటాయి. తినేటప్పుడు పెనం మీద సన్న సెగకు వేడి చేస్తే అప్పటికప్పుడు చేసిన అరిశెలాగా వేడిగా, మెత్తగా వస్తాయి. ఒవెన్ ఉంటే తినే ముందు ఒక మోస్తరుగా వేడి చేసుకుంటే అప్పుడే చేసిన అరిశెల్లాగా తాజాగా ఉంటాయి. ● చక్కెర అరిశెలు చేయాలంటే బెల్లం బదులు చక్కెరతో పాకం పట్టాలి.

పూతరేకులు



కావలసినవి: బెల్లం పొడి – కేజీ; సగ్గు బియ్యం– ముప్పావు కేజీ; జీడిపప్పు, పిస్తా – పావుకేజీ (చిన్న పలుకులు చేయాలి); ఏలకుల పొడి– 5గ్రా.; నెయ్యి– 100 గ్రా.

తయారి: సగ్గుబియ్యాన్ని ఉడికించి చిక్కటి గంజి చేసుకోవాలి. పూత రేకు చేయడానికి మందపాటి నూలు వస్త్రాన్ని నలుచదరంగా కత్తిరించి సిద్ధం చేసుకోవాలి. కుండను మంట మీద బోర్లించి వేడెక్కిన తరువాత వస్త్రాన్ని సగ్గుబియ్యం గంజిలో ముంచి కుండ మీద అతికించినట్లు పరిచి వస్త్రాన్ని తీసేయాలి. గంజి కుండకు అంటుకుని వేడికి పలుచని పొరలాగా వస్తుంది. ఆ పొర చిరిగి పోకుండా అట్లకాడతో జాగ్రత్తగా తీయాలి. ఇలా ఎన్ని రేకులు కావాలంటే అన్నింటికీ ఇదే పద్ధతి. రేకు ఏ సైజులో కావాలంటే క్లాత్‌ను ఆ సైజులో కట్ చేసుకోవాలి. ● ఒకపాత్రలో బెల్లం పొడి, జీడిపప్పు, పిస్తా పలుకులు, ఏలకుల పొడి వేసి కలుపుకోవాలి. ఇప్పుడు రేకులను రెండు పొరలు తీసుకుని వాటికి నెయ్యి రాయాలి. ఆ తర్వాత బెల్లం పొడి, జీడిపప్పు పలుకులు, ఏలకుల పొడి మిశ్రమాన్ని పలుచగా వేసి పైన మరొక పొర రేకును వేసి మడత వేయాలి. ఇవి పదిహేను రోజుల వరకు తాజాగా ఉంటాయి.

కొబ్బరి బూరెలు



కావలసినవి: బియ్యప్పిండి– అరకేజీ; బెల్లం – 300గ్రా.; పచ్చి కొబ్బరి– ఒక చిప్ప; ఏలకులపొడి – ఒక టీ స్పూను; నెయ్యి– టేబుల్ స్పూన్; నూనె – కాలడానికి సరిపడినంత.

తయారి: బియ్యాన్ని శుభ్రంగా కడిగి అరిసెలకు చేసుకున్నట్లే తడిబియ్యాన్ని దంచుకోవాలి. జల్లించి పిండి ఆరిపోకుండా మూతపెట్టి పక్కన ఉంచాలి. పచ్చికొబ్బరిని తురిమి సిద్ధంగా ఉంచాలి. బెల్లాన్ని పాకం పట్టాలి. బూరెలకు పాకం ముదరకూడదు. లేతపాకం సరిపోతుంది. పాకం వచ్చిన వెంటనే కొబ్బరి తురుము వేసి కలపాలి. కొబ్బరి కలిసిన తరువాత మూడు – నాలుగు గుప్పెళ్ల బియ్యప్పిండి వేసి మంట మీద నుంచి దించేయాలి. ఇప్పుడు ఏలకుల పొడి, మిగిలిన బియ్యప్పిండిని వేసి ఉండలు కట్టకుండా సమంగా కలిసే వరకు కలిపి పైన నెయ్యి వేసి అద్ది మూత పెట్టాలి. కొబ్బరి బూరెల పిండి సిద్ధం అన్నమాట. ● బాణలిలో నూనె పోసి కాగనివ్వాలి. ఈ లోపుగా బూరెల పిండి చిన్న గోళీ అంత తీసుకుని అరచేతిలో కాని పాలిథిన్ పేపరు మీద కాని అరిసెలాగా వేళ్లతో ఒత్తి కాగిన నూనెలో వేయాలి. రెండు వైపులా దోరగా వేగిన తరువాత తీయాలి. తీసిన పదినిమిషాలకు వేడి తగ్గి బూరె రుచి ఇనుమడిస్తుంది.

ఎల్లు చిక్కీ

కావలసినవి: నువ్వులు – పావు కేజీ; బెల్లం – పావు కేజీ; నెయ్యి – టేబుల్ స్పూన్.

తయారి: నువ్వులను మందపాటి పెనంలో వేసి సన్నమంట మీద వేయించాలి. చిటపట పేలడం మొదలుపెట్టిన తర్వాత స్టవ్ ఆపేసి పెనం పక్కన పెట్టి చల్లారనివ్వాలి. ● మరొక పాత్రలో బెల్లం పొడితోపాటు టీ స్పూన్ నీటిని వేసి కరిగేవరకు మీడియం మంట మీద ఉంచాలి. కరిగిన తర్వాత మంట తగ్గించి పాకం వచ్చే వరకు ఉడికించాలి. పాకం వచ్చిన తర్వాత అందులో నువ్వులు, నెయ్యి వేసి కలపాలి. ఒక వెడల్పాటి ప్లేట్‌కు నెయ్యి రాసి బెల్లం, నువ్వుల మిశ్రమాన్ని వేసి పూరీల కర్రతో అంతటా ఒకేమందం వచ్చేటట్లు వత్తాలి. వేడి తగ్గిన తర్వాత చాకుతో ఇష్టమైన ఆకారంలో గాట్లు పెట్టాలి. చల్లారిన తర్వాత ప్లేట్ నుంచి వేరు చేసి గాలి దూరని డబ్బాలో నిల్వ చేసుకుంటే నాలుగు వారాల పాటు నిల్వ ఉంటాయి. కన్నడ భాషలో ఎల్లు అంటే నువ్వులు. నువ్వుల పట్టీని వాళ్లు ఎల్లు చిక్కీ అంటారు. పిల్లలు, మహిళల ఆరోగ్యం కోసం ఎల్లు చిక్కీని నెలకోసారి చేసుకుని రోజూ కనీసం ఒక్క పట్టీ అయినా తినాలి.



● ముగ్గు-ముచ్చట



బొడ్డేడ సూర్యప్రభ
సింహాచలం



21 చుక్కలు
7 వరుసలు
7 వచ్చేవరకు



21 చుక్కలు
మధ్య చుక్క
11 వచ్చేవరకు



రావిరాల విజయలక్ష్మి
దేవరకొండ,
నల్గొండ జిల్లా

ముగ్గులకు ఆహ్వానం



ముగ్గులు పంపవలసిన చిరునామా:
ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ,
సాక్షి టవర్స్, రోడ్ నెం.1,
బంజారాహిల్స్, హైదరాబాద్–34.
ఈ మెయిల్: muggulu.sakshi@gmail.com


● అభిషేక్ ● అపూర్వ్ కుషాల్ ● సంభవ్ జైన్

యువర్స్

● సక్సెస్ స్టోరీ



ముగ్గురు మిత్రుల ముచ్చటైన విజయం

'కాలంతో పాటు నడవాలి' అంటారు పెద్దలు.
'కాలంతో పాటు నడుస్తూనే భవిష్యత్‌పై ఒక కన్ను వేయాలి' అంటారు విజ్ఞులు.
అభిషేక్ అనిత, అపూర్వ్ కుషాల్, సంభవ్ జైన్... అనే ముగ్గురు మిత్రులు రెండో కోవకు చెందిన దార్శనికులు.
లెర్న్ అండ్ ఎర్న్ ప్లాట్‌ఫామ్ 'ఇంట్రాక్ట్'తో వెబ్3 వరల్డ్‌లో కీలక పాత్ర పోషిస్తున్నారు...

ఐటీఐ–ఢిల్లీలో చదువుకున్న అభిషేక్ అనిత, అపూర్వ్ కుషాల్, సంభవ్ జైన్ సంభాషణాల్లో సరదా విషయాల కంటే సాంకేతిక విషయాలే ఎక్కువగా చోటు చేసుకునేవి. బ్లాక్ చెయిన్ టెక్నాలజీని మొదటిసారిగా ఎప్పుడు ఉపయోగించారు? వివిధ దేశాల్లో ఈ టెక్నాలజీని ఎలా ఉపయోగిస్తున్నారు? ఏ రంగాలలో ఎక్కువగా ఉపయోగిస్తున్నారు? మన దేశంలో క్రిప్టో కరెన్సీపై పెట్టుబడులు, ఇంటర్నెట్ అభివృద్ధిలో మూడు ప్రధాన దశలు, వెబ్3 టెక్నాలజీతో అపారమైన ఉద్యోగావకాశాలు...ఇలా ఒకటా రెండా బ్లాక్‌చైన్, క్రిప్టో టెక్నాలజీ, వెబ్3 టెక్నాలజీ గురించి గంటల తరబడి మాట్లాడుకునేవారు.

వారు మాట్లాడుకున్న విషయాలేవి వృథా పోలేదు.
'ఇంట్రాక్ట్' ప్లాట్‌ఫామ్‌కు పునాదిగా ఉపయోగపడ్డాయి.

ప్రజలకు బ్లాక్ చెయిన్, క్రిప్టో టెక్నాలజీని చేరువ చేయాలనే లక్ష్యంతో 2022లో 'ఇంట్రాక్ట్' అనే స్టార్టప్ స్టార్ట్ చేశారు ముగ్గురు మిత్రులు. 'వెబ్3 టెక్నాలజీకి సంబంధించి కేవలం సమాచార వేదికగానే కాకుండా ప్రతిఫలదాయక వేదికగా ఇంట్రాక్ట్‌ని నిర్మించాం. లెర్నింగ్ అండ్ ఎర్నింగ్ అనేది ఇంట్రాక్ట్ లక్ష్యం. క్వెస్ట్, ఇంటరాక్టివ్ టాస్కుల ద్వారా బ్లాక్ చెయిన్, క్రిప్టో, వెబ్3 టెక్నాలజీతో యూజర్‌లను ఎడ్యుకేట్ చేసే ప్రయత్నం చేస్తున్నాం' అంటున్నాడు కో–ఫౌండర్ అభిషేక్.

సంక్లిష్టమైన రీతిలో కాకుండా ఫన్ అండ్ ఇంటరాక్టివ్ పద్ధతిలో కొత్త ప్రాడక్టులు, సర్వీసులను యూజర్‌లకు పరిచయం చేయడంలో 'ఇంట్రాక్ట్' విజయం సాధించింది. టాస్క్‌లను విజయవంతంగా పూర్తి చేసిన యూజర్‌లకు క్రిప్టో, ఎన్ఎఫ్‌టీ, లాయల్టీ పాయింట్స్ రూపంలో 'ప్రోత్సాహకాలు' అందిస్తోంది.

ఎన్నో కలలతో ముగ్గురు మిత్రులు 'ఇంట్రాక్ట్'ను ప్రారంభించారు. ఆ కలలకు కష్టాన్ని జోడించారు. ఆ కష్టం వృథా పోలేదు. లక్షలాది యూజర్‌లతో 'ఇంట్రాక్ట్' వెబ్3 వరల్డ్‌లో కీలక పాత్ర పోషిస్తూ ప్రాఫిటబుల్ ప్లాట్‌ఫామ్‌గా ఎదిగింది. 'ఇంట్రాక్ట్' ఇన్వెస్టర్‌లలో ఆల్ఫా వేవ్ గ్లోబల్, గుమీ క్రిప్టోస్, ఆల్కెమీ, మూన్ పే, వెబ్ 3 స్టూడియోస్, కాయిన్ బేస్...మొదలైన కంపెనీలు ఉన్నాయి. సమీకరించిన నిధులలో కొంత మొత్తాన్ని తమ టీమ్ సభ్యుల సంఖ్యను రెట్టింపు చేయడానికి, సాంకేతిక అవసరాలకు ఉపయోగించారు. సాధించిన విజయంతో సంతృప్తి పడడం లేదు ముగ్గురు మిత్రులు. భవిష్యత్ లక్ష్యాలను నిర్దేశించుకున్నారు.

వెబ్3 టెక్నాలజీపై మార్కెటింగ్ నిపుణులు, కంపెనీల ఫౌండర్‌లు దృష్టి పెట్టారు. మరో వైపు ఉద్యోగావకాశాలు లేదా ఆవిష్కరణల కోణంలో యువతరం ఆసక్తి ప్రదర్శిస్తోంది. ఈ నేపథ్యంలో పోటీగా ఎన్నో కంపెనీలు మార్కెట్‌లోకి రావచ్చు. వాటిని తట్టుకొని ముందుకు వెళ్లాలంటే ఎప్పటికప్పుడు కొత్త వ్యూహాల గురించి ఆలోచించాలనేది ముగ్గురు మిత్రులకు తెలియని విషయం కాదు.

'వెబ్3 క్రియేట్ చేసిన సరికొత్త ఆర్థిక అవకాశాలు, డిజిటల్ ఆర్థిక వ్యవస్థల గురించి పరిచయం చేసి యూజర్‌లకు ఉపయోగపడాలనేది మా లక్ష్యం' అంటున్నాడు సంస్థ కో–ఫౌండర్, సీయీవో సంభవ్ జైన్.

● మ్యూజిక్ వరల్డ్

స్వర మాయాజాలం


● షహన షోమ్

షహన షోమ్ మ్యూజికల్ జర్నీ తన అధికార యూట్యూబ్ చానల్ 'వోల్డ్ బట్ గోల్డ్'తో మొదలైంది. దీని ద్వారా బాలీవుడ్ టైమ్‌లెస్ మెలోడిస్‌ను వినిపించి ఆబాలగోపాలాన్ని అలరిస్తోంది. 'మొహబ్బత్ కర్నే వాలే' లాంటి క్లాసిక్‌తో పాటు 'సేవ్ ది గర్ల్‌చైల్డ్' 'ఎడ్యుకేషన్ ఫర్ ది అండర్‌ప్రివిలేజ్‌డ్'లాంటి సామాజిక స్పృహతో కూడిన ఇతివృత్తాలతో పాటలు పాడుతుంది. చిన్నప్పుడు సినిమా పాటలే కాదు క్లాసిక్ గజల్స్, కీర్తనలు పాడేది. ప్రముఖ సంగీతకారుల వర్ధంతిని దృష్టిలో పెట్టుకొని వారికి నివాళిగా యూట్యూబ్‌లో చేసే పాటల కార్యక్రమాలు సూపర్‌హిట్ అయ్యాయి.'పాత పాటలు పాడుతుంటే కాలమే తెలియదు. టైమ్‌మెషిన్‌లో గతంలోకి వెళ్లినట్లుగా అనిపిస్తుంది' అంటున్న షహనకు దేశవ్యాప్తంగా ఎంతోమంది అభిమానులు ఉన్నారు. తన పాటల ద్వారా వివిధ సామాజిక సేవా కార్యక్రమాలకు నిధులను సేకరించడంలో కూడా ముందు ఉంటుంది. 'పాటల ద్వారా సామాజిక సందేశాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లడం నా లక్ష్యాలలో ఒకటి' అని చెబుతుంది షహన.

● టెక్.. టాక్



మోటోరోలా మోటో జీ4 ప్లే

సైజ్	: 5.00 అంగుళాలు
బరువు	: 137 గ్రా.
ర్యామ్	: 2జీబి స్టోరేజ్ : 16జీబి
బ్యాటరీ	: 2800 ఎంఏహెచ్

వివో వి30 లైట్

సైజ్	: 6.67 అంగుళాలు
రిఫ్రెష్ రేట్	: 120 హెచ్‌జడ్
బ్యాటరీ	: 4,800 ఎంఏహెచ్
బరువు	: 190 గ్రా.
ర్యామ్	: 12జీబి
స్టోరేజ్	: 256జీబి
ఆండ్రాయిడ్:	ఫన్‌టచ్ వోఎస్ 13
కలర్స్	: బ్లాక్ ఫారెస్ట్ అండ్ రోజ్ గోల్డ్



యాంటీ–స్లిప్ ఫోన్ హోల్డర్



బ్రాండ్	: వోహ
డైమెన్షన్స్	: 20x10x10 సీఎం
కలర్	: మల్టీ కలర్
కంపాటబుల్	: స్మార్ట్‌ఫోన్స్
మౌంటింగ్	: కార్ డాష్‌బోర్డ్

● ఆయిల్ రెసిస్టెన్స్ బరువు : 200 గ్రా.

వాట్సాప్‌లో డిజిటల్ అవతార్ క్రియేట్ చేయడానికి...



1. వాట్సాప్ ఓపెన్ చేసి స్క్రీన్ అప్పర్ రైట్ కార్నర్‌లోని త్రీ డాట్స్ ట్యాప్ చేసి 'సెలెక్టింగ్స్'ను సెలెక్ట్ చేసుకోవాలి. 2. ప్రొఫైల్ ఫోటో–క్లిక్ . 3. అప్పర్ రైట్ కార్నర్‌లోని 'ఎడిట్' క్లిక్ చేయాలి. 4. మెనూ నుంచి 'యాడ్ అవతార్'ను సెలెక్ట్ చేసుకోవాలి. 5. అవతార్‌ను క్రియేట్ చేసిన తరువాత 'సేవ్' బటన్ నొక్కాలి. 6. స్క్రీన్ బాటమ్‌లోని 'యూజ్ యాజ్ ప్రొఫైల్ పిక్చర్' సెలెక్ట్ చేసుకోవడం ద్వారా అవతార్‌ను ప్రొఫైల్ ఇమేజ్‌గా ఉపయోగించుకోవచ్చు.

● అవును... ఇది నిజమే!



● స్టాండర్డ్ టైమ్ జోన్స్‌కు ముందు యూఎస్‌లో వివిధ ప్రాంతాలలో వివిధ టైమ్ జోన్స్ ఉండేవి. సూర్యుడి స్థానం ఆధారంగా వోన్ లోకల్ టైమ్‌ను సెట్ చేసుకునేవారు. 1918లో యూఎస్ అధికారికంగా స్టాండర్డ్ టైమ్‌జోన్ సిస్టమ్‌ను ఎడాప్ట్ చేసుకుంది.

● స్విట్జర్లాండ్‌లోని కొన్ని థియేటర్‌లలో టాయిలెట్ స్క్రీన్‌లు ఉంటాయి! టాయిలెట్ బ్రేక్ తీసుకున్నప్పుడు మూవీని మిస్ కాకుండా ఉండడానికి ఈ ఏర్పాటు చేశారు.

● జపాన్ రాజధాని టోక్యోలో 'ది రెస్టారెంట్ ఆఫ్ మిస్టేకెన్ ఆర్డర్స్' అనే రెస్టారెంట్ ఉంది. దీనిలో ఒక వంటకం ఆర్డర్ ఇస్తే ఇంకో వంటకం మన టేబుల్ మీద ఉంటుంది. దీనికి కారణం ఈ రెస్టారెంట్‌లోని వెయిటర్‌లు డిమెన్షియా బాధితులు. డిమెన్షియాపై ప్రజలకు అవగాహన కలిగించే ప్రయత్నంలో భాగంగానే డిమెన్షియా బాధితులకే ఈ రెస్టారెంట్‌లో ఉద్యోగాలు ఇస్తారు.

● గేమింగ్



ఢీ అంటే ఢీ 2.5డీ

యాక్షన్–అడ్వెంచర్ గేమ్ 'ప్రిన్స్ ఆఫ్ పర్షియా: ది లాస్ట్ క్రౌన్' ఈ నెల 18న విడుదల కానుంది. ఈ గేమ్ కథానాయకుడు సర్గాన్ ఎంత ఎత్తు నుంచి అయినా దూకగలడు. ఎయిర్ డ్యాష్ ఇవ్వగలడు. మెరుపు వేగంతో రకరకాల ప్లాట్‌ఫామ్స్ మధ్య ప్రయాణించగలడు. శత్రువును ఎలా ఓడించాలో, ఏ సమయంలో ఎలాంటి ఆయుధం వాడలో సర్గాన్‌కు బాగా తెలుసు. కంబాట్, ప్లాట్‌ఫామింగ్ పర్పస్ కోసం టైమ్–బేస్‌డ్ పవర్స్‌తో ప్లేయర్ యాక్సెస్ కావచ్చు. ఎన్నో అడ్వెంచర్‌లకు కేంద్రమైన 'ది లాస్ట్ క్రౌన్' 2.5డీ సైడ్–స్క్రోలింగ్ యాక్షన్–అడ్వెంచర్ ప్లాట్‌ఫామ్ వీడియో గేమ్.

జానర్స్: యాక్షన్–అడ్వెంచర్, మెట్రోవోడ్వెనియా **మోడ్:** సింగిల్ ప్లేయర్
ప్లాట్‌ఫామ్స్: నిన్‌టెండో స్విచ్, ప్లే స్టేషన్ 4, ప్లే స్టేషన్ 5, విండోస్, ఎక్స్‌బాక్స్ వన్, ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్

English Idioms

ఏ పాట్ ఆన్ ది బ్యాక్

మంచి పనిచేసినప్పుడు, ఏదైనా విషయంలో ప్రతిభ చాటుకున్నప్పుడు ఇతరులను ప్రశంసించే సందర్భంలో వాడే మాట...
ఏ పాట్ ఆన్ ది బ్యాక్.
ఉదా: యూ హ్యావ్ డన్ ఏ గ్రేట్ జాబ్, అండ్ యూ డిజర్వ్ ఏ పాట్ ఆన్ ది బ్యాక్.

★ ★ ★

లాక్, స్టాక్ అండ్ బారెల్

'ఆల్' 'ఎవ్రీథింగ్' 'టోటల్' అని చెప్పడానికి ఉపయోగించే మాట...
లాక్, స్టాక్ అండ్ బారెల్.
ఉదా: ఉయ్ లాస్ట్ ఎవ్రీ థింగ్–లాక్, స్టాక్ అండ్ బ్యారెల్

సినిమా

మరో లేడీ ఓరియంటెడ్ మూవీలో..?


● అనుష్క

'అరుంధతి', 'భాగమతి' వంటి ఉమెన్ సెంట్రిక్ హిట్స్‌తో ఈ జానర్ చిత్రాలకు ఓ స్పెషలిస్ట్‌గా మారిపోయారు అనుష్కా శెట్టి. తాజాగా ఆమె మరో ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చే అవకాశాలు ఉన్నాయనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. దర్శకుడు క్రిష్ ఇటీవల ఓ ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్ స్టోరీని డెవలప్ చేశారని, ఈ కథలో అనుష్క అయితే బాగుంటుందని ఆయన అనుకుంటున్నారనీ టాక్. గతంలో క్రిష్ దర్శకత్వంలో వచ్చిన 'వేదం' (2010) సినిమాలో అనుష్క ఓ లీడ్ రోల్ చేసిన విషయం గుర్తుండే ఉంటుంది. మరి.. పద్నాలుగేళ్లకు క్రిష్–అనుష్క కాంబో కుదురుతుందా? అనేది వేచి చూడాల్సిందే.

వన్ ప్లస్ వన్ ఈక్వెల్ టు త్రీ!


● అమలా పాల్, జగత్ దేశాయ్

వన్ ప్లస్ వన్ ఈక్వెల్ టు త్రీ అంటున్నారు అమలా పాల్. తాను తల్లి కాబోతున్న విషయాన్ని అమలా పాల్ ఈ విధంగా వెల్లడించి, ఓ ఫొటోను సోషల్ మీడియాలో షేర్ చేశారు. గత ఏడాది నవంబరులో వ్యాపారవేత్త జగత్ దేశాయ్‌తో అమలా పాల్ ఏడడుగులు వేశారు. గురువారం తాము దంపతులు కానున్నట్లుగా వెల్లడించారు జగత్–అమలాపాల్.

పవర్‌ఫుల్ సత్యభామ


● కాజల్ అగర్వాల్

హీరోయిన్ కాజల్ అగర్వాల్ టైటిల్ రోల్‌లో రూపొందుతున్న చిత్రం 'సత్యభామ'. సుమన్ చిక్కాల దర్శకత్వం వహిస్తున్నారు. దర్శకుడు శశికిరణ్ తిక్క ఈ చిత్రానికి సమర్పకులుగా వ్యవహరించడంతో పాటు స్క్రీన్ ప్లే అందించారు. బాబీ తిక్క, శ్రీనివాసరావు తక్కలపల్లి నిర్మిస్తున్నారు. ఈ సినిమాకి సంబంధించి ఓ భారీ షెడ్యూల్‌ను పూర్తి చేశారు. ఈ సందర్భంగా దర్శక–నిర్మాతలు మాట్లాడుతూ–''సత్యభామ'లో కాజల్ అగర్వాల్ ఓ పవర్‌ఫుల్ పోలీసాఫీసర్ పాత్ర చేస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించి 35 రోజుల పాటు ఓ భారీ షెడ్యూల్ పూర్తి చేశాం. ఈ షెడ్యూల్‌లో భారీ యాక్షన్ సన్నివేశాల్లో పాల్గొన్నారు కాజల్. ఫైట్ మాస్టర్ సుబ్బు ఆధ్వర్యంలో ఈ యాక్షన్ సీక్వెన్స్‌లను తెరకెక్కించాం. గతంలో ఎప్పుడూ కనిపించని యాక్షన్ మోడ్‌లో కాజల్ కనిపిస్తారు. ఈ సినిమాలోని పోరాట ఘట్టాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. తాజా షెడ్యూల్‌తో 90శాతం షూటింగ్ పూర్తయింది. త్వరలోనే విడుదల తేదీ ప్రకటిస్తాం'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: శ్రీ చరణ్ పాకాల, కెమెరా: జి. విష్ణు, సహనిర్మాత: బాలాజీ.

ఐదు చిత్రాలొస్తే సమస్యే

- 'దిల్' రాజు

''గత ఏడాది సంక్రాంతికి మూడు సినిమాలు విడుదలైతే ఎంత రచ్చ జరిగిందో తెలిసిందే. అలాంటిది ఈ సంక్రాంతికి ఐదు చిత్రాలొస్తే ఎన్ని సమస్యలొస్తాయో అనిపించింది. నిర్మాతలు విశ్వప్రసాద్, వివేక్ కూఛిబొట్లగారు మాట్లాడారు. పరిస్థితిని రవితేజగారికి కూడా వివరించి 'ఈగల్' సినిమా సంక్రాంతి విడుదలని వాయిదా వేసుకున్నారు. తర్వాత వారి సినిమా రిలీజ్‌కి చాంబర్ ద్వారా సోలో డేట్ ఇప్పించాలని గురువారం చర్చించుకుని నిర్ణయించాం'' అని నిర్మాత 'దిల్' రాజు అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని నిర్మాతల మండలి కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి అధ్యక్షుడు 'దిల్' రాజు మాట్లాడుతూ– ''మా 'ఫ్యామిలీస్టార్' మూవీ సంక్రాంతి రిలీజ్ నుంచి తప్పుకున్నాక మిగిలిన నిర్మాతలతో మాట్లాడి, వాస్తవ పరిస్థితులను వివరించాం. ఐదు సినిమాల్లో (గుంటూరు కారం, హను–మాన్, సైంధవ్, ఈగల్, నా సామి రంగ) ఒక్కటైనా రిలీజ్‌లో వెనక్కి తగ్గినా మిగిలిన సినిమాలపై ఎఫర్ట్స్ పెట్టవచ్చని. ఓ సినిమా వాయిదా పడటం వల్ల మిగతా నాలుగు సినిమాలకు ఎంతో కొంత రెవెన్యూ పెరగడానికి, స్క్రీన్స్ దొరకడానికి అవకాశం ఉంటుంది. చాంబర్ అడిగినందుకు సహకరించిన 'ఈగల్' నిర్మాతలకు థ్యాంక్స్. మిగిలిన సినిమాలకు స్క్రీన్స్ కేటాయిస్తాం. ప్రేక్షకులు ఎగ్జైట్‌మెంట్‌లో మార్నింగ్ షోకి పరిగెత్తేదే పెద్ద సినిమా. మహేశ్‌గారి సినిమాకి ఎక్కువ స్క్రీన్స్ వెళతాయి. ఆ తర్వాత వెంకటేశ్(సైంధవ్), నాగార్జున(నా సామిరంగ) గార్ల సినిమాలకు, ఆ తర్వాత 'హను–మాన్'కి వెళతాయి'' అన్నారు.


● దిల్ రాజు, దామోదర ప్రసాద్, సునీల్ నారంగ్, విశ్వప్రసాద్

ఫిబ్రవరి 9న ఈగల్

ఇంకా 'దిల్' రాజు మాట్లాడుతూ– ''ఈగల్' సినిమాని ఫిబ్రవరి 9న రిలీజ్ చేస్తామని నిర్మాతలు అడిగారు. ఆ రోజు 'టిల్లు స్క్వేర్', 'యాత్ర 2' సినిమాల విడుదలని ఇప్పటికే ప్రకటించారు. నిర్మాత నాగవంశీతో మాట్లాడితే సంక్రాంతికి 'గుంటూరు కారం'తో వస్తున్నందున 'టిల్లు స్క్వేర్' రిలీజ్ వాయిదాకి ఒప్పుకున్నారు. యూవీ క్రియేషన్స్ వంశీతో మాట్లాడి.. అవకాశం ఉంటే 'యాత్ర 2'ని ఒక వారం తర్వాతో, ముందో రిలీజ్ చేయమని అడుగుతాం'' అన్నారు. తెలుగు చలన చిత్ర నిర్మాతల మండలి అధ్యక్షుడు నిర్మాత కేఎల్ దామోదర్ ప్రసాద్ మాట్లాడుతూ– ''ఈగల్' సినిమా రిలీజ్‌ని వాయిదా వేస్తూ, మంచి నిర్ణయం తీసుకున్నందుకు కృతజ్ఞతలు'' అన్నారు. ''పరిస్థితిని రవితేజగారికి వివరించడంతో ఆయన కూడా 'ఈగల్' వాయిదాకి అంగీకరించారు'' అన్నారు టీజీ విశ్వప్రసాద్.

ఈ కార్యక్రమంలో నిర్మాతలు తుమ్మల ప్రసన్న కుమార్, వెంకట్ బోయనపల్లి, వివేక్ కూఛిబొట్ల, కె. నిరంజన్ రెడ్డి పాల్గొన్నారు.

హను–మాన్ చూసి సంతోషంగా బయటికొస్తారు

- నిర్మాత కె. నిరంజన్‌రెడ్డి



''సోషియో ఫ్యాంటసీ అంశాలతో కూడిన సూపర్ హీరో జానర్ మూవీ 'హను–మాన్'. ఆంజనేయ స్వామిని ఎలా చూడాలని ప్రేక్షకులు కోరుకుంటారో 'హను–మాన్'లో అలానే చూస్తారు. సినిమా చూసిన ప్రేక్షకులంతా థియేటర్స్ నుంచి సంతోషంగా బయటికొస్తారు'' అన్నారు నిర్మాత కె. నిరంజన్ రెడ్డి. తేజ సజ్జా, అమృతా అయ్యర్ జంటగా ప్రశాంత్ వర్మ దర్శకత్వం వహించిన చిత్రం 'హను–మాన్'. శ్రీమతి చైతన్య సమర్పణలో కె. నిరంజన్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 12న విడుదలవుతోంది. ఈ సందర్భంగా విలేకరులతో కె. నిరంజన్ రెడ్డి చెప్పిన విశేషాలు.

● మాది నల్గొండ. నేను హైదరాబాద్‌లోనే పుట్టి, పెరిగాను. నాకు సినిమా నేపథ్యం లేదు. మా నాన్న రిటైర్డ్ ప్రభుత్వోద్యోగి. సినిమా అంటే ప్యాషన్‌తో ఈ రంగంలోకి వచ్చాను. ఎంతో ప్యాషన్‌తో చేసిన 'హను–మాన్' ప్రేక్షకులకు నచ్చుతుంది. మా బ్యానర్ నుంచి వచ్చే చిత్రాలన్నీ కంటెంట్ బేస్డ్‌గానే ఉంటాయి. 25 ఏళ్ల పాటు ఈ రంగంలో ఉండాలనే లక్ష్యంతో వచ్చాను. 'హను–మాన్' నా తొలి చిత్రం. ఫస్ట్ మూవీనే గ్రాండ్‌గా నిర్మించడం, సంక్రాంతికి రావడం హ్యాపీగా ఉంది. ● 'హను–మాన్' ముందు అనుకున్న బడ్జెట్ కంటే ఐదు రెట్లు పెరిగింది. ప్రశాంత్ వర్మ విజన్, కథపై నమ్మకంతోనే రాజీ పడలేదు. మా నమ్మకాన్ని నిజం చేస్తూ వ్యాపారం కూడా అద్భుతంగా జరిగింది. ఈ సంక్రాంతికి ఐదు సినిమాలు విడుదలవుతున్నాయి. అయితే మా 'హను–మాన్' కథపై పూర్తి నమ్మకం ఉంది. కథని నమ్మి తీసిన 'బేబీ, బలగం' సినిమాలు ఇదే విషయాన్ని నిరూపించాయి. మా సినిమా కూడా వాటిలా లాంగ్ రన్‌గా ఉంటుంది. ● ప్రేక్షకులు ఫ్యామిలీతో కలసి మా సినిమా చూడాలని కోరుకుంటున్నారని తెలిసింది. దీనికి తగినట్లు హను–మాన్‌ని ఓ ప్రత్యేకమైన సినిమాలా భావించి, ఇండస్ట్రీవారు సహకరించాలని కోరుకుంటున్నాను. నాలుగు సినిమాలు వస్తున్నప్పుడు ఆయా మూవీ స్కేల్, బజ్‌కి తగ్గట్టు థియేటర్స్ కేటాయించాలనేదే మా విన్నపం.

రీల్స్

సినిమా రిలీజ్ చేయడం పెద్ద టాస్క్

- నిర్మాత విజయ్


● శివశక్తి, కిశోర్, విజయ్ మట్టపల్లి


కిశోర్ కేఎస్‌డి, దియా సితెపల్లి జంటగా శివశక్తి రెడ్డి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'ప్రేమకథ'. విజయ్ మట్టపల్లి, సుశీల్ వాజపిల్లి, శింగనమల కల్యాణ్ నిర్మించిన ఈ చిత్రం నేడు రిలీజ్ కానుంది. గురువారం జరిగిన ఈ చిత్రం ప్రీ రిలీజ్ ప్రోగ్రామ్‌లో.. ''రియాల్టీకి దగ్గరగా ఉండే లవ్‌స్టోరీ ఫిల్మ్ ఇది'' అన్నారు దర్శకుడు శివ. ''ఓ సినిమా తీయడం కన్నా, దాన్ని కరెక్ట్‌గా రిలీజ్ చేయడం పెద్ద టాస్క్‌గా మారింది. 'మధుర' శ్రీధర్, ధీరజ్, శింగనమల కల్యాణ్‌లు ఈ సినిమా విడుదలలో హెల్ప్ చేశారు'' అన్నారు విజయ్. ''ప్రేక్షకులు ఓ కొత్త లవ్‌స్టోరీ చూస్తారు'' అన్నారు సుశీల్.

వజ్రాన్వేషణలో...


● మౌర్యాణి

కిరణ్, మౌర్యాణి జంటగా సీరపు రవికుమార్ దర్శకత్వం వహించిన చిత్రం 'పింకీ'. పి. పద్మావతి సమర్పణలో పసుపులేటి వెంకటరమణ నిర్మించిన ఈ సినిమా ఫిబ్రవరి మొదటి వారంలో రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో పసుపులేటి వెంకటరమణ మాట్లాడుతూ– ''జరిగిన కథ, జనం' చిత్రాలను స్వీయ దర్శకత్వంలో నిర్మించా. 'జనం పార్ట్ 2' షూటింగ్‌లో ఉంది. రవికుమార్ చెప్పిన కథ నచ్చడంతో 'పింకీ' సినిమా నిర్మించా. ప్రస్తుతం సెన్సార్ పనులు జరుగుతున్నాయి'' అన్నారు. ''ఒక డైమండ్ కోసం జరిగే అన్వేషణే ఈ చిత్రం. ఫ్యామిలీ, సస్పెన్స్, థ్రిల్లర్ మూవీ'' అన్నారు సీరపు రవికుమార్.

భిన్నమైన ఆట


● గీతానంద్, నేహా

గీతానంద్, నేహా సోలంకి జంటగా దయానంద్ దర్శకత్వంలో రవి కస్తూరి నిర్మించిన చిత్రం 'గేమ్ ఆన్'. ఈ చిత్రం ఫిబ్రవరి 2న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు దయానంద్ మాట్లాడుతూ– ''ఈ చిత్రంలో తన జీవితాన్ని చాలించాలనుకునే ఓ వ్యక్తి రియల్ టైమ్ సైకలాజికల్ గేమ్‌లోకి ఎలా ప్రవేశించాడు? ఈ ఆట ఎవరు ఆడిస్తున్నారు? అనే అంశాలు ఆసక్తికరంగా ఉంటాయి'' అన్నారు. ''విభిన్నమైన కథతో రూపొందిన చిత్రం ఇది. ఈ మూవీతో గీతానంద్ కెరీర్ నెక్ట్స్ లెవెల్‌కి వెళ్తుంది'' అన్నారు రవి కస్తూరి. ఈ చిత్రానికి సంగీతం: అభిషేక్ ఏఆర్.

కళాశాలలో చల్లగాలి


● ప్రణవ్, షజ్ఞ శ్రీ

ప్రణవ్, షజ్ఞ శ్రీ జంటగా శ్రీనాథ్ పులకురం దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ప్రభుత్వ జూనియర్ కళాశాల'. కొవ్వూరి అరుణ సమర్పణలో భువన్ రెడ్డి కొవ్వూరి నిర్మించిన ఈ సినిమా త్వరలో రిలీజ్ కానుంది. కార్తీక్ రోడ్రిగ్జ్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'చల్లగాలి..' అంటూ సాగే వీడియో సాంగ్‌ని రిలీజ్ చేశారు. ''2000 సంవత్సరంలో పుంగనూరులో జరిగిన ఓ వాస్తవ ఘటన ఆధారంగా ఈ సినిమా తీశాం'' అన్నారు శ్రీనాథ్ పులకురం. ''మంచి కథతో తీసిన ఈ చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు భువన్ రెడ్డి. ''ప్రేక్షకుల ఆలోచనలు రెండు దశాబ్దాలు వెనక్కి వెళ్లేలా రియలిస్టిక్‌గా ఈ సినిమా చేశాం'' అన్నారు ప్రణవ్.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	491	71,848
నిఫ్టీ ▲	141	21,659

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (రాత్రి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	14,581	▽	11
డోజోన్స్	37,582	▲	152
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,723	▲	41
డాక్స్	16,617	▲	79
షాంఘై	2,954	▽	13
నికాయ్	33,288	▽	176

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (24 క్యారెట్)	61,930
బంగారం (22 క్యారెట్)	58,980
వెండి (కేజీ)	78,000

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.91	83.93
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	104.20	106.98
€	యూరో	ఒకటి	89.98	92.35
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	57.56	58.88
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	55.28	57.22
S$	సింగపూర్ డాలర్	ఒకటి	61.69	63.49
SAR	సౌదీ రియాల్	పది	21.19	22.29
UAE D	యూఏఈ దిర్హామ్	పది	21.54	23.36
¥	చైనా యువాన్	పది	10.48	12.39

ఫండ్స్‌లో 'జియో' మార్క్!

- బ్లాక్‌రాక్‌తో కలసి జాయింట్ వెంచర్
- లైసెన్స్ కోసం సెబీ వద్ద దరఖాస్తు
- త్వరలోనే అనుమతులు వచ్చే అవకాశం
- మ్యూచువల్ ఫండ్స్‌లో పెరగనున్న పోటీ



న్యూఢిల్లీ: టెలికంలో మాదిరే మ్యూచువల్ ఫండ్స్ లోనూ 'జియో' మార్క్ కనిపించనుందా..? ముకేశ్ అంబానీకి చెందిన జియో ఫైనాన్షియల్, ప్రపంచంలోనే అతిపెద్ద అస్సెట్ మేనేజర్ అయిన బ్లాక్‌రాక్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్‌తో జాయింట్ వెంచర్ ఏర్పాటు చేయడంతో అందరిలోనూ ఇదే ప్రశ్న తలెత్తుతోంది. కొన్ని సవాళ్లు ఉన్నప్పటికీ, జియో తనదైన ప్రత్యేక ముద్ర వేసే అవకాశాలు లేకపోలేదన్నది అంచనా. తక్కువ చార్జీలతో వినూత్నమైన ఫండ్స్ ఉత్పత్తులు, ఆకర్షణీయమైన రేట్లకే రుణాలను ఆఫర్ చేయవచ్చన్న అంచనాలు నెలకొన్నాయి. రిలయన్స్ గ్రూప్‌నకు దేశంలోనే అతిపెద్ద రిటైల్ స్టోర్ నెట్‌వర్క్ ఉంది. 40 కోట్లకు పైగా టెలికం కస్టమర్లు ఉన్నారు. ఇవన్నీ జియో ఫండ్స్‌కు కలిసొచ్చే అంశాలు.

రుణ సేవలు ఆరంభం

జియో ఫైనాన్షియల్ సర్వీసెస్‌కు చెందిన జియో ఫైనాన్స్ తన రుణ వితరణ వ్యాపారాన్ని ఇప్పటికే ప్రారంభించింది.

త్వరలో ఫండ్స్ సేవలు

ఫండ్ వ్యాపారాన్ని ప్రారంభించేందుకు వీలుగా జియో ఫైనాన్షియల్ సర్వీసెస్, బ్లాక్‌రాక్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ జాయింట్ వెంచర్ (జేవీ) పెట్టుకున్న అభ్యర్థనకు త్వరలో సెబీ నుంచి గ్రీన్ సిగ్నల్ రానుంది. జియో ఫైనాన్షియల్, బ్లాక్‌రాక్ చెరో 150 మిలియన్ డాలర్లను జేవీ కింద ఇన్వెస్ట్ చేయడం కోసం నిర్ణయించుకున్నాయి.

మరిన్ని సంస్థల కన్ను..

కోల్‌కతా కేంద్రంగా స్టాక్ బ్రోకింగ్ సేవలు అందిస్తున్న అబీరా సెక్యూరిటీస్ కూడా మ్యూచువల్ ఫండ్ లైసెన్స్ కోసం తిరిగి దరఖాస్తు చేసుకుంది. ఏంజెల్ వన్ సంస్థకు మ్యూచువల్ ఫండ్స్ సేవలు ప్రారంభించేందుకు గతేడాది ఫిబ్రవరి 8న సెబీ సూత్రప్రాయ ఆమోదం తెలియజేయగా, తుది రిజిస్ట్రేషన్ ప్రస్తుతం సెబీ పరిశీలనలో ఉంది. గతేడాది జూన్‌లో బజాజ్ ఫిన్‌సర్వ్ అస్సెట్ మేనేజ్‌మెంట్ ఫండ్స్ సేవలను ప్రారంభించింది. అక్టోబర్‌లో సమీర్ అరోరాకు చెందిన హీలియోస్ మ్యూచువల్ ఫండ్స్ సేవలు మొదలు పెట్టగా, అదే సమయంలో జెరోదా ఫండ్ సేవలు కూడా ప్రారంభమయ్యాయి. కెన్నెత్ యాండ్రడేకి చెందిన ఓల్డ్ బ్రిడ్జ్ క్యాపిటల్ మేనేజ్‌మెంట్‌కు సెబీ నుంచి ఇటీవలే తుది ఆమోదం లభించింది. పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్ సంస్థ యూనిఫి క్యాపిటల్‌కు సెబీ నుంచి గత నవంబర్‌లో సూత్రప్రాయ ఆమోదం లభించింది. ప్రస్తుతం దేశ ఫండ్స్ పరిశ్రమలో సుమారు 45 సంస్థలు ఉన్నాయి.

జియో కొత్త కస్టమర్లు 31.59 లక్షలు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: రిలయన్స్ జియో 2023 అక్టోబర్‌లో కొత్తగా 31.59 లక్షల మంది మొబైల్ కస్టమర్లను సొంతం చేసుకుంది. ట్రాయ్ ప్రకారం.. గతేడాది అక్టోబర్‌లో భారతీ ఎయిర్‌టెల్ 3.52 లక్షల మంది వినియోగదార్లను నూతనంగా చేర్చుకుంది. వొడాఫోన్ ఐడియా 20.44 లక్షల మంది చందాదార్లను పోగొట్టుకుంది. అక్టోబర్‌లో తోడైన వినియోగదార్లతో కలిపి రిలయన్స్ జియో మొత్తం సబ్‌స్క్రైబర్ల సంఖ్య 45.23 కోట్లకు చేరింది. ఎయిర్‌టెల్ చందాదార్ల మొత్తం సంఖ్య 37.81 కోట్లకు ఎగసింది. వొడాఫోన్ ఐడియా వినియోగదార్ల సంఖ్య 22.54 కోట్లకు పడిపోయింది. అక్టోబర్ నాటికి మొత్తం యాక్టివ్ సబ్‌స్క్రైబర్లు14 లక్షలు తగ్గి 104.5 కోట్లకు చేరారు. సెప్టెంబర్‌తో పోలిస్తే అక్టోబర్‌లో బ్రాడ్‌బ్యాండ్ వినియోగదార్లు 0.37 శాతం అధికమై 88.8 కోట్లకు చేరారు.

మార్కెట్ మళ్లీ లాభాల్లోకి..

- రెండు రోజుల నష్టాలకు చెక్
- సెన్సెక్స్ 491 పాయింట్లు అప్
- నిఫ్టీ లాభం 141 పాయింట్లు
- ఫైనాన్స్, రియల్టీ షేర్లకు డిమాండ్



ముంబై: రెండు రోజుల వరుస నష్టాల తర్వాత స్టాక్ సూచీలు మళ్లీ పుంజుకొని గురువారం లాభాలు ఆర్జించాయి. త్రైమాసిక రుణ వృద్ధి, వ్యాపారాలు మెరుగుపడినట్లు వెల్లడైన డేటాతో ఫైనాన్స్ కంపెనీల షేర్లు, కొత్త ఇళ్లకి డిమాండ్ పెరగొచ్చనే అంచనాలతో రియల్టీ షేర్లు, భారీ పెట్టుబడి ప్రణాళికల కారణంగా ఇంధన షేర్లు రాణించాయి. ఫలితంగా సెన్సెక్స్ 491 పాయింట్లు పెరిగి 71,848 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 141 పాయింట్లు బలపడి 21,659 వద్ద నిలిచింది. ఉదయం లాభాలతో మొదలైన సూచీలు రోజంతా స్థిరంగా ముందుకు కదలాయి. ఆటో, మెటల్ మినహా అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించాయి. ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 598 పాయింట్లు బలపడి 71,955 వద్ద, నిఫ్టీ 169 పాయింట్లు బలపడి 21,686 పాయింట్ల వద్ద ఇంట్రాడే గరిష్టాలను అందుకున్నాయి. కంపెనీల డిసెంబర్ త్రైమాసిక ఆర్థిక ఫలితాలపై సానుకూల అంచనాలతో మార్కెట్లో చిన్న, మధ్య తరహా షేర్లకు భారీ డిమాండ్ నెలకొంది. బీఎస్ఈ మిడ్, స్మాల్ సూచీలు వరుసగా 1.50%, 1.04% చొప్పున పెరిగాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1,513 కోట్ల షేర్లను కొన్నారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1,387 కోట్ల షేర్లను అమ్మేశారు. డాలర్ మారకంలో రూపాయి విలువ 7 పైసలు పెరిగి 83.23 వద్ద స్థిరపడింది. ఫెడరల్ రిజర్వ్ మినిట్స్‌లో ఈ ఏడాది వడ్డీ రేట్ల తగ్గింపు ఎప్పటి నుంచి అనే అంశంపై స్పష్టత కొరవడడంతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి. బ్యాంకుల ప్రకటించిన ఆరోగ్యకరమైన గృహ రుణాల పంపిణీ డేటా, వడ్డీరేట్లు తగ్గే అవకాశం అంచనాలతో రానున్న రోజుల్లో ఇళ్లకు డిమాండ్ పెరగొచ్చనే ఆశావహ అంచనాలతో రియల్టీ రంగ షేర్లకు ఊపునిచ్చింది. సెన్సెక్స్ 491 పాయింట్లు పెరగడంతో ఇన్వెస్టర్లు సంపదగా భావించే బీఎస్ఈలోని కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.3.24 లక్షల కోట్లు పెరిగి రూ.368 లక్షల కోట్లకు చేరింది.

డిసెంబర్‌లో 'తయారీ' నెమ్మది

18 నెలల కనిష్ట స్థాయికి సూచీ



న్యూఢిల్లీ: తయారీ రంగం డిసెంబర్‌లో పేలవ పనితీరును ప్రదర్శించింది. ఎస్ అండ్‌పీ గ్లోబల్ నిర్వహించిన హెచ్‌ఎస్‌బీసీ ఇండియా మ్యానుఫ్యాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ 54.9కి పడిపోయింది. ఇది 18 నెలల కనిష్ట స్థాయి. కాగా ఈ సూచీ 50 పైన కొనసాగితే వృద్ధి ధోరణిగా పరిగణిస్తారు. ఆ దిగువకు పడిపోతేనే క్షీణతగా విశ్లేషిస్తారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

5-1-2024	
విశాఖ	625-00
చిత్తూరు	608-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	585-00
విజయవాడ	585-00
4-1-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	582-00
వరంగల్	584-00

తక్కువ సుంకాల విధానానికి మళ్లాలి

డీపీఐఐటీ కార్యదర్శి రాజేశ్ కుమార్



న్యూఢిల్లీ: దేశీయంగా పరిశ్రమ శైశవ దశలోనే ఉందంటూ, తయారీదారుల ప్రయోజనాలను పరిరక్షించే ఉద్దేశంతో కస్టమ్స్ సుంకాలను అధిక స్థాయిలో కొనసాగించే పరిస్థితి ఎంతో కాలం ఉండదని డీపీఐఐటీ కార్యదర్శి రాజేశ్ కుమార్ సింగ్ తెలిపారు. భారత్ క్రమంగా తక్కువ సుంకాల విధానాలకు మళ్లాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. వాస్తవానికి టారిఫ్‌లను ఆదాయ వనరుగా పరిగణించలేమని తెలిపారు. టారిఫ్‌ల విధింపుతో బలహీనంగా ఉన్న రంగాలను పరిరక్షించాల్సిన అవసరం తప్పకుండా ఉన్నప్పటికీ.. మెరుగ్గా ఉన్న రంగాలకూ అధిక సుంకాల రక్షణ కల్పించాల్సిన అవసరం ఉండదని సింగ్ చెప్పారు.అంతర్జాతీయంగా సరఫరా వ్యవస్థలకు మరింత అనుసంధానమయ్యేందుకు భారత్ దిగుమతి సుంకాలను తగ్గించాల్సి ఉంటుందని నిపుణులు అభిప్రాయపడుతుండగా, ఆటోమొబైల్ తదితర రంగాలు దాన్ని వ్యతిరేకిస్తున్నాయి.

అధిక పింఛను వివరాలకు వ్యవధి

మే 31 వరకు పొడిగింపు



న్యూఢిల్లీ: అధిక పింఛను కోసం దరఖాస్తు చేసుకున్న సభ్యుల తరఫున వేతన వివరాలు అప్‌లోడ్ చేసేందుకు యాజమాన్యాలకు ఈపీఎఫ్‌వో మరింత గడువు ఇచ్చింది. తొలుత ఇచ్చిన గడువు డిసెంబర్ 31తో ముగిసిపోగా, దీన్ని ఈ ఏడాది మే 31 వరకు పొడిగించినట్టు కేంద్ర కార్మిక శాఖ వెల్లడించింది. అధిక పింఛను కోసం వేతనం నుంచి మరింత చందా చెల్లించేందుకు వీలుగా ఆన్‌లైన్‌లో ఆప్షన్ ఇచ్చే అవకాశాన్ని ఈపీఎఫ్‌వో లోగడ కల్పించడం తెలిసిందే. 2023 ఫిబ్రవరి 26న ఆన్‌లైన్ ఆప్షన్ సదుపాయం అందుబాటులోకి వచ్చింది. తొలుత 2023 మే వరకు అవకాశం ఇవ్వగా, రెండు విడతలుగా పెంపుతో జూలై 11 వరకు వెసులుబాటు కల్పించింది. మొత్తం 17.49 లక్షల మంది సభ్యులు అధిక పింఛను కోసం ఆప్షన్ ఇచ్చారు. తాజా నిర్ణయంతో వేతన వివరాలను అప్‌లోడ్ చేసేందుకు యాజమాన్యాలకు మరింత వ్యవధి లభించింది

కాఫీ డే చెల్లింపుల వైఫల్యం

రుణాలు, వడ్డీలు కలిపి రూ. 434 కోట్లు



న్యూఢిల్లీ: కాఫీ డే ఎంటర్‌ప్రైజెస్ తాజాగా రూ. 434 కోట్ల రుణ చెల్లింపుల్లో విఫలమైంది. డిసెంబర్ త్రైమాసికానికల్లా బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు అసలు, వడ్డీ కలిపి రూ. 434 కోట్లు చెల్లించవలసి ఉండగా.. చెల్లించలేకపోయినట్లుగా కంపెనీ వెల్లడించింది. ఆస్తుల పరిష్కార ప్రక్రియ(రిజల్యూషన్) ద్వారా రుణ భారాన్ని తగ్గించుకుంటున్న కంపెనీ లిక్విడిటీ సంక్షోభం కారణంగా రుణ చెల్లింపులను చేపట్టలేకపోయినట్లు వివరించింది. బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు రూ. 183.36 కోట్లు, వడ్డీ చెల్లింపులు రూ. 5.78 కోట్లు చెల్లించలేకపోయినట్లు సీడీఈఎల్ పేర్కొంది. ఇదేవిధంగా రూ.200 కోట్ల విలువైన అన్‌లిస్టెడ్ రుణ సెక్యూరిటీలు, ఎన్‌సీఆర్‌పీఎస్‌లతోపాటు రూ. 44.77 కోట్లమేర వడ్డీ చెల్లింపుల్లోనూ విఫలమైనట్లు తెలియజేసింది. 2019 జూలైలో కంపెనీ వ్యవస్థాపకుడు, చైర్మన్ సిద్ధార్థ ఆత్మహత్యకు పాల్పడిన సంగతి తెలిసిందే.

వివో ఎక్స్ 100 సిరీస్


ధర రూ.89,999 వరకు



న్యూఢిల్లీ: స్మార్ట్‌ఫోన్ తయారీ సంస్థ వివో తాజాగా ఎక్స్100 సిరీస్ ఫోన్లను భారత్‌లో ప్రవేశపెట్టింది. ఎక్స్100 ధర రూ.63,999-69,999, ఎక్స్100 ప్రో రూ.89,999గా ఉంది. ప్రీమియం సెగ్మెంట్‌లో వాటాను పెంచుకోవడానికి వీటిని పరిచయం చేసినట్టు కంపెనీ గురువారం ప్రకటించింది. అత్యంత నాణ్యమైన చిత్రాలు, వీడియోల కోసం జైస్ కెమెరా పొందుపరిచారు. వినియోగదారులకు విప్లవాత్మక మొబైల్ ఫొటోగ్రఫీ అనుభవాన్ని అందించాలనే నిబద్ధతకు ఎక్స్100 నిదర్శనమని వివో తెలిపింది. సూర్యోదయం, సూర్యాస్తమయం సమయంలో సూర్యుని ఫోటోలను సులభంగా తీసేందుకు వీలుగా టెలిఫోటో సన్‌షాట్ ఫీచర్‌తో ఇవి రూపుదిద్దుకున్నాయి. రూ.30,000లు ఆపైన ధర కలిగిన స్మార్ట్‌ఫోన్ల విభాగంలో వివో మార్కెట్ వాటా 2023 రెండవ త్రైమాసికంలో 22 శాతానికి చేరుకుంది.

యూపీఐ చెల్లింపులకు చార్జీలు!

పెద్ద వ్యాపారులు చెల్లించాల్సిందే



ముంబై: వచ్చే మూడేళ్లలో పెద్ద వ్యాపారులు యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ఆధారిత చెల్లింపులకు చార్జీలు చెల్లించాల్సి ఉంటుందని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) చీఫ్ ఎగ్జిక్యూటివ్, ఎండీ దిలీప్ అస్బే గురువారం వెల్లడించారు. నగదుకు ప్రత్యామ్నాయ చెల్లింపులను అందించడం, యూపీఐని విస్తృతం చేయడంపై ప్రస్తుతం దృష్టి సారించామని తెలిపారు. బాంబే చార్టర్డ్ అకౌంటెంట్స్ సొసైటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బ్యాంకులు తమ ఐటీ బడ్జెట్‌లో సైబర్ సెక్యూరిటీ, ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీపై ఖర్చులను ఇప్పుడున్న 10 నుంచి 25 శాతానికి పెంచాల్సిన అవసరం ఉందన్నారు. యూపీఐ ఆధారిత చెల్లింపులపై చార్జీలు విధింపు అంశంపై పరిశ్రమ నుంచి విముఖత వ్యక్తం అవుతోంది. ప్రస్తుతం యూపీఐ సేవలు అందించే సంస్థలకు ప్రభుత్వం పరిహారం చెల్లిస్తోంది.

"ఇది కూడా క్రికెట్ పిచే కదా. ఆడింది మ్యాచే కదా! మ్యాచ్ రిఫరీలకు, ఐసీసీకి ఏం జరిగిందో కనబడిందనే అనుకుంటున్నా. మరి దీనికేం రేటింగ్ ఇస్తారు? భారత్‌లో ప్రపంచకప్ ఫైనల్ కోసం తయారు చేసిన పిచ్‌పై ఓ బ్యాటర్ సెంచరీ చేసినా దానికి 'యావరేజ్' రేటింగ్ ఇస్తారు. ఇవేం ద్వంద్వ ప్రమాణాలు మరి! ఐసీసీ గానీ, రిఫరీలు గానీ తటస్థంగా ఉండాలి. కేప్‌టౌన్‌లో ఏం జరిగిందో అందరూ చూశారు. పిచ్ ఎలా ఉందో అందరికీ తెలుసు. నిజాయితీగా చెబుతున్నా... ఇలాంటి పిచ్‌లపై ఆడేందుకు నాకైతే ఎలాంటి ఇబ్బందులు లేవు. అలాగే విదేశీ జట్లు కూడా భారత్‌కు వచ్చినపుడు మూడు రోజుల్లో ముగిస్తే, స్పిన్ తిరిగితే ఇవేం పిచ్‌లు, ఇదేం చెత్త అని నోరుపారేసుకోవడం ఆపితే మంచిది. -రోహిత్ శర్మ, భారత జట్టు కెప్టెన్

నేటి నుంచి రంజీ ట్రోఫీ క్రికెట్ టోర్నీ

దేశంలోని వివిధ నగరాల్లో భారత దేశవాళీ క్రికెట్ టోర్నమెంట్ రంజీ ట్రోఫీకి శుక్రవారం తెర లేవనుంది. ఎలైట్ డివిజన్‌లో 32 జట్లు... ప్లేట్ డివిజన్‌లో 6 జట్లు ఉన్నాయి. ఎలైట్ డివిజన్ తొలి రౌండ్ మ్యాచ్‌లో విశాఖపట్నంలో బెంగాల్‌తో ఆంధ్ర జట్టు... ప్లేట్ డివిజన్‌లో నాగాలాండ్ జట్టుతో హైదరాబాద్ తలపడతాయి.



టి20 సిరీస్‌కు 'సై'

- నేడు ఆస్ట్రేలియాతో భారత్ తొలి మ్యాచ్
- రాత్రి గం. 7:30 నుంచి స్పోర్ట్స్-18, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

నవీ ముంబై: ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌ను కోల్పోయిన భారత మహిళల జట్టు టి20 సిరీస్‌కు సిద్ధమైంది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా నేడు ఇరు జట్ల మధ్య తొలి టి20 జరగనుంది. వన్డే సిరీస్‌లో నిరాశపరిచిన హర్మన్‌ప్రీత్ కౌర్ జట్టు టి20ల్లో సమష్టిగా రాణించాల్సిన అవసరం ఉంది. స్మృతి మంధాన, రిచా, షఫాలీ వర్మ, జెమీమాలతో పాటు హర్మన్‌ప్రీత్ కూడా తనవంతు పాత్రను పోషించాలి. మరోవైపు ఆస్ట్రేలియా జట్టు వన్డే సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసి జోరు మీదుంది. ఫోబీ లిచ్‌ఫీల్డ్, తాలియా, అనాబెల్ మంచి ఫామ్‌లో ఉన్నారు.

ఆస్ట్రేలియా 116/2

సిడ్నీ: పాకిస్తాన్, ఆస్ట్రేలియా జట్ల మధ్య చివరిదైన మూడో టెస్టు రెండో రోజు ఆటకు వర్షం ఆటంకం కలిగించింది. ఓవర్‌నైట్ స్కోరు 6/0తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆస్ట్రేలియా వెలుతురులేమి, వర్షం కారణంగా ఆటను నిలిపి వేసే సమయానికి 47 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 116 పరుగులు చేసింది. చివరి టెస్టు ఆడుతున్న ఆసీస్ ఓపెనర్ డేవిడ్ వార్నర్ 34 పరుగులు సాధించి అవుటయ్యాడు. ఖ్వాజా (47; 4 ఫోర్లు) అర్ధ సెంచరీని చేజార్చుకున్నాడు. లబుషేన్ (23 బ్యాటింగ్), స్మిత్ (6 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. పాకిస్తాన్ తొలి ఇన్నింగ్స్‌లో 313 పరుగులకు ఆలౌటైంది.

స్నేహ దీప్తి 173

సిక్కింపై ఆంధ్ర భారీ విజయం



రాంచీ: బీసీసీఐ సీనియర్ మహిళల వన్డే క్రికెట్ టోర్నమెంట్‌లో ఆంధ్ర జట్టు శుభారంభం చేసింది. సిక్కిం జట్టుతో జరిగిన మ్యాచ్‌లో ఆంధ్ర 246 పరుగుల తేడాతో నెగ్గింది. ముందుగా ఆంధ్ర జట్టు 50 ఓవర్లలో 4 వికెట్లకు 327 పరుగులు చేసింది. ఆంధ్ర జట్టు కెప్టెన్ స్నేహ దీప్తి (134 బంతుల్లో 22 ఫోర్లు, 4 సిక్స్‌లతో 173) అద్భుత సెంచరీ చేసింది. ఎస్.అనూష (68 నాటౌట్; 4 ఫోర్లు), దుర్గ (56; 8 ఫోర్లు) అర్ధ సెంచరీలు సాధించారు. సిక్కిం జట్టు 41.4 ఓవర్లలో 82 పరుగులకే ఆలౌటైంది. శరణ్య (2/22), చంద్రలేఖ (2/10), బి.అనూష (2/13) రాణించారు.



బుమ్రా

రెండు రోజుల్లోనే...

ఆఖరి టెస్టులో భారత్ 7 వికెట్లతో జయభేరి | **చరిత్రకెక్కిన విజయంతో సఫారీ టూర్ ముగింపు** | **రెండో ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికాను కూల్చేసిన బుమ్రా** | **మార్క్‌రమ్ సెంచరీ వృథా**

తగ్గేదేలే... సినిమా డైలాగ్‌లా ఉంది సఫారీలో భారత పర్యటన తీరు! తొలి టెస్టును ఆతిథ్య జట్టు మూడు రోజుల్లోనే ముగిస్తే... రెండో టెస్టును టీమిండియా రెండు రోజుల్లోనే ఖతం చేసింది. మొదటి మ్యాచ్ ముగియగానే అందరూ 'భారత్ సొంతగడ్డపై పులి... విదేశాల్లో పిల్లి' అని నిట్టూర్చారు. ఇప్పుడదే విమర్శకులు 'ఔరా' అని విస్తుపోయేలా మన పేస్ పేట్రేగిపోయింది. అచ్చిరాని కేప్‌టౌన్‌లో కేక పెట్టింది. క్రీజులోకి దిగిన బ్యాటర్ల గుండెల్లో గుబులు రేపింది. ఇన్నేళ్లుగా ఏ వేదికపై గెలవలేకపోయామో అక్కడే చరిత్రకెక్కే గెలుపుతో భారత్ మళ్లీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరుకుంది.

కేప్‌టౌన్: క్రికెట్‌నే శ్వాసించే భారత అభిమానులకు ఈ కొత్త సంవత్సరం కిక్ ఇచ్చే గిఫ్ట్‌ను టీమిండియా ఇచ్చింది. ఆఖరి రెండో టెస్టులో 7 వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికాను చిత్తు చేసింది. మొత్తం సఫారీ పర్యటనలో మూడు ఫార్మాట్‌ల సిరీస్‌ను సాధికారంగా ముగించింది. గత డిసెంబర్‌లో టి20 సిరీస్‌తో ఈ పర్యటన మొదలైంది. టి20 సిరీస్‌ను 1-1తో సమం చేసుకున్న టీమిండియా... వన్డే సిరీస్‌ను 2-1తో కైవసం చేసుకుంది. తాజాగా టెస్టు సిరీస్‌ను 1-1తో సమంగా ముగించింది. తద్వారా ఏ ఒక్క సిరీస్‌లోనూ తగ్గలేదు సరికదా... పైపెచ్చు వన్డేలతో ఒకమెట్టుపైనే నిలిచింది.

అలా మొదలై... ఇలా కుదేలైంది!

తొలిరోజే 23 వికెట్లతో ఆసక్తికర పేస్ డ్రామాకు తెర లేపిన మ్యాచ్... రెండో రోజు అదే పేస్ పదునుకు తెరపడేలా చేసింది. ఓవర్‌నైట్ స్కోరు 62/3తో గురువారం రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన దక్షిణాఫ్రికా 36.5 ఓవర్లలో 176 పరుగులకే కుప్పకూలింది. ఇంత తక్కువ జట్టు స్కోరులోనూ మార్క్‌రమ్ (103 బంతుల్లో 106; 17 ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీ హైలైట్ కాగా... తొలి ఇన్నింగ్స్‌ను సిరాజ్ కూల్చితే... రెండో ఇన్నింగ్స్‌లో ఆ పని బుమ్రా (6/61) చేశాడు. 98 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం వల్ల భారత్ లక్ష్యం 79 పరుగులతో మరింత చిన్నదైంది. దీన్ని టీమిండియా 12 ఓవర్లలోనే మూడు వికెట్లు కోల్పోయి 80 పరుగులతో చకచకా ఛేదించింది.

ఒకడి పోరాటం... మరొకడి పేస్ ప్రతాపం

టెస్టుల్లో ఆటంటే ఐదు రోజులు. నాలుగు ఇన్నింగ్స్‌లు... 15 సెషన్లు... 450 ఓవర్లు... 40 వికెట్లు... అంటే అందరూ (బ్యాటింగ్) డబుల్ యాక్షన్ చేయాల్సిందే! అన్ని రోజులు శ్రమించినా... ప్రతి సెషన్లోనూ చెమటోడ్చినా చాలా టెస్టుల్లో (డ్రాలతో) ఫలితమే రాదు! కేప్‌టౌన్‌లో మాత్రం పేస్ పదునుకు, భారత్ పట్టుదలకు ఒక వంతు (ఐదు సెషన్లలోపే)లోనే, రెండు రోజులు పూర్తవకముందే భారత్ జయభేరి మోగించింది. తొలి సెషన్లో దక్షిణాఫ్రికా ఓవర్‌నైట్ బ్యాటర్ మార్క్‌రమ్ వన్డేను తలపించే ఆటతీరుతో చకచకా పరుగులు సాధించాడు. మరోవైపు బుమ్రా... బెడింగ్‌హామ్ (11), కైల్ వెరిన్ (9)లను పడగొట్టడంలో సఫలమయ్యాడు. దీని వల్ల జట్టు స్కోరు వంద పరుగుల్లోపే సగం (85/5) వికెట్లను కోల్పోగా, మార్క్‌రమ్ ఫిఫ్టీ కూడా పూర్తయ్యింది. పిచ్ సంగతి, బుమ్రా పేస్ నిప్పులు వెంటనే అర్థమైపోవడంతో మార్క్‌రమ్ ధనాధన్ బౌండరీలతో సెంచరీ సాధించాడు. కానీ ఈలోపే బుమ్రా కూడా జాన్సెన్ (11), కేశవ్ మహరాజ్ (3) వికెట్లను చేజిక్కించుకున్నాడు. మార్క్‌రమ్ పోరాటానికి సిరాజ్ బౌలింగ్‌లో చుక్కెదురవగా... మిగతా టెయిలెండర్లు లంచ్‌లోపే అవుటయ్యారు. ఇక రెండో సెషన్‌లో లక్ష్యఛేదనకు దిగిన భారత్ రెండో ఇన్నింగ్స్‌లో క్రీజులోకి దిగిన వారంతా వేగంగా బ్యాటింగ్ చేశారు. యశస్వి జైస్వాల్ (23 బంతుల్లో 28; 6 ఫోర్లు), గిల్ (11 బంతుల్లో 10; 2 ఫోర్లు), కోహ్లి (11 బంతుల్లో 12; 2 ఫోర్లు) అవుట్‌కాగా, కెప్టెన్ రోహిత్ (16 నాటౌట్; 2 ఫోర్లు), శ్రేయస్ అయ్యర్ (4 నాటౌట్; 1 ఫోర్) అజేయంగా ముగించారు. సిరాజ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించగా... 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' పురస్కారాన్ని ఎల్గర్, బుమ్రా సంయుక్తంగా గెల్చుకున్నారు.



టెస్టు సిరీస్ ట్రోఫీతో భారత కెప్టెన్ రోహిత్ శర్మ, దక్షిణాఫ్రికా కెప్టెన్ డీన్ ఎల్గర్

స్కోరు వివరాలు

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: 55 ఆలౌట్; భారత్ తొలి ఇన్నింగ్స్: 153 ఆలౌట్; దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్: మార్క్‌రమ్ (సి) రోహిత్ శర్మ (బి) సిరాజ్ 106; ఎల్గర్ (సి) కోహ్లి (బి) ముకేశ్ 12; జోర్జి (సి) రాహుల్ (బి) ముకేశ్ 1; స్టబ్స్ (సి) రాహుల్ (బి) బుమ్రా 1; బెడింగమ్ (సి) రాహుల్ (బి) బుమ్రా 11; వెరిన్ (సి) సిరాజ్ (బి) బుమ్రా 9; జాన్సెన్ (సి అండ్ బి) బుమ్రా 11; కేశవ్ మహరాజ్ (సి) అయ్యర్ (బి) బుమ్రా 3; రబడ (సి) రోహిత్ శర్మ (బి) ప్రసిధ్ కృష్ణ 2; బర్గర్ (నాటౌట్) 6; ఎన్‌గిడి (సి) యశస్వి (బి) బుమ్రా 8; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (36.5 ఓవర్లలో ఆలౌట్) 176. వికెట్ల పతనం:** 1-37, 2-41, 3-45, 4-66, 5-85, 6-103, 7-111, 8-162, 9-162, 10-176. **బౌలింగ్:** బుమ్రా 13.5-0-61-6, సిరాజ్ 9-3-31-1, ముకేశ్ కుమార్ 10-2-56-2, ప్రసిధ్ కృష్ణ 4-1-27-1.

భారత్ రెండో ఇన్నింగ్స్: యశస్వి జైస్వాల్ (సి) స్టబ్స్ (బి) బర్గర్ 28; రోహిత్ శర్మ (నాటౌట్) 16; శుబ్‌మన్ గిల్ (బి) రబడ 10; కోహ్లి (సి) వెరిన్ (బి) జాన్సెన్ 12; శ్రేయస్ అయ్యర్ (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (12 ఓవర్లలో మూడు వికెట్లకు) 80. వికెట్ల పతనం:** 1-44, 2-57, 3-75. **బౌలింగ్:** రబడ 6-0-33-1, బర్గర్ 4-0-29-1, జాన్సెన్ 2-0-15-1.

642 భారత్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య రెండో టెస్టులో ఫలితం రావడానికి వచ్చిన బంతులు (107 ఓవర్లు). తక్కువ బంతుల పరంగా, ఓవర్ల పరంగా టెస్టు క్రికెట్‌లో ఫలితం వచ్చిన టెస్టుగా ఈ మ్యాచ్ రికార్డు పుస్తకాల్లో ఎక్కింది. 1932లో ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా మధ్య మెల్‌బోర్న్‌లో జరిగిన టెస్టులో 656 బంతుల్లో ఫలితం వచ్చింది.

3 రెండు రోజుల్లోనే ముగిసిన టెస్టులో భారత జట్టు నెగ్గడం ఇది మూడోసారి. గతంలో భారత జట్టు అఫ్గానిస్తాన్‌పై (బెంగళూరులో-2018), ఇంగ్లండ్‌పై (అహ్మదాబాద్‌లో-2021) ఈ ఘనత సాధించింది. ఓవరాల్‌గా ఇప్పటి వరకు 25 టెస్టుల్లో రెండు రోజుల్లోనే ఫలితం వచ్చింది.

1 కేప్‌టౌన్‌లో భారత జట్టు టెస్టులో నెగ్గడం ఇదే తొలిసారి. గతంలో ఈ వేదికపై భారత్ ఆరు టెస్టులు ఆడి రెండింటిని 'డ్రా' చేసుకొని, నాలుగింటిలో ఓడింది. దక్షిణాఫ్రికా గడ్డపై భారత జట్టు రెండోసారి బ్యాటింగ్ చేసి టెస్టులో గెలవడం ఇదే మొదటిసారి. గతంలో ఇక్కడ భారత్ నెగ్గిన నాలుగు టెస్టుల్లో తొలుత బ్యాటింగ్ ప్రారంభించింది.

5 దక్షిణాఫ్రికా గడ్డపై భారత జట్టు గెలిచిన టెస్టుల సంఖ్య (జోహనెస్‌బర్గ్‌లో-2, డర్బన్‌లో-1, సెంచూరియన్‌లో-1, కేప్‌టౌన్‌లో-1). దక్షిణాఫ్రికా గడ్డపై భారత్ మొత్తం 25 టెస్టుల ఆడగా ... ఐదు టెస్టుల్లో విజయం సాధించింది. 13 టెస్టుల్లో ఓడిపోయింది. ఏడింటిని 'డ్రా' చేసుకుంది.

2 ఒక టెస్టు మ్యాచ్‌లో ఇద్దరు భారత పేస్ బౌలర్లు (సిరాజ్, బుమ్రా) రెండు ఇన్నింగ్స్‌లలో ఆరు లేదా అంతకంటే ఎక్కువ వికెట్లు తీసుకోవడం ఇది రెండోసారి మాత్రమే. 2014లో ఇంగ్లండ్‌తో లార్డ్స్‌లో జరిగిన టెస్టులో భువనేశ్వర్ (తొలి ఇన్నింగ్స్‌లో 6/82), ఇషాంత్ శర్మ (రెండో ఇన్నింగ్స్‌లో 7/74) తొలిసారి ఈ ఘనత సాధించారు.

4 రాహుల్ ద్రవిడ్ (2006), ధోని (2010), కోహ్లి (2018, 2021) తర్వాత దక్షిణాఫ్రికా గడ్డపై భారత జట్టుకు టెస్టులో విజయాన్ని అందించిన నాలుగో కెప్టెన్‌గా రోహిత్ శర్మ గుర్తింపు పొందాడు.

2 దక్షిణాఫ్రికా గడ్డపై టెస్ట్ సిరీస్‌ను 'డ్రా'గా ముగించడం భారత జట్టుకిది రెండోసారి. ధోని సారథ్యంలో 2010-2011లో మూడు టెస్టుల సిరీస్‌ను భారత్ 1-1తో సమంగా ముగించింది. ఇప్పుడు రోహిత్ శర్మ కెప్టెన్సీలో రెండు టెస్టుల సిరీస్‌ను టీమిండియా 1-1తో 'డ్రా'గా ముగించింది.

1 దక్షిణాఫ్రికా గడ్డపై టెస్టు సిరీస్‌లో 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్' అవార్డు గెల్చుకున్న తొలి భారతీయ క్రికెటర్‌గా బుమ్రా గుర్తింపు పొందాడు.

4 కేప్‌టౌన్‌లో రెండు రోజుల్లోనే ఫలితం వచ్చిన టెస్టులు. 1889, 1896లో దక్షిణాఫ్రికా-ఇంగ్లండ్ జట్ల మధ్య రెండు టెస్టులు... 2005లో దక్షిణాఫ్రికా-జింబాబ్వే జట్ల మధ్య ఒక టెస్టు రెండు రోజుల్లోనే ముగిశాయి.

దివ్యాంగుల విద్యాభివృద్ధికి కృషి చేయాలి

సమగ్ర శిక్షా ఎస్పీడీ బి. శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి: దివ్యాంగ విద్యార్థుల అభివృద్ధికి ప్రత్యేక ఉపాధ్యాయులు, ఐఈఆర్పీలు కృషి చేయాలని సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు బి.శ్రీనివాసరావు సూచించారు. అంతర్జాతీయ బ్రెయిలీ దినోత్సవం సందర్భంగా గురువారం సమగ్ర శిక్షా రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన వెబ్ ఎక్స్ ద్వారా ప్రత్యేక ఉపాధ్యాయులకు, ఐఈఆర్పీలను ఉద్దేశించి శ్రీనివాసరావు మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో భవితా కేంద్రాల నిర్వహణ, దివ్యాంగ విద్యార్థులకు అలవెన్సులు, ఉపకరణాలు అందించడం ద్వారా ప్రతి దివ్యాంగ విద్యార్థి లబ్ధి పొందేలా ఉపాధ్యాయులు శ్రద్ధ వహించాలన్నారు. దివ్యాంగ విద్యార్థులు దేనికీ తీసిపోరని, గతేడాది ఆరుగురు దివ్యాంగ (అంధ) విద్యార్థులు పబ్లిక్ పరీక్షలు డిజిటల్ విధానంలో రాసి ఉత్తీర్ణత సాధించి, వినూత్న చరిత్ర సృష్టించారని గుర్తు చేశారు. ఏఎస్పీడీ శ్రీనివాసులురెడ్డి, కోఆర్డినేటర్ ఎన్కే అన్నపూర్ణ పాల్గొన్నారు.

తన్నుకుంటూ ఈడ్చుకుపోతాం

సమస్యపై నిలదీసిన మహిళకు టీడీపీ నేతల బెదిరింపులు

పెండ్లిమర్రి : వైఎస్సార్ జిల్లా కమలాపురం నియోజకవర్గంలో టీడీపీ మద్దతుదారైన ఓ మహిళపై అదే పార్టీకి చెందిన నాయకులు దౌర్జన్యం చేశారు. పెండ్లిమర్రి మండలం పగడాలపల్లిలో భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించడానికి గురువారం సాయంత్రం టీడీపీ ఇంచార్జ్ పుత్తా నరసింహారెడ్డి, మండల కన్వీనర్ గంగిరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు గ్రామానికి వెళ్లారు. ప్రతి ఇంటికీ వెళ్తుండగా పార్టీ మద్దతుదారులైన పి.మల్లారెడ్డి భార్య లక్ష్మీదేవి తమ భూమి సమస్య తీర్చలేదంటూ పుత్తా నరసింహారెడ్డి, కన్వీనర్ గంగిరెడ్డిని నిలదీసింది. ఎన్నిసార్లు పార్టీకి మద్దతుగా నిలిచినా సాయం చేసే నాథుడు కరువయ్యాడని వాపోయింది. కోపోద్రిక్తుడైన పుత్తా నరసింహారెడ్డి ఆమెను దూషిస్తూ ఇంటి నుంచి బైటికి వెళ్లిపోయారు. అంతలోనే అక్కడికొచ్చిన నరసింహారెడ్డి బంధువు నర్రెడ్డి కిశోర్‌రెడ్డి ఆమెపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ 'పుత్తా గురించి మాట్లాడితే తన్నుకొంటూ కట్టేసుకుని ఈడ్చుకుని పోతాం.. తమాషాలు చేస్తున్నారా' అని ఆగ్రహంతో ఊగిపోయాడు. దీంతో సానుభూతిపరులతో పాటు ఈ కార్యక్రమానికి వచ్చిన పార్టీ నాయకులు కంగుతిన్నారు. ప్రజలు ఏదైనా సమస్యపై అడిగితే.. ఇలా ఆగ్రహం వ్యక్తం చేయడమేంటని ముక్కున వేలేసుకున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'వైఎస్సార్ రైతు భరోసా ఛానల్' దుమ్ము దులిపేస్తోంది. మూడేళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఈ చానల్ నిరంతరాయంగా వీక్షకుల మన్ననలు పొందుతోంది. రైతాంగానికి కావాల్సిన సలహాలిస్తూ, వ్యవసాయం అనుబంధ రంగాలకు సూచనలు అందించి తోడ్పాటు ఇవ్వడంలో ముందు వరుసలో ఉంది. ఫలితంగా తక్కువ కాలంలోనే రైతులు ఆర్బీకే ఛానల్‌పై అధిక సంతృప్తి కనపరుస్తున్నారు. సొంతగా యూ ట్యూబ్ ఛానెల్ నెలకొల్పి అన్నదాతకు ఆసరాగా నిలబడుతుండడంతో ఏపీ ప్రభుత్వాన్ని పలు రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకొని అక్కడ కూడా ఏర్పాటు చేసేలా అడుగులు వేస్తున్నాయి. అన్నపూర్ణగా వెలుగొందుతున్న ఏపీ వ్యవసాయ రంగంలో కాలానికి తగినట్టుగా విప్లవాత్మక మార్పులు రావడంతో రైతాంగం హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఆర్బీకే ఛానల్ లో ప్రసారం చేస్తున్న విధానాన్ని పరిశీలిస్తున్న విదేశీ ప్రతినిధి బృందం సభ్యులు (ఫైల్)

డిజిటల్‌లో దుమ్ము దులిపేస్తోంది

వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం ఛానల్‌కు అరకోటి దాటిన వ్యూయర్‌షిప్

- వ్యవసాయ అనుబంధ రంగాలకు ప్రత్యేక ఛానల్.. దేశంలోనే తొలి ప్రయోగం
- జాతీయస్థాయిలో గుర్తింపు పొంది మూడేళ్లలోనే 55 లక్షలకు చేరిన వ్యూయర్‌షిప్
- 2.75 లక్షల సబ్‌స్క్రిప్షన్‌తో 1,628 సాగు సంబంధిత వీడియోలు అప్‌లోడ్
- ఏపీ స్ఫూర్తితో సొంతంగా ఛానల్ ఏర్పాటు దిశగా రాజస్థాన్

సాక్షి, అమరావతి: వైఎస్సార్ రైతు భరోసా ఛానల్ అనతి కాలంలోనే అన్నదాతలతో పాటు వ్యవసాయ అనుబంధ రంగాలకు చెందిన వారి మన్ననలు చూరగొంటోంది. ప్రారంభించి మూడేళ్లు కూడా పూర్తి కాకుండానే 2.75లక్షల సబ్‌స్క్రిప్షన్, 55 లక్షల వ్యూయర్ షిప్‌తో దూసుకుపోతోంది. దేశంలో మరెక్కడా లేని విధంగా 'ఆర్బీకే' పేరిట ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈ యూ ట్యూబ్ ఛానల్ జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది. కేంద్రంతోపాటు పొరుగు రాష్ట్రాలు, జాతీయ, అంతర్జాతీయ సంస్థలు, ప్రముఖుల ప్రశంసలందుకుంటోంది. ఏపీ స్ఫూర్తితో ఇప్పటికే రాజస్థాన్ ప్రభుత్వం రైతుల కోసం సొంతంగా యూ ట్యూబ్ ఛానల్ ఏర్పాటు చేస్తుండగా.. పలు రాష్ట్రాలు ఆ దిశగా అడుగులు వేస్తున్నాయి. నీతి ఆయోగ్, ఐసీఏఆర్, ఆర్బీఐ వంటి జాతీయ సంస్థలకే కాదు వరల్డ్‌బ్యాంక్, యూఎస్‌కు చెందిన ఎఫ్ఏఓతోపాటు వివిధ దేశాల ప్రముఖులను సైతం ఆకట్టుకుంది. తెలంగాణ, తమిళనాడు, కేరళ, రాజస్థాన్‌తో పాటు వివిధ రాష్ట్రాల మంత్రులు, ఉన్నతాధికారులు ఛానల్‌ను సందర్శించి నిర్వహణ తీరును ప్రశంసించారు.

ఎస్ఎంఎస్ ద్వారా రైతులకు సమాచారం

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు సాగులో వస్తున్న నూతన విధానాలను ఎప్పటికప్పుడు డిజిటల్ మీడియా ద్వారా రైతులకు చేరువ చేసే లక్ష్యంతో ఆర్బీకే ఛానల్‌ను ఏర్పాటు చేసింది. రైతుల అభ్యుదయ గాథలు, ఆదర్శ రైతుల అనుభవాలను ఆకట్టుకునేలా తీర్చి దిద్ది ప్రసారం చేస్తున్నారు. అలాగే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొనే అధికారిక కార్యక్రమాలను ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నారు. వైఎస్సార్ యంత్ర సేవా కేంద్రాల్లో ఉండే పరికరాలు, ఉపయోగాలు రైతులందరికీ తెలిసేలా రైతు గ్రూపులతో ఛానల్ ద్వారా ఇంటరాక్షన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఏ రోజు ఏ శాఖకు చెందిన కార్యక్రమాలు ప్రసారం అవుతున్నాయో? ఆర్బీకేల ద్వారా ప్రసారం చేస్తున్నారు. ఛానల్ ద్వారా ప్రసారమయ్యే కార్యక్రమాలను యూ ట్యూబ్‌లో అప్‌లోడ్ అవుతుండడంతో ఎప్పుడు కావాలంటే అప్పుడు మొబైల్ ద్వారా రైతులు వీక్షిస్తున్నారు.

1,628 వీడియోలు.. 500కు పైగా ప్రత్యక్ష ప్రసారాలు

ఆర్బీకే ఛానల్ కోసం ప్రత్యేకంగా గన్నవరం ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్‌లో మూడేళ్ల క్రితం డిజిటల్ స్టూడియోను ఏర్పాటు చేసింది. డిజిటల్ రంగంలో విశేష అనుభవం కలిగిన సిబ్బందిని ప్రత్యేకంగా నియమించారు. క్షేత్ర స్థాయిలో ఆదర్శ, అభ్యుదయ రైతులు సాధిస్తోన్న విజయాలపై ఇంటర్‌వ్యూలు, డాక్యుమెంటరీలు రూప కల్పన కోసం ప్రత్యేకంగా అవుట్ డోర్ యూనిట్‌ను కూడా ఏర్పాటు చేసారు. శాఖల వారీగా అప్‌లోడ్ చేస్తున్న వీడియోలు, ప్రత్యక్ష ప్రసారాలకు అనూహ్య స్పందన లభిస్తోంది. ఇప్పటి వరకు 599 వ్యవసాయ, 589 ఉద్యాన, 257 పశు సంవర్ధక, 97 మత్స్య, 13 పట్టు శాఖలకు చెందిన వీడియోలతో పాటు వివిధ సంక్షేమ పథకాలకు సంబంధించి 73 వీడియోలు కలిపి ఇప్పటి వరకు 1,628 వీడియోలను అప్‌లోడ్ చేశారు. 500కు పైగా ప్రత్యక్ష ప్రసారాలను చేసారు. ఛానల్‌ను 2.75లక్షల మంది సబ్‌స్క్రిప్షన్ చేసుకోగా, జనవరి 4వ తేదీ నాటికి అప్‌లోడ్ చేసిన వీడియోలు, ప్రసారాలను 54,67,079 మంది వీక్షించారు. ప్రభుత్వ పరంగా ఏర్పాటు చేసిన ఓ యూట్యూబ్ ఛానల్‌కు ఈ స్థాయి వ్యూయర్ షిప్ లభించడం గొప్ప విషయమని చెబుతున్నారు.

ఆర్బీకే ఛానల్ ద్వారా ఎంతో మేలు



'ఆర్బీకే చానల్' చాలా బాగుంది. ఈ ఛానల్ ద్వారా ప్రసారం చేసే వీడియోలను రెగ్యులర్‌గా వీక్షిస్తుంటాను. సీజన్‌లో విత్తనాలు, ఎరువులు ఏ మేరకు నిల్వ ఉన్నాయి. ఎలా బుక్ చేసుకోవాలి. సాగులో సందేహాలనే కాకుండా.. విత్తు నుంచి విక్రయం వరకు రైతులు ఎదుర్కొనే సమస్యలకు చక్కని పరిష్కారాలు చూపిస్తున్నారు. ఈ తరహా ప్రయోగం ప్రభుత్వ పరంగా చేపట్టడం నిజంగా ప్రశంసనీయం.

–నందం రఘువీర్, మొక్కల జన్యు రక్షకుని అవార్డు గ్రహీత, పెనమూలూరు, కృష్ణ జిల్లా

రైతులు స్వచ్ఛందంగా సబ్‌స్క్రైబ్



రైతు ప్రాయోజిత కార్యక్రమాలను ప్రసారం చేసే ఈ ఛానల్‌కు వ్యూయర్‌షిప్ అరకోటి దాటడం నిజంగా గొప్ప విషయం. సాగులో సందేహాలను నివృత్తి చేయడమే కాకుండా ఎప్పటికప్పుడు వ్యవసాయ అనుబంధ రంగాల్లో వస్తోన్న మార్పులు, నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఛానల్ ద్వారా రైతులకు చేరువ చేస్తున్నాం. రైతులు స్వచ్ఛందంగా సబ్‌స్క్రైబ్ చేసుకుంటున్నారు.

–చేవూరు హరికిరణ్, స్పెషల్ కమిషనర్, వ్యవసాయ శాఖ

ఆయిల్‌పామ్ కేరాఫ్ ఏలూరు

జిల్లాలో 14 మండలాల్లో భారీగా విస్తరించిన పంట

1,30,000 ఎకరాల్లో సాగు • గాలిలో తేమతో కూడిన వాతావరణం అనుకూలం



ఆయిల్‌పామ్ తోట



ఆయిల్‌పామ్ గెలలు

సాక్షి ప్రతినిధి, ఏలూరు : దేశంలోనే ఆయిల్‌పామ్ అత్యధిక సాగు జరుగుతున్న ఏకైక జిల్లాగా ఏలూరు స్థానం సంపాదించడమే కాకుండా దిగుబడిలోనూ మొదటిస్థానంలో నిలిచి రికార్డు సాధించింది. 30 ఏళ్ల క్రితమే మామిడికి ప్రత్యామ్నాయంగా జిల్లాలో ప్రారంభమైన ఆయిల్‌పామ్ సాగు ఉద్యాన వన పంటల విస్తీర్ణంలో సింహభాగానికి చేరింది. 2023 నాటికి జిల్లాలో 8,086 హెక్టార్లలో ఆయిల్‌పామ్ సాగు పెరగడంతో మొత్తంగా 1,30,000 ఎకరాల్లో సాగు విస్తీర్ణానికి చేరింది.

ఆదాయ వనరుగా..

అంతర్జాతీయ మార్కెట్ పరిణామాలు, చమురు ధరలకు అనుగుణంగా ఆయిల్‌పామ్ ధరను నిర్ణయిస్తుంటారు. 2022 మేలో రికార్డు స్థాయిలో ఆయిల్‌పామ్ ధర టన్నుకు రూ.23,365 చొప్పున లభించింది. తదనంతర క్రమంలో ధర కొంత మేరకు తగ్గినప్పటికీ తక్కువ ఖర్చుతో సాగు, మొదటి నాలుగేళ్లు రూ.71 వేలు ప్రభుత్వ సబ్సిడీ ఇవ్వడం, ప్రభుత్వం నుంచి సాగుకు ప్రోత్సాహకం ఉండడంతో ధరతో నిమిత్తం లేకుండా సాగు చేయడంతో పాటు మంచి దిగుబడులు, ఆదాయం పొందుతున్నారు. ప్రధానంగా జిల్లాలో చింతలపూడి, కామవరపుకోట, ద్వారకాతిరుమల, టి.నర్సాపురం, పెదవేగి తదితర మండలాల్లో సుమారుగా 80 వేల ఎకరాల్లో సాగులో ఉంది. జిల్లాలో 27 మండలాలకు గానూ ప్రస్తుతం 14 మండలాల్లో ఆయిల్‌పామ్ సాగు అధికంగా ఉంది. జిల్లాలో 5 ఆయిల్‌పామ్ కంపెనీలు 22 మండలాలను కవర్ చేస్తూ ఆయిల్ పామ్‌ను కొనుగోలు చేస్తున్నాయి. ఈ ఏడాది జిల్లాలో సగటున 9 లక్షల టన్నుల దిగుబడి అంచనా. కొత్తగా నూజివీడు నియోజకవర్గంలోని మండలాల్లో సాగు విస్తీర్ణం పెరుగుతున్నది.

85 శాతం తేమతో సాగుకు అనుకూలం

రాష్ట్ర వ్యాప్తంగా 2.65 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగులో ఉంటే.. దానిలో 50 శాతం సాగు ఒక్క ఏలూరు జిల్లాలోనే ఉంది. ప్రధానంగా ఇసుకతో కూడిన ఎర్ర నేలలు, కృష్ణా, గోదావరి డెల్టా మధ్యలో ఉన్న ప్రాంతం కావడం, గాలిలో తేమ సగటున 85 శాతానికి పైబడి ఉండడంతో ఆయిల్ పామ్‌కు నూరు శాతం అనుకూలమైన ప్రాంతంగా జిల్లాను ఎంపిక చేశారు. దీనిలో అంతర పంటల సాగుకు కూడా అవకాశాలు అధికంగా ఉండడం, ఆయిల్‌పామ్‌లో 80 శాతం మేర కోకో సాగులో ఉండడంతో రైతులకు రెండు పంటల ద్వారా మంచి ఆదాయం వస్తున్నది.

రైతులకు ప్రోత్సాహం..

జిల్లాలో ఈ ఏడాది 1,30,000 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేశారు. వేలేరుపాడు, ఏలూరు, పోలవరం, కుక్కునూరు మండలాల్లో రైతులు ఆయిల్‌పామ్ సాగుపై ఎక్కువ శ్రద్ధ చూపుతుండడంతో శాఖాపరంగా ప్రోత్సహిస్తున్నాం. ఆయిల్ పామ్ తోటల్లో కోకో పంటతో పాటు ఇతర పంటలకూ అవకాశం ఉంది.

–ఎస్.రామ్మోహనరావు, ఉద్యాన శాఖ ఏడీ

కాంగ్రెస్‌లోకి వైఎస్ షర్మిల

- ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, అగ్రనేత రాహుల్ సమక్షంలో పార్టీలో చేరిక
- పార్టీని విలీనం చేస్తున్నట్లు వివరణ
- ఏపీలో పార్టీ పటిష్టతకు పనిచేయాలని సూచన
- బ్రదర్ అనిల్‌పై ఖర్గే అసహనం



సాక్షి, న్యూఢిల్లీ: వైఎస్సార్ టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్‌గాంధీ సమక్షంలో ఢిల్లీలో గురువారం ఆమె కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. వైఎస్సార్ టీపీని కాంగ్రెస్‌లో విలీనం చేస్తున్నట్లు ఈ సందర్భంగా ప్రకటించారు. భర్త అనిల్ తదితరులతో కలసి షర్మిల కార్యక్రమానికి హాజరయ్యారు. వేదికపై ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, ఏపీ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి మాణిక్యం ఠాకూర్, ఏపీ పీసీసీ ప్రెసిడెంట్ రుద్రరాజు, ఏఐసీసీ సీనియర్ నేత కొప్పుల రాజు ఉన్నారు. అగ్రనేత రాహుల్ గాంధీ పార్టీ కండువా కప్పి అభినందనలు తెలిపారు. అనంతరం పార్టీ పార్లమెంటరీ చైర్‌పర్సన్ సోనియా గాంధీతో భర్త అనిల్‌తో కలసి మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. అనంతరం షర్మిల మీడియాతో మాట్లాడారు.

అవసరమైతే అండమాన్ నుంచి..

వైఎస్సార్ టీపీ ఇకపై కాంగ్రెస్ పార్టీలో భాగమని, తన చేరిక పట్ల తన తండ్రి, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆత్మ సంతోషిస్తుందని షర్మిల తెలిపారు. వైఎస్సార్ బతికున్నంత కాలం కాంగ్రెస్ పార్టీకి ఎంతో నమ్మకంగా పనిచేశారని గుర్తు చేశారు. రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి కావాలనేది తన తండ్రి కల అని.. ఆ కల నెరవేర్చేందుకు, పార్టీ అభ్యున్నతికి తాను పనిచేస్తానని వివరించారు. భారత్ జోడో యాత్ర వల్ల రాహుల్ గాంధీపై తనతో పాటు ప్రజలందరిలో నమ్మకం పెరిగిందన్నారు. ఆ యాత్ర కారణంగా అటు కర్ణాటక ఇటు తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని పేర్కొన్నారు. కేసీఆర్ వ్యతిరేక ఓటు చీలకూడదన్న ఉద్దేశంతో తెలంగాణలో కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటించి పోటీ చేయలేదని వెల్లడించారు. పార్టీ ఆదేశిస్తే అవసరమైతే అండమాన్ నుంచైనా పని చేస్తానని అన్నారు. మరో రెండు రోజుల్లో పూర్తి వివరాలు వెల్లడిస్తానన్నారు.

దెన్ హౌ కమ్?

షర్మిల పార్టీ చేరిక సమయంలో ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే అసహనం వ్యక్తం చేశారు. వేదికపైకి షర్మిలతో పాటు ఆమె భర్త అనిల్ కూడా వచ్చారు. అనిల్‌కు కూడా ఖర్గే కండువా కప్పుతుండగా.. ఆయన నిరాకరించారు. షర్మిల సైతం తాను ఒక్కదానినే అంటూ ఖర్గేకు తెలిపారు. దీంతో ఖర్గే స్పందిస్తూ.. మరి మీరెందుకు వచ్చారు (దెన్ హౌ కమ్) అంటూ నవ్వుతూనే అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఏపీలో బాధ్యతలపై అధిష్టానం కసరత్తు

ఏపీలో షర్మిలకు ఎలాంటి బాధ్యతలు ఇవ్వాలనేది పార్టీ అధిష్టానం కసరత్తు చేస్తుందని ఏపీ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ మాణిక్యం ఠాగూర్ తెలిపారు. మోదీ, జగన్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసికెళ్లి అధికారం దిశగా ముందుకెళ్తామన్నారు. తాము చంద్రబాబు నాయుడు పాలనా విధానాలకు కూడా వ్యతిరేకమన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ మనిషే అని.. ఆయన పేరును వచ్చే ఎన్నికల్లో ఉపయోగించుకుంటామని వివరించారు.

పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటా

అధిష్టానం ఏ నిర్ణయం తీసుకున్నా తాను కట్టుబడి ఉంటానని ఏపీ పీసీసీ అధ్యక్షుడు రుద్రరాజు తెలిపారు. పార్టీ కోసం పదవిని సైతం వదులుకునేందుకు తాను సిద్ధంగా ఉన్నానని పేర్కొన్నారు. రాష్ట్రంలో జగన్‌మోహన్ రెడ్డిని, కేంద్రంలో మోదీని ఓడించడమే తమ లక్ష్యమని తెలిపారు. షర్మిల రాకతో మరింత ఉత్సాహం పార్టీలో రానుందని, ఆమెకు ఏ పదవి ఇచ్చినా తామంతా కలసి కట్టుగా పని చేసేందుకు సిద్ధంగా ఉన్నామని రుద్రరాజు వివరించారు.

తెలంగాణ

రికార్డు స్థాయిలో యాదాద్రి హుండీ ఆదాయం

28 రోజుల్లో రూ.3.15 కోట్లు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి హుండీ ఆదాయం రికార్డు స్థాయిలో వచ్చింది. ప్రధానాలయ ఉద్ఘాటన తరువాత ఇదే పెద్ద ఆదాయంగా అధికారులు చెబుతున్నారు. గురువారం శ్రీసత్యనారాయణస్వామి వ్రత మండపంలో ఈవో రామకృష్ణారావు, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు జరిగింది. ఈ లెక్కింపులో 28 రోజుల ఆదాయం రూ.3,15,05,035 వచ్చినట్లు ఈవో వెల్లడించారు. ఇక మిశ్రమ బంగారు 100 గ్రాములు, మిశ్రమ వెండి 4కిలోల 250 గ్రాములు వచ్చినట్లు పేర్కొన్నారు. వీటితో పాటు విదేశీ కరెన్సీ సైతం వచ్చినట్లు తెలిపారు. వరుస సెలవులతో పాటు వైకుంఠ ఏకాదశి, నూతన సంవత్సరం మొదటి రోజు కలిసి రావడంతో భక్తులు శ్రీస్వామి వారిని అధికంగా దర్శించుకున్నారు.

బీజేపీ నేత హనుమంతరావు మృతి

లంగర్‌హౌజ్ (హైదరాబాద్): బీజేపీ సీనియర్ నేత, మాజీ ప్రధాని వాజ్‌పేయికి అత్యంత ఆప్తుడైన ఆకుల హనుమంతరావు (78) గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. లంగర్‌హౌజ్‌లో నివసిస్తున్న ఆయన అప్పటి జనసంఘ్ పార్టీ తరఫున రాష్ట్రంలో కీలకంగా వ్యవహరించారు. పార్టీ వ్యవహారాలపై తన నివాసంలో కూర్చొని అటల్ బిహారీ వాజ్‌పేయితో చర్చించేవారు. దక్షిణాదిలో లంగర్‌హౌజ్ త్రివేణి సంఘంలో బాపూజీ అస్తికలను నిమజ్జనం చేయాలని స్వాతంత్ర్య సమరయోధుడు బోయినపల్లి వెంకటరమణతో కలిసి సర్దార్ వల్లభాయ్ పటేల్‌తో మాట్లాడి ఒప్పించారు. లంగర్‌హౌజ్‌లో గాంధీజీ సమాధి నిర్మాణంలో కూడా కీలకపాత్ర పోషించారు. ఎమర్జెన్సీ సమయంలో నాసా చట్టం కింద రెండు నెలల జైలు జీవితం కూడా అనుభవించారు. ఆయన కొద్ది నెలలుగా అనారోగ్యంతో బాధపడుతూ.. బ్రెయిన్ స్ట్రోక్‌తో నిమ్స్ ఆసుపత్రిలో మృతి చెందారు.

ప్రముఖుల నివాళి

సీనియర్ నేత ఆకుల హనుమంతరావు లేని లోటు ఎవరూ తీర్చలేరని హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. హనుమంతరావు మృతి విషయం తెలిసి దత్తాత్రేయ, కిషన్‌రెడ్డి, లక్ష్మణ్‌లు ఆయన కుటుంబ సభ్యులకు ఫోన్‌చేసి సంతాపం తెలిపారు.

కాంగ్రెస్‌లో షర్మిల చేరినా వైఎస్సార్‌సీపీకి నష్టం లేదు

- అనకాపల్లి ప్రాంతమంటే ముఖ్యమంత్రికి అమితమైన ప్రేమ
- పేదోడికి గూడు కల్పించిన ఘనత జగన్‌దే
- రాష్ట్రవ్యాప్తంగా 2.50 లక్షల టిడ్కో గృహాలు పంపిణీ చేశాం
- వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి. చిత్రంలో మంత్రి అమర్‌నాథ్

సాక్షి, అనకాపల్లి: వైఎస్ షర్మిల కాంగ్రెస్‌లో చేరినా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఎటువంటి నష్టం వాటిల్లదని పార్టీ రీజనల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి అన్నారు. అనకాపల్లిలో గురువారం జరిగిన టిడ్కో గృహాల పంపిణీ కార్యక్రమానికి హాజరై మాట్లాడుతూ అనకాపల్లి సత్యనారాయణపురంలో రూ.153.82 కోట్లతో నిర్మించిన 2,744 గృహాల్లో సామూహిక గృహ ప్రవేశాలు చేయించి ఇంటి రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ పేదోడికి అనేక సంక్షేమ పథకాలతోపాటు ఉచితంగా విద్య, వైద్యం, ఇల్లు కల్పించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 2.50 లక్షల టిడ్కో గృహాలు పంపిణీ చేయగా, అనకాపల్లి జిల్లాలో ఇంతవరకు 3,200 టిడ్కో గృహాలు పేదలకు అందించినట్లు చెప్పారు. అనకాపల్లి ప్రాంతమంటే ముఖ్యమంత్రికి అమితమైన ప్రేమ అని, రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జగన్‌ను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ అనకాపల్లిలోని సత్యనారాయణపురంలో 2296 మంది లబ్ధిదారులకు 300 చదరపు గజాల ఇళ్లను కేవలం ఒక్క రూపాయికే అందించి అక్కా చెల్లెమ్మల పేరిట సీఎం ఉచిత రిజిస్ట్రేషన్ చేసి అండగా నిలిచారని కొనియాడారు. టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ మాట్లాడుతూ 2024 జనవరి నెలాఖరు నాటికి రాష్ట్రం మొత్తంమీద 1.5 లక్షల గృహాలను లబ్ధిదారులకు అందించే విధంగా కార్యాచరణను రూపొందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి, అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, మునిసిపల్ కమిషనర్ ఎస్.వి.రమణ, టిడ్కో బోర్డ్ డైరెక్టర్లు నాగేశ్వరమ్మ, ఖండాపు గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

సొంత పార్టీల్లోనే సెగలు

- కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురంలో చిత్రమైన రాజకీయం
- టీడీపీ, జనసేన ఇన్‌చార్జిలకు పొగ
- మా పార్టీకి టిక్కెట్ వద్దు.. మిత్రపక్షానికి ఇవ్వండని పరస్పర ప్రతిపాదనలు
- మిత్రపక్ష అభ్యర్థి తమకూ నచ్చాలని డిమాండ్

సాక్షి, అమలాపురం: రాజకీయ పార్టీల మధ్య పొత్తులు కొత్త కాదు. ఒంటరిగా పోటీ చేసి పార్టీని గెలిపించే సత్తా లేని చంద్రబాబు నాయకత్వంలోని టీడీపీకై తే పొత్తులు మరీ తప్పనిసరి. ఒకటి రెండు పార్టీలతో పొత్తులున్నా.. ఆయా పార్టీల క్యాడర్ తమ తమ నియోజకవర్గాల నుంచి సొంత పార్టీకి చెందిన వారే పోటీ చేసి, గెలవాలని కోరుకోవడం సర్వసాధారణం. కానీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గంలో మాత్రం ఇందుకు భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. వచ్చే సాధారణ ఎన్నికల్లో కలిసి పోటీ చేయాలని నిర్ణయించుకున్న టీడీపీ, జనసేన క్యాడర్ ఈ నియోజకవర్గం నుంచి తమ పార్టీ పోటీ చేయకుండా ఉంటే బాగుంటుందని కోరుకుంటున్న విచిత్ర రాజకీయం ఇక్కడ కనిపిస్తోంది. రెండు పార్టీల ఇన్‌చార్జిల మీద వారి సొంత పార్టీల్లో నెలకొన్న అసంతృప్తితో క్యాడర్ ఇలా రివర్స్ పోటీ కోరుకుంటోంది.

అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గానికి టీడీపీ, జనసేన ఇన్‌చార్జీలుగా అయితాబత్తుల ఆనందరావు, శెట్టిబత్తుల రాజబాబు ఉన్నారు. వారిద్దరిపై సొంత పార్టీల్లో అసంతృప్తి నెలకొని ఉంది. ఆనందరావుకు టీడీపీలో ఒక వర్గం పూర్తిగా సహాయ నిరాకరణ చేస్తోంది. దీనిలో భాగంగానే పార్టీ అధినేత చంద్రబాబు అరెస్టు సమయంలో నియోజకవర్గం తరఫున అమలాపురం కేంద్రంగా ఆ పార్టీ నాయకుడు మెట్ల రమణబాబు ఇంటి వద్ద తొలుత నిరసన కార్యక్రమాలు చేపట్టారు. దీనిపై విమర్శలు రావడంతో తరువాత షాదీఖానాకు మార్చు చేశారు. ఇదే నియోజకవర్గానికి చెందిన మాజీ హోం మంత్రి, కాకినాడ జిల్లా పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప వర్గం ఆనందరావు ఆధ్వర్యంలోని శిబిరాలను బాయ్‌కాట్ చేసింది. ఇందుకు పోటీగా ఉప్పల గుప్తం మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. 'బాబు షూరిటీ.. భవితకు గ్యారంటీ'లో భాగంగా అమలాపురంలో చంద్రబాబు గతంలో నిర్వహించిన ర్యాలీకి కూడా స్పందన లేకుండా పోయింది. బహిరంగ సభను జనం లేక ఆలస్యంగా ప్రారంభించాల్సి వచ్చింది. అయినప్పటికీ అది వెలవెలబోయింది. క్యాడర్ కలిసి రావడం లేదనే లోకేశ్ నిర్వహించిన యువగళం యాత్రకు సంబంధించి బహిరంగ సభ పెట్టే సాహసాన్ని ఆనందరావు చేయలేకపోయారు. ప్రైవేట్ మెడికల్, ఇంజినీరింగ్ కాలేజీల విద్యార్థులను బెదిరించి, భట్నవిల్లిలో లోకేశ్‌తో ముఖాముఖి నిర్వహించి మమ అనిపించారు. ఇది పార్టీలో తీవ్ర విమర్శలకు దారి తీసింది. సభ పెట్టలేని దుస్థితికి పార్టీ దిగజారిపోయిందా? అని సోషల్ మీడియా వేదికగా సొంత పార్టీ నాయకులే వ్యంగ్యోక్తులు విసిరారు.

ఇక్కడా అదే సీన్

జనసేనలో సైతం సేమ్ సీన్ కనిపిస్తోంది. పార్టీ అమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి శెట్టిబత్తుల రాజబాబును సైతం ఒక వర్గం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. మాజీ మున్సిపల్ చైర్మన్ యాళ్ల నాగ సతీష్, మున్సిపాలిటీ ప్రతిపక్ష నాయకుడు యేడిద శ్రీను, నల్లా శ్రీధర్, లింగోలు పండు వంటి వారు రాజబాబుతో తీవ్రంగా విభేదిస్తున్నారు. వీరందరూ పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జి డీఎంఆర్ శేఖర్‌ను ప్రోత్సహిస్తున్నారు. రాజబాబు వర్గానికి పోటీగా వీరు వేరేగా కార్యక్రమాలు చేస్తున్నారు. అమలాపురంలో పార్టీ అధినేత పవన్ నిర్వహించిన వారాహి యాత్ర విజయవంతం కోసం ఏర్పాటు చేసిన సభలో పార్టీలోని రెండు వర్గాల వారు బహిరంగంగా తలపడిన విషయం తెలిసిందే. చివరకు టీడీపీ, జనసేన మైత్రి కోసం ఇటీవల బోడసకుర్రులో ఏర్పాటు చేసిన సమావేశానికి రెండు పార్టీల్లోని అసంతృప్తి వర్గాల వారు దూరంగా ఉండడం గమనార్హం.

అటు నుంచి వస్తే..

టీడీపీ, జనసేన ఇన్‌చార్జీల మీద నియోజకవర్గంలో తీవ్ర అసంతృప్తి ఉందనే విషయం ఆ పార్టీల అధిష్టానాలకు సైతం తెలుసు. కానీ ఏమీ చేయలేని దుస్థితి. కనీసం రెండు వర్గాలనూ ఒకచోట కూర్చోబెట్టి సర్దుబాటు చేయలేదు. ఈ పరిస్థితుల్లో రెండు పార్టీల అసంతృప్తి వర్గాల వారూ తాజాగా కొత్త పల్లవి అందుకున్నారు. ఇస్తే తాము సూచించిన అభ్యర్థికి సీటు ఇవ్వాలని, లేకుంటే మిత్రపక్షానికి కేటాయించాలని అధిష్టానాలను కోరుతున్నారు. ఈ ప్రతిపాదన చూసి రెండు పార్టీల అధిష్టానాలూ అవాక్కయ్యాయి. సొంత పార్టీల్లో ఇన్‌చార్జులుగా ఉన్న ఆనందరావు, రాజబాబులకు పార్టీ తరఫున టిక్కెట్ ఇస్తే ఓడిపోతారని ఇటు టీడీపీ, అటు జనసేన అసంతృప్తి వాదులు బహిరంగంగానే అంటున్నారు. ఈ ప్రతిపాదన విషయంలో జనసేనలో రాజబాబు వ్యతిరేక వర్గం ఒక అడుగు ముందుకు వేసింది. ఇస్తే తాము సూచించిన డీఎంఆర్ శేఖర్‌కు సీటు ఇవ్వాలని, లేకుంటే టీడీపీకి సీటు కేటాయించి, ఆ పార్టీలో కొత్త వ్యక్తిని నిలబెట్టాలని కోరుతున్నారు. ఇదే విషయంపై ఇటు జనసేన, అటు టీడీపీ పెద్దలకు వారు రాయబారం నడుపుతున్నారు. టీడీపీ, జనసేన పార్టీలు పొత్తుల్లో సీట్ల కేటాయింపు తలనొప్పి ఒకటైతే... మిత్రపక్షాలకు ఇవ్వాలనే అమలాపురం క్యాడర్‌ల కోరిక సమస్యలకు కారణమవుతోంది.

మళ్లీ మళ్లీ జగనే సీఎం కావాలి

కమ్యూనిస్ట్ నేత పాండురంగారావు



మొగల్తూరు: పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని సీపీఎం నాయకుడు వీరా పాండురంగారావు కొనియాడారు. పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరు ఉన్నత పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన పింఛను పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తనకు నూతనంగా పెంచిన రూ.250తో కలిపి రూ.3 వేలు పింఛనుగా అందించినట్టు చెప్పారు. తన కుటుంబంలో కాపు నేస్తంతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటికి తీసుకువచ్చి అందించడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఇటీవల తనకు బ్రెయిన్ ట్యూమర్ రావడంతో వైఎస్సార్ ఆరోగ్యశ్రీలో చికిత్స పొందానని.. జగన్ పాలనలో తాను, తన కుటుంబ సభ్యులు ఆనందంగా ఉన్నామని వివరించారు. ముఖ్యమంత్రిగా మళ్లీ మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రావాలని, ఉండాలని కోరుకుంటున్నానని ఘంటాపథంగా చెప్పడంతో సభలో హర్షధ్వానాలు మారుమోగాయి.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

క్లుప్తంగా

చట్టసవరణపై అభిప్రాయాలు సేకరిస్తాం



మాట్లాడుతున్న మంత్రి శివానంద పాటిల్

రాయచూరు రూరల్: ఏపీఎంసీ చట్టం–2023 సవరణపై రైతులు, వ్యాపారులు, కూలీ కార్మికుల నుంచి అభిప్రాయ సేకరణ చేస్తామని రాష్ట్ర జవళి, చక్కెర, వ్యవసాయ ఉత్పత్తుల విక్రయ శాఖా మంత్రి శివానంద పాటిల్ వెల్లడించారు. బుధవారం నగరంలోని ఏపీఎంసీ భవన్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఏపీఎంసీ చట్టాన్ని, మహారాష్ట్రలో రద్దు చేసిందని, ఉత్తర ప్రదేశ్, కర్ణాటకల్లో సవరణపై అభిప్రాయాలు సేకరించి తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. సమావేశంలో రూరల్ ఎమ్మెల్యే బసనగౌడ, ఏపీఎంసీ అధ్యక్షుడు మల్లికార్జునగౌడ, ఎమ్మెల్సీ అరుణ, కేశవ ప్రసాద్, తిప్పేస్వామి, జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్, ఏడీసీ దురుగేష్, కార్యదర్శులున్నారు.

టెన్త్‌లో సత్ఫలితాలు సాధించండి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

రాయచూరు రూరల్: మార్చి నెలలో జరిగే టెన్త్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని తారానాథ్ శిక్షణ సంస్థ కార్యదర్శి శరత్ కుమార్ కలస పిలుపు ఇచ్చారు. గురువారం నగరంలోని హందర్ద్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. విజన్ 625ను లక్ష్యంగా పెట్టుకొని విద్యార్థుల మనోబలాన్ని పెంచాలన్నారు. ఉపాధ్యాయులు జిల్లాలో వంద శాతం ఉత్తీర్ణత సాధనకు కృషి చేయాలన్నారు. సమావేశంలో అధికారులు చంద్రశేఖర్, శివరాజ్, హనుమంతరాయలున్నారు.

అక్రమంగా ఏపీఎంసీ గోదాముల విక్రయం



మాట్లాడుతున్న విరుపాక్షి

రాయచూరు రూరల్: ఏపీఎంసీలోని నాలుగు గోదాములను అక్రమంగా విక్రయించారని జేడీఎస్ జిల్లాధ్యక్షుడు విరుపాక్షి ఆరోపించారు. గురువారం పాత్రికేయుల భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో రైతులు పండించిన పంటలను నిల్వ చేయడానికి ఉపయోగించాల్సిన గోదాములను రూ.5 కోట్లు విలువ చేసే వాటిని కేవలం రూ.34,50,600కు విక్రయించారన్నారు. నగరంలో వెయ్యి మెట్రిక్ టన్నుల గోదాములు శ్రీశైలేశ్వర కాటన్ ట్రేడర్స్, రేణుక కాటన్ ట్రేడర్స్, లక్ష్మి వేంకటేశ్వర ట్రేడర్స్, శ్రీకాంత్ కాటన్ ట్రేడర్స్‌లకు విక్రయించారన్నారు. లీజ్ కం సేల్ మీద గోదాములను వినియోగించుకోకుండా హోటల్ ఇతర పదార్థాల విక్రయిస్తున్నారన్నారు. ఏపీఎంసీ చట్ట నియమాలను ఉల్లంఘించిన వారిపై చర్యలు చేపట్టాలని కోరారు.

నరేగ కార్మికులకు వైద్య సేవలు

రాయచూరు రూరల్: జిల్లాలో నరేగ కార్మికులకు ఉత్తమ వైద్య సేవలందించాలని జిల్లా ఆరోగ్య అధికారి సురేంద్రబాబు పేర్కొన్నారు. గురువారం నగరంలోని భారతీయ వైద్య భవనంలో ఉపాధి హామీ పథకంలో విధులు నిర్వహించే కార్మికులకు, దేవదాసి మహిళలకు ఆరోగ్య అభియాన్ పథకంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. 148 మందికి ఆరోగ్య సేవలు అందించారు.

అక్రమాలపై విచారణకు సూచన



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బసనగౌడ

రాయచూరు రూరల్: తాలూకాలోని వివిధ గ్రామాల్లో భూ పంపిణీలో జరిగిన అక్రమాలపై విచారణ జరపాలని గ్రామీణ ఎమ్మెల్యే బసనగౌడ సూచించారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన తాలూకా స్థాయి కోర్ కమిటీ, భూ అక్రమ, సక్రమ సభ్యుల సమావేశంలో మాట్లాడారు. పలు సంవత్సరాల నుంచి పేద రైతులు రెండు, మూడెకరాల భూములను సాగు చేసుకుంటున్న వారికి సాగు చేసుకొనేలా పట్టాలు ఇవ్వాలని తహసీల్దార్ సురేష్‌వర్మను ఆదేశించారు. అక్రమ, సక్రమ పేర్లతో ఉన్న భూములను సర్వే చేసి వారి పేరు మీద పట్టాలివ్వాలన్నారు. దరఖాస్తు చేసుకున్న 3500 మంది పేద రైతులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఈసం దర్భంగా సభ్యులు ఆంజనేయ, అబ్రహం, పార్వతమ్మలున్నారు.

పడకేసిన నగర అభివృద్ధి

- అస్తవ్యస్తంగా మారిన డ్రైనేజీ వ్యవస్థ
- కాలువల్లో నిలిచిపోయిన మురుగునీరు
- పాఠశాల పక్కనే వెదజల్లుతున్న దుర్వాసనతో నరకయాతన



విశాల్‌నగర్‌లో నాలుగు నెలలుగా కంకర వేసి వదిలేసిన రోడ్డు

సాక్షి,బళ్లారి: అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అంటే ఇదేనేమో.! రాష్ట్రంలో ఏ జిల్లాకు లేనన్ని అపారమైన నిధులు జిల్లాలో మూలుగుతున్నా వాటిని సద్వినియోగ పరచుకుని నగరాభివృద్ధికి కృషి చేయాల్సిన మంత్రులు, ఎమ్మెల్యేలు మాటల పరిమితం అవుతూ అభివృద్ధి విషయాన్ని పట్టించుకోకపోవడంతో నగర అభివృద్ధి మూడు అడుగులు ముందుకు, ఆరు అడుగులు వెనక్కు అన్న చందంగా మారింది. స్టీల్ సిటీగా పేరుగాంచిన నగరం చెత్త సిటీగా మారుతోందని నగర వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగరంలో అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీలతో ఆయా కాలనీల వాసులు నరకం అనుభవిస్తున్నారు. నగరంలోని గణేష్ కాలనీలోని డ్రైనేజీలు, రూపనగుడి రోడ్డులోని డ్రైనేజీలు, రాజ కాలువల దుస్థితి అధ్వానంగా ఉంది. వాటిలో చెత్తా చెదారం తీయకపోవడంతో ఆయా కాలనీల వాసులు దోమలు, దుర్వాసన బెడదతో పలు రోగాల బారిన పడుతున్నారు. నగరంలో బాపూజీనగర్‌లోని ప్రభుత్వ పాఠశాల పక్కనే ఉన్న డ్రైనేజీలు కూడా శుభ్రం చేయకపోవడంతో మురుగునీరు నిలిచిపోయి విద్యార్థులు అనారోగ్యాల బారిన పడుతున్నారు. అక్కడక్కడ డ్రైనేజీ నీరు రోడ్లలో కూడా పారుతుండటంతో ప్రజలు నానా ఇబ్బందులకు గురవుతున్నారు.

నెలల తరబడి అసంపూర్తిగా రోడ్ల పనులు

అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీలతో పాటు నగరంలో పలు రోడ్ల అభివృద్ధి పనులు చేస్తామని, సీసీ రోడ్లు వేస్తామని రోడ్లను తవ్వి వాటిలో కంకర వేసి నెలలు తరబడి అయినా పనులు పూర్తి చేయకపోవడంతో ఆయా కాలనీ వాసుల పాట్లు అన్నీ ఇన్నీ కావు. విశాల్‌నగర్‌లో పలు రోడ్లను అభివృద్ధి చేస్తామని రోడ్లను తవ్వి, కంకర వేసి వదిలేయడంతో అడుగు తీసి అడుగు వేయలేకపోతున్నామని ఆ కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాలుగు నెలల నుంచి సీసీ రోడ్డు లేదా తారు రోడ్డు వేసేందుకు చేతకాకపోతే ఇక నగరాభివృద్ధి ఎలా చేస్తారని కాలనీ వాసులు ప్రశ్నిస్తున్నారు. కాంట్రాక్టర్ల అలసత్యం, పాలకుల నిర్లక్ష్యం తమకు శాపంగా మారిందని వాపోతున్నారు. నగరంలో ఏ కాలనీలో చూసినా అభివృద్ధి అంతంత మాత్రమే జరుగుతుండగా నగరాభివృద్ధిపై ప్రధానంగా దృష్టి పెట్టాల్సిన కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. ఇకనైనా సంబంధిత అధికారులు, పాలకులు నగరంలో కుంటుపడిన అభివృద్ధి పనులను చిత్తశుద్ధితో సత్వరం పూర్తి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



బాపూజీ నగర్‌లో పాఠశాల పక్కనే అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ

ఏటీఎంలో రూ.20 లక్షల దోపిడీ

- చిక్కతిరుపతిలో ఘటన

మాలూరు: ఏటీఎంలో దోపిడీ దొంగలు చొరబడి అందులోని రూ.20 లక్షల నగదును దోచుకెళ్లిన ఘటన కోలారు జిల్లా చిక్కతిరుపతి గ్రామంలోని కెనరా బ్యాంకు ఏటీఎంలో చోటు చేసుకుంది. కెనరా బ్యాంకు ప్రాంగణంలోని ఏటీఎంలో బ్యాంకు అధికారులు రూ.20 లక్షల నగదును ఉంచారు. ఇందులో వినియోగదారులు సుమారు రూ.1.5 లక్షల వరకు డబ్బులను డ్రా చేసుకున్నారు. అదే రోజు రాత్రి ఏటీఎంలోకి చొరబడిన దుండగులు నగదు యంత్రాన్ని పగులగొట్టి డబ్బును దోచుకెళ్లారు. ఉదయం విషయం తెలిసిన వెంటనే బ్యాంకు సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. పోలీసు జాగిలం, వేలిముద్రల నిపుణులతో పోలీసులు పరిశీలించారు. మాలూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వరుసగా ఏటీఎంల లూటీలు

ఇటీవల చింతామణిలో, తరువాత చిక్కమగళూరులో, తరువాత చిక్కతిరుపతిలో ఏటీఎంలను లూటీ చేయడం వెనుక ఒకే ముఠా ఉండవచ్చని అనుమానాలున్నాయి. పోలీసులు చురుగ్గా పని చేసి బందిపోటు దొంగల ముఠాలను అరికట్టాలని ప్రజలు డిమాండ్ చేశారు.



చోరీకి గురైన ఏటీఎం ఇదే

హంతకులపై కఠిన చర్యలకు వినతి

బళ్లారిఅర్బన్: నగరంలో డిసెంబర్ 31వ తేదీ రాత్రి సంచలనం రేకెత్తించిన సైదుల్లాను హత్య కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ పలువురు గురువారం ఆందోళన చేపట్టారు. హత్యకు గురైన వ్యక్తి కుటుంబ సభ్యులతో కలిసి కర్ణాటక నదాఫ్ పింజార్ సంఘం ఆధ్వర్యంలో జిల్లాధికారి కార్యాలయం వరకు పెద్ద ఎత్తున ర్యాలీ చేపట్టారు. అనంతరం అదనపు అధికారికి వినతి పత్రాన్ని అందజేశారు. సంఘం అధ్యక్షుడు షాషాబ్, కోశాధికారి మౌలాలీ మాట్లాడుతూ బాపూజీ నగర్‌లోని ఆర్‌కే కాలనీకి చెందిన సయ్యద్ అలీని హత్య చేసిన వారిని బంధించి కఠినంగా శిక్షించాలని ఒత్తిడి చేశారు. ఈసందర్భంగా సంఘం ప్రముఖులు అల్లాబకాష్, షాషావలి, మౌలాలీ, నబీ సాబ్, మస్తాన్‌వలి, మృతుని తల్లి, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ఏడీసీకి వినతిపత్రం అందజేస్తున్న కుటుంబ సభ్యులు

కొత్త చట్టం వద్దంటూ డ్రైవర్ల ర్యాలీ

బళ్లారి అర్బన్: వాహన డ్రైవర్లపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొత్త చట్టాన్ని అమలు చేయడాన్ని నిరసిస్తూ గురువారం నగరంలో కర్ణాటక డ్రైవర్ల యూనియన్ తరఫున ఆందోళన చేపట్టారు. నగరంలో డ్రైవర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జీ.నారాయణ స్వామి నేతృత్వంలో భారీ ర్యాలీ నిర్వహించి జిల్లాధికారి కార్యాలయానికి చేరుకుని నిరసన తెలిపారు. అనంతరం డ్రైవర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.డీ.మస్తాన్ మాట్లాడుతూ పేదలు మాత్రమే డ్రైవర్ వృత్తిని నమ్ముకుని జీవిస్తున్నారన్నారు. ప్రమాదం చేసిన డ్రైవర్‌పై చర్యలు తీసుకొని, రూ.10 లక్షలు జరిమానా, ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తామంటూ కేంద్రం కొత్త చట్టాన్ని అమలు చేయడం సరికాదన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా డ్రైవర్లపై అమలు చేసిన చట్టాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర, దేశ వ్యాప్తంగా నిరసన వ్యక్తం అవుతోందన్నారు. 10 రోజుల్లో ఈ చట్టాన్ని వెనక్కి తీసుకోకపోతే డ్రైవర్ వృత్తిని వదిలి వేరే పనులు చేసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా డ్రైవర్ల అసోసియేషన్ తరఫున జిల్లాధికారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కర్ణాటక డ్రైవర్ల ఐక్య సంఘం జిల్లాధ్యక్షుడు సయ్యద్ అజాం, పదాధికారులు హుసేన్ పీరా, సుధాకర్, కేఎం.కవిత, నాగవేణి, శాంతమ్మ, ఆంథోని రాజ్, ఎం.డీ.రియాజ్, దాదా పాల్గొన్నారు.



ఆందోళనలో పాల్గొన్న సంఘం నేతలు, డ్రైవర్లు

శ్రీకాంత్ పూజారిపై 16 కేసులు

హుబ్లీ: రాష్ట్రంలో సంచలనం రేకెత్తించిన 1992 డిసెంబర్ 5న హుబ్లీలో జరిగిన ఘర్షణ కేసులో అరెస్టయిన శ్రీకాంత్ పూజారిపై దాదాపు 16 కేసులు దాఖలైనట్లు పోలీసు వర్గాలు వెల్లడిస్తున్నాయి. స్థానిక ఎమ్మెల్యే ప్రసాద్ అబ్బయ్య విడుదల చేసిన ప్రకటనలో పాతహుబ్లీ చెన్నపేట నివాసి శ్రీకాంత్ అలియాస్ కాంత్యపై పాత హుబ్లీ స్టేషన్ పరిధిలో 8 అక్రమ మద్య విక్రయాల కేసులు, మూడు దొమ్మి కేసులతో పాటు ఒక జూదం కేసు దాఖలైంది. కసబా పేట స్టేషన్ మూడు ముందు జాగ్రత్త కేసులు దాఖలయ్యాయి. ఇక హుబ్లీ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో 1992లో జరిగిన దొమ్మి కేసులో కూడా ఇతను నిందితుడని కేసు దాఖలు చేశారు. అక్రమ మద్యం విక్రయాలకు సంబంధించి 1998, 1999, 2003లో రెండేసి కేసుల చొప్పున, 2002, 2006లో ఒక్కో కేసు నమోదయ్యాయి. దొమ్మి కేసుకు సంబంధించి 1992, 2001లో, అలాగే 2014లో పలు కేసులు దాఖలయ్యాయని, 2002లో మట్కా జూదం కేసు కూడా పాత హుబ్లీలో నమోదైందని, ఈ కేసులపై పోలీసు కమిషనర్ రేణుక సుకుమార వివరణ ఇచ్చారు. శ్రీకాంత్ పూజారిపై వివిధ స్టేషన్లలో పలు కేసులు దాఖలు కావడం నిజమేనని, అయితే కొన్ని పరిష్కారం కూడా అయ్యాయని, ఈ విషయాన్ని పరిశీలిస్తున్నామన్నారు.

పేదల పెన్నిధి ఈరణ్ణ



ఈరణ్ణ ప్రతిమకు పుష్పాంజలి దృశ్యం

రాయచూరు రూరల్: నగరంలో సామాన్య ప్రజలు, పేదల పెన్నిధిగా నగరసభ మాజీ అధ్యక్షుడు దివంగత ఎం.ఈరణ్ణ నిలిచారని కిల్లే బృహన్మఠాధిపతి శాంతమల్ల శివాచార్యులు అభిప్రాయ పడ్డారు. గురువారం శశిమహల్ సర్కిల్ వద్ద నగరసభ మాజీ అధ్యక్షుడు ఈరణ్ణ 71వ జయంతి కార్యక్రమంలో ఈరణ్ణ ప్రతిమకు పూలమాల వేసిన అనంతరం ఆయన మాట్లాడారు. నగరసభ అధ్యక్షుడిగా, సమాజ సేవకుడుగా పేరొందారన్నారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ జిల్లా పంచాయతీ అధ్యక్షురాలు పద్మావతి, నగరసభ సభ్యుడు పవన్ కుమార్, రేణుకాచార్య, రఘు, రవి కుమార్‌లున్నారు.

కరోనా బూస్టర్ డోస్‌కు ఏర్పాట్లు

హుబ్లీ: కేంద్ర ప్రభుత్వ సూచన మేరకు కార్బీ వ్యాక్స్ టీకాను ముందస్తుగా తీసుకోవచ్చని డాక్టర్ శశి పాటిల్ తెలిపారు. ఆమె గురువారం ఓ ప్రకటనలో కోవిషీల్డ్ లేదా కోవాక్సిన్ రెండు డోసులు తీసుకుని ఆరు నెలలు లేదా 26 వారాలు పూర్తి చేసిన 18 ఏళ్ల వయస్సు పైబడిన వారు, అలాగే ముందస్తు డోసు తీసుకోని వారు, 60 ఏళ్ల పైబడిన వారు, తక్కువ వ్యాధి నిరోధక శక్తి ఉన్న వారు, ఆరోగ్య కార్యకర్తలు ఈ ముందస్తు డోసు తీసుకోవచ్చని తెలిపారు. ఇందుకోసం ధార్వాడ, హుబ్లీ కిమ్స్ ఆస్పత్రిలో, కలఘటిగి, కుందగోళ, నవలగుంద తాలూకా ఆస్పత్రుల్లో ఈ కొత్త వ్యాక్సిన్ అందుబాటులో ఉందని తెలిపారు.

మతిస్థిమితం లేక ఆత్మహత్య



మృతుడు శివకుమార్ (ఫైల్)

రాయదుర్గం (డి.హీరేహాళ్): డి.హీరేహాళ్ మండలంలోని హిర్దేహాళ్ దగ్గర ఒక తోటలో శివకుమార్ (31) అనే యువకుడు గురువారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మృతుని స్వగ్రామం బళ్లారి దగ్గర కమ్మరచేడు గ్రామం. ఇటీవల డి.హీరేహాళ్ మండలం పులకుర్తికి చెందిన క్రిష్ణవేణితో వివాహం జరిగింది. అయితే అతడు కొంతకాలంగా మతిస్థిమితం కోల్పోయి ఇష్టారాజ్యంగా తిరిగేవాడు. వారం రోజుల క్రితం భార్య తన పుట్టినింటికి పిలుచుకువచ్చింది. ఈ నెల 1న చెప్పాపెట్టకుండా ఇల్లు వదిలి వెళ్లిపోయాడు. పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. సపోటా తోట వద్ద ఉరి వేసుకుని ప్రాణాలు తీసుకున్నాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

సహకార బ్యాంకర్లు సహృదయంతో మెలగాలి

కోలారు: జిల్లాలోని సహకార బ్యాంకులు రైతులపై సహృదయంతో వ్యవహరించాలని జిల్లాధికారి అక్రంపాషా తెలిపారు. గురువారం కలెక్టరేట్ సభాంగణంలో కోలారు, చిక్కబళ్లాపుర జిల్లాల సహకార బ్యాంకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని రైతులు పంట రుణాల తిరిగి చెల్లింపులో ఇతర జిల్లాల కంటే ముందంజలో ఉన్నారన్నారు. వాతావరణం, మట్టి సారవంతం అనుగుణంగా ఉద్యానవన, వాణిజ్య పంటలను అధికంగా పండిస్తున్నారన్నారు. వాన కొరత వల్ల జిల్లాలోని ఆరు తాలూకాలను కరువు పీడిత ప్రాంతాలుగా ప్రకటించారన్నారు. ఈ సమయంలో కూరగాయలు, వాణిజ్య పంటలకు కూడా సరైన రుణ పరిమితి విధిస్తారన్నారు. సమావేశంలో డీసీసీ బ్యాంకు సీఈఓ శంకర్, చిక్కబళ్లాపుర జిల్లా అభివృద్ధి మేనేజర్ సాయి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంఘం పదాధికారుల ధర్నా

శ్రీనివాసపురం: వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్ కమిటీ(ఏపీఎంసీ)లో లైసెన్సును పొందిన అనప వ్యాపారుల వ్యాపారాన్ని ఎంజీ మార్కెట్‌కు తరలించాలని లేదా మరో సరైన స్థలానికి మార్చాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘం పదాధికారులు గురువారం పట్టణంలోని ఇంద్రా భవన్ సర్కిల్ వద్ద అనపకాయలను పోసి ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ రైతులు కరువు, పంట నష్టంతో తీవ్ర ఇబ్బంది పడుతున్న రైతులకు నకిలీ విత్తనాలు, మందులను విక్రయించి రైతులను నిండా ముంచుతున్నారన్నారు. అనప వ్యాపారానికి సరైన మార్కెట్ వ్యవస్థ ఉన్నా ఏపీఎంసీ కార్యదర్శి, పాలక మండలి బాధ్యతా రాహిత్యం వల్ల అనప వ్యాపారులు ఎంజీ మార్కెట్‌లోనే వ్యాపారాలు చేసుకుంటున్నారని ఆరోపించారు. రైతులకు సరైన ధరలు ఇవ్వకుండా తూకాల్లో కూడా మోసాలు చేస్తున్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ధర్నాలో రైతు సంఘం రాష్ట్ర సంచాలకుడు బంగవాది నాగరాజగౌడ, తాలూకా అధ్యక్షుడు తేర్నహళ్లి అంజినప్ప తదితరులు పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

పెండింగ్ ఫైళ్ల సత్వర క్లియరెన్స్‌కు సూచన

కోలారు: మజరా గ్రామాలను రెవిన్యూ గ్రామాలుగా పరివర్తించి శాఖలోని దీర్ఘకాల పెండింగ్ ఫైళ్లను సత్వరం క్లియర్ చేయాలని రాష్ట్ర సర్వే శాఖ కమిషనర్ మంజునాథ్ సూచించారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సర్వే శాఖ ప్రగతి పరిశీలన కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నుంచి సన్మానం స్వీకరించి మాట్లాడారు. సర్వే శాఖ ప్రజలకు మరింత దగ్గర కావాలన్నారు. ఆకారబంధు, డిజిటలీకరణ తదితర విషయాలపై చర్చించి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అటవీ భూమిని సర్వే చేయాలని, సర్వే సమయంలో గందరగోళాల పరిష్కారానికి సలహాలు అందించారు. జిల్లాలో ప్రభుత్వ సర్వేయర్ల కొరత ఉండడం వల్ల సర్వే పనులు ఆలస్యం అవుతున్నాయని అధికారులు తెలిపారు. కొత్త నియామకాలు జరిగే వరకు లైసెన్సు కలిగిన సర్వేయర్ల నియామకానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. చెరువులు అధికంగా ఉన్న జిల్లాలో చెరువుల్లో ఆక్రమణల తొలగింపునకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జీ.సురేష్‌బాబు, డిప్యూటీ డైరెక్టర్ భాగ్యమ్మ, ఉద్యోగుల సంఘం కార్యదర్శి ఎన్ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్ మంజునాథ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

కేంద్రానికి హై–క కరువు జ్ఞాపకం ఏదీ?

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం
- 25 మంది లోక్‌సభ సభ్యులు మౌనం
- కేంద్ర సర్కార్‌కు ట్విటర్‌లో సందేశాలు
- 17 జిల్లాలు, 223 తాలూకాల్లో సంభవించిన తీవ్ర కరువు

రాయచూరు రూరల్: కర్ణాటక రాష్ట్ర చరిత్రలో పేజీలు తిరగవేసినట్లుగా అతివృష్టి, అనావృష్టితో జిల్లాలోని రైతులు పంట పొలాల్లో వేసుకున్న పంటలు పండక, పశుగ్రాసం లేక తల్లడిల్లిపోతున్నామని, పంట నష్ట పరిహారం అందించాలని కోరుతూ వ్యవసాయ కూలీ కార్మికులు ఆందోళన చేపడుతున్నారు. బాధితులు జీవితం ఎలా గడపాలనే ఆలోచనలో ఉంటున్న సందర్భంలో తక్కువ పరిహారం అందించాలని అధికారుల కార్యాలయాల చుట్టూ తిరిగినా అధికారులు తమకేమీ పట్టనట్లు ఉండటంపై రైతులు ఆక్రోశం వ్యక్తం చేస్తున్నారు. హైదరాబాద్ కర్ణాటకలోని రైతులు ఎదుర్కొంటున్న కష్టాలను ఆలకించే దండనాయకుడే(తహసీల్దార్) మాయం కావడం బాధితుల్లో విచారం వ్యక్తమైంది. గ్రామీణ ప్రాంతాల్లో గ్రామీణ కార్యదర్శులు, అధికారులు రైతులను చూసిన వెంటనే పరుగు లంఘిస్తున్నారు.

పరిహారానికి రైతుల పడిగాపులు

పంట నష్టపరిహారం కోసం రెండు నెలల నుంచి వేచి చూసినా ఫలితం లేకుండా పోయిందని రైతులు వాపోయారు. రాష్ట్రంలో బాధితులు, రైతులు, పేదలు అన్నమో రామచంద్ర అంటూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా అధికారులు మౌనం వహించడాన్ని రైతులు రాష్ట్రంలో 223 తాలూకాల్లో తీవ్ర కరువు సంభవించినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించాయి. రాష్ట్రం నుంచి 25 మంది లోక్‌సభ సభ్యులు వెళ్లినా వారి మౌనానికి అర్థం కావడం లేదు. 2009లో వరదలు వచ్చినప్పుడు కాంగ్రెస్ ప్రధానమంత్రి మన్‌మోహన్ సింగ్ పరిహారం ప్రకటన చేసిన విషయాన్ని ప్రతి ఒక్కరూ ప్రస్తావిస్తున్నారు. ఈ విషయంలో కేంద్రంలోని నేతలు నరేంద్ర మోదీ, అమిత్‌షా, నిర్మలా సీతారామన్ కర్ణాటకను మరిచి ఇతర రాష్ట్రాలకు ఆపన్నహస్తం అందించడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్న నెలకొంది.



హైదరాబాద్ కర్ణాటక జిల్లాల చిత్రపటం

మద్దతు ధరతో విక్రయానికి పేర్లు నమోదు చేసుకోండి

హొసపేటె: ఈయేడాది వర్షాకాలంలో పండించిన మినుము, తెల్లజొన్నలను రైతుల నుంచి కనీస మద్దతు ధర పథకం కింద కొనుగోలు చేస్తున్నామని, జిల్లా రైతులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని జిల్లాధికారి దివాకర్ పేర్కొన్నారు. ఆయన గురువారం జిల్లాధికారి కార్యాలయంలో వ్యవసాయ మార్కెటింగ్ బోర్డు పోస్టర్‌ను విడుదల చేసి మాట్లాడారు. మినుము, తెల్లజొన్నలను రైతుల నుంచి కనీస మద్దతు ధర కోసం కొనుగోలు చేసేందుకు జిల్లాలోని ఆరు తాలూకాల్లో ఇప్పటికే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించగా, ఆయా పంటలకు ప్రభుత్వం క్వింటాల్‌కు ధర నిర్ణయించిందని, జిల్లా రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పేర్ల నమోదుకు సంబంధిత అధికారులను జిల్లాధికారి ఆదేశించారు. మినుము క్వింటాల్‌కు రూ.3800, హైబ్రిడ్ తెల్ల జొన్నలకు రూ.3180, మేలు రకం జొన్నలకు రూ.3225లు చొప్పున 'ప్రస్తుతం కనీస మద్దతు ధరలను కర్ణాటక వ్యవసాయ శాఖ నిర్ణయించిందన్నారు. ఆహార పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ డిప్యూటీ డైరెక్టర్ మల్లికార్జున తెలిపారు. జిల్లాలో ఈనెల 3 నుంచి 17 వరకు కొనుగోలు కేంద్రాల్లో సంప్రదించాలన్నారు.

క్వారీ నీటి గుంతలో పడి వ్యక్తి మృతి



మృతుడు గోపాలప్ప

సాక్షి,బళ్లారి: క్వారీలో ఉన్న నీటిలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన చిత్రదుర్గ జిల్లాలో చోటు చేసుకుంది. వివరాలు.. బుధవారం రాత్రి చిత్రదుర్గ జిల్లా చెళ్లకెరె తాలూకా నాయకనహట్టి సమీపంలోని నేరలగుంటె కణివె మారెమ్మ దేవాలయం దగ్గరలోని క్వారీలో ఉన్న నీటి గుంతలో హొళల్కెరె తాలూకా దాసయ్యనహట్టి గ్రామానికి చెందిన గోపాలప్ప(45) అనే వ్యక్తి ప్రమాదవశాత్తు పడి మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. నాయకనహట్టి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మందిరం ప్రారంభంలో ప్రధాని పాల్గొనొద్దు



మాట్లాడుతున్న మానసయ్య

రాయచూరు రూరల్: అయోధ్యలో ఈ నెల 22న జరిగే రామ మందిర ప్రారంభోత్సవంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పాల్గొనరాదని టీయూసీఐ కేంద్ర సంచాలకుడు మానసయ్య అభిప్రాయపడ్డారు. బుధవారం నగరంలోని జేసీ భవన్‌లో టీయూసీఐ రాష్ట్ర స్థాయి ముగింపు సమ్మేళనంలో మాట్లాడారు. ప్రభుత్వం, మోదీ పాల్గొంటే రాజ్యాంగానికి వ్యతిరేకమని, రామ మందిరం ప్రైవేట్ కార్యక్రమం అన్నారు. రాష్ట్రంలో కులగణన పూర్తి చేయాలన్నారు. సమావేశంలో సంచాలకుడు అమీర్ అలీ, చెన్నప్ప కొట్రికి, జిల్లాధ్యక్షుడు అమరేష్, అదవి రావ్, అజీజ్, హుచ్చారెడ్డిలున్నారు.

సమస్యల పరిష్కారానికే జనతా దర్శన్



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నంజేగౌడ

మాలూరు: ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే జనతా దర్శన్ ధ్యేయమని, ప్రజలు వినియోగించుకోవాలని ఎమ్మెల్యే కేవై నంజేగౌడ తెలిపారు. గురువారం మాస్తి వెంకటేశ అయ్యంగార్ రంగమందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి జనతా దర్శన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజలు జనతా దర్శన్‌లో ఇచ్చిన అర్జీలను ఆయా శాఖలకు చెందిన అధికారులు పరిశీలించి వెంటనే పరిష్కరిస్తారన్నారు. పట్టణంలో గత అక్టోబర్ 16న నిర్వహించిన జనతా దర్శన్‌లో 55 దరఖాస్తులు అందగా, వాటిలో అన్నింటినీ ఇప్పటికే అధికారులు పరిష్కరించారన్నారు. జనతాదర్శన్‌ను అధికారుల సమక్షంలోనే నిర్వహిస్తుండడం వల్ల వాటిని అక్కడికక్కడే పరిష్కరించడానికి వీలవుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ పద్మ బసవంతప్ప, తహసీల్దార్ కె రమేష్, తాలూకా స్థాయి అధికారులు పాల్గొన్నారు.